శతపత్ర సుందరి

రజని గేయాలు



శతపత్ర సుందరి

బాలాంత్రపు రజనీకాంతరావు

ప్రతులకు :

నవోదయ పబ్లిషర్స్

విజయవాడ . గుంటూరు

SATAPATRA SUNDARI
-Balantrapu Rajanikanta Rao

© Dr. B. RAJANI KANTA RAO
FF4, B, Venus Apartments
Tikkil Road, Mogalrajapuram
VIJAYAWADA - 520 010.

First Part
First Edition - 1953
Second Edition - 2000

Second Part
First Edition - 2000

Laser Type Setting :
PARAMESWARI PRESS
VIJAYAWADA - 2

Title
MUDRIKA
VIJAYAWADA - 3.

Printed at
PLANOGRAPHERS
VIJAYAWADA - 3

Distributors :
NAVODAYA PUBLISHERS
Karl marx Road,
VIJAYAWADA - 2

Price :
Paper back Rs. 150/- $ 15/-
Hard bound Rs. 200/- $ 20/-

<u>అంకితం</u>

నాన్నా మామయ్యలకి

(వేంకట పార్వతీశ్వరకవులు)

బాలాంత్రపు వేంకటరావుగారు రజనికి నాన్న
కోలేటి పార్వతీశంగారు రజనికి మామయ్య

తెలుగు సాహిత్యంలో జంటకవులుగా ఈ శతాబ్ది తొలితరాల ఆధునిక యువకవులకు మార్గదర్శకులు. నూటికిపైగా అనువాదనవలలనూ, స్వతంత్ర నవలలనూ, పురాణ గ్రంథాలనూ రచించారు. 1911వ సంవత్సరంలో ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయం స్థాపించారు. కావ్యకుసుమావళీ, ఏకాంతసేవా వంటి కవితా సంకలనాలు, వసుమతీ వసంతం, ప్రమదావనం, మాతృమందిరం వంటి స్వతంత్రనవలలూ బంకించంద్ర, రవీంద్రుల దుర్గేశనందిని, గోరావంటి అనువాద నవలలూ తమ సంస్థ ద్వారా ప్రచురించారు. ఆంధ్రపాఠకలోకంలో మధ్యతరగతి కుటుంబాల గృహిణులలో పుస్తక పఠనాభిలాషకు దోహదం చేశారు.

"నాన్నా! మామయ్యా!"

మా నాన్నా! మా మామయ్యా!
నే విన్నా మీ సన్నిధినే!
కడచినయుగముల మహాకవివరుల
కవితారీతుల ఘనతలనూ, ఈ
నవయుగమున కాది ఘనత నందిన
కవిభావుక నవఫణితులను
గంగాయమునాసంగమంబుగా
కలిసికొనిన మీకవనములోనే
నే విన్నా మీసన్నిధినే!
మా నాన్నా! మా మామయ్యా!!
సమితుల చేరని కవితల చదవక
వలపక్షమ్ముల మనసులతో
నవయుగకర్తలు వా రని వీ రని
ఎవ రే మన్నా ఒకటే నిజం!
ఆ యుగకర్తల శైశవమందే
మీ యువలేఖిని వ్రాసినకైతలు
కావ్యకుసుమశంఖారావముగా
నవ్యయుగావు వైతాళికయుతిగా
నే విన్నా మీ సన్నిధినే!
మా నాన్నా! మా మామయ్యా!!

లేదు నిదురలో లేదు సుగతి యని
చూడు కనువిచ్చి జగతి యని
గోవర్ధనమే మాతృదేశ మని
గోపకులంతా దేశప్రజ యని
దేశనేత గోకులకృష్ణుం డని

దేవేంద్రుండే శ్వేతప్రభ వని
వితతుష్పాజల నేల మాన రవి
జాతిని మేల్కొలిపే మీ గీతులు
నే విన్నా మీ సన్నిధినే !
మా నాన్నా! మా మామయ్యా!!
తేటగీతముల తెన్నులలో
మేటిపీసముల వన్నెలలో
బహుళవృత్త నవభంగులలో
ఆంధ్రభారతి వెలుంగులలో
ప్రకృతిసౌందర్య యవనికలూ
వికృతివివేక కనీనికలూ
శ్రీసూక్తి నవసుధానిధిలో
భావసంకీర్తనాంబుధిలో
రమణు నేకాంతసేవనము
రమ్య మధుర బృందావనము
నే విన్నా మీ సన్నిధినే !
మా నాన్నా ! మా మామయ్యా!!

బడికి పోకయే పొత్తము పట్టకె
గిరగిర తిరుగుచు వ్రాయగ నేర్చిన
బాలగీతముల బొంగరమట్టుల
బాల్యమునందే మీ యొడులందే
పడుకొని కైతలు విని విని వెంటనె
కాకిమీదనో ఆవుమీదనో
ఆకసమ్ములో అంచలపైనో
నా కేరింతలు, మీ యూరింతలు
నే విన్నా మీ సన్నిధినే !
మా నాన్నా ! మా మామయ్యా !! ◆

నామాట

జనవరిలో హైదరాబాదులో ఉన్న నన్ను అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని ఒహైయోనగరం నుంచి లాంగ్ డిస్టెన్స్‌కాల్‌లో పిలిచి మాట్లాడుతూ – చిరంజీవి 'పాలన' (పారనంది లక్ష్మీనరసింహం) "నేను ఆంధ్ర విశ్వవిద్యాలయం వాల్తేరులో మీ క్లాస్‌మేటూ, హాస్టల్‌మేటూ మీ అభిమానీ, మిత్రుడూ అయిన శ్రీ పారనంది రామశాస్త్రిగారి కుమారుడిని! మీరు తెలుగు ఎమ్. ఏ. చదువుతూ ఉండినపుడు ఆయన పోలిటిక్సు ఎమ్. ఏ. చేశారు. మానాన్నగారు మీ పాటల రచన గురించీ, పాడే గానకళను గురించీ ఎంతగానో పొగుడుతూ ఎన్నోసార్లు చెప్పారు! అప్పటినుంచీ మీ పుస్తకాలూ, పాటలూ చదవాలీ, సంగీతం వినాలీ అనే మాకోర్కె తీరకుండా అలాగే ఉండిపోయింది. 'శతపత్రసుందరి' పుస్తకం తిరిగి అచ్చు వేయించగలరా? అందులోని పాటలు మీరుపాడిన టేప్సులో పంపించగలుగుతారా అని చెప్పి అమెరికాలోని మిత్రపుత్రుడిచ్చిన ప్రోత్సాహం – శతపత్రసుందరి ప్రథమ భాగపు రెండవకూర్పునకూ, ద్వితీయ భాగపు మొదటి కూర్పునకూ, కారణములూ ఉద్బోధకాలూ అయినవని, యీ ముందుమాట లో నిండు గుండెతో సంతోషపూర్వకంగా వక్కాణిస్తున్నాను.

ఆమధ్య గుంటూరులో జరిగిన సాంస్కృతిక సభలోనే ఒకదాన్లో
వచ్చిన చిరంజీవి చిన్నబోట్ల రామన్నగారికి మా పెద్దాలదానికి నాలుగు దశాబ్ద
పూర్వరంగంలోని గొల్ల పాటల ప్రజాకళా అర్థమైనట్లు ఉండిన అభిజనం!

అనుకోకుండా ఆయనతోటి సంభాషణలో 'ప్రణయజీవనం' బాటలు కలిసి వచ్చుతోట 'అలకానగరి' అనే నా గేయం ఎంతో ఆకర్షణీయంగా రామన్నగారు పాడుతూ ఉండగా అకస్మాత్తుగా వినబడి, నేను చాలా ఆశ్చర్యానందాలకు లోనయ్యాను. అది ఆయన వరుస నేను కట్టినది కాదు. అది నేను నా 'మేఘసందేశం' నాటిక కోసం అలకానగరిని గురించి వ్రాసిన పాట. దానిని ప్రసారంలో ఎన్నడూ వాడలేదు, పాడలేదు. శతపత్రసుందరి '1953లో అచ్చయిన' తొలికూర్పులోంచి తీసుకుని నేను ఒకవేళ పాడుంటే ఎలా పాడి ఉండేవాడినో అలాగే ఒక వరుస కూర్చి రామన్నగారు పాడేశారు.

అంటే ఏమిటి? రజనీ రచించిన పాటల సంగీతం ఇలా ఉండాలి అనే ఒక రీతి దేశంలో అంతవరకూ వ్యాప్తిలో ఉన్న రజనీ లలిత సంగీత ప్రబాణీ ద్వారా ఒక 'ట్రేడ్ మార్క్' లా సంగీతప్రియాభిమానులైన శ్రోతల హృదయాలలో నెలకొని ఉన్నదన్నమాట!

నేను పాటలు వ్రాయడం మొదలుపెట్టిన నా 18-20 ఏళ్ల వయస్సు నాటికి అంటే 1937-1940ల మధ్య అప్పటికే వస్తున్న సినిమాల ద్వారా వంగీయ బాణీ, మరాఠీబాణీ, పంజాబు బాణీ, మధ్యప్రాచ్య బాణీ తెలుగు పాటల్లో కర్ణాటక సంగీత బాణీ. వీటిలో ఏదో ఒక దానిలో నా పాటకి సంగీతం రచనతో పాటే అమిరిపోయేది. 1938 నాటి నా తొలినాటకం 'చండీదాస' పాటలన్నీ వంగదేశపు కీర్తన పద్ధతికి దగ్గరగా ఉంటాయి. శతపత్రసుందరి సంపుటిలోని గేయనాటికల పాటలు మరాఠీ, పంజాబీ, పర్షియన్ ఉండేవి. రజనీకి మన సంప్రదాయం తెలియదు అని నస్సు దుయ్యబట్టే విమర్శకులనోళ్ళు మూయించడానికి, వారి విమర్శలు ఖండించడానికి 'గ్రీష్మరుతువు ఎండకారు, వండదారు, ఈనాడు జగాలుకాలు, ఈ గ్రీష్మజ్వాలాకీల' వంటి పాటలు పక్కా కర్ణాటక బాణీలో వ్రాశాను.

గౌళవంటి రాగాలలో చేశాను. దివ్యజ్యోతి అనే బుద్ధ జీవితాత్మకమైన నాటకంలోని పాటలూ మేఘసందేశంలోని పాటలూ కూడా ఎంతో ఆనందదాయకపు సంగీతపు బాణీలతో బాగా మెప్పించాయి. శ్రీ వెంకటేశ్వర్లు వంటి విద్యార్థులకు కూడా సాధనంగా గానం చెయ్యడానికి తగ్గ ఆకర్షణ ఉండేది వాటిలో.

దక్కన్ దివ్యభాష (ఆంధ్ర దినపత్రిక 1942) వంటి పాటల్లోని మధ్యమావతి రసజ్ఞ సంగీత ప్రాధాన్యంతో ఉండే పాటల బాణీలకు ఆకర్షితులై, కృష్ణశాస్త్రి గారు తన ఆకాశవాణి కోసం, ఉషశ్రీ గారు, వేమూరి రాసిన కథల కోసం ఎన్నో వంటి ఉద్యోగులు వారి ఉన్న కార్యక్రమం వంటి నాటకాల కోసం ఆగ్రహ బాణీలు నాగరిచేశారు.

దివ్యజ్యోతి నాటకంలోని వాయిగాదిని స్వప్నంలోని గేయాలను, గౌతముని మహాప్రస్థానపు గేయాలని నాట, మధ్యమావతి, శహానా వంటి రాగాలలో కూర్చాను.

సాంప్రదాయిక నాటకీ పద్ధతి, రాగధారణ లాగా పెంచుకునే అవకాశాలు గల ప్రయోగాలు యక్షగానాలలో ఎక్కువగా లభిస్తాయని, క్షీరసాగర మథనమూ శ్రీనివాస కల్యాణమూ వంటి యక్షగానాలను కృష్ణశాస్త్రి గారితో కలిసి రూపొందించి హైదరాబాద్‌లో ప్రణయ స్వప్నమనే కులకుతుబ్షా ప్రణయగాథను యక్షగాన పద్ధతిలో నేనే కూర్చి ఆడించాను.

'కొండవాలులో కొలన్ కొలను తళతళ మెరుస్తోంది ఎండ పడినప్పుడల్లా' ధగధగ ఎంతో మెరుస్తోంది నాటక ప్రియ రాగంలో కూర్చిన యీ గేయం ..... తారసపడగా వినిపించేది అప్పుడు ఆత్మమిత్రుడైపోయిన ఒక రాజుగారి నోట విన్నంతనే ముగ్ధుడనైపోయాను.

ఆంజనేయ శర్మ గారితో కోటేశ్వర్ గారి చేత పాడించిన 'మురిసెమనసం' 4 లలోనే వచ్చిన పాట, అహిర్ భైరవ్ ఖాన్ పాడిన, దేశ్, పీలు రాగాలలో 'ఆశా నా సఖి ఉండగా ఉందో' 'నీలి నింగి' అనే పల్లవితో కూర్చిన రాగమాలిక గేయాలు - సిద్ధ్ గాయకులకు అందరకు పాత్రములు అయినాయి

1938లో నేను వాల్తేరులో విద్యార్థిగా ఉండే రోజులలోనే వైస్‌ఛాన్సలర్ రామలింగారెడ్డిగారి కోరిక మేరకు తెలుగుతల్లి మీద ఇంగ్లీషు సానెట్ పద్ధతిలో (ప్రతీ స్టాంజాకీ చివర పల్లవి వచ్చే పద్ధతిలో ఆనంద భైరవి రాగంలో కూర్చినపాట (పల్లవిని ఆంగ్లంలో 'బర్డన్ ఆఫ్ ది సాంగ్' అంటారు).

పసిడిమెరుగుల తళతళలు
పసిమివెలుంగుల మిలమిలలు
గౌతమికృష్ణల గల గలలు
గుడిజేగంటల గణగణలు – అని ప్రారంభించి
మెరసిమెరసి మించిన శుభ సమయము తల్లీ
తరళయిశోభతి అనుపమిత రాగవల్లీ, నీ
వరసంతతి చేమోడ్పులివె తెలుగుతల్లీ –

ఈ తెలుగుతల్లి పాటను 1948లో శ్రీమతి భానుమతీ రామకృష్ణ, నేనూ పాడి గ్రామఫోన్ రికార్డు చేయించాము.

మా గురువుగారయిన అబ్బూరి రామకృష్ణారావుగారి 'ఓ విశాలావనీ, శోభాతిపావనీ' అనే మధ్యాక్కరగేయాన్ని నేను రేడియోలో పాడించడమే కాకుండా, మధ్యాక్కరలోనే ఒక గేయాన్ని 1941లోనే రచించాను.

'ఓర్మి తాల్ముల పైడినావ!
ఓధారుణీమాతృదేవి!
సంజ కెంజాయ వీవనలు,
క్రౌంజివురు గుబురు జాలరులు,
తల్లి నీయడుగుదామరలు!'

ఈ మధ్యాక్కర శతపత్రసుందరి ప్రథమభాగంలోనే ఉంది,

ద్వితీయభాగంలో నన్నయ్య గారి మధ్యాక్కర ఛందోరీతిని అనుసరించిన గేయాన్ని ఈ సంకలనంలోని తెలుగుపాట అనే గేయమాలికలో ఇమిడ్చాను.

ముగ్గురు భారతకవుల సద్దేలతో
ముద్దు కూర్చింది.
తగ్గట్లు ఛాందసవృత్తాల తొడవుల
తలను దాల్చింది!
తల్లుల దేశిపదాల అందాలతో
ఒళ్లు నింపింది!

ఈ శతపత్రసుందరి ప్రథమ భాగంలో 60 గేయాలే కాకుండా దగ్గిందాంగా రెండవభాగంలో [illegible] నృత్య[illegible], వచనకవితలూ, గేయాలూ చేర్చాను.

అప్పుడు సంకలనం చేస్తున్న ఈ శతపత్రసుందరి ద్వితీయభాగంలో రచనలకు [illegible] చిరంజీవి [illegible] నాగబాబు [illegible] ముద్రణ భాగమూ రెండవభాగమూ అచ్చు [illegible] నాచేత [illegible] సహృదయ [illegible] కృతజ్ఞత [illegible] వారికి నచ్చదు. అందుకు కారణం వారికి నాయందున్న [illegible] అభిమానాలే!

జర్మనీలో [illegible] 2,3 [illegible] ఇండియా (విజయవాడ) వచ్చిన [illegible] మిత్రులు సహృదయ [illegible] నా కేసెట్ [illegible] అత్యంత గౌరవ అభిమానాలను [illegible] నా శతపత్రసుందరి ఒకటి రెండు భాగాలను [illegible] ప్రోత్సహించారు. వారికి నా కృతజ్ఞత.

ఇట్లు
విజయవాడ
సహృదయ విధేయుడు
బాలాంత్రపు రజనీకాంతరావు

ఆశీస్సు

"శతపత్ర సుందరీ ! ఓహో శతపత్రసుందరీ !"

"మ్రోయింపు జయభేరి
వాయింపుము నగారా !"

"మాదీ స్వతంత్రదేశం
మాదీ స్వతంత్రజాతి !"

పల్లెపది ఆటల్లో పాట సంచలితమయిన కీర్తనలలో ఏదైనా ఏ సందర్భానుసారంగా పాడుతూ ఉత్సాహపరుస్తూ "అదిగో "రజనీకాంతరావు పాట" [illegible] ప్రజానీకము

తదేకాయత్తచిత్తమై ఆగేయమును మధురరసమునువలె తనివితీర గ్రోలి, అర్ధనిమీలితనేత్ర పారవశ్యసుఖ మనుభవించుట నేను అనేకపర్యాయములు అనేక సభలలో ప్రత్యక్షముగా విలోకించి, నాశిష్యుడు ఆర్జించుకొన్న యశమునకును అతనియెడ సమస్తాంధ్రప్రజకు గల అనురంజనమునకును లోలో మురియుచుందును.

రజనీకాంతరావునకు నాగురుత్వమువలన ఏమైన కొంత వ్యుత్పత్తియు కొంతసంస్కృతియు కలిగియుండవచ్చునేమో కాని, కవిత్వము మాత్రము నావలన అలవడినది కాదు ఆ గురుత్వము అతని జనకునిది.

శ్రీ వేంకటపార్వతీశ్వరకవులు జగమెరిగిన జంటకవులు. ఆజంటలో శ్రీవేంకటరావుగారు ఇతని తండ్రిగారు. ఈ కుమారుడు "బడికిపోయి పొత్తము పట్టని" బాల్యమునందే తండ్రి యొడిలో పరుండి, ఆయన లాలించుచు వినిపించిన కవితాగాన ఫణితులను వినివిని కడుపార పాలుత్రావిన శిశువు త్రేన్చినట్లు "కాకిమీదనో ఆవుమీదనో ఆకసమ్ములో అంచలపైనో" కేరింతలు కొట్టుచు చిట్టిపొట్టిపాటలు అల్లుట, ఈ కవితోద్యానమునకు మొదటి అంకురములు.

ఆ యుద్యానలతలు గోముగా నలుదెసల ప్రాకి, పరిమళ కుసుమ భరితములై, జగదాహ్లాదన మొనర్చునట్లుగా వర్ధిల్లుటకు వలసిన దోహద మంతయు రజనీకాంతరావు స్వయంకృషి వలననే జరిగినది. ఈ తండ్రి కొడుకులవిషయమునసే కాదు, లోకములో ఇతర గురుశిష్యులవిషయము నందైనను కవితా సంప్రదాయము ఈరీతిగానే ప్రవర్తిల్లును: గురూపదేశము శిష్యుని హృదయమున నిగూఢమై అణగియున్న కవితాబీజమును ఉద్భిన్న మొనర్చు జలకణసేచనము అంకురించుట మొదలుగా ఆ లతకు నానాదోహదము లొనర్చి, ఏమరుపాటులేని శ్రద్ధతో కాపాడి పుష్పఫల సమృద్ధమొనర్చుకొనుట శిష్యుని కృషి.

గురువు ఉపదేశదక్షుడు కాడేని శిష్యునిలో బీజమునుండియు అంకురింపదు. శిష్యుడు దోహదకుశలుడు కాడేని మొలకెత్తియు అంకురము వర్ధిల్లదు. ఈ రెండు వ్యాపారములును సముచితముగా సంఘటిల్లుట ఈశ్వరానుగ్రహము. అట్టి యీశ్వరానుగ్రహము కలిమి రజనీకాంతరావు నేటికవులలో అందును గేయకవులలో అందును వాగ్గేయకారులలో ఉత్తమస్థానము దక్కఁగొనగలిగెను.

మనభాష సహజముగా గేయరచనానుకూల మైనదే యయ్యు కొన్ని కారణములచే మన గేయవాఙ్మయశాఖ పూర్వకాలమున తగిన మన్నన పొందలేదు. ఆ వాఙ్మయనిర్మాతలలో ప్రథమబ్రహ్మయని పేర్కొనదగిన తాళ్ళపాక అన్నమాచార్యుని పేరైనను నిన్న మొన్నటివరకు ఆంధ్రులు వినియుండరు. ఆంధ్రజయదేవు డనదగిన క్షేత్రయ్యపదములు తెనుగు దేశమునుండియు సాహితీ క్షేత్రమునుండియు తరిమి వేయబడినవి. త్యాగబ్రహ్మనామము విస్మృతము కాకుండుటకు గాయకులు మాత్రమే కారణముగాని సాహితీపరులు కాదు. గేయకవితా పుంభావసరస్వతు లనదగిన పైని పేర్కొన్న మువ్వుర చరిత్రయే ఇటులుండగా తక్కిన చిల్లరపల్లరకీర్తనలు వ్రాసినవారి సంగతి తడవనేల? గేయకవిత్వములో ఒక నిసర్గదోష మున్నది. అది పాటవలననేకాక పఠనమువలన వ్యాప్తికి రాదు. పాడువారు కొఱవడినంతనే పాటవలన వచ్చిన వ్యాప్తియు మఱుగుపడిపోవును. కాని గేయములో గానాంశను వదలి సాహిత్యాంశను పరిశీలనజేసి ఆ పదార్థము సుసంపన్నముగా నున్నయెడ సాహిత్య విమర్శకులు దానిని వాఙ్మయకక్ష్యను స్వీకరించుట ధర్మము. ఇది వాఙ్మయచరిత్రకారులయు విమర్శకులయు విధి.

మన ప్రాచీనగేయకవితాశాఖను గూర్చి సవిమర్శ వాఙ్మయచరిత్ర రచింపవలసిన ఆవశ్యకత యెంతేని కలదు. ఆ శాఖలో ప్రబంధకవులను గూడ సరివడి పట్టిన భావసంపదయు నుడికారముపొంకమును పండుకొనియున్నవి.

అట్టి భావసంపన్నతను అట్టి మధురాక్షరసొగసులను ప్రదర్శించి ఉత్తమకవులుగా పరిగణింపబడిన గేయరచయితలు ఈనాడును కొందరు కలరు. వారిలో ఈ రజనీకాంతరావు ఒకడు. ఇతడు ఉత్తమశ్రేణికి చెందిన గేయకవి. శాస్త్రీయమైన రాగ తాళ జ్ఞానముతో స్వయముగా పాడనేర్చిన గానకళానిపుణుడగుటచేబట్టి వాగ్గేయకారు డనిపించుకొనిన విశేష ప్రజ్ఞాశాలి.

పూర్వులు ఒక్కొక్క కీర్తనసంపుటికి శృంగారపదములనియు, భక్తికీర్తన లనియు, తత్త్వము లనియు, తత్తత్ కీర్తన సముదాయములోని గుణప్రాధాన్యమునుబట్టి స్థూలముగా నామనిర్దేశము చేయుచుండెడివారు. ఆ సంప్రదాయమునే పాటించి ఈ 'శతపత్రసుందరి'కి ప్రణయకీర్తన అని నామకరణముచేయుట సముచిత మని నా ఉద్దేశము. ఇందు దేశభక్తి ప్రబోధకములు, దేశమాతృస్తవములు, దేశనాయక ప్రశంసలు మొదలైన రాజకీయకీర్తనలును మరి యితరములును కొన్నియున్నను తక్కిన అనేకములు స్వసంబంధములును నాటికాగీతములును కూడ ప్రణయభావపూరితము లగుటచేత నేను ఈ సంపుటికి ఆ వ్యపదేశము బాగని తలంచితిని.

ప్రణయము శృంగారముకంటె కొంత భిన్నము. ఆలంకారిక సిద్ధాంతమునుబట్టి శృంగారమునకు 'రతి' స్థాయి యగును. ప్రణయమునకు ప్రేమ స్థాయి. దీనిని ప్రేయస్సు అనియు చెప్పవచ్చును.

ఈ ప్రేమ లేకున్న లోకాన ఏమున్నది? అని యొక కవి ప్రశ్న. నిజమే ప్రేమలేని ప్రపంచము శూన్యమే నని నా యొప్పుదల. మరియు,

"ప్రేమ నాలో పెరిగి పెద్దదౌతుంటేను
నేను భగవంతునికి చేరువౌతుంటాను"

అని ఇతని ప్రేమభావ ప్రకటనము. ఇది ఆధ్యాత్మికపరంపరములలో ఒకటి. హృదయము ప్రేమాస్పదమైనప్పుడే ఆత్మ భగవంతుని సన్నిధానమున వ్రాలు నని భక్తియోగ ముపదేశించు తత్త్వము.

ఈ ప్రేయస్సు అనునది శృంగారరసములో అంతర్భాగమే అని వాదించెడి ఒక ఆలంకారికమతము కలదు. అందు కొంత సత్యము లేకపోలేదు. కాని శృంగార మనగా నాయికానాయక ఆలంబనమున ఉత్పన్నము మాత్రమే యని అంగీకరింతుమేని ప్రణయము దానికంటె భిన్నమని వెంటనే అంగీకరింపవలెను. ఈ ప్రేయస్సునకు ఆలంబనము నాయికానాయకులుగా స్త్రీ పురుషులే కానక్కరలేదు. పరస్పరం భావానుబంధయుగళ యే రెండు జీవులైనను కావచ్చును. ఆత్మయొక్క సర్వగతత్వమును అంగీకరింతుమేని అచేతనములైన ఏ రెండు మూర్తులైనను ఈ ప్రేయస్సునకు ఆలంబనము కావచ్చును.

మబ్బు యువతిగా మలయపవనుడు యువకుడుగా పరస్పరానురాగబద్ధచేతనములై వలపుసొలపుల తీయదనములు కలిసి ఆరగింపవచ్చును. ప్రేమికుడౌ చంద్రుడు, ప్రేయసియౌ తారకు చేసన్న చేసి చంద్రనౌకలో ఎక్కించుకొని వెన్నెలవెల్లువలో విహరింపవచ్చును

ప్రకృతికి ప్రణయధర్మమనే యనెడి ఇంకొక పేరు గలదు. విశ్వలీల ప్రణయమూలకము అను న్యాయమునుబట్టియే ఆ పేరు సమర్థించబడును. విశ్వప్రవృత్తి ప్రణయ లీల యగునో చేతనా చేతనపదార్థజాత మంతయు మాధుర్యప్రవాహమగ్నమే, ఆ దర్శనము లభించిన కవికి 'అంధకారప్రభలు మండునెండలను' 'నల్ల కాటిదయ్యాల వెరలాటలోను' అన్నివైపులగూడ ఊరకే మాధురులు ఊరిపోవుచుంటవి.

సుఖదుఃఖమయమైన ప్రాపంచిక జీవితసముద్రమున పొడమెడి అమృతమునేకాక విషమునుగూడ మధురముగానే భావింపగల జీవికి వేరే యోగసాధనాదుల యక్కర యుండదు. ఈతని లోకమునకు వేయు ప్రబోధము "ఎల్లెడల మాధురులు గ్రోలుడు" అని. అసలు నేనెరిగినంతవరకు ఇతని చిత్తవృత్తియే మాధురీభరితము, కటుత్వపారుష్యము లెఱుగదు. అట్టి చిత్తమున మొలకెత్తిన మధురభావములే యీ గేయార్థములు

రజనీకాంతరావు పద్యకావ్యము వ్రాయలేదనవీలుపడు. ఇతడు రచించిన పద్యకవిత్వము ఇందు ప్రకటింపబడకపోయినను బహుళముగా కలదు. ఆ పద్యములలో ఊతిని గీతపద్యపునడక ఇతని తండ్రిగారి గీతపద్యమునే అనుసరించి సాగుచుండు నని నా ఊహ. ఇందలి నాందీముఖములోని

“జగతి రంగస్థలమ్ముగా సకలజీవ
తతులు పాత్రలుగాగ గాథలను గూర్చి
వెలుగునీడల తెరవెన్క నిలుచు నటన
సూత్రధారుండు మమ్ము బ్రోచుత సతమ్ము”

అనెడి గీతపద్యము నాచిన్ననాడు చదివిన వేంకటపార్వతీశ్వరుల గీతపద్యములను జ్ఞప్తికి తెచ్చినది.

ఇట్టి నానాసాధనసామగ్రిగల యీ నా శిష్యుడు ఒక పద్యప్రబంధమును గూడ రచించి ఆంధ్రుల కర్పించుగాక!

ఇతని కవితాయశము దినదినప్రవర్ధమానమై అజరామరముగా వెలుగొందుగాక

“పసిడిమెరుంగుల తళతళలు” అనెడి తెలుగుతల్లి గేయము ఆంధ్ర రాష్ట్రావతరణ ముహూర్తమున ఆంధ్రమాతకు మన మర్పించు ఆవాహనోపచారమై మన జాతీయగీతముగా స్థిరపడుగాక!

తుది రెండుగేయములలోని మంగళము తెలుగుతల్లికి మనము చేయు నిత్యపూజలో నీరాజనోపచారమగుగాక!

ముకాం : మద్రాస్
దీ. 27-3-53

పింగళి లక్ష్మీకాంతం.

శతపత్రసుందరి

(మొదటి భాగము)

విషయసూచిక

వసంత పత్రావళి

	గేయము	తొలిపంక్తి	పుట
1	ఉగాది (1937)	ఆలయమున ...	33
2	నాందీముఖము (1936)	జీవితమ్మను ...	34
3	నా దేవుఁడు (1936)	నాదేవుని ...	35
4	తెలుగుతల్లీ (1939)	పసిడిమెఱుంగుల ...	37
5	శతపత్రసుందరి (1941)	శతపత్రసుందరీ .	38
6	విశ్వవీణ (1937)	విశ్వవీణారవ ...	39
7	కోయిలా (1938)	పాడవే కోయిలా ...	41
8	చిన్నిపూవు (1938)	చేకొనవె ...	42
9	మధుపాయి (1938)	మధుపాయి ...	43
10	మాధురులు (1938)	ఊరకే మాధురులు	45
11	ఒక్కపువ్వే (1938)	ఒక్కపువ్వేలు ...	47
12	చండీదాసుప్రేమగీతి (1938)	అతిదీనకామిని .	49
13	కన్నె కాకిబావ (1938)	కాకిచూపుల ...	50
14	ప్రధానం (1938)	ఎన్ని తీయనికలలు ..	52
15	మనప్రేమ (1938)	మనప్రేమ ...	53
16	రాధవలపు (1938)	వలపులో ...	54
17	వసంతోత్సవము (1941)	పులుగు నెచ్చెలులార ...	55

'మధువన స్వప్న' నాటక గీతాలు

	గేయము	తొలిపంక్తి	పుట
18	మధువని (1944)	మధువనీలతాంత ...	57
19	మలయానిలుడు-1 (1944)	రావోయీ ...	57
20	మలయానిలుడు-2 (1944)	ఏతెంచెనదె ...	58
21	మరులుమాతంగి-1 (1944)	చరచరచర ...	58
22	మరులుమాతంగి-2 (1944)	మరులుమాతంగి . .	58

	గేయము	తొలిపంక్తి	పుట
23	జోల (1944)	జో జో జో జో ...	59
24	మధువనస్వప్నసీమ (1944)	రేగనీ .	59
25	మాయాజాలం (1944)	మధువన స్వప్నసీమ ..	59
26	వెలుగు (1940)	వెలుగు ...	60
27	పెళ్లికాకముందు (1947)	ఏమని ...	60
28	పెళ్లయాక (1947)	చిన్ననాటి ...	61
29	జంట ఊయల (1947)	ఊయల ఊపనా ...	62
30	ఆరుఋతువుల ఊయెల (1947)	జీవితమూయలగా ...	63
31	పూలచెండు (1941)	అందుకోండి ...	65
32	మేలుకొలుపు (1951)	మేలుకొలిపిగా ..	66
33	మలయానిలుడు- దీరిసెన (1951)	ఓమలయపవనమా ...	67
34	స్వభాను (1943)	రావే రావే ...	68
35	మధుఋతువు (1945)	వెలసెనహో ...	69
36	చెల్లికి (1938)	మెఱసె మెఱసె ...	70
37	వసంతము (1948)	జగతికి వసంతమా	71
	గ్రీష్మ పత్రావళి		
38	అందవు (1940)	అందవు అందవు ...	72
39	గతాగతం (1941)	చూచినకొలంది ...	73
40	వికృతహాసం (1941)	హృదిపొంగే ...	73
41	గజల్ (1945)	హాయిలో ...	74
42	విరహిణి రాధ (1939)	విరహానలంపు బాధ ...	75
	గ్రీష్మము నాటికాగీతాలు		
43	స్వాగతము (1941)	సంధ్యారుణిమ ...	76
44	గ్రీష్మజృంభణము (1941)	నడిమింట . .	77
45	" (1941)	ఊరేడుజాగాలు ...	78
46	" (1941)	ఎండకారు ...	78

	గేయము	తొలిపంక్తి	పుట
47	తోటమాలి (1941)	తోటమాలీ ...	79
48	,, (1941)	ఓసారి లెమ్ము ...	80
49	పీకెందుకు (1941)	తోటమాలిజోలి ...	81
50	చలిపందిరి (1941)	విరిచెలువలార ...	82
51	వీడ్కోలు (1941)	తీయమావిచిపుళ్లు ...	84
52	ఆశాగీతి (1941)	కనవో ...	86
53	గ్రీష్మసంధ్య (1941)	మెరసినవి వినువీధి .	87

'మేఘ సందేశం' సంగీత నాటికలోని పాట

54	యక్షుని గ్రీష్మము (1941)	వీకుమాత్రము ..	87
55	ఏలో ఏలేలే (1950)	ఏలో కోయిల ...	88

వర్షప్రావళి

56	కొత్తపాంగు (1939)	మొయిలు వడకల ...	89

'శుక్తి' సంగీత నాటికలోని పాటలు

57	శుక్తి విరహము (1942)	ఈవిదాహ మెటు ...	91
58	నిరీక్షణ (1942)	ఈ తీరభూమిలో .	92
59	శుక్తిముక్తాఫలము (1942)	మెరుపుతీవలవిగో	93
60	నెమలి (1942)	ఆడుతోంది నెమలి .	94
61	హరివిల్లు (1942)	అదిగో లేచెను ...	95
62	చినుకుపాట (1942)	చినుకు కన్నియల ...	96
63	శ్రావణలక్ష్మి (1942)	శ్రావణలక్ష్మియె ...	97
64	జానపదం (1942)	సేలమీదీ పైరగాలి ...	98
65	ములగసిర (1942)	వొచ్చిందా తిరిగి...	99
66	చాతకీ (1942)	నీదుపాట విందుగ ...	100
67	వానకోయిల (1942)	చిటపట ...	101

	గేయము	తొలిపంక్తి	పుట
68	మయూరీ (1952)	నటనమాడవే ...	102
69	ఇంద్రధనుస్సు (1950)	నింగికి నేలకు ...	103
70	అభిసారిక (1942)	గాలివాన రేయి ...	104
71	జలదాగమనం (1941)	మురళీధరుని ...	105
72	మేఘమా (1942)	మేఘమా ...	106
73	దిగకోయి (1941)	మెరిసేమబ్బుల ...	107
74	ఉజ్జయిని పిలుపు (1941)	రమ్మోయి జలధరా ..	108
75	అలకానగరి (1941)	ప్రణయజీవనపు ...	109
76	మేఘరంజని (1)(1945)	ఘనాఘనా ...	110
77	మేఘరంజని (2) (1948)	హృదయాంభోధరా .	111
78	వరలక్ష్మి (1944)	స్వాగతమమ్మా ...	112
79	వాళ (1942)	యెయ్యరా వొం ...	113
80	అభిసరణ (1946)	సఖుని గాంతువే ...	114
81	కృష్ణజననము (1945)	భువననేత ...	115
82	కృష్ణసంతారం (1951)	అల వైకుంఠపురం . .	116

'దివ్యజ్యోతి' నాటికాగీతాలు

83	వైతాళికగీతులు (1941)	మేలుకో ...	119
84	మాయాదేవి స్వప్నం (1941)	నిద్రాముద్రితవు	120
85	మాయాదేవి స్వప్నం (1941)	విహరింపవె..	120
86	ప్రబోధము (1941)	చైత్రజీవ...	121
87	వైతాళికగీతి (1941)	మెరయు దిశాముఖ .	122
88	గౌతమబుద్ధుని జననం (.941)	ప్రమదావని	123
89	అసితముని ఆవేదన (1941)	అసద్భాశతేజోవర్షీ.	124
90	ఏనాడో యేనాడో (1941,	ఈనాడుకాదు	125
91	స్వయంవరం 1941)	కామదేవు కొలువున .	126

	గేయము	తొలిపంక్తి	పుట
92	సోమరి పాట (1941)	ఆమని పొంగులో ...	127
93	భ్రమరప్రబోధం (1941)	భ్రమరా భ్రమరా ..	128
94	భ్రమరప్రబోధం (1941)	భ్రమరా భ్రమరా ..	129
95	చితిజ్వాల (1941)	రగిలిమండెను ...	130
96	ఉజ్జ్వల ప్రభాతము 1941)	అమలహృదయ	131
97	ప్రస్థానము (1941)	ఈయిరులు ...	132
98	వియోగిని (1941)	హృదయేశ్వరుడు ...	133
99	వైతాళికగీతి (1941)	పాలపుంత ...	134
100	విరాగగీతము (1941)	శ్రుతులు సమముగా ...	134
101	విరాగగీతము (1941)	గడ్డిపువ్వు సుఖము ...	135
102	బోధిమహీజం (1941)	ఆశాంతర ...	136

* * * *

103	ఒక్కడవే (1948)	ఒకరయినా ...	137

శరత్పత్రావళి

104	ఆగమనము (1941)	చల్లగాలిలో ...	139
105	విభావరి (1942)	ఓ విభావరీ ...	140
106	నళిని - పవనుడు (1942)	కుంజవని ...	141
107	శరద్గీతి (1942)	పసిడిమబ్బుల ...	142
108	సంధ్యాదీపకళిక (1941)	స్వామీ నీ యాలయ	143
109	స్వప్నజగతి (1952)	స్వప్నజగతిలో ...	144
110	జాజి - తుమ్మెద (1942)	చల్లగాలిలో పూల	145

శతపత్రసుందరి నాటికా గేయాలు

111	ఆశ్వాసనము (1942)	శతపత్రసుందరీ ...	146
112	అస్తమయము (1942)	ఇనుడుకొండదిగెనా .	147

	గేయము	తొలిపంక్తి	పుట
113	కీచురాలు (1942)	హోయి హోయి హోయి ...	148
114	విరహిణి (1942)	తిరిగి తిరిగి తిరిగి ...	149
115	జాబిల్లి (1942)	జాబిల్లి వస్తున్నాడు ...	150
116	జోల (1942)	జోజో సఖీ ...	151
117	స్వప్నలోకము (1942)	స్వప్నలోకము ...	151
118	గగనయానము (1942)	సరసివిడిచి ...	152
119	మేలుకొలుపు (1942)	మేలుకొనవెశతపత్రా ...	153
120	రోద (1942)	రోదసేయికె ...	154
121	కొండకోన (1942)	కొండకోనలో ...	155
122	సెలయేరు (1942)	రా సెలయేరా ...	156
123	ప్రతిశ్రుతి (1942)	ఓహో ప్రతి శ్రుతీ ...	157
124	బృందావనము (1941)	కోపమేలరాధా ...	158
125	వెన్నెలరేయి (1941)	కన్నులకింపౌ ...	160
126	మబ్బుకన్నె —		
	మలయపవనుడు (1941)	మలయపవనా! ...	162
127	దినాంతము (1942)	దినాంతమ్ము ...	164
128	అన్వేషణ (1942)	యమునాతీర ...	164
129	మనమిద్దరమే (1951)	ఇద్దరమే ...	165
130	ఎందుకో (1948)	ఎందుకో! పున్నమ! ...	166
131	మెట్లవరుసలు (1948)	మెట్లవరుసలు ...	167
132	జ్వాలాతోరణం (1943)	జ్వాలాతోరణం ...	168
133	దిబ్బూదిబ్బూ (1943)	దిబ్బూదిబ్బూ ...	169
134	కనుడదే (1943)	కనుడదే ...	169
135	జైత్రయాత్ర (1943)	కేల కేలగోగు ...	170
136	ప్రతిజ్ఞ (1951)	ప్రతిహస్తము ...	171

	గేయము	తొలిపంక్తి	పుట
137	దీపావళి (1951)	ఇంటింటి ముంగిటా	172

'అవంతి సుందరి' నాటికా గీతాలు

138	అంజలి (1945)	అంజలిదే ...	173
139	రాజహంస (1945)	రావో రాజహంసమా ..	174
140	ఇంద్రజాలము (1945)	రావోయి వైనతేయా ..	175
141	ఇంద్రజాలము (1945)	దిగుదిగు మహేంద్ర ..	175
142	రమ్యాణివీక్ష (1945)	స్మరియింతుయగా .	176

'కదలిదరి' పాటలు .

143	తొలిపిలుపు (1941)	ఎవరుపిలిచినారో ...	177
144	ప్రియోక్తి (1941)	సడలనీకు ...	178
145	చెలివలపు (1941)	తీయతీయగా ..	179
146	చెలిపొగసు, వలపు (1941)	తెలియువా ...	180
147	వాగ్భంగము (1941)	ఇటులౌనని ...	181
148	కావేరి (1941)	కావేరీ ఓ కావేరీ ...	182

'మాళవిక పాటలు

149	సుమసౌరభము (1949)	ఈ సుమసౌరభము ...	184
150	ఏకాంత జీవిక (1938)	ఎదగాయపడీ ...	184
151	నాట్యపరీక్షా (1946)	వర్తించుమనె ...	185
152	ఎందుకో (1946)	ఎందుకో హృదయమా ...	186
153	లాక్షాచిత్రణ (1946)	కదలకుమా ...	187
154	దోహదము (1946)	పరవుము ...	188
155	ఎడబాపు (1946)	మనోరమణుడె ..	189
156	అశోకదోహదము (1946)	ఎత్తెనదే మాళవిక ...	190

	గేయము	తొలిపంక్తి	పుట
157	కుసుమితాశోకము (1946)	విరహశిశింమిరగా.	191

* * * *

158	కలువ వలపు (1946)	ఓ శశీ ...	192
159	శశిపిలుపు (1946)	కలువా! ...	193
160	ఆనందప్రకృతి (194?)	ఆకుపచ్చని ఆకు .	194
161	స్వేచ్ఛ (1941)	పాట తెలిసిన ...	195
162	శరదభిసారిక (1941)	మధువని కానరావో .	197
163	హృదయనావ (941)	చిన్నదోయీ ...	198
164	గులాబి (1946)	సంజనీరెండ ...	199
165	చిత్రార్జునులు (1944)	ఎవరో నీవెవరో .	200
166	పరిష్వంగము (1941)	హాయిగ పాడుదునా ..	201
167	నిదురపో (1951)	నిదురపో ...	202
168	మెల్లమెల్లగ (1951)	మెల్లమెల్లగ ..	203
169	మధురయామిని (1944)	మధురయామిని .	204

హేమంత పత్రావళి

170	చలికారు (1947)	ఛలికారు కౌగిలించె ...	205

'విషవృక్షం' నాటకంలోని పాటలు

171	హరిదాసి కీర్తన (1952)	తన అధరసీమపై .	206
172	జూదరి వేదాంతము (1952)	వేరే జూదమెందుకూ ..	207
173	జూదరి వేదాంతము (1952)	చూపుమారమెందుకు	208
174	కాలసర్పి (1952)	ఆడుదంటే ...	209

'ఉమర్ ఖైయామ్' నాటికలోని పాటలు

175	అనుభవ భారము (1946)	ఎన్నో ఫలాల్ .	210
176	ఖైయాము తత్వం (1946)	ఖైయాముతో కలు .	211

గేయము	తొలిపంక్తి	పుట
177 హేమంతగానము (1946)	మిస్త్రీబొమ్మను .	212
బుచ్చిబాబు నాటికలోని పాటలు		
178 ఉమర్ ఖైయాం (1946)	సాకీరావె సాకీ ...	213
179 కలలబేహారి పాటలు (1946)	కలలూబాబూ	214
180 కలలబేహారి (1946)	కలలు కొంటారా	215
181 మధుమాయ (1943)	(మాయయె మధుమురళి	216
182 మంచు తెరల అవల (1949)	మాఘమంచుపోనరో .	217
183 లోకాలోకం (1948)	ఏలోకానికి ఆలోకం	218
184 జన్మభూమి (1943)	మేలుకొనవా	219
185 నవోదయాశ (1943)	నవోదయమెపుడో .	220
'శాంతిపథం' నాటికా గేయం		
186 శాంతిశోధ (1941)	వడవనిచో వెల్లి .	221
187 అన్వేషణ (1943)	దారిచూపువాడె	222
188 ఊరడింపు (1943)	ఊరడిలవె ఓ నలినీ	223
189 దిగు దిగు (1950)	దిగు దిగు నాగా ...	224
190 హింసాయ్ ఉన్మత్త (1948)	ధరాతలము	225
191 అమరగాయకుడు (1941)	వృథా వ్యథిత ...	227
192 స్మృతిసీమల్లో శైల్ (1947)	గేయకాంటలేస్వర్గైనా	228
బుచ్చిబాబు నాటికలోని పాట		
193 భగ్నప్రతిమ (1947)	ఎచట ఎచట .	231
194 యశోధర వ్యాకులత (1947)	ఉపనిషత్తుల శాక్యముని . .	232
195 పురప్రవేశము (1947)	నేడే వచ్చు	233
గోపీచంద్ 'మాంచాల' నాటికలోని పాట		
196 మాంచాలా బాలచంద్రుడు (1947) ఎన్నాళ్లకు		234

	గేయము	తొలిపంక్తి	పుట
197	రుచీదేవి (1943)	కృష్ణ నృపతి	236
198	ధరిత్రీమాత (1941)	ఓర్మితాల్ముల	237
199	రావమ్మా (1951)	రావమ్మా మా తెలుగు	239
శశిరపత్రావళి			
200	తృష్ణ (1941)	కొండవాలులో ...	240
201	నావికా (1949)	ఏ తీరమని చేరెదో ...	241
202	పోయిన స్వర్గము (1938)	[illegible]	242
203	లక్ష్యాపాలు (1937)	విస్ఫులాకాశ ...	244
204	కలకోసం (1941)	[illegible]	245
205	రతివిలాపం (1941)	హా ప్రాణపతీ ...	246
206	చెలిమినలులు (1938)	మరపు తెరల ...	247
'దేవదాసే' నాటికా గీతాలు			
207	ఎవరోహో (1940)	ఎవరోహో	248
208	జానపదం (1940)	సీతులార	249
209	నృత్యగీతి (1940)	సఖీసఖీ	250
210	పదనోయి (1940)	పదనోయి	251
211	దప్పి (1940)	నీటితో ఆరేది	252
212	మరునిముసము (1940)	మరునిముసము	253
213	జీవితము (1940)	జీవితము	254
214	ఏలరాడు (1940)	[illegible]	255
215	చరమగీతి (1940)	[illegible]	255
'బెహులా' నాటికా గీతాలు			
216	బృందగానము (1944)	[illegible]	256
217	యుగళగీతి (1944)	ఇటులరావో	256

	గేయము	తొలిపంక్తి	పుట
218	కాలనాగినీ (1944)	రావే కాలనాగినీ	257
219	వియోగగీతి (1944)	విననోచనా ...	257
220	నృత్యగీతి (1944)	వినర్తింతువే ...	258
'లైలా మజ్నూ' నాటికా గీతాలు			
221	నిశ్చలప్రేమ (1946)	కఠినమోయీ ...	259
222	మహల్ (1946)	మామహల్	260
223	బిచ్చం (1946)	మంచు తెరలో ...	261
224	ప్రేమ తప్పా (1946)	ప్రేమయే అపరాధమా .	262
225	లైలా వీడ్కోలు (1946	అన్నీ మరపవలెనా? ..	263
226	లైలా వీడ్కోలు (1946)	సెలవింక సెలవింక ..	264
227	మజ్నూ విలాపము (1946)	గుడారమెత్తి వేశారు .	265
228	బృందగీతం (1946)	వదిలిమోహో ...	266
229	లైలా విశ్వరూపము (1946)	ఏంచుమూచిన .	267
230	తుదిపాట (1946)	ఎవని కలియ .	268

* * * *

231	సతీపరాభవం (1942)	రుద్రదేవా ...	269
232	అన్నపూర్ణ (1942)	అన్నపూర్ణా ...	270
233	హింసామత్త (1942)	హింసామత్తపృథివి	271
'ధర్మచక్ర' నాటక గీతాలు			
234	ధర్మచక్రావేదన (1947)	ఆర్తియుమ్యోనే .	272
235	రాజ్యశ్రీ శోకగీతి (1947)	జ్వాలాకీలలలో	274
236	ప్రబోధగీతి (1947)	మూతపడిన ...	274
237	పాపీ (1947)	పాపీ ఓహో పాపీ ...	275
238	ధర్మచక్రము (1947)	సాగువదే ...	276
239	గీతాంజలి (1948)	ఓయి మహాత్యాగీ ...	277
240	జోత (1948)	ఇదెజోతా	278

	గేయము	తొలిపంక్తి	పుట
241	పూజా శిరీషములు (1949)	పూజా శిరీషములివిగో . .	279
242	పృథ్వీ ప్రశంస (1941)	పృథులక్షణూశాలినీ ...	280
243	లలితాస్తుతి (1952)	మహేశ్వరీ మహాకాళీ . .	281

నవవసంత పత్రావళి

244	మహోదయం (1943)	మహోదయమాయె ..	283
245	స్వాతంత్రస్వప్నం (1937)	విధుర హేమంత ..	284
246	స్వాతంత్ర్య భేరి (1947)	మ్రోయింపు జయభేరి ...	286
247	బౌద్ధభారత వసంతము (1948)	నవ వసంతము ...	288
248	వాగమృతద (1943)	అగణితశుభదాయినీ ...	289
249	'ద్వారం' వారికి (1949)	నీ యాశీః సుమరాశి ...	290
250	యుగకర్తా (1948)	కందుకూరి వీరేశలింగం . .	291
251	మాతృభూమి (1943)	హే భువన మహో ...	294
252	సరోజిని (1949)	అందుకోనుమ . .	295
253	సరోజిని (1949)	భారత స్వాతంత్ర్య ...	296
254	అంజలి (1949)	అంజలిదే ...	297
255	శాంతిదూత (1950)	జయజయ .	298
256	సర్వోదయం (1950)	ఓ బాపూ ..	299
257	ఉగాది ,1949)	స్వాతంత్ర్య భారత ...	300
258	స్వాతంత్ర్యఘంట (1949)	స్వాతంత్ర్యశుభోదయ ...	301
259	నవభారత సందేశము (1948)	అహోనవప్రభాతము ...	303
260	స్వాతంత్ర్యోత్సవ (1949)	మాదీ స్వతంత్ర దేశం ..	304
261	ప్రబోధము (1950)	జైహిందని ..	305
262	అభినందనము (1948)	అభినందన చందన ..	307
263	తెలుగుతల్లి (1946)	తెలుగుతల్లీ .	308
264	మంగళం (1943)	మంగళమ్మమ్మ ...	309
265	విజయప్రభాతము (1953)	విందురేమేమని	312

ఉగాది

ఆలయమున వినబడు నదిగో!
ఆకసమున కనబడు నదిగో!
నవవర్షపు ఘంటానినదం
నవ్యాశాజ్యోతి!

ప్రాతయేటి పెను తమస్సులు
పాపకలితములు మనస్సులు
పటాపంచలే!

క్షుభితహృదయములపై విరిసి
విభునికరుణ జడులై కురిసి
నవవసంతమై!

శుభోదయోత్సవ సమయమున
ప్రభూ యనుచు మధురరవమున
కీర్తింతుదమా! ◆

నాందీముఖం

జీవితమ్మను పాలకడలిని
తేలు నమృతవిషాలు క్రోలుచు
పాటగా పాడుదురు కవు లిల
యందె స్వర్గము నిల్పగా!

జీవితమ్మను పాలకడలిని
తరచి తేట గ్రహించి సిద్ధాం
తములు గూర్తురు తత్త్వవిదు లిల
యందె స్వర్గము నిల్పగా!

జగతి రంగస్థలమ్ముగా సకలజీవ
తతులు పాత్రలుగాఁగ గాథలను గూర్చి
వెలుగునీడల తెరవెన్క నిలుచు నటన
సూత్రధారుండు మనుష్యు బ్రోచుత సతమ్ము! ❖

నా దేవుడు

(వచనగీతం)

నాదేవుని గుహలతో వనులతో నిండిన
కొండగా జేసికొని కొలుచుకొనవలెనని నాకోరిక!
కాని నాదేవుడు పాషాణమాత్రుడేనా?

నాదేవుని పూలతో ఆకులతో కాయలతో పండిన
చెట్టుగా జేసికొని సేవించుకొనవలెనని నాయభిలాష!
కాని నాదేవుడు పాదపమాత్రుడేనా?

నాదేవునికి తొక్కను ముక్కును పెట్టి
పక్షిగా జేసికొని పరికించుకొనవలెనని నాయూహ!
కాని నాదేవుడు ఖగమాత్రుడేనా?

నాదేవునికి జూలును గిలుమ పెట్టి
హర్యక్షముగాజేసికొని ఆరాధించుకొనవలెనని నాయాస!
కాని నాదేవుడు మృగమాత్రుడేనా?

నాదేవునికి కాళ్ళు, వ్రేళ్ళు, తోకయు గీకయు పెట్టి
కోతిగాజేసికొని వినోదింత మని నాతలంపు!
కాని నాదేవుడు వానరమాత్రుడేనా?

నాదేవునికి ముక్కూ, మొగమూ పెట్టి విద్యాబుద్ధి యిచ్చి
మనుష్యునిగాజేసికొని చీనిచీనాంబరాలతో
స్వర్ణాలంకారాలతో మణికిరీటంతో
అలంకరించి అర్చించుకొనవలె నని నా అపేక్ష!
కాని నాదేవుడు నరమాత్రుడేనా?

నాదేవుని పురుషుడని పూజింతునా? స్త్రీయని సేవింతునా?
సూర్యుడని చూచికొందునా? చంద్రుడని సంతోషింతునా?
నాదేవుడు నీరా? నిప్పా? గాలియా? గగనమా?

అన్నిటను అడగియున్న నాదేవుని,
అన్నిటను నిండియున్న నాదేవుని,
అన్ని పక్షములను వహించిన నాదేవుని,
అన్నిటను తిరుగాడుచున్న నాదేవుని,
అన్ని చేష్టలు చేయుచున్న నాదేవుని,
అన్ని వేషములు వేయుచున్న నాదేవుని,
అన్నిటికిని అధిదేవతయైన నాదేవుని,
అన్నిటికిని అతీతుడైన నాదేవుని,
నే నేవిధంగా ఆరాధించుకొందునో! ◆

తెలుగుతల్లీ

పసిడి మెఱుంగుల తళతళలు
పసిమి వెలుంగుల మిలమిలలు
గౌతమి కృష్ణల గలగలలు
గుడి జేగంటల గణగణలు

మెఱసి మెరిసి మించిన శుభసమయము తల్లీ!
తరళ యశోవతి! అనుపమిత రాగవల్లీ!
నీవరసంతతి చేమోడ్పు లివె తెలుగుతల్లీ!

కవిపికముల సల్లాపములు
గాయక బర్హ్యాలాపములు
లాస్యత్వగ విన్యాసములు
భాస్వత్పటహ నినాదములు

విరిసి, మ్రోగి, పఱచిన శుభసమయము తల్లీ!
సరళోక్తి మధురసవతీ! కోమలవల్లీ!
నీవరసంతతి చేమోడ్పు లివె తెలుగుతల్లీ!

హాలికజన కలహాసములు
శ్రామికజన మధుహాసములు
దాస్యవిముక్త నివాసములు
స్వతంత్రప్రభావికాసములు

ఒలసి, మెలసి, చెలగిన శుభసమయము తల్లీ!
చరణార్పిత కోటిషట్కహృత్సుమవల్లీ!
నీవరసంతతి చేమోడ్పు లివె తెలుగు తల్లీ ❖

శతపత్రసుందరి

శతపత్రసుందరీ, ఓహో శతపత్రసుందరీ!
సురభిళ భ్రాంతిలో
సుందర
నయనదళకాంతిలో
ఈ ఉదయ సాంధ్యవేళ మెరసిలే
ఈ ఉదయ సాంధ్యవేళ

నా హృదయభావ వేల విరిసెలే
నాహృదయ భావవేల

ఓ శతపత్రసుందరీ, ఓహో శతపత్రసుందరీ!
అరుణదరహాసమో
చందన
మరున్ని శ్వాసమో
నీమృదులదళశతమ్ము తెరచెలే
నీమృదులదళశతమ్ము!
నీ హృదివి మధురసమ్ము వరచెలే
నీహృదివి మధురసమ్ము
శతపత్రసుందరీ, ఓహో శతపత్రసుందరీ!
అనంగవాద్యములో
యౌవన
తరంగలాస్యములో
నీమధువు మధుకరాళి మరగెలే
నీమధువు మధుకరాళి!
నీవలపు లీనకరాళి కరగెలే
నీవలపు లీనకరాళి!
ఓ శతపత్రసుందరీ, ఓహో శతపత్ర సుందరీ! ❖

విశ్వవీణ

విశ్వవీణారవ విస్మృతమాధురులు
వినువీథుల ప్రసరించెన్!
విశ్వజీవజాల మీమ్మవేళను
విమోహిత మ్మనిపించెన్!

స్థలమున జలమున సమీరణమ్మున
అనలాకాశము లందే
సదా ధ్వనించుచుఁ గదలుచు ప్రాకెను
విశ్వవీణామధురవము!

విభృతాకాశ గభీరమర్దళవు
నీలివర్మ మదె పల్లవించెను!
వారిదఘోషను భైరవితానము!
వాతోన్మాదారభటి నసావరి!

అంధకార భీకరరాత్రమ్మున
నవ్యభంగిమంబుల నర్తించుచు
అదిగో! ఉన్మాదిని! సౌదామిని! !

విశ్వమోహిని! విశ్వనటి! దేవి!
విలయంకరి! అదిగో!
విపరీతావేశ నృత్తములతో
వికృతయై ప్రకృతి వెనుక నటింపగ
విపంచీ గళిత గీతపరంపర
వెఱ్ఱిగా అభినయించుచున్నదో!

అనంతమగు నావీణారవమున
అఖండమగు నామృదంగజవమున
నవ్యరుచుల వర్ణము లుదయించెను
నవ్యగతుల తాళము లలరించెను!
నవ్యాశలు వికసనము చెందెను
నవ్య తేజమూ నవనవసృష్టి
నవోత్సాహ ముద్భవ మందెడినది! ◆

(రవీంద్రకవి వాణిని అనుసరించి.)

కోయిల

పాడవే కోయిలా
పంచమస్వరమెత్తి
పాడవే కోయిలా!

బయల పచ్చని ప్రాకు
పాటాలకించేని!
చలన రహిత నదాన
శశియు తిలకించేని!
పాడవే పాడు
మవ్యక్తమధురరవాన
పాడవే!!

రిక్కలవె మైకాన
చొక్కించు నీపాట
రేయి హృదయము వెడలి
హాయిగా జాలిగా
చేల గట్టులు దాటి
చిని చిన్ని తెరలుగా
పాడవే కోయిలా

నాకలల పూదేవి
త్రాగు తేటివి కాదొ
నాకవీథుల జనుము
నన వలపులను గొనుము
ఆకలిగ నిప్పువలె
అంతలో మంచువలె
పాడవే కోయిలా!

పంచమస్వర మెత్తి
పాడవే కోయిలా! ◆

చిన్ని పూవు

చేకొనవె చేకొనవె
చిన్నిపూవో నాథ!
కన్ను విప్పేవేళ
వన్నె లొప్పేవేళ
వలపులో తలపులో
వచ్చి దరిసెన మిచ్చి
చేకొనవె!

కమ్మపుప్పొడి చింద
కనువిందు కాదేమొ
పసిమి చిందకమున్నె
మిసిమి కందకమున్నె
చేకొనవె!

తావి బరువగునేమొ
తలుకు కరవగునేమొ,
మరులు గ్రమ్మకమున్నె
ఇరులు జిమ్మకమున్నె
చేకొనవె!

అలరుదోయిలిలోన
తొలకుతేనియసోన
అరగాడ్పు కోవలో
ఆరునో జారునో!
చేకొనవె చేకొనవె
చిన్నిపూవో నాథ! ◆

(రవీంద్రుని గీతి ననుసరించి)

మధుపాయి

మధుపాయి విరి జీల్చి
మధువు త్రాగకుమోయి!

కలుగగల మధురతల
కలవరింతల కలుగు
ఆశానిరాశల, అ
నారతము చిక్కువడి,
కూర్పునెగులునఁదగిలి
కుందుటే కోరుమోయ్!
మధుపాయి! !

తీయమంటలయేట
దిక్కులుఁగుబ్బుండఁగా
తెలిచూపయే లేక
త్రిప్పు మాలిమిలేక
పరువంపు టోడపై
పయనంబె వలచుమోయ్!
మధుపాయి ! !

అందమక్కఱలేద !
హాయి గనరాద!
అనువు దొరకమిఁ గలుగు
ఆర్తిసౌఖ్యముచేద?
ప్రేమ ఫలియించుటకు
ఏమార్గ మున్నదోయ్?
మధుపాయి ! !

నలిగి రాలిన ఱేకు
వలపు గోల్పోవదా?
ఎండిపోయిన యకరు
నేమి దాహము తీర్చు?
కలలబాధల కపుడు
కలుగునే మధురతలు?
మధుపాయి ! !

వలపు విరిగొలనిపై
వలిగాలి యలలపై
వెలిజిందు తేనెపో
వల ముగ్గి తేలుమోయ్!
కలనాద మెత్తి, కా
కలిపాట పాడుమోయ్!

మధుపాయి, విరి జీల్చి
మధువు త్రాగకుమోయి! ◆

మాధురులు

ఊరకే మాధురులు
ఊరిపోతున్నాయి!
ఆవైపు ఈవైపు
అని కాదు, అలముకొను
అందమే వెలుగైన
అన్నివైపులగూడ
అంధకార ప్రభలు
ముందు వైపులగూడ!
ఊరకే మాధురులు ! !

వలపుటామనిలోన
తల లెత్తు పూల తే
నెల క్రోలి సోలు ఆ
యెల దేటి పాటలో
అలి వల్లకాట, ధ
య్యాల చెరలాటలో!
ఊరకే మాధురులు ! !

ఒక్కపారిగ మరగ
కక్కుతూ పొంగేసి
ఉరుముతూ విరిగేటి
కెరటమ్ము కేకలో

ఆవెన్నెలే మరో
అల రాక తెలుపుతూ
ఏవైపు చూచినా
ఎందుకో మాధురులు ! !

వాడిపోయిన పూల
వాసనలు కాబోవు!
క్రొత్తవాసంతికల
కొమరు అసలే కావు!
మన మనస్సులె కాల
మందు కల్పించితే
ఊరకే మాధురులు
ఊరిపడుతున్నాయి!

హాయి, భోగం, మనకి
ఏవైపా దాగకొని
తీయరోజులె కలుగు
తాయి ముం దెప్పుడూ
అని కమ్మవాసనలు
విరజిమ్ముతున్నాయి ! !

ఆశలై అందాలరాశులై, కలిగేటి
సౌఖ్యాలపూసులై
చిరునవ్వు మోసులై
పెరుగులో విరుగులో
తరుగులో పరుగులో
ఊరకే మాధురులు
ఊరిపోతున్నాయి! ◆

ఒక్క పువ్వే

ఒక్క పువ్వేటు చాలునోయ్? నీ
కొక్క నవ్వేటు చాలునోయీ?
వలపులోనో సొలపులోనో
కలుగు తీపియె వలయుగాదా!
అందమందే వలపుసొలపులు
అంతటా లోకమునఁ గలవోయ్!
ఒక్క పువ్వే?

అడుగు నిడితివి లోకమందున
హాయికొఱకే కాదటోయీ?
అందఱకు సొత్తయినలోకము
నంద మందే కలదు హాయి!
ఒక్కపువ్వే?

ఏకతమ గూర్చుండి యూరక
యేడ్వ నెటులు సహింతువోయీ?
పగలనక, రేయనక, యీవిధి

బాధ నెటుల భరింతువోయీ!
ఒక్క పువ్వే?

కలడొ లేడో ఆయున స్వామికి
కాలమంతయు రిత్త బుచ్చుచు
ఏల యీగతి సేవచేయుట
ఎందునా పొందని శ్రమంబున
ఒక్క పువ్వే?

ఆ 'విభుని నేర్పయినకృతు' లగు
అన్ని విరు లందమ్ము నీవా
ఆ విభుని ప్రతిమూర్తులే యగు
అన్ని పూవులు వలపు నీవా
ఒక్క పువ్వే?

కల విరుల నన్నిటిని వలచుము
వలయుచో లోకమునె వలచుము!
కలవు తీపియు హోయి, దానని!
బదులుకోరే స్వార్థపరతను
వదలుమోయ్! అనవసరమోయీ!

లేవు నీ కాశాని రాశలు!
రాదు నీ కిక భగ్నహృదయము
విశ్వసౌందర్యార్చకుడవై
నిత్య మానందమ్ము గ్రోలే
సత్య మగు జీవితాశయ మా
చరణమందున నిడగదోయి! ◆

చండీదాసు ప్రేమగీతి

అతిదీనకామిని! రజకినిరామి! నా
హృదయమందిర మె తన సదనముగ వెలసినది ! !
లేదు తిరుగనివాడ లేదు చూడనిజాడ
లేదు చేరని నీడ తన కూటికై వేడ!
అతిదీన కామిని!
రజకిని రామిని!

అలయంబున వెల్గు నాదేవి యటు; నాహృ
దంతరంబున వెల్గు నీదేవి యిటు సతము!
వరప్రేమగాయని!
వాసంతదాయిని!
ఆమెను నియోగించి రాచార్యులమకంప
మందిరాంగణము సమ్మార్జన మ్మొనరింప!
దేవీ ప్రసాదమ్ము తృప్తిగా భుజియింప!
అతిదీన కామిని!
రజకిని రామిని!
యౌవనభామిని! దుఃఖిని రామిని!
నిరుపమప్రేమిని! శారదయామిని!
అతిదీన కామిని! రజకిని రామి! నా
హృదయమందిర మె తన సదనముగ వెలసినది!
అతిదీనకామిని:
రజకినిరామిని!
కవిగాయకుడు 'చండి' గానమ్ములో తేట!
లేదు లే దల రామి ప్రేమ కిలలో సాటి ! ! ◆

కన్నె కాకిబొ

కాకిమూపుల కన్నెకొలుకుల
కొత్తతీవుల చివ్వులు పూయగ
తేనెబుగ్గలు గుంటలడగా

తీయపాటలు పాడుతుంటే
పండ్రెండో వసంత మిట్టే
పొలు తెంచిందోయ్!

కాకిబావా కాకిబావా
కలిగె నీ రెక్కల్లో సత్తువ
ఎగరలేవో ఏకటంగా
ఇరులుతెంచుక మింటిలోనికి
చూపులకునూ రంగునకు నే
చూడగా నువు కాకి బావవి!
హాయిగా నువు పాటపాడిన
కోయి లెందు కిక?

ఊరపిచ్చుక అదరిపోతూ
మారుమూలల కెగిరిపోవగ
ఒక్కపా టెలుగెత్తిపాడవ్
ఒక్కమా టెలుగెత్తిపాడవ్
నక్కబావని కాను లే నేను

ఎపగు బిడియపుతొడిమ
పసిమి మించెను గదా!
అతను శంఖరవాలి
అలముకొన్నది గదా!
తీయకోరిక తేకు
తెలుసుకొన్నదిగదా!
తలయెత్తి చూచుటకు
తటపటాయించకోయ్!

కలిసిమాటాడుటకు
కల్లోలపడకుమోయ్! ◆

ప్రధానం

ఎన్ని తీయని కలలు
కన్నానో నినుగూర్చి
ఇన్నాళ్లు ఎదవిప్పి
ఎరిగింపనా చెలీ!
బ్రతుకు పందెములో
పయిపేరు నాదిగా
తొడిగినా వొక పీర
కడియమ్ము నాచేయి!

నీ పెదవి కెంజివురు నే
పుడికిన ఫలమె చాలు
తీయగొంతుకతోడ
కోయిలై పాడుదును!

నీమనసు నామనసు
ఏక మగుటనె చాలు
లోకమ్ము దిద్దే మ
హాకవిని కాగలము!

నీ వలపు తేనియను
త్రావిన బలమె చాలు
ఈ రేడులోకాలు
ఏకముగ ఏలుదును! ◆

మనప్రేమ

మనప్రేమ

సస్యసుందర భూముల్

ప్రభవించి ప్రభవించి

ప్రణయ తృణకాష్ఠ మగునొ? ఏమో?

ప్రణయ పల్లవం బగునొ ఏమో!

మనప్రేమ

కల్లోలినీతరంగములన్

పయనించి పయనించి

ప్రణయ తరణియే యగునొ? ఏమో!

ప్రణయ జలరాశి యగునొ? ఏమో!

మనప్రేమ

కాలగాఢాగ్ని శిఖలన్

తపియించి, తపియించి

ప్రణయ జలరాశి యగునొ? ఏమో!

ప్రణయ విద్యుల్లి తగునొ? ఏమో!

మనప్రేమ

దీర్ఘఝుంఝూనిలములన్

ప్రసరించి, ప్రసరించి

ప్రణయ నిశ్శ్వాస మగునొ? ఏమో!

ప్రణయ మధుహాసమగునొ ! ఏమో !

మనప్రేమ

సువిశాల గగన వీథులలో

విహరించి విహరించి

ప్రణయ విహగరాజంబె అగునో!

ప్రణయ భువన సామ్రాజ్య మగునో? ◆

రాధవలపు

వలపులో తేలుదునో
మఱపులో సోలుదునో
మనసులో ప్రాణేశు
        మాట తీరే తోచె!
కపురంపు తునకలో
అపరంజి మొలకలో
తలపులో నానాథు
        పలుకు తీరే తోచె!
విరిదేనె ముసురులో
తొలిమించు విసురులో
విరమింప కే విభుని
        వేణురావమె తోచె!
ప్రణయగీతమ్ములో
ప్రణవనాదమ్ములో
రాధయే నాథునిగ
        ప్రభుడె రాధగ తోచె! ◆

వసంతోత్సవము

బృందం : పులుగునెచ్చెలులార పూవునెచ్చెలులార
కొదమతుమ్మెదలార కదలి రా రండోయి!

తీయతావుల పూల తేరెక్కి ఋతురాజు
వనలక్ష్మి కైసేయ వచ్చెనే నేడు!
ఇరులు కురియగ లోక మిగురజేసినవాడు
చలిరేడు హేమంతు డరిగెనే నేడు ! !

స్వాగతమోయీ! వసంత దేవా !
స్వాగతమమ్మా వనలక్ష్మి ! !

తుమ్మెద : ఝుం ఝుం ఝుం ఝుం
ఝుం ధిం ధిం ధిం
ధిమ్మని దుందుభు
లను మ్రోయింతుము!

కోయిలలు : ఆహో ఆహో యని
జగములు మరవగ
కుహూ కుహూ కుహూ కుహూ యని తూ
ర్యారావమ్ములు సేయుదుమోయ్!

బృందం : స్వాగతమోయీ వసంతదేవా!
స్వాగతమమ్మా వనలక్ష్మీ ! !

చలిలో రాలిన మంచుము త్తెసరులు !
ఇరులను త్రోలి హసించు కమ్మవిరులు !
మరులను జిమ్మి తనియించు తేనియలు!
మలయానిల మృదుమధురాలాపములు !
కలహంసీకృతనవనవనాట్యములు!
కొనుమోయీ మాధవ మా కానుకలు!

వనలక్ష్మియె లోకపుయౌవనలక్ష్మి
కొనుమోయీ మాధవ నీప్రేయసిగా!

వనలక్ష్మీ వసంతులకు పెళ్లి!
మనస్సులకు మోదమ్మగు రండి!
తమస్సులిక తొలగును లెండి!
వనలక్ష్మీ వసంతులకు పెళ్లి ! ! ◆

రాబోవు ఎనిమిది
'మధువన స్వప్న'
నాటక గీతలు

మధువని

మధువనీల తాంత కాంతలారా! రారే
మదభర యౌవన మధునిధులారా రారే రారే!
నీలగగనవీథులలో బారులుగా తీరి
తేలి తేలి కోమలదళముల పరచుకరారే
లోలపవన కల్లోలినిలోన తూలి తూలి
రాలుపరాగపరీమళపాళి మెరయురారే?
రావె అశోకా అరవిందా
రావే మాకందా
రావే నవమల్లీ నీలోత్పల రారే విరులారా
మధువనస్వప్న డోల
విధురహృదయ సంయోగఖేలలో
మధురప్రేమిజన మత్సరలీల
మధువన స్వప్న డోల

మలయానిలుడు :

రావోయీ మలయపవనా!
తీయ తీయనైన విరితావులడోలికలో రావోయీ
దూరారామ భ్రమరాళీపికాళుల
హాయిగొలుపు సన్నాయీ నాదాలలో రావోయీ.

మలయానిలుడు :

ఏతెంచె నదె మలయానిలుడు
పీతెంచెనదె మలయానిలుడు!
హాయి హాయిగ తీయ తీయని
భావముల నెదరేపుచూ!! ॥ఏ తెంచె॥
రివ్వురివ్వున నెగురుకమ్మని
పువ్వుతేనెల రువ్వుచూ!
దవ్వుదవ్వుల పాటతేటల
వలపు బరువుల మోయుచూ!! ॥ఏ తెంచె॥

మరులుమాతంగి :

చర చర చర చర పోయే
శరవేగము చాల దహో!
చరాలు మని బిరాన పోయే తటిల్ల తేల నహో!
మనోవేగమును మించిన
మలయవాయువేగ మ్మిది!
ఏడుసముద్రములా ఈరేడుసముద్రములా
చూడు దాటి కొని తెత్తును అపరూపపుసంపంగి
మరపుతెరల మాయ ముంచు ప్రసవము
మరులుమాతంగి!!

మరులుమాతంగి :

మరులు మాతంగి వూదేని! నీదు
కనుదోయి లోగొన్న యిరుల పొద్రోలీని !' ॥మరులు।
ప్రియురాలి ప్రేమార్తి గువహో నీదు
హృదయమ్ముగాయైతె ఇక కంగిపోయీని!! ॥మరులు॥
కన్ను రెప్పలు తెరవగానే నీ ప్రియును

ఎన్నింటవో వలపు వలపంటూ వేడవో !!
మరులుమాతంగి !!

జోల.

జోజో, జోజో, జోజో, జోజోజో
అందాలమల్లీ నికుంజమందునా
పొందుగా నిద్రింపవమ్మ సుందరీ
చల్లగాలి చెక్కిళ్లపై సోకగా
మెల్లగ సోగా కన్నుల తాకగా
తీయాలాపీ వింజామర లాడగా
హాయిగా సుమాంగ నాళి పాడగా
జోజో, జోజో, జోజో, జోజోజో

మాయాజాలం :

రేగనీ చెలరేగనీ
మాయాజాలము, మధుమాయాజాలము!
పుప్పొడి దుమారము, స్వప్నపారావారము
ఉప్పెనౌచు పొంగి నిండనీ నిండనీ కాంతారము!
మధురసాలసారము దివ్యసౌరభసారము !!
దిక్కుదిక్కులా అల్లనీ అల్లనీ నీహారము !!
రేగనీ చెలరేగనీ !!!

మధువన స్వప్నసీమ :

మధువనస్వప్నసీమ
మధుమాయా పరివృతచ్ఛాయా సుందరము
నరులుగాని, సురలుగాని, పూవుల
నారాచాల వాడిమొనల కోడరె
తీయ విరులతోనె సుంత కనుగవ
పూయ ప్రియా ప్రియా యనుచు రోయరె
మధువనస్వప్నసీమా! ◆

వెలుగు

వెలుగు ! నావెలుగు !
ఈ జగము నిండిన వెలుగు !
కనుల ముద్దిడు వెలుగు
ఎద తియ్య నగు వెలుగు !
మనికి మొగసాలలో
నటియించు నా వెలుగు !
వలపు తీవల మీటి
పలికించు నా వెలుగు !
అంబరమ్మే విరిసి
అనిలము కడల దరిసి
అఖిలలోకమ్ము, హో
సొంచితమ్మై వెలసె ! ◆

పెళ్లి కాకముందు

ఏమని, ఏ మేమని, ఏ మేమని ! !
నా హృదిలోపల కోరిక యేదో
నాట్యము నేయుచు తీయని పాటై
కమ్మకమ్మని పూవుల తావులు
పలుకరించు పూరేకుల చాటై
హృదిలో కోరిక ఏ మేమని ! ! ఏమని ! !
ఝుం ఝుం ఝుమ్మని పూవుపూవుపై
క్రమ్మెడు తుమ్మెద పాటల రొదతో
యీా వసంతమే గేలిసేయగా
హృదిలో కోరిక యే మేమని ! ! ఏమని ! ! ◆

పెళ్లయాక

చిన్ననాటి స్వప్నసీమ
కన్నయూరు విడువలేము!!
ఎంతహాయి!
చింతా చీకు లేని చిన్ననాడు ?
ఎంత వంత,
ఎదిగి లోకమెరుగుకొలది, నేడు!!
తల్లి మరచి, తండ్రి మరచి, చెలుల, బంధువులను
కల్ల లనుచు, ప్రియములైన వెల్ల మరచిపోవలెను!!
చిన్ననాటి స్వప్నసీమ
కన్న యూరు విడువలేము!! ◆

జంట ఊయెల

అతను : ఊయెల ఊపనా సఖీ

ఊయెల ఊపనా!

ఆమె : తీయగ పాడనా మీ

రూయల ఊపగ ఊగనా !!

అతను జీవితమే ఊయెలగా, కలగా

నీవే కలలో తీయుదనముగా !! ఊయెల !!

ఆమె ప్రకృతియె నేనుగ

పురుషుడు మీరుగ

అతను . ఆకాశము భూమియు ఏకముగా

ఇద్దరు · ప్రకృతిపురుషలీలయె ఊయెలగా

ప్రణయమధురడోలయె ఊయెలగా

ఆమె భావగగనపుటంచులు మీరి

దేవలోకపుసీమలు చేరి

అతను : } ఏలుదమా యీ జగమంతా

ఆమె : } మరచి మనుజాలచింతా, వంతా !!

అతను : ఊయల ఊపనా !

ఆమె : తీయగా పాడనా !! ◆

ఆరుఋతువుల ఊయల

జీవిత మూయెలగా
ఊగెద తియ్యనికలగా ।।

ధళధళ మను మెరుపులలో
ఫెళఫెళ మను ఉరుములలో

ఝురఝుర పడుధారలలో
చరచర నర్తించు నెమలినై ।।

జీవిత మూయెలగా
ఊగెద తియ్యనికలగా ।।

తెలిమబ్బుల నురగలలో
తెలివెన్నెల తరగలలో

పయనించు చంద్రనౌకలో
శయనించే తారాకోమలినై ।।

జీవిత మూయెలగా

ఊగెద తియ్యనికలగా ! !
హేమంతరాజాకైదండవే
చేమంతి కుసుమాలదండతో
తెరతెరల నును మంచువలువలో
సిరు లొలుకగా పుడమి చెలువమై ! !
జీవిత మాయెలగా
ఊగెద తియ్యనికలగా ! !

ఇల రాలిన ఆకులలో
తలవాల్చిన తరువులలో
చలిమంటల వెలుగులలో
వలపొలుకు చెంగల్వలతికనై ! !
జీవిత మాయెలగా
ఊగెద తియ్యనికలగా ! !

తోటతోట చివురులు పోయా
బాట బాట పూవులు పూయా
ఝుమ్మని పాడుచు తేనెలు క్రోలే
తుమ్మెదరాయని సుమప్రేయసినై ! !
జీవిత మాయెలగా
ఊగెద తియ్యనికలగా ! !
తెలిమల్లెల పూల తోటలో
చలిపందిరి తేనెయూటలో
తరువు తరువు ఫలాలబరువులో
వరలి మురియు వనదేవతనై ! !
జీవిత మాయెలగా
ఊగెద తియ్యనికలగా ! ! ◆

పూలచెండు

అందుకోం డందుకోం డిదే!
అందుకోం డిదే! అందుకోం డిదే!
అందమౌ పూలచెం డిదే! ! ॥ అందుకోండి ॥
మందమారుతమువోలె సోలుతూ
తేలి తేలి భువి రాలి తూలుతూ
కన్నెవలపువలె కమ్మవాసనల
చిమ్మి మైమరచుచెండిదే!
తన్ను దా మరచి యెదిరి మరపించు
అందమౌ పూలచెం డిదే! ! ॥ అందుకోండి ॥
అందదోయ్ అడుగు మందగించి వెను
కంజవేసినా అందదోయ్!
తొందరై అడుగు ముందు వేసినా
అందదోయ్ అదే మందదోయ్!
క్రిందుమీ దరసి చిందు తా వరసి
పొందుగా అందుకోం డిదే! ◆ ॥ అందుకోండి ॥

మేలుకొలుపు

మేలుకొలిపెగా
    తానే మేలుకొలిపెగా !
నామేనిసొగసులో
    నిదురించే యౌవనమును తానే !
ప్రేమ తెలిపి పలుకరించి
    మేలుకొలిపెగా ! !   ॥ మేలుకొలిపెగా ॥
నా మదిలో నాట్యమాడు
    నా తొలికోరికలే
మింట తోచి మెరసిపోవు
    తారా మాలికలై ! !   ॥ మేలుకొలిపెగా ॥
రెక్క విప్పి నా కోరికలే
    ఎక్కడెక్కడికో ఎగయా
చక్కనైన వెన్నెలయేరుల
    స్వప్న నౌకలలో సాగయా!
స్వప్న నౌకల తేలే కోర్కెలు
    సఫలము సేయడో రయమున తానే ◆ ॥ మేలుకొలిపెగా ॥

మలయానిలుడు - దిరిసెనపూవు

దిరిసెన : ఓ మలయపవనమా !
నిలు నిలు నిలుమా ! ॥ ఓ మలయపవనమా ॥
మలయ : ఓ విరిసిన దిరిసెనపూవా !
నిలిచిన బహుమతులా ! ॥ ఓ విరిసిన దిరిసెనపూవా ॥
దిరిసెన : బాటసారి నిలు నిలు మని
పిలువగానె బహుమతులా ! ॥ ఓ మలయపవనమా ॥
మలయ : బహుమతులే ఈయనిచో
బాటసారి పిలువనేల ! ॥ ఓ విరిసిన దిరిసెనపూవా ॥
దిరిసెన : మాటకారి బాటసారి
మాట చెల్లకుండునేమి
అర్పించితి సర్వస్వము
అతిథిసేవగా తనకే ॥ ఓ మలయపవనమా ॥
మలయ : తా నెవరో నే నెవరో
తనసంగతి నా కెందుకు
నీ వలపుల నీ తళుకుల
ఏవి నాకు బహుమతులో ॥ ఓ విరిసిన దిరిసెనపూవా ॥
దిరిసెన : తొలిజన్మల వలపులతో
తొరిపిన తేనియలు !
వలపుల పుప్పొడి మెరుపుల
విరిసిన మాధురులు ! ◆ ॥ ఓ మలయపవనమా ॥

స్వభాను

రావే రావే నవవర్షా జగదభి నవహర్షా!
రావే నవప్రభాత శీతల
శుభానిలంతో స్వభాను!

దెసదెసలో, కెంజాయల మధుహాసనములు
ఎసగునవే తరులతల చివురు గుసగుసలు
ముసరునవే పరిమళ కుసుమోల్లసనములు!! ॥రావే॥

పల్లె పల్లెలో, పట్టణమ్ములో
బాలబాలికలు చెలరేగ, నీ
ఆగమనమ్మును గనరాగ,
దవ్వుదవ్వులను నవ్వులగొంతుల
యౌవనరమ ఉయ్యల లూగ
జంటలుగాగ, నిను గనరాగ!!
విషాదగీతులు, విరాగ గాథలు
వినంబడవులే
వినూతన మధూదయోత్సవమ్మున
విమోహనానంద మాధుర్యమో! ◆ ॥రావే॥

మధుఋతువు

వెలసె నహో! వెలసె నహో
ప్రతివనమున మధుఋతువునహో!
యౌవనము! యౌవనము!
త్రిభువనముల నవయౌవనము!!

వలపుబరువుతో వరుసలుగా
తరులతికలపై విరిసె నహో!
కుసుమాలు! కుసుమాలు!
వనవనమున మధురసుమాలు!

మరంద ధారలు క్రోలుటకో
పరాగ రాశుల తేలుటకో!
మునసె నహో! మునసె నహో
కుసుమకుసుమమున భ్రమరాలు! ◆

పెళ్లికి

మెఱసె మెఱసె తారకాళి
మింట తోరణమ్మై !
మొరసె మొరసె భువన మెల్ల
దుందుభి స్వనమ్మై !
తరళ మధుర మధురామృత
కలితగానవల్లీ !
సురగాయకగణము పాడు
శోభనగీతులు చెల్లీ !
నీదు నవవసంతోదయ మీ
దినమున తల్లీ !
ఈ దినమ్ము తిరిగి రాక
మునుపే నీ పెళ్ళి ! ◆

వసంతము

జగతికి వసంతమా
        వసంతమా జగతి !!
అమృతవీణ వాగాన
        మ్మ్రోవరించు దశదిశలను !!   ॥వసంతమా॥
షడ్జమ్మును మీటి
        మధ్యమమును దాటి
ధైవతమును మీరి తార
        షడ్జమ్మును చేరి !!   ॥జగతికి వసంతమా॥
మోడులయిన తరుల వీణ
        మ్రోయగనె చివురులు !!
సఫలాశయ హృదయమ్ములు
        సఫలాశలగు వనమ్ములు !!   ॥జగతికి వసంతమా॥
పాడలేని ప్రతిగళమ్ము
        పాడునే డనర్గళమ్ము !!
పాటలోన మరచు నాత్మ
        మరపున నెరుగు పరమాత్మ !!
జగతికి వసంతమా
        వసంతమా జగతి !!
అమృతవీణ వాగాన
        మ్మ్రోవరించు దశదిశలను !! ◆   ॥వసంతమా॥

గ్రీష్మ పర్వం

అందవు

అందవు అందవు యెంత చాచినా
యెడదల మొలిచే చేతులు !
ముందుకు ముందుకె యెంత చూచినా
బరువుగ మెరిసే చూపులు !
తడియవు తడియవు యెంత కురిసినా
వలపు జడుల బడి యెడదలు !
తనియవు తనియవు యెంత విరిసినా
వెన్నెలసుడులలో కన్నులు !
అందవు అందవు యెంత చొచ్చినా
యెడదల దొలిచే చేతులు !
ముందుకు ముందుకె యెంత విచ్చినా
పెదవుల నమిలే చూపులు !
తెలియవు తెలియవు యెంత వ్రాసినా
బ్రతుకుల సంజలగంటలు !
కలియవు కలియవు యెంత సోలసినా
ఒకటై రెండు యెడందలు ! ◆

గతాగతం

చూచినకొలంది రాబోవు వత్సరా
        లంపా లనిపిస్తాయి !
కడచినవి వెనుదిరిగి చూస్తే
        వేవేగ నడిచె ననిపిస్తాయి !
సంతోషమైన సంతాపమైన
        ఒకట్యోటి క్రమసారంభమే !
చిరకాలపు కర్పూరమ్మో !
        కడచినకాలపు చందనమోకద ! ◆

వికృతహాసం

హృది పొంగే తరుణ మధువనంలో
నిదురించా నొక నీరవరాత్రి
గుసగుసల నెసగి నా మదిలోన
కొసరి కల లవెన్నో కదిలాయి !

        మధూదయారుణిమచ్ఛాయలలో
        హృది నిండే యావంగముకొర్కై
        వెదకాడగ ప్రకృతియే వికృతయ్యై
        వికటహాస మొనరించినది ! ◆

"గజల్"

హాయిలో నేల యెద కింత హింస?
తీయపాటలో బాధేల వంశీ !! ॥హాయిలో॥

శకలశకలాలుగా నిన్ను విరిచి
వికలరుతు లందె జగతి మైమరచు ! ! ॥హాయిలో॥

ఏల అమృతమ్ము పాశించు వీరే
నందనము నేలకే దించుతారే ! ! ॥హాయిలో॥

మురళి నీ పాట నేల గద్గదము ?
రజనికంఠాన నేల బుద్బుదము ? ◆ ॥హాయిలో॥

విరహిణి రాధ

విరహానలంపుబాధ
భరియింపలేదు రాధ!
తన చూపే నీదు తేరు
చను దివ్యపథముగ గోరు
తన వినికియె నీ మురళీ
స్వనస్ఫుటానిలముగ గోరు
విరహానలంపు బాధ!
భరియింపలేదు రాధ!

ఊర్పు వేడి వాడె విరులు
ఉరమునుండి యూడె సరులు
కేశరాశి అశ్రువారి
రాశితోడ కలగి పారలు

విరహానలంపు బాధ
భరియింపలేదు రాధ! ◆

రాబోవు పది పాటలు
"గ్రీష్మము" అను
సంగీత నాటిక లోనివి

స్వాగతము

సంధ్యారుణిమ రుచిరజ్యోతులు
సకలపాంథులకు స్వాగతము

నందనవని హరిచందన వివృతా
నందాంగణమున స్వాగతము

ప్రసవ సుగంధిల విహార శీతల
పాద్యజలమ్ముల స్వాగతము!

విచికి లాక్షతా దధి మధు ఫలరస
రచితార్ఘ్యాంజలి స్వాగతము!

వసంతాంత మృదుకిసలయతోరణ
మసృణాంగుళముల స్వాగతము!

అదళిత కదళీ శ్యామ విస్పృమర
ఛదవకరమ్ముల స్వాగతము! ◆

గ్రీష్మజృంభణము

నడిమింట చండరవి మండు నెండ కాచె!
వడగాలులు సుడి తిరిగి హోరు మని వీచె!
సడలి తరుపర్ణములు జరజర మని రాలె!

వడలి సుమఫలాలు సొగసుచెడి పడి తూలె !
కడలంటు బ్రదుకులను జీవరాశి రోసె !
బడలి మంచెపయి తోటమాలి కనుమూసె !

ఈ రేడుజగాలు కాలె ఈ గ్రీష్మజ్వాలాకీల ! జ్వాలాకీల!
జగాలుకాలె!
ఈ తాపమునార్పు నేత లేడు ఈ పాపముతీర్పు త్రాత లేడు !
అనల మ్మనిలమ్ము కలిసి, ఆకాశము నొసట పొగలు
వనరుజీవజంతుతతుల బ్రదు కాశల కడల ంగులు
ఈ తాపము ... ... ఈ పాపము
ప్రేమలేక మరిగి మండి ప్రీలిపోయినవి ఎడదలు
క్షేమలేక సురిగి యెండి చీలిపోయినవి యేరులు
ఈ తాపము ... ... ఈ పాపము
వెతలను మరపించు దారి కతలు మాయమాటలోయి
వితలో యెండమావులే వినిపించే పాటలోయి
ఈ తాపము ... ... ఈ పాపము
ఈ రేడుజగాలు కాలె ఈ గ్రీష్మ జ్వాలాకీల ! జగాలు కాలె!
జ్వాలాకీల!

ఎండకారు, ఎండకారు, తోటలన్నీ పండేకారు
వనదేవత కావికురులు మెరసె వ్రేలు కెంజివురులు !
తెరల తెరల కమ్మతావు లొరసె మరులుజిమ్ము త్రోవ ! ఎండకారు
తరులనీడల వనేందిర పరచికొనిన చలిపందిర
విరిదేనెలు ఫలరసాలు కురిసె నోరు నిండేకారు! ఎండకారు
తెరతీసిన మావితోట సురిగి చెవుడు పికముపాట
తేటలోన మేను మరచి తోటమాలి పండేకారు!
ఎండకారు ఎండకారు తోటలన్నీ పండేకారు ! ◆

తోటమాలి

తోటమాలీ! తోటమాలీ!
యేటి కింక లేవవు యీపాటికి నీ నిద్ర తేలీ
తోటమాలీ! తోటమాలీ!

పాటిరేవులో కదలక పడవలాగిపోయినవో

ఏటినీరు రాక తోట యెండి మాడిపోయినదో
తోటమాలీ! తోటమాలీ!

మావి పండ్లు కావిలోన మాగిపోయెనో యేమో
తావిజారి పూవులన్ని రాలిపోయెనో యేమో
తోటమాలీ! తోటమాలీ!

వడగాలులు వీచుచుండ, ఒడలుకాలి మండిపోవ
మడులలోని విత్తనాలు ముడిగి విడిగి యెండిపోవ
తోటమాలీ..............తోటమాలీ........

యేటి కింక లేవవు యీపాటికి నీ నిద్ర తేలీ
తోటమాలీ! తోటమాలీ!

ఓసారి లెమ్ము ఓ తోటమాలి
హాసమ్ము చిందువదనమ్ముతోడ
ఓ తోటమాలి ఓసరిలి లెమ్ము లెమ్ము
ఓసారి లెమ్ము ఓతోటమాలి లెమ్ము!
వేసంగి నలిగి వేగునే ప్రాణితతులు
ఈసారి లేచి ఈక్షింపు జీవగతులు
ఆశాశ నందుకొనుమోయి లోకనతులు
ఓసారి లెమ్ము.......... ....

వేసంగి క్రాగి వీగి భువి రిత్తవోయె
వాసంత జీవనవుపోయి విత్తువేని
బ్రతుకంత మధుమ్మయ మ్మంచు మెత్తుమోయి
ఓసారి లెమ్ము ఓతోటమాలి
హాసమ్ము చిందు వదనమ్ముతోడ
ఓ తోటమాలి ఓసరిలి లెమ్ము లెమ్ము
ఓసారి లెమ్ము ఓ తోటమాలి లెమ్ము! ❖

నీ కెందుకు

తోటమాలిజోలి నీకెందుకు !
తోటలో తేనెతేటలో తీయపాటలో మునిగి తేలక
వనములో నవజీవనములో సుమవనములో మునిగి తేలక
తోటమాలి జోలి నీకెందుకు ?
తోటమాలి స్మరింపను లేదు
తోటమాలి మేలుకోనూ లేదు
నీదు ఊర్పులో నాదు ఊర్పులో
నీపాటల నాపాటల మాటల
పెరుగులో విరుగులో తిరుగులోన
పరుగువారు కనబడని తేజమా
తోటమాలి జోలి నీకెందుకు
తోటలో తేనెతేటలో తీయపాటలో మునిగితేలక
వనములో నవజీవనముతో సుమవనములో మునిగితేలక
తోటమాలి జోలి నీకెందుకు ? ◆

చలిపందిరి

విరిచెలువలార నవమాధవీనికుంజ
మందు కలయంపిగా తేనియలను చిల్కి
గందవొడు అల్కి పైడిసింగాపుపీట
లం దతిథివర్యు లెల్లరు నధివసింప
పజ్జ గొజ్జంగి చలువవీవనలు గొనుడు

• • •

బ్రదుకందు గాసిలిన పాంథా
ముదియెండ శోషిలినపాంథా !
బరువైన చూపు విదళించు
చిరునవ్వు పెదవి గదియించు !
చలిపందిరి లోపల విందు
కలలూరు మధువనమునందు ! !

మలుసంజ మంచు నునుజల్లు
వలికమ్మ తెమ్మెరల పెల్లు
ఎల దేటులార లే లెండు
విరిబోటులార రా రండు ! !

నవవర్ష మధువులను తెండు
యువహర్ష గంధముల నిండు
క్రొవ్విరులతేనెజడి ముసురు
మవ్వంపు గందవాడి విసురు ! !

చలిపందిరి లోపల విందు
కలలూరు మధువనమునందు
ఫలరసాలు నవశీధువులు
కలశివాలు యువమాధురులు ! !

అజరుండవైతివిక పాంథా
అమరుండవై తివిక పాంథా
ఇది ఆశకై సుధాపాత్ర
ఇదె ప్రేమకై సుధాపాత్ర
ఇదె స్మరణకై సుధాపాత్ర
విస్మరణకై సుధాపాత్ర ! ! ❖

కోయిల

తీయమావిచివుళ్లు మత్తిల్ల మెసవి
పాడి తెగపాడి, కోయిలా నేడు నీవ
సంత మలరారు వేరు ద్వీపాంతరమ్ము
చనియు, నీడవు హా హ్వానయించెదము లెప్పుడు !

•   •   •

చివురు గుబురుల గూటిలోనె దాగితివి
చివురు రసమును చేదుగానె త్రాగితివి
తీయతీయగ పాడి హాయి మనిపించుటే
కాని కంటికి కానరానె లేదోయీ !

రానే రావో కోయిలా ! ఇక నీవు
పోనే పోదువో కోయిలా .

దెసల యంచుల పాట తేలి కరగేనో
ముసలి మ్రాకుల తోట పోలి మరగేనో

పాయకే మా హృదయఫలకాల చిత్రిత
మ్మాయెనే నీపాట కానరాలే దీనె

రానేరావో కోయిలా! ఇక నీవు
పోనే పోదువో కోయిలా ....

• • •

పోయిరావే కోయిలా
పోయిరావే కోయిలా
వీడుకోలే కోయిలా
వీడుకోలే
చివురుగుబురుల
గూటిలోన
దాగినావే కోయిలా !

చివురురసమును
చేదు చేదుగ
త్రాగినావే కోయిలా !

తీయపాటల
హాయిగొలుపుటెగాని
కానరాని లేదోయి ! ! !

దెసల అంచున
నీదు పాట
తేలి కరగేనోయి
పసిమి వెలుగుల
తోట నిలువున పులకరించేనోయి ! ! ◆

ఆశాగీతి

కనవో ప్రతిబింబుతు మధురీతి !
వినవో యీ ఆశాగీతి !
వడలో సందడిలో . . . ప్రశాంత
వనజనసంగతి నీ ఆశ !
జడిలో అలజడిలో . . . మనోజ్ఞ
శంపాద్యుతిగతి నీ ఆశ !
చలిలో ఆకలిలో . . . కలిత
స్వప్న సుధాస్మృతి నీ ఆశ !
పువులోవ మధువులో . . . హసంత
కవిపికగళరుతి నీ ఆశ !
కనవో ప్రతిబింబుతుమధురీతి !
వినవో యీ ఆశాగీతి ! ◆

గ్రీష్మసంధ్య

మెరసినవి వినువీథిలోగిట వెలుగు తేనెల పైడిగిన్నెలు
కురిసినవి యీ తోటముంగిట నసుచు మల్లెల చలువసోనలు
ఒలసినవి యీ సంజవాకిట మధువులొలికిన పాటతేటలు
వెలసినవి యలసంపుబ్రదుకుల అమృతచైతన్యంపు బాటలు
ఒరగినవి వేత లడగి యెడదలు మరపుటంచుల మెరపుపాలికి
కరగినవి తరళిమలు కన్నుల విరియు మించుల తోటమాలికి! ◆

యక్షునిగ్రీష్మము

నీకు మాత్రము కాకపోయిన
నాకు సుంతయు లేకపోయిన
ఆ వసంత మ్మటులె గడచెను
        నీవు లేకయె ప్రేయసీ!
ఎడద వ్రీల్చు వియోగశాపము
ఒడలు కాలుచు గ్రీష్మతాపము
జగమె యుడుకుచు నంటుకొన్నది
జ్వాలాతోరణ మౌచు నలుగడ
        నీవు లేకయె ప్రేయసీ!
ఈ నిదాఘనిశీథి జాబిలి
ఏడ్పు నొంటిగ మంచుటేర్లయి
ఈ వనిని సుమసౌరభమ్ములె
దావపావక శిఖల నమియును
        నీవు లేకయె ప్రేయసీ! ◆

('మేఘ సందేశం' సంగీత నాటకంలోని పాట)

ఏలో ఏలేలే

ఏలో కోయిల ఏలే
ఏలో ఏలేలే

కువ కువ కువ మంటూ
కురూ కురూ అంటూ
చివురులమాటున గొంతుక చించుక పాడే వేలే
చినుకులు రాలుటతోనే తోటను వీడే వేలె

ఏలో కోయిల ఏలే
ఏలో ఏలేలే !

కువ కువ కువ మంటూ
కురూ కురూ అంటూ
చివురులరసమును చేదుగ చేదుగ తాగే వేలె
నవఋతుగీతము తీయగ తీయగ పాడే వేలె

ఏలో కోయిల ఏలే
ఏలో ఏలేలే !
కువ కువ కువ మంటూ
కురూ కురూ అంటూ
వడగాలుల సెగలాన ఓడిన దమ్ములపుచాలే
కడిచే వేసవితోనే కదలుచుపోయే వేలే
ఏలో కోయిల ఏలే
ఏలో ఏలేలే ! ! ❖

క్రొత్త హంగు

మెయిలునడకలఁ గ్రొత్త హొయలు తోచినది!
మెఱుపుచిందులఁ గ్రొత్త మిసిమి మించినది!
నాకలమ్మును గ్రొత్త నడక నేర్చినది!
హృదయమ్ము క్రొంగ్రొత్త పదము పాడినది!

సీతమ్మ శోకమ్ము శ్రీకృష్ణులీల
శ్రీ రాము సత్యవాక్పారీణతయును
గానమ్ము చేసిన కవిలోకమునకు
ముసలిసీతులవలని మోసమ్ముచాలు
మతము పేరిటి ప్రాతకతలు చాల్చాలు
అని చాటుమాట యీ నా క్రొత్తపాట!

కవిసమయాల శృంఖలములఁదవిలి
ఉత్ప్రేక్షలుపమలు నూరకే చొనిపి
రంభోరువులు హేమకుంభస్తని అని
అవయవమ్ముల నసభ్యముగ వర్ణించు
విరసప్రబంధాల వ్యాప్తమ్ము లింక
కాలగర్భమ్మున గడతేర్పవలయు
అను తేటమాట యీ నా క్రొత్తపాట!

అశరీరయౌ సఖి యాశ్లేషమునకు
పవలు రేలను దీయు బాధలఁబొగిలి

విరహాగ్ని కీలల వేగి తపించి
తనియక భావగీతములను వ్రాసి
తమయాతనలయందు గుములులోకమ్ము
వారిపై విరజిమ్ము వలను గా దింక
అను క్రొత్తమాట యీ నా క్రొత్తపాట !

దారిద్ర్య మంది స్వాతంత్ర్యమ్ము లేక
కష్టజీవిక నమక్షణము భారముగ
గడపుచు ముక్తికై యడలెడు మనకు
జ్ఞానమ్మునకు గానరాని యమూర్త
భావాలు వృత్తమో పద్యాలవేల
అను తెల్విమాట యీ నా క్రొత్తపాట !

కనకసౌధాల సుఖాపేక్షఁ గులుకు
స్వార్థపరులును సౌహార్దహీనులును
ఊడిగము చేయింప వాడు మొగాన
కాయకష్టము రక్తము చెమటూడ్చి
నవయు కార్మికుమాట నా క్రొత్తపాట !

దారిద్ర్యతమసావ జలధిప్రళయము
తలపించు కార్మికు తన్వి కన్నీటి
తేటగూర్చిన మాట నా క్రొత్తపాట !

జలధి ప్రళయములోపలఁ జిన్నినావ
ఆవిపించు కార్మికు చిరిపావ నవ్వు
రేక గూర్చిన మాట నాక్రొత్తపాట ! ◆

రాబోవు మూడు పాటలు
'శక్తి' అను సంగీత నాటిక
లోనివి

శక్తివిరహము

ఈవిదాహ మెటులారునో !
ఈ హృదయతాప మెటుతీరునో !
జలదసఖుడు తన ప్రణయామృతమధు
కణము లెన్నటికి కురియునో !
ఈ విదాహ మెటులారునో !
ఆకసమ్ములో అమృతధారకై
అరయు నా కరవు బరువులో
విజనసీమలో వేదనాగ్ని లో
వేగు టెన్నటికి తీరునో ! !
ఈ విదాహ మెటులారునో ! ! ❖

నిరీక్షణ

ఈ తీరభూమిలో ఏకాకినిగ నీవు
ఎందుకై తపియింతువో సుందరీ ఎవనికై తపియింతువో !
చేయి కనుబొమలపై చూపు లాకసముపై
ఎండు పెదవులతోడ ఎగయుగుండెలతోడ
పొంగి నిస్సలరింపబోవు తరగల గనవు
నింగివైపే వెతల క్రుంగుచూపే కాని
ఈ తీరభూమిలో ఏకాకినిగ నీవు
ఎందుకై తపియింతువో సుందరీ
ఎవనికై తపియింతువో ! ◆

శుక్తిము క్తాఫలము

"మెరుపు తీగ లవిగో జలదవరు
ఘన గర్జన లవిగో !!
మలయవాయువుల
పులకింతలో ఎల
కలలకోరికలు
అలలై పొంగగా
హాయి హాయిగా
తీయ తీయగా
అమృతధార లవిగో !!
యుగయుగాలుగా
పగలు రేలు నా
పడిన వేదనా ఫలమా
తరళ తరళమై
ధవళ కాంతులను
మెరసిన ముక్తాఫలమా ! ❖

నెమలి

ఆడుతోంది నెమలీ! తీయగ పాడుతోంది నెమలీ
రంగురంగుల తరంగవళులలో
రమ్యమైన పురివిప్పి గెంతుతూ ఆడు
తళుక్ తళుక్కని కన్నులు చెదరగ
మబ్బులపై నొక హరిచాపం!
అబ్బురముగ మెడ తిప్పి యాడు నా
నెమలిపింఛ మొక హరిచాపం
సొబగు పింఛము విప్పెను! పిలుపు గొంతుక హెచ్చెను!
వనియే బృందావనియో తానే
నందకుమారుడో అనిపింప!

ఆడుతోంది నెమలీ! తీయగ పాడుతోంది నెమలీ! ❖

హరివిల్లు

అదిగో లేచెను హరివిల్లు !
హరివిల్లు ! హరివిల్లు !
ఆకసమందున అందా లొలికే
ఏడు రంగులా హరివిల్లు ! ॥ అదిగో ॥

రవికి వాహనాలా ? మబ్బుల
రథాల చక్రాలా ?
చూడ రమ్యమౌ చిత్రవర్ణముల
అమృతవాహినుల నను జల్లు! ॥ అదిగో ॥

నేరెడిరస మెవరో విల్లున
నిలువున పూశారే
పాలపిట్ట రెక్కల నెవరో
బాగుగ కట్టారే ! ॥ అదిగో ॥
నీలనీలమై పచ్చపచ్చనై
అంచున విరిసింది - విల్లున
సంద్రము పాయో పొలాల చాయో
చక్కగ మెరిసింది ! ॥ అదిగో ॥

పాలవెల్లిలో పసుపుకుంకుమలు
నూరి యలదినారా !
కోరి కూర్చి శ్రీ శ్రావణలక్ష్మికి
గొడుగు నెత్తినారా ! ॥ అదిగో ॥

అదిగో లేచెను హరివిల్లు !
హరివిల్లు ! హరివిల్లు !
ఆకసమందున అందా లొలికే
ఏడురంగులా హరివిల్లు ! ! ◆ ॥ అదిగో ॥

చినుకుపాట

చినుకు కన్నియల పరికిణీ చెంగుల
చెంగున మెరిశాయే చిన్ని ముత్తెసరులు !
టిప్ టప్ !....టిప్ టప్ !......టిప్ టప్ !.....
పరికిణీ చెంగుల మాటున బరువుగ
ఝంగున మొరశాయే సిరిమువ్వవరుసలు !
టిప్ టప్ !....టిప్ టప్ !......టిప్ టప్ !.. ..
చినుకు కన్నియల పెదవుల కెంపుల
కిల కిల విరిశాయె చిట్టి తటిల్లతలు !
టిప్ టప్ !... టిప్ టప్ ! .....టిప్ టప్ !.....
పెదవుల కెంపుల మాటున పేరట
పిలుపులు పిలిచాయే పిల్లమబ్బుసడులు
టిప్ టప్ ! టిప్ టప్ ! ... టిప్ టప్ ! ..
చినుకు కన్నియల ఊపిరిదారుల
తలుపులు తెరిచాయే వలపు పైర జడులు !
టిప్ టప్ !....టిప్ టప్ !......టిప్ టప్ ! . ❖

శ్రావణలక్ష్మి

శ్రావణలక్ష్మియె అవతరించింది
జగమెల్ల చలువయ్యై పులకరించింది
మేఘాల రథ మెక్కి ఊరేగుతోంది
మెరపుల జండాల మెరసిపోతోంది
మసలు గాడ్పుల్లోన మాడిన లోకం
విసురు పయ్యరలోన వీడింది శోకం
ఆకస మంతటా అల్లివేసింది
ఊరూరనూ శాంతిభేరి మ్రోసింది
చల్లచల్లగ నయ్యె సూర్యుని తాపం
నల్లమబ్బుం నిల్పె నింద్రుని చాపం
శ్రావణలక్ష్మియె అవతరించింది
జగ మెల్ల చలువయ్యై పులకరించింది ◆

జానపదం

సేలపీదీ పైరగాలీ - సల్లంగ
సెంప తాకీ లేపుతాది !
మణుసులో అణగారి మరిసీపోయిన కతల
మక్కువలూ రేపుతాదీ !
తెల్లావోరిందంటూ తలివొచ్చిందా అంటూ
మెల్లా మెల సంకరిస్తాది - జల్లుమని
వొళ్ళెల్లా పులకరిస్తాదీ ! ◆

ముంగిసిరి

వొచ్చిందా తిరిగీ వొచ్చిందా !
తొంగిమూసిన ములగసిరకి పొంగిపోయే తొలిమేగం
వొచ్చిందా తిరిగీ వొచ్చిందా !
నల్లాకళ్ల యేన్నెలబారో
కొల్లేటీ కొంగలతీరో
అందాల మెరుపురథాలో
కిందా మీ దొంతు నింగి రాలేయా పొంగి కూలేయా
వొచ్చిందా తిరిగీ వొచ్చిందా !
యేటివొడ్డున మొల్లరుప్పొ
యెల్లువగా నవ్వింది !
నవ్వుతూ తనకళ్లా నవరసులూ రువ్వింది !
తళుకూలే ములుకూలై
వలపూల రేపంగ
వొచ్చిందా తిరిగీ వొచ్చిందా !
తొంగిమూసిన ములగసిరకి పొంగిపోయే తొలిమేగం
వొచ్చిందా తిరిగీ వొచ్చిందా ! ◆

చాతకీ

నీదుపాట విందుఙ్ - చాతకీ
నీదుపాట విందుఙ్ - లోకము
లేదు లే దనుచు వాదులాడినా
నీదుపాట విందున్

మంచున తడిసిన మల్లెకైపులో
మించి యలరు రేరాణి వలపులో
నింగిమబ్బులు మెలంగకుండిన అ
నంగ ఖేదమున ఆశాశలలో
నీదుపాట విందున్

చందనవిపినసుగంధవహాములో
మందమందపవమానగీతముల
మించు దీగలై విశ్వ మెల్ల పుల
కించు వర్షహర్షాగమమ్ములో
నీదుపాట విందుఙ్ - చాతకీ
నీదుపాట విందుఙ్ - లోకము
లేదు లే దనుచు వాదులాడినా
నీదుపాట విందున్ ❖

వానకోయిల

చిటపట చినుకులు రాలగ
　　కో యని కూసె నదే
చిటారు కొమ్మకొన వాన
　　కోయిల హాయిగ తీయగ ! !
ఎండల వేడిమి తరుగగ
　　మండిన యెడదలు తడియగ
తీయగ పండిన ఫలములు
　　తిని తిని గళమ్ము విరియగ ! !
దారిని పోయెడు పాంథుడు
　　తలెత్తి చూడగను
పారెడు కాల్వల జలములు
　　పకపక నవ్వగను ! !
చిటపట చినుకులు రాలగ
　　కో యని కూసె నదే
చిటారు కొమ్మకొన వాన
　　కోయిల హాయిగ తీయగ ! ! ◆

మయూరీ

నటన మాడవే మయూరీ
నటనమాడవే !

కటి యిటు నటు కదలియాడ
చిరుపదాలు చిందులాడ
వంపుల మెడ సొంపు లొలుక
ఇంపుగ గళమెత్తి పాడి ॥ నటన ॥

చల్లని తడిగాలిపిల్ల
మెల్లగ నిను తాకెనుగా
రెక్కల నందున నేదో
చక్కిలిగింతాయెనుగా ॥ నటన ॥

ఆకసంపు టంచు దాటి
పైకి పైకి ప్రాకివచ్చు
నీలిమబ్బు దుప్పటాన
తేలియాడు కలలలోన ॥ నటన ॥

ఉరుములనడి మెరుపులవడి
చినుకులజడి తాళముగా
సరస నీసఖుడు పురివిడి
వన్నెలకన్నుల చూడగ ॥నటన॥

నటన మాడవే మయూరీ
నటన మాడవే ! ◆

ఇంద్రధనుస్సు

నింగికి నేలకు వంగిన వంతెనగా
రంగుల కురిసే ఇంద్రధను స్సిదిగో ! ! ॥ నింగికి ॥

సప్తాశ్వమ్ములు లాగెడు అరుణారథం
సప్తవర్ణ దీప్తమ్మగు గగనపథం
వర్ణ వర్ణముల విద్యున్మాలికలు
కర్ణ పర్వమర్మరిత కథానికలు ! ! ॥ నింగికి ॥

నేరెడుఫలముల ప్రోవుల నిగనిగలు
బారులు తీరిన పాలపిట్టజతలు
చాయలుతేరిన సంద్రపుపాయ లవే
పాయలుతీరిన పాలాలచాయ లవే ! ! ॥ నింగికి ॥

పసుపు నలందిన దిక్కూలకడప లదే
నొసటను కుంకుమతో మిను వెలది యదే
జేగురు సేలువ నేలెడు చెలువ మదే
శ్రావణలక్ష్మికి నిలిపిన ఛత్ర మదే ! ! ◆ ॥ నింగికి ॥

అభిసారిక

గాలివానరేయి ! నిన్నే
కానలోన నెటులు కాంతునోయీ ! !
మనసులోన ఊరు తీయకోర్కులు
కనుల యెదుట వాడు నీడలై
ఇరులు చీల్చి దూయు మెరపుతీవల
తళుకులోన చెరిగి కరగునోయి ! !

హృదయమందు నిన్ను గూర్చి మాటలు
కదలియాడు తీయపాటలై
ఉరుము సడుల నుడిగెనోయి పాటలు
వెరపులోన దారి కాననోయి ! !

పొదరుచాటో తీవమాటో నిల్చితో
వెదకలేను వేసరిలితినే !
రజనివేళ ప్రొద్దు తెలియదే ఈ
విజన సీమ నెందు, వెదకనో వెదకలేను వేసరితినే !

గాలివానరేయి ! నిన్నే
కానలోన నెటులు కాంతునోయి ! ◆

జలదాగమనం

మురళీధరుని మోహనగానము
మరల వినబడునదే!
గోపభామినికి దూరపు స్వర్గము
సరస కనబడునదే!!

గోపభామినికి గ్రీష్మమ్మంతయు
హరి వియోగమున వలవంత!
శౌరిరాకచే జలదాగమమున
ఆనందమ్మగు కొండంత!!

జలభరితములౌ చల్లని మెల్లని
జలధరముల నడకలలో
మదమయూర సమ్మదనాట్యమ్ముల
మృదుకేకారవములలో!!

శిఖిపింఛము తన శిరసున మెరయ
అఖిలలోకములు మురియ
శ్రావణనీరదశ్యామలదేహుడు
బృందావనిలో వెలయ!!

మురళీధరుని మోహనగానము
మరల వినబడునదే!
గోపభామినికి దూరపు స్వర్గము
సరస కనబడునదే! ◆

మేఘమా

మేఘమా ! మేఘమా !

గంగవలపులో సొలపులో
బెంగయూర్పులో
కనలు నెండలో తేలుతూ
గగన మంటెదో ! !-మేఘమా !

హృదయ మావిరుల్ వదలుతూ
కదలి కదలకే
కుంగి పొంగుతూ నింగిపై
కంగ చాపుతూ
నిండుకడలి తోడెగా నీకన్న
తండ్రి! కన్నతండ్రి ! ! - మేఘమా !

వలపు టలలలో కలలలో
వగల సగమయీ
వెలుగుపొరలలో యిరులలో
తిరిగి వరుగయీ
మరుగుప్రేమికుల్ నీ
కన్నదమ్ము లన్నదమ్ములు ! ! - మేఘమా ! ◆

దిగకోయి

మెరిసే మబ్బులలోనో
విరిసే పూవులపైనో
చరియించే నా చెలీ! చెలీ!
మేను
పులకించే - నాచెలీ చెలీ!
దివ్యలోకమునుండి
దిగకోయి దిగకోయి
దేవతామూర్తి నా చెలీ!
వలచే గాలులపైనో
తలచే దారులలోనో
తలపించే నా చెలీ చెలీ!
మేను
మఱపించే నా చెలీ చెలీ!
దివ్యలోకమునుండి
దిగకోయి దిగకోయి
దేవతామూర్తీ నా చెలీ! ◆

ఉజ్జయిని పిలుపు

"రమ్మోయి! జలధరా! మదభరా!
స్వాగతమ్మోయి! అమృతధారాధరా!

ఉజ్జయిని ప్రేమసామ్రాజ్యాల నెలవంచు
ఊరూర నింటింట మారుమ్రోగగ విమ్ము! రమ్మోయి
ఆమహాకాళు ఫాలాక్షి కెంజాయ!
అభిసారికల పాదలాక్ష క్రొంజాయ!

ఆనందధామాన నరయుగా రమ్ము!
ఆమంద్రరవళి నాలాపించి పొమ్మోయి!
రమ్మోయి! జలధరా! మదభరా!
స్వాగతమ్మోయి! అమృతధారాధరా!" ◆

అలకానగరి

ప్రణయజీవనపు బాటలకలిసే
వలపుతోట అలకానగరి !
ప్రణయిహృదుల పులకలౌచు మెరసే
కలికావళి అలకానగరి !

శ్రీయలాని తెరలందు చిందుక్రొం
దేనె లాను భ్రమరావళులు !
తేలి సోలుచును జోలపాడు భ్రమ
రాళి వ్రాలు కుసుమావళులు !

హాయి మీరగా నూయ లూగు కుసు
మాళితో తరులతావళులు !
మందాకినివయి నందగించు నవ
నందనాళి జ్యోత్స్నావళులు !

కరములలీలా కమలాలు
అలకల తెలిమొల్ల సుమాలు !
ముఖములపై లోధ్రరజాలు
శిఖలను విరియు కురవకాలు
సీమంతముల కడిమిపూలు !

తలపగలమె అలకానగరీ
లలనావళి చక్కదనాలు !
వలపు లొలుకు తియ్యదనాలు ! ◆

మేఘరంజని (1)

ఘనాఘనా ! ఘనాఘనా!
గర్జింపవో ! ఘనాశని ! ! ॥ఘనాఘనా॥

దిశాంతములనుండి పైకి
కొనల్ బిగించి లేవనీ
ప్రశాంత సమీర ప్రసరిత
పయోధర వినీలశాటి ! ! ॥ఘనాఘనా॥

వియత్తలిన్ తటిల్లతల్
చలచ్చకితలై పొంగ
ధరాతలాన వారిధుల్
నభోంగణమ్ము మీరగ !! ॥ఘనాఘనా॥

చిటుక్ చిటుక్ చిటుక్ చిటుక్
చిద్రువ లౌచు చినుకుజడులు
ఝురత్ ఝురత్ ఝురత్ ఝురత్ ఝురులై ప్రవహించుధార
ధారాధరా ! ధారాధరా !
కురియింపవో ! ధారాఝరి !
ఘనాఘనా ! ఘనాఘనా !
గర్జింపవో ! ఘనాశని ! ◆ ॥ఘనాఘనా॥

మేఘరంజని (2)

హేదయాంభోధరా పర్జన్యా
ఏదయా నీజీవధార ।
నా తానమందు నా గాన మందు ఉ
ద్దీన మౌ వేడి యావిరుల్ ।
వినువీథి దాటి ఘననీలశాటి
గా పైకి లేమునా తెరతెరల్
భూమ్యంతరాళముల వంతెన లౌ వి
ద్యుల్లతల్ తమపు హ్లాల్లతల్
దిగ్దిగంతరమ్ముల మారుమ్రోయు గ
ర్జనముల్ మురియు మనములు !
వలిగాలి వీచ జలధార లౌచు, ఝుర
ఝురా ఝురా! ఝుర ఝురా ఝురా!
హేదయాంభోధరా! పర్జన్యావడె
నయా నీ జీవధారా । ◆

వరలక్ష్మి

స్వాగత మమ్మా!
    శ్రావణ వరలక్ష్మి!
దయాకువలయాక్షీ!
    స్వాగత మమ్మా!
వినీలజలదాంచలా!
    చలచ్చంచలామేఖలా!
ఝరీమృదులకుంతలా!
    ఝళంఝళితధారానూపురా!
స్వాగత మమ్మా!
    శ్రావణవరలక్ష్మి!
చందనానిలశీతలా!
    కుందకుసుమమృదుదరస్మితా!!
మధురాశాడోలికా?
    ఫలభరితోద్యానమాలికా!
స్వాగత మమ్మా!
    శ్రావణ వరలక్ష్మి!! ◆

౫౨

యెయ్యరా వొల యెయ్యెరా
యిసి రెయ్యరా వొల యెయ్యరా!

సెంద్ర వొంక రూపుమాసె! మబ్బు
సీకట్లు రేతిరి కాసె!

సంద్రము హోరున మ్రోసె! కెరటాలు
మింటిపై పురకలు వేసె!! ॥యెయ్యరా వొల॥

కెరటాలు విరిగినకాడె! మిల మిల
మెరిసేటి సేపలతోడ!!
బరువైన వొల లాగినావా! ఇల్లె
బంగారమై తూగినావా!! ॥లాగరా వొల॥

కన్నులుసెదిరీని నేడు! వొలలో
వెన్నెల సేపలు కూడ!
కొంపలో కుంపటికాడ - కునుకు
కోడలు ఆసతో సూడు! ◆ ॥యెత్తరా వొల॥

అభిసరిణ

సుఖుని గాంతునే ! ఆహో సఖుని గాంతునే !

నీలిమబ్బు మేలిముసుగులో
తేలిపోవు తారానారినై
తరువు తరువు వెనుక తారుచు
అడు గడుగున నూహ లూరుచు

ఆహో సఖుని గాంతునే
మోమున చిరునవ్వు మొలకలో
మ్రోల నిలిచి తీయపలుకులో
మైమరపున మధువు లొలుకగా
ప్రేమడోల నోలగింపగా
ఆహో సఖుని గాంతునే ! ఆహో సఖుని గాంతునే ! ❖

కృష్ణజననం

భువననేత శాంతిదాత
పురుషోత్తము డవతరించె
పృథివీతలి నెట యెట యెట!

మధురానగరి! - యెట యెట
మధురా నగరి!

ఆశాహృదు లోలలాడె
ఈరేడు జగాల
అలవైకుంఠ మిలా తలి
కవతరించె నెట యెట యెట?

మధురానగరి! - యెట యెట
మధురానగరి!

జగత్ప్రజ కిక అంధతమో బంధన తొలగు ననుచు
ధర ధర్మదేవతకు స్వేచ్ఛాసుగతులు కలుగు ననుచు
వసుదేవ దేవకీదేవుల వరములు పండె ననుచు
గలగల మని యూడిపడెను కరచరణశృంఖలాళి
చరచర మని తెరచుకొనియె చెరసాల ద్వారపాళి
ఎడ యెడమై పాయ విచ్చి యమునానదీమతల్లి
శిశువుతోడ వసుదేవున కొసగె త్రోవ రేపల్లె!
దూరమాయె దూరమాయె
దురహంకృతి నిరంకుశత!
ఇలాతలిని ధర్మపరత
నెలకొన్నది యెట యెట యెట?

మధురానగరి! - యెట యెట
మధురానగరి! ◆

కృష్ణావతారం

బృందం : అల వైకుంఠపురంవారం ! మేం
శ్రీమహావిష్ణు పరివారం !

గరుడ అందమైన రెక్కలూ
అనంతమైన వేగము గల
గరుడుడ నేను !

శార్ఙధనుష్పాణి జగము
లేల తిరుగు తేరు నేనె!
దేవరాక్షసుల పోరుల
విష్ణువాహనము నేనే!

బృందం : అల వైకుంఠపురంవారం! మేం
శ్రీమహావిష్ణు పరివారం!

సుదర్శనం : కృష్ణుని తర్జని కేంద్రముగాగ
గిరగిర తిరిగే చక్రము నేను!
మధ్యందిన మార్తాండునిపోలె
మహాతేజమున మెరయుదు నేను
సముద్రమథనపు సమయమునందున
అనేకాసురుల హత మొనరించిన
కృష్ణుని తర్జని కేంద్రముగాగ
గిరగిర తిరుగు సుదర్శన మేను!

బృందం : అల వైకుంఠపురంవారం! మేం
శ్రీమహావిష్ణు పరివారం

శార్ఙము : శార్ఙము నేను
కురంగపు వంపుల సొంపుల ధనువును నేను
వైకుంఠేశ్వరుడౌ శ్రీమహావిష్ణువు ధరించే
సుందరధనువును నేను
స్త్రీవల తోచియు పురుషుని
ధైర్యముతో చెలగుదును
రథ గజ తురగ పదాతుల
రాక్షసబలము అడంచిన
వైకుంఠేశ్వరుడౌ శ్రీమహావిష్ణువు ధరించే
సుందరధనువును నేను!

గద	హరి ధరించు గద నేను !
కౌమోదకి నా నామము !
సరయూనది మథించితిని !
చంపితి ఘోరాసురులను
హరిధరించు గద నేను !
నా నామము కౌమోదకి !

పాంచజన్యం : భం భం భం, భం భం భం, భం భం
పాంచజన్యమును నేనే!
పాలకడలి జన్మించినతోడనె
శ్రీపతి ముదమున చేపట్టెను నను
నా నాదముతో దేవవైరులకు
నాశమ్మొదవును రణాంగణమ్మున
భం భం భం, భం భం భం, భం భం
పాంచజన్యమును నేనే !

ఖడ్గం : నందకమను ఖడ్గమ్మును
నన్నెదిర్చి రణమ్మందు నాశమ్మే పొందుదురు !
తలచినతోడనె విష్ణుని కరమ్మునంటి మెరయు నేను
నందక మను ఖడ్గమ్మును !

బృందం : అల వైకుంఠపురంవారం !
శ్రీమహావిష్ణు పరివారం !
ఆ మహావిష్ణు వవతరించె, లో
కావనార్థమై ప్రజభువిలోన !
మేమంతా గోగోపజనమ్మై
అనుసరించెదము విష్ణుని సేవ !
అల వైకుంఠపురంవారం !
శ్రీమహావిష్ణు పరివారం ! ! ◆

రాగం 20 పాటలు
బుద్ధచరిత్రాత్మకమైన
‘దివ్యజ్యోతి’
నాటిక నుండి.

వైతాళికగీతము

మేలుకో స్వప్నలోకరాజ్ఞీ మేలుకో
చాలింక నిదుర శాక్యరాజ్ఞీ మేలుకో ॥మేలుకో॥
నిశాతమస్సులు నిరాసములై వశించెనులే
దిశాంతభూమిని ఉషఃకామిని హసించెనులే
స్వాంతమ్ముల శాంతిహిమఘనములు వర్షించెనులే
అంతరమున నఖిలవిశ్వమును హర్షించునులే ◆ ॥మేలుకో॥

మాయాదేవి స్వప్నం

నిద్రాముద్రితవు కమ్ము
సార్వభౌమినీ !
విశ్వజ్యోతిష్మతీ ప్రమోదయామిని

స్వప్నలోకచ్ఛాయావీణా
సమ్మోహననిస్వనాలు
సర్వదిశల విస్తరిల్ల
సార్వభౌమినీ
విశ్వజ్యోతిష్మతీ ప్రమోదయామిని

• • •

విహరింపవె మారాణీ
        మోహన
విహారపథ సోపానపాళిపై !

అలసనిమీలిత సుందరనయనా !
పులకిత సకలాశామృదుశయనా !
మహనీయాశయ కాంచనసదనా !
విహసన మధువర్షాంచితరదనా !
విహరింపవె మారాణీ !
        మోహన
విహారపథసోపానపాళిపై
విహరింపవె మారాణీ ! ◆

ప్రబోధము

చైత్రజీవచైతన్యము గొను మీసారి
    మర్త్యశరీరీ!

ఆర్తిహాలహలధారీ!
ఆనందసుధక్రోలు మీసారి!

శాంతతరళశుభ కాంతిలో
చందనానిలభ్రాంతిలో
ప్రాచీదిశ నరుణరోచిలో
ఆశా లసదమృతవీచిలో!! —

అఖిలేశ్వరమౌ తేజస్సే
సకలలోకైకమౌ వర్చస్సే
శాక్యరాజ్ఞిగర్భమునందు
జ్ఞానరవియై జనన మొందు!

చైత్ర జీవచైతన్యముగొను మీసారి!
    మర్త్యశరీరీ!
ఆర్తిహాలహలధారీ!
ఆనందసుధక్రోలు మీసారి! ◆

వైతాళికగీతి

మెరయు దిశాముఖ మే మన్నది యే మన్నది?
మరుగు సుషుమ్నిఖ యే మన్నది ?

తెలివివెలుగులో శతసూర్యచ్ఛవి
మెలగనీని తేజము కలుగు నని !

పొరలు సాగర మ్మే మన్నది యే మన్నది ?
కెరలు చకోర మ్మే మన్నది ?

చలువవెలుగులో శతచంద్రప్రభ
తొలగద్రోయు తేజము కలుగు నని !

ఎరగు హిమశిఖర మే మన్నది యే మన్నది ?
కరగు గిరిఝుర మ్మే మన్నది ?

ఎడదలోతులో హిరణ్యగిరినే
కడకు ద్రోయు తేజము కలుగు నని !

విరియు పంకజ మ్మే మన్నది యే మన్నది ?
ఉరలు పరాగ మ్మే మన్నది ?

వలపుబరువులో అమృతభాండమునె
తలపనీని తేజము కలుగు నని! ◆

గౌతమబుద్ధుని జననం

ప్రమదావని కింశుకసాలము
కకుబంతసృత మృదుకిసాలము
కమనీయ సురభిసుమజాలము
హిమశీకర సించితమూలము
కింశుక పర్ణచ్ఛాయాకుంజములోన సంఫు
ల్లాంశుమతి రాణి స్వర్ణవితర్దికపైని
విశ్రమించి నయనముల సుధారుచు లొసగ కన్నది
అశ్రమమున అఖిలేశు వంశమౌ నిసుగు!

• • •

కలలు ఫలియించి జగతి వెలిగించు సుతుడు రాణికి జనించె
మలయానిలము లలమి లుంబినీవనము నందనమ్మై మించె
మాధవీలతిక వలపించి ప్రోవుల్లై పూచె కోటపైని
బోధితరుశాఖ పులకించి మొలకలై లేచె తోటలోన! ॥కలలు ఫలియించి॥
రాజసౌధ మజరావనము!
రమ్యమానంద కాననము!
దివ్యశరీరులు తిరోహితులై చరించిరి
దిక్పాలకులు సువర్ణడోలిక వహించిరి!
రాణిని సూనుని రాచనగరు చేర్పించిరి!
కానికలను దీవెనల వనల నర్పించిరి!
రాజసౌధమజరావనము!
రమ్యమానంద కాననము! ◆

అసితముని ఆవేదన

అసదృశ తేజోవర్తీ!
శిశుమూర్తీ శిశుమూర్తీ!
అఖిలము వెలిగించు జ్యోతి నీవె నీవె నీవె!!
కనగా గలిగితి ని న్నమరకమలినీ సుధాధునీ!
జరాభరితుడనే నేను
వినగలనే యిల శాసనములా
నీ మృదులభాషల మధురకలస్వని
కిసలయారుణమ్మౌ నీ
మసృణ చరణతలమువ నను
పొరలనీ! తరలనీ!
చింతారహితముగ సుప్రశాంతియుతముగ
నా వయోజీవిక నిక మరలనీ
సురుగనీ! పరలోక మ్మరుగనీ!
యువమానవ భావిమార్గవ్యక్తీ!
భువినవతారమా స్వర్గశక్తీ!
అసదృశ తేజోవర్తీ!
శిశుమూర్తీ! శిశుమూర్తీ! ◆

ఏనాడో యేనాడో

ఈ నాడె కాదు ఇం కే నాడో యే నాడో
ఈ గాలి నెరుగదే నేను ?
ఈ నేల తిరుగనే నేను ?
మనసు నలరించు కమ్మని గాలు లివి యవే
తనువు సొలయించు చల్లని దారు లివి యవే !

ఈ నాడె కాదు ఇం కే నాడో యే నాడో
ఈ గాలి నెరుగనే నేను ?
ఈ నేల తిరుగనే నేను ?
ఎరుగనే వీరు నాబంధులు ! వీరు నా బంధులు !
మనసు కలిసియు కలియకుందురు
సరస నిలిచియు నిలువకుందురు !

ఎరుగనే వీరు నా బంధులు ! వీరు నా బంధులు !
ఈ నాడె కాదు ఇం కే నాడో యే నాడో
ఈ గాలి నెరుగనే నేను ?
ఈ నేల తిరుగదే నేను ? ◆

స్వయంవరం

కామదేవు కొలువున వలపుల
రేకలను విరియు ప్రసవాలమోయి
కనవోయీ ! కనవోయీ !
ఓ మధుపాయీ ! కనవోయీ !

హృదయములో కస్తురులో
మది నలలా చంచలలో ! !
పుష్పశరాలు మైమరచెనో !
యువహారిణి దెనలుపరచెనో !

పరువిడు వలపుల ప్రసవమ్ము నెటుల
బహుమానింతువో భ్రమరకుమారా !
మదనవిశిఖలకు మెరుగగు విరి నెటు
బహూకరింతువో భ్రమరకుమారా ! ◆

సోమరి పాట

ఆమని పొంగులో
అలరులేమ ముసుంగులో
సోమరిగాయకుండు
నే డేమని పాడెనో, బ్రదుకు
నేమని పాడెనో,
ఎందుకని — సౌందర్య మెవరికని!

కమ్మనైన విరిముసుంగు చాయనే
వేడిరక్తమ్ము ఎమ్ము కంటకమ్ము గాయమే!
ఎందుకని — సౌందర్య మెవరికని!
ఆకటి బాటలో
అలము చీకటి తోటలో
సోమరిగాయకుండు
నే డేమని పాడెనో! బ్రదుకు
నేమని పాడెనో,
దుఃఖమ్మని — సౌఖ్యమ్ము దూరమ్మని!

బ్రదుకు తెరువు వరయు ప్రాణి గొంతులో
బెదరి యుసురు వదలు నల్పజీవి జాలి వంతలో
దుఃఖమ్మని — సౌఖ్యమ్ము దూరమ్మని!
ఆమనిపొంగులో
అలరులేమ ముసుంగులో
సోమరిగాయకుండు
నే డేమని పాడెనో, బ్రదుకు
నేమని పాడెనో! ❖

భ్రమర ప్రబోధము

భ్రమరా ! ఓ భ్రమరా !

సిరుల తెరలలో పొరయు విరులలో
ఒరగు మనికి చాలులే చాలులే

మేలుకో వేళ, మేలుకో వేళ
భ్రమరా ! ఓ భ్రమరా !

చెలిమి కలలలో వలపుటలలలో
కరుణ తెలిసి మేలుకో మేలుకో

చాలు లే నిదుర, చాలు లే నిదుర
భ్రమరా ! ఓ భ్రమరా ! ❖

భ్రమర ప్రబోధము

భ్రమరా ! ఓ భ్రమరా !
సుమభవనము విడుమా !
మర్త్యజీవిత మ్మన నే మనుకొన్నావు?
ఆర్తస్వరమో భరమో నిశ్వసనమ్మో
ప్రలయశ్రుతియో సంతత హింసారతియో
భ్రమరా ! ఓ భ్రమరా !
సుమభవనము విడుమా !
దేశదేశముల ప్రమోదలేశము కానము కానము !
ఆశ లరయు నయనమ్ముల రాలిన వ్రశులు అశ్రులు !
అంతఃపుర మేల ప్రణయ సంతర్పణ మేల లెమ్ము !
భ్రమరా ! ఓభ్రమరా ! ◆

చితి జ్వాల

రగిలి మండెను చితిజ్వాల!
ఎగసి యార్చెను దహనకీల!

మేడలో వాడలో తోటలో బాటలో
ఆడుతూ పాడేటి కునుకుతూ కుళ్లేటి

తనువు మండెను చితిజ్వాల!
కనలి యార్చెను దహనకీల!

వలపులో వంతలో ఆసలో ఊసులో
ఎగురుతూ గెంతేటి వగచి వగపించేటి

తనువు మండెను చితిజ్వాల
కనలియార్చెను దహనకీల! ◆

ఉజ్జ్వలప్రభాతము

అమలహృదయ కమలాకరా !
సకల వికలజనార్తితమోహరా !

నిద్రారహితములౌ నీ నేత్రమ్ములవలెను !
హిమార్ద్రములౌ దిశల నరుణరాగమ్ము ప్రబలెను !

అదిగో ! ప్రథమ శకుంత మనోహరగానమ్ము !
అదిగో ! ప్రాసాదాంగణఘంటాధ్వానమ్ము ! ◆

ప్రస్థానము

ఈ యిరులు చీల్చుకొని యే వెలుగు పిలిచేనో
యేగుమోయీపథికుడా !
          యిలు వీడి
సాగుమోయీ పథికుడా !

ఏ కొసకు సాగేవొ ఆ దెసని ప్రాగాను
ఆశాప్రశాంతకిరణాలు !
          వాగాను
అమృతవాణీపురాణాలు !

ఇరులలో కడలంట మలుగు తారలు మింట ;
మనుజహృదయాల పెనుమంట
          కలదంట
కనలు నీకనుల కొనలంట !

జగములోపలి వంత మనసులోపలి చింత
తొలగింప నీ యాత్రకంతు !
          యుగ యుగ
మ్ములను జన్మింప నీ వంతు !

ఈ యాత్ర వల దంచు నెవరు పలికేవారు ?
ఎవరు ని న్నాపగలవారు ?
          లోకాని
కెవరు సంతాప మోవారు ? ◆

వియోగిని

హృదయేశ్వరు డెందు పోయెనో యిక
నేనాటికి నింdu రాడుగా ।।
బ్రదు కంతయు వంతపాలుగా, ఏ
పాపమ్మున కింత శాపమో ।।

ఎదలోపల నొదిగియున్న కోరిక
లెపుడే వెరిగింప నైతినే ।
ఇపుడే యవి పొంగి కూలి చీలిక
లై పోయిన నేమిసేతునో ।।

అరవిచ్చిన పారిజాతమాలిక
నురమం దొకనాడెయు తాల్పదే ।
తడి యారని దాని యూర్పు వేడిమి
వడి నుసిగాంజాల నేలనో ।।

హృదయేశ్వరు డెందు పోయెనో యిక
నేనాటికి నిందు రాడుగా ।। ◆

వైతాళికగీతి

పాలపుంత పర్వతముపై వ్రాలి పవ్వళించినదిలే
నాలవజా మింక భూమిపయి చిరునవ్వు నుంచినదిలే !

వేగుజుక్క ఆశ లల్లు చూడ్కులం వేసటలో
రాగశాటి యొసరిల్లు అంచుల బాసటలో

పాలపుంత పర్వతముపై వ్రాలి పవ్వళించినదిలే
నాలవజా మింక భూమిపయి చిరునవ్వు నుంచినదిలే ◆

విరాగగీతం

శ్రుతులు సమముగా బిగించి
నదింపు మోయీ విపంచి! ॥ శ్రుతులు ॥

మనోహరమ్మగు హొయలుతో
అనేకరీతుల లయలతో
వినూత్న గీతులు సాగవో
వియోగతంతులు వీగవో ! ॥ శ్రుతులు ॥

తీగశ్రుతి మించి లాగిన
సాగకే రాగ మాగునే !
తీగ శ్రుతులు బిగి సడలిన
మూగయ్యె రాగ మడగునే ! ◆ ॥ శ్రుతులు ॥

విరాగిగీతం

గడ్డిపువ్వు సుఖము
. నీకు కలదా మానవుడా !

ఎండగాడ్పులందు గాని
వాన వరదలందు గాని
మంచుజడులయందు గాని
చింత, చీకు, వంత, వాదు
సుంతయేని లేని చిన్ని ॥గడ్డిపువ్వు॥

చిన్ని పూవుపైని యెగురు
సీతాకోకచిలుకయేని
హాయిగా క్రొంజివురులందు
కూయుచుండు కోయిలేని
సొగసు వెరచి సురిగిపోదు
బ్రదుకు వెరచి పారిపోదు
జ్ఞానీ మానవ నీకె తగుర !

గడ్డిపువ్వు సుఖము
నీకు కలదా మానవుడా ! ! ◆

బోధిమహీజం

ఆశాంతర చుంబితకాంతిలో
వాసంతికా మధురభ్రాంతిలో
శకుంతలోక సురభూజము!
సుప్రశాంతము బోధిమహీజము!

బోధితరుచ్ఛాయాస్థితుడౌ గౌతముడు
ప్రపంచ
బాధాశమన విభాకర తేజోధనుడు! ◆

ఒక్కడవే

ఒకరయినా నీకేకకు ఓ యని రాకున్నా
ఒక్కడవే పదవోయి!
ఒక్కడవే ఒక్కడవే ఒక్కడవే పదవోయి!

ఓరీ ఓ అభాగ్యుడా,
ఊరంతా భయంచేత

గోడవైపు తిరిగి మాట
లాడకుండ నిలుచున్నా
మనసు విప్పి లోలోపలి
మర్మమేదో కంఠమెత్తి
సీకు సీవె చెప్పవోయి !

ఒక్కడవే ఒక్కడవే ఒక్కడవే చెప్పవోయి !

ఓరీ ఓ అభాగ్యుడా
ఊరంతా విన్నొంటిగ
కారడవిని వదలి, తోడు
గా యెవ్వరు రాకున్నా
ముళ్ల దారి తొక్కిళ్లకు
కాళ్లు నెత్తురే చిమ్మగ
సీ వొకడవె నడువవోయి !

ఒక్కడవే ఒక్కడవే ఒక్కడవే నడువవోయి !

ఓరీ ఓ అభాగ్యుడా
ఒకరైనా నీ ముంగిట
కారుమబ్బు కాళరాత్రి
దీపమైన చూపకున్న
పిడుగుమంట కాల్పులోన
పడి మండే నీ గుండెల
ఒంటిగానె వెలుగనీయి !

ఒక్కడవే ఒక్కడవే ఒక్కడవే వెలుగనీవోయి ! ◆

(రవీంద్రుని ఏక్ లా చలో అను గీతమునకు అనువాదము.
మహాత్మునకు నవఖాళిలో ఈగీతము ప్రబోధానికి సహాయపడింది)

శరత్పత్రావళి

ఆగమనము

చల్లగాలిలో యమునాతటిపై
　　శ్యామసుందరుని మురళి!
ఉల్లము కొల్లగొనే మధుగీతులు
　　మెల్ల మెల్ల చెవి సోకు నవే! ॥చల్ల॥
తూలి రాలు వటపత్రమ్ములవయి
　　తేలి తేలి పడు నడుగు లవే!
పూలతీవ పొదరిండ్ల మాటుగా
　　పొంచి చూచు శిఖిపింఛ మదే! ॥చల్ల॥
తరువు తరువు కడ డాగి డాగి వ
　　న్నరయు కన్నుగవ ముదుపు లవే!
మురిసి మురిసి నా వెనుక దరిసి కను
　　మూయు చివురు కెంగేలు లివే! ◆ ॥చల్ల॥

విభావరి

ఓ విభావరీ ! ఓహో విభావరీ !
నీహార హీర నీలాంబర
ధారిణీ, మనోహారిణీ ! ! ॥ ఓ విభావరీ ॥

నీ చంచల చేలాంచల
నిభృత స్వప్న సీమలలో
ఏలా భయచ్ఛాయాజాల
మేలా సౌఖ్యరోచిర్లీల ! ! ॥ ఓ విభావరీ ॥

సంతత శాంతతరంగిణీ
మదభరయువకురంగిణీ
ఏలా యలసగమనమ్ము
ఏలా నవవిలసనమ్ము ! ! ॥ ఓ విభావరీ ॥

ధరణీతలచంద్రశిలా
తరళమంటపమున నిలిచి
యుగములుగ పరిభ్రమింతు
వగమ్యుడా యెవని వలచి ! !
ఓ విభావరీ ! ఓహో విభావరీ ! ◆

నళిని - పవనుడు

ఆమె : కుంజవని మధుర మంజుల గానము
మందపవనుడా నీదేగా

అతను : మంజులగీతి మరంద స్రోతము
నళినీ నీదే గాదా !

ఆమె : మృదులగీతముల మధ రావములో
హృది పొంగింతువు పవనా !

అతను : నీ మృదులపత్రములమదమాధురిలో
మైమరపింతువు నళినీ !

ఆమె : ప్రణయ సరసి తేలుదమా

అతను · ప్రణవ మరసి సోలుదమా

ఆమె : యువకవరా !

అతను : సుమరమణీ !

ఆమె : అనిలసఖా !

అతను : కమలినీ ప్రియసఖీ !

ఇద్దరు : అనురాగాంబుధి వలరుదమా
ఆనందాంబుధి మునుగుదమా ◆

శరద్గీతి

పసిడి మబ్బుల ముసుంగులో
పాలవెల్లి హొరంగులో
తళుకు మెఱుపుల తీవె లై
వెలుగు నాశాజ్యోతులు ! !

        కడలి కెరటముల ఆటలో
        సొడియిసుక పొరల పాటలో
        మలయపవనముల ఈలలో
        చెలగు నాశాడోలలూ ! !

తరులతాళి మలిపూతలో
పరదేశిపికపు తొలికూతలో
విరతిలేని మాఱుమ్రోతలో
వినెద నాశాగీతులు ! ! ✦

సంధ్యాదీపకళిక

స్వామీ నీ యాలయమున
సంధ్యాదీపకళిక నోయి!! ॥స్వామీ॥

అలలై తావులవలలో మలయపవనములలో
తెరలై నీ తీయని ఊపిరితేనెల సోనలపై
తేలి సోలి పోదునోయి!! ॥స్వామీ॥

ఝుంఝానిలగతిలో
తాపక తాండవత్ పదఝుళంఝుళన విరుతిలో
హృదంజలి కంపిలిపోవగ
ఊగి తూగి పోదునోయి!! ॥స్వామీ॥

ఘనతమోవివృతనిశీథి
వనపథాల దిగులు మిగులు
అభిసారిక నయనయుగళి
కాశాజ్యోతి నౌదునోయి!! ॥స్వామీ॥

విరహిణీ దృగంచలాల
తరళాశ్రుకణాలలో
మెరసినపుడె చెలిమికలలు
విరియ ధన్య నౌదునోయి!! ॥స్వామీ॥

లోకావళి పెన్నిద్దురలో తోగిన వెనుక
పెంజీకటి కవ్వలవెలిగే నీకాంతి సుధాస్రవంతిలో
కరంగి పోదునోయి!! ◆ ॥స్వామీ॥

స్వప్న జగతి

స్వప్న జగతిలో ఛాయావీణా
సమదశ్రుతు లెవో సాగువవే ! ! ॥స్వప్నజగతిలో॥

అంతరాళమున వింతరంగు లెవో
అలసాలసముశై అలమువవే !
రెప్పపాటులో కోటికోటిశశి
రేఖలాశలకు యేగువవే ! ! ॥స్వప్నజగతిలో॥

కల్పనాకృతులు కథలు కథలుగా
కదలి మెదలి చెలరేగునవే !
జన్మజన్మగతస్నేహమాధురులు
ఝురులు ఝురులుగా మూగునవే ! ! ॥స్వప్నజగతిలో॥

జాడజాడలుగ జరిగిపోవు నా
నీడల నా ప్రియు డేడో !
గురుతు నైచికొని, కన్ను మూయగవె
జరిగిపోవు నే నీడో ! ! ◆ ॥స్వప్నజగతిలో॥

జాజి, తుమ్మెద

చల్లగాలిలో పూలంతోటలో కొల్లలైన వలపులలో
కన్ను విచ్చి చిరునవ్వు నవ్వినది సన్నజాజిపూ వొకటి ! !

దారినిబోయే తుమ్మెదబాలుడు దగ్గరగా నిలిచాడు ! !
సన్నజాజివిరికన్నె చూపులో తనచూపులు కలిపాడు ! !

సన్నజాజివిరికన్నె యెడదలో తేనెజల్లు కురిసింది !
తుమ్మెదబాలుని కన్నులలోపల వానవిల్లు మెరిసింది ! !

తుమ్మెదబాలుడు జుమ్ముజు మ్మనుచు రమ్ముర మ్మనగసాగె !
సన్నజాజివిరికన్నె సిగ్గుతో చివురుజొంపమున డాగె ! !

తుమ్మెదబాలుడు నమ్మకమునకై తోటయే సాక్షిగాను
బాసల నెన్నో చేసినాడు విరిబాలకు మోదముగాను ! !

జాజివిరివలపు తేనెల వానల జడులలోన తడిశాడు !
జాజిపూవుపై మోజుతోడనే రోజు లెన్నో గడిపాడు ! ◆

రాబోయే
కొమ్మిడిగేయాలు
'శతపత్ర సుందరి'
నాటిక నుండి

ఆశ్వసనము

శతపత్ర సుందరీ ! అతిలోక
సౌందర్య బంధురీ !

యౌవనసరసి - మదభరిత
జీవితలావణ్యము లొరసి
ధగధగ మెరసి - శతమృదుల
దళములుగా విరిసి
వెలసితే, చెలిమి కలలలో
అలసితే, సొలసితే

తరుణారుణ నవరాగమంజరీ !
భ్రమరకంఠకలగానవాహినీ !
భంగసాంద్ర హృదయాంజలీ !
సుందరీ ! ఓ సుందరీ ! ◆

అస్తమయము

ఇనుడు కొండ దిగెనా అయ్యో,
దిగెనా అయ్యో, దిగెనా ?

నా వలపుల చేకొనకుండ,
నా పిలుపులనే వినకుండ, కొండ
దిగెనా అయ్యో, దిగెనా ?

యుగయుగాల దినదినంపు మోసము
ఓర్వగలనో యెన్నినాళ్లో యీగతి
నగవుపాలుకాదె నాదు జీవిక
కనులు తెరచి కలువ చూసే !!

ఇనుడు కొండ దిగెనా అయ్యో,
దిగెనా అయ్యో, దిగెనా ? ❖

కీచురాయి

హోయి హోయి హోయి
రేయివచ్చెనోయి।
తెరలు తెరలుగాగ యిరులవే
పొరలి వచ్చెనోయి।।

కలుగు కలుగు తలుపు తెరవరే
తలలు పైకి చాపరే।।
కీచు కీచు మంటు రెక్కలూ
రాచి రాచి పాడరే

కాలు తీసి కాలువేయరే
గంతు వేసి తేలరే
ఎరక పరచి యిరుంలోపల
ఎగిరి దుమికి పోవరే।। ◆

విరహిణి

తిరిగి, తిరిగి, తిరిగి, యేలనోయి
ఈ రేయి యేలనోయి!!

మరిగి మరిగి మరిగి తరుగు
నాదు నెడదపైని తెరగ। ।తిరిగి తిరిగి।

పడమట కను నిలిపి నిలిపి
బడలి దిగులు పడుదు,
సడలి వ్రీలునో, నా
ఆశామృణాలహారావళి! ॥తిరిగి తిరిగి॥

సురిగిపోయి లోన, తేనె
పెరలు, తరుగ దిక దాహము
ఒరగి, ఒరగి, ఒరగి, కలల
బరువు నిదురలోనపడుదు। ◆ ॥తిరిగి తిరిగి।

జాబిల్లి

జాబిల్లి వస్తున్నాడు
వెన్నెల్లు కాస్తున్నాడు
కళ్లెత్తి చూస్తున్నారా ! !

తూర్పుకొండపైనే
ప్రాకి వస్తున్నాడు
చూస్తున్నారా ?

ఓ జక్కవపులుగుల్లారా !
ఓ చక్కనిమక్కిళ్లారా ! రారే! రారేమర్రా !

తేలుదామా వెన్నెల్లో
వ్రాలుదామా కొలనుతిన్నెల్లో
విరాళి సోలే పద్మరాణి
ఇదే పోయి చూదామా ! ! ◆

జోల

జోజో సఖీ! నిదురపోవే సఖీ!

నూరు రేకుకన్ను లొక్కసారి మూసి హాయి!
తేరు తేటనీటి యలల డోల నూయ లూగవోయి!
జో జో సఖీ! నిదురపోవే సఖీ!!

నిదురలోన నీ యాశలు కదలి రెక్క లొదవునోయి
విదలించిన రెక్క లెగసి చదల తేలి మెదలు హాయి!!
జోజో సఖీ! నిదురపోవే సఖీ!

వెలుగుతెరల చిమ్ముకొనుచు మబ్బుతెరల చీల్చుకొనుచు
కలలలోకములను కోరికల చెలువల కలిసియాడు
జోజో సఖీ! నిదురపోవే సఖీ! ◆

స్వప్న లోకము

స్వప్న లోకము! స్వప్న లోకము!!
రంగురంగు వెల్గుతెరల చిత్రలోకము!!

పొంగి పొరలు వెన్నెలలో, చుక్కలసాగరములో,
ప్రోవు లౌచు లావు లౌచు, చేరి చేరి చెదరిపోవు!!

ఫలియించని ప్రేమలో తరించని మాధురులో
పండి విరిసి అలసిన నీ గుండియ చల్లగా నిమురు

స్వప్నలోకము! స్వప్నలోకము!!
రంగురంగు వెల్గుతెరల చిత్రలోకము!! ◆

గగనయానము

సరసి విడిచి యెగయుదునో!
నే నెగయుదునో! నే నెగయుదునో!
సరస సరస వెన్నెల తరగలు నన్నొరయు
పై మి న్నొరయు!

నూరురేకులూ తెలితెలి తెరచాపలై పైకి సాగు!
తొడిమరేకులే గాలిని కిందికి వడివడి త్రోయగ సాగు!!
వెన్నెలప్రోవులు క్రిందికి క్రిందికి
క్రొన్నన తావులు పైపైకి!

తారామండలి క్రిందికి క్రిందికి
నూరురేకులూ పైపైకి -
పైపైకి! పైపైకి! పైపైకి! పైపైకి! ◆

మేలుకొలుపు

మేలుకొనవె శతపత్రా !
శతపత్రా ! శతపత్రా !
అరుణ తరుణ కోమలగాత్రా !
అలసమీలితాయతనేత్రా !

ఉదయకాంతు లొదవెను కనవో !
హృదిని విరిసి మధువు లొలుకవో !
శతపత్రా ! శతపత్రా !

కుక్కుటరవ మేల్కొలుపు లవే !
మధుపమాగధుల పిలుపు లవే !
సారసపీఠ ప్రాంగణసీమను
స్వర్ణపలాశల తళుకు లవే !

మేలుకొనవె శతపత్రా !
శతపత్రా ! శతపత్రా ! ◆

రొద

రొదసేయకె తుమ్మెదా, రేగి
రొదసేయకె తుమ్మెదా!!
చెలిని నిదురింపగా నీయదే, నీ రొదా!
రొదసేయకె తుమ్మెదా!!

విరివలపని భ్రమయకే
పొందామర తళుకని మురియకే
చెలియూపిరి తీపికి సొలయకే అలయకే!! ॥రొదసేయకే॥

హాయిగ నీ అరమూయు కనులలో
ఆడు పాపలే నీ చెలులా!
తీయనైన పెదవి యొఱుపులో
తేరు తేనెలే నీ కలలా!!

వింజామర వేయవె - చల్లని
విరిగంధము భరియించు రెక్కలతో
వింజామర వేయవె!
కంజానన యిపు డిపుడే ఆ
కలల లోకమున చెల గెడివేళ!! ❖ ॥రొదసేయకే॥

కొండకోన

కొండకోనలో కుంకుమమ్ము
శతకోటిరాశులై తూలి!
సెలయేటిపాయలై మేటిచాయలై
పాటలీకుసుమవాటియై!! ॥కొండకోనలో॥

అవనితలమునకు, ఆకసమ్మునకు
అందమౌ కెంపుబాటయై
నవగంధలహరి, నా
నందఝరు లలము
మందపవనముల పాటయై!! ॥కొండకోనలో॥

పొదరు పొదరునా గుబురు గుబురునా
కదలు పులుగుగమి కూతలై
ఆలమందలను తోలుకొనెడు గో
పాలుని వేణువు మ్రోతలై
మధురీతులై మంజులగీతులై ◆ ॥కొండకోనలో॥

సెలయేరు

కవి : రా, సెలయేరా! రా, సెలయేరా!!

జలజల ప్రవహించు సెలయేరా, సెలయేరా!
కలకల నవ్వుచు చిందుచు
కులికే కన్నెపిల్లవలె రా, సెలయేరా!!
రా, సెలయేరా! బిరాన, రా సెలయేరా!!

సెలయేరు : వస్తాను నేను వస్తాను, న
ర్తిస్తూ బిరాన వస్తాను!

తొలిమెరపు నడక ఒయ్యారంతో
తెలిమంచు చీర సింగారంతో

నా కలల తేనియలయూటలతో చిరు
యెదద రొదచేయు పాటలతో

వడవడ వణకించే మంచుశిలల
అడుగున తడబడుతూ వస్తాను!

తళతళ మెరయించే గులకరాల
గలగల పరుగులతో వస్తాను! ◆

ప్రతిశ్రుతి

ఓహో ప్రతిశ్రుతీ! ఓహో ప్రతిశ్రుతీ!!
ఏటివార తోటలో తాటిరోపు తలలనూపు
గాలి తీయ పాటలో
ఆకుపచ్చ చేలవెన్ను లల్లలాడు ఆటలో
నీపాటె విందునే! నీమాటె విందునే!
ఓహో ప్రతిశ్రుతీ! ఓహో ప్రతిశ్రుతీ!
పవలు రేలు కొనలలో పాతకోట బురుజుపై ని
పలికించు నగారలో
దెసలు మారుమ్రోయ మ్రోగు దేవళంపుగంటలో
నీపాటె విందునే! నీమాటె విందునే!
ఓహో ప్రతిశ్రుతీ! ఓహో ప్రతి శ్రుతీ!
దారికాని దారిలో ఆకసమ్ము నంటి నిల్చు
కొండల నడి లోయలో
ఒంటరైన బాటసారి ఓ యన ఓహో యన
నీపాటె విందునే! నీమాటె విందునే!
ఓహో ప్రతిశ్రుతీ! ఓహో ప్రతిశ్రుతీ! ◆

బృందావనము

కృష్ణుడు : కోప మేల రాధా ! దయ
చూప వేల నాపై !

రాధ : మోసగాడవోయీ ! పలు
బాస లేల చాలునోయి !

కృష్ణుడు : బాధ కలుగు చాల ! అప
రాధ మేదో సైప వేల ?

రాధ : అపుడె మోసగించి, తిరిగి
యపుడె సైప మందువోయి !
ఓరి మెంతవరకో, నీ
నేర మీవె తెలియలేవా !

కృష్ణుడు : ప్రాణసఖుడ గాన, నా
యాన, నను క్షమింపవేని !
నేర మేదొ తెలియా, నే
వేరనైతి చెలియా !

రాధ : రాతిగుండె నీది ! ఎన్ని
రాత్రు లయ్యె నన్ను వీడి
వార్తయైన లేదు - నాదు
ఆర్తి నీకు తెలియ లేదొ !

కృష్ణుడు : కలత వీడు చెలియ ! నీ
వలపు దక్క వేరు తెలియ !
రాధికాప్రియుండె, యీ
మాధవు డని విశ్వ మెరుగు !

రాధ : కల్ల లెన్ని పల్కినావొ ?

కృష్ణుడు : ప్రతిన సేతు నమ్మలేవొ ?

రాధ : ప్రతిన లెన్ని పల్కినావొ ?

కృష్ణుడు : ప్రాణసఖీ పదములాన !
వదలను క్షమియించుదాక !

రాధ : మాధవ ! అపరాధము నీ
రాధను నీవే క్షమించు !

కృష్ణుడు : రాధారాణీ !

రాధ : మాధవదేవా !

ఇద్దరు : రాధామాధవప్రేమా
రామము బృందావనము
రాసక్రీడామనోజ్ఞ
ధామము బృందావనము ! ❖

వెన్నెలరేయి

తార : కన్నుల కింపౌ వెన్నెల రేయి
వన్నె కాడ వెవరోయి ! చే
సన్న సేతు వెవరోయి

చంద్రు : అందమైన యీ చంద్ర నౌకలో
నావికుండనే చెలియా !
నీ ప్రేమికుండనే చెలియా !

తార : నున్నని చెక్కిలి వెన్నెలకన్నా
మిన్నయై మెరసె నేలా !
నా కన్ను లిటు విరిసె నేలా !

చంద్రు : వెలుగుముద్దలో వెన్నపూసలో
మలచినారు నను చెలియా !
నిను వలచినాడనే చెలియా !

తార : అందమైన నీ చంద్రనౌకలో
ఎందుకు తిరుగుదువోయీ !

చంద్రు : చుక్కలలోపల
సుందరివౌ నీ
పొందుకోసమే చెలియా !

తార : నన్ను చేరగా
తెన్ను నీ కెవరు
తెలిపినారోయి సఖుడా !

చంద్రు : మినుకు మినుకనీ
మెరయు నీ చూపె
దారిచూపెనే చెలియా !

తార : నన్ను చేరగా
ఎన్ని నాళ్లగా
తిరుగుచుంటివో సఖుడా !

చంద్రు : యుగయుగాలుగా
పగలు రే యనక
పయన మైతినే చెలియా !

తార : నావలోకి రా
నీవో, నా కింత
తావు చూపవో సఖుడా !

చంద్రు నావ నీదె గాదా ! చెలియా
నావ నీదె గాదా !
నీవె నడపవే చెలియా ! నావ
నీవె నడపవే చెలియా !

ఇద్దరు : కన్నుల కింపౌ వెన్నెలరేయి
అందమైన మన చంద్ర నౌకలో

చంద్రు : ఒరగిపోదమా సకియా !

తార : కరగిపోదమా సఖుడా !

ఇద్దరు : కన్నుల కింపౌ వెన్నెల రేయి ! ! ◆

మబ్బుకన్నె - మలయపవనుడు

మబ్బు : మలయపవనా ! మలయపవనా !
కొండదాపుననుండి లేచి
కొంటెచూపులు చూచి చూచి
గుండెలోపలి కోర్కె లేవో
గొంతుముడిలో కదలియాడగ
ఏల యీలలు పాడుదోయి !
ఎవరికై నడయాడుదోయి
మలయపవనా ! మలయపవనా !

మలయ : మబ్బుకన్నే ! మబ్బుకన్నే !
నీదు వలపుల జడుల కోసము
నీటిదారుల కొండకోనల
నీటిచాలుల తేలిపోతూ

నింగి నీలపుచాందినీకడ
నిలిచిచూచెదనే - ఓ మబ్బుకన్నే !

మబ్బు : తోటతోటల బాటబాటల
యేటికెరదుల పూలకన్నెలు
తేనెసోనల కాన్క లీయరో !
నా దరికి రానేల నోయీ!
మలయపవనా ! మలయపవనా !

మలయ : మబ్బుకన్నే ! మబ్బుకన్నే !
కానుకలుగ గడించినాడను
తీయదనముల వెన్నొ బరువై
పోయె - చల్లగ సేద తేరగ
నీ తుషారము కోరినానో !
మబ్బుకన్నే ! మబ్బుకన్నే !

మబ్బు : నా తుషారపు వజ్రహారము
నాదు మెరపుల వలపు జడులను
నీకు కానుక లిత్తు నంచుము
నీకు తెలియున ? నీకు తెలియున !
మలయపవనా ! మలయపవనా !

మలయ : మబ్బుకన్నే ! మబ్బుకన్నే !
నాకు తెలియును ! నాకు తెలియును !
నిలిచి నీ నీలాల మేడ
నీలిదారుల నొడలు మరచి
నీ వెవరి నెదురుచూచెదవో !
నన్నె కాదా ! నన్నె కాదా !
మబ్బుకన్నే ! మబ్బుకన్నే ! ◆

దినాంతము

దినాంతమ్ము కాగా వనాంతమ్ములందు
ప్రశాంతారుణచ్ఛాయ లంతర్హితాలై
దిశాంతావకాశమ్ము లాక్షే తమమ్ము
నిశాకేశపాశమ్ము ప్రాక్షే నభమ్ము ◆

అన్వేషణ

యమునాతీరవనములో ప్రముదిత
శ్యామల జలధరఖేల !
మధుర మధుర మృదుమురళీలోలన
గోపికామోహనలీల ! ! ॥ యమునా ॥

మదులకోరికలు మెదల
బెదరుచూపులే కదల
వెదకుదు రేమది నదిలో
జలముల శ్యామలతనువో ! ! ॥ యమునా ॥

నీట మునుగు వసనాలా
నింగి తేలు జలదాలా ?
తొంగిచూచు నయనాలో
వంగి ప్రాకు చరణాలో ! ! ◆ ॥ యమునా ॥

మనమిద్దరము

ఇద్దరమే, మన
మిద్దరమే!

నీలిబైలి లోయలలో
పాలవెల్లి పాయలలో
చేయి చేయి కలిపి, హాయి
హాయి నొక్కటై పోదము!
ఇద్దరమే, మన
    మిద్దరమే!

పాలవెల్లి బిరుల దాటి
పాలరాతి గవను దాటి
ఆలోకపు పొలిమేరల
తేలి ఒక్కటై పోదము!
ఇద్దరమే, మన
    మిద్దరమే!

తెలిమబ్బు తెరలలో
నెలవంకడోనెలో
వలపుటుయ్యాలలో
కలిపి ఒకటౌదమా!
ఇద్దరమే, మన
    మిద్దరమే! ◆

ఎందుకో

ఎందుకో ! పున్నమ !
ఎందుకో ! వెన్నెల !
ఎందుకో ఈ జగ
మ్మంత నే డీహాయి ! ! ॥ ఎందుకో ॥
ఇందుకా నాహృదయ
మెగసి పాడేందు కా !
విశ్వహృదయమ్ముతో
ఐక్య మందేందుకా ! ॥ ఇందుకా ॥

అమృతవీణాహృదయ
గలిత దివ్యశ్రుతులె
ఆశాళ లెల్ల బ్ర
హ్మాండాలు నిండినవి ! !
నా గళమ్మును వీడు
కళ్యాణిరాగమ్ము
నా వీణపై లోక
కళ్యాణమౌ నేడు ! ! ॥ ఇందుకా ॥

ఇందుకా నాహృదయ
మెగసి పాడేందుకా !
విశ్వహృదయమ్ముతో
ఐక్య మందేందుకా ! ॥ ఇందుకా ॥

ఎందుకో ఈ జగ
మ్మంత నే డీహాయి ! ◆ ॥ ఇందుకా ॥

మెట్లవరుసలు

మెట్లవరుసలు మెట్లవరుసలు !
మెట్లవరుసలు మెట్లవరుసలు !

గగనసీమలు కాలపరిధులు
గడచిపోయే మెట్లవరుసలు !
జీవితమునకు మరణమునకూ
ఈవ లావల కదలు వరుసలు !

మెట్లవరుసలు మెట్లవరుసలు !
మెట్లవరుసలు మెట్లవరుసలు !

కుడి యెడమలే కానరాని
తుదిమొదళ్లే తోచబోని
మెట్లవరుసలు మెట్లవరుసలు !

స్వప్న మధువుల జడులలోపల
స్వాంతమున జ్ఞాపకపుపొరలు !
పొరలలోపల తెరలు తెరలుగ
పూర్వజన్మ ప్రేమకథలు ! !

మెట్లవరుసలు మెట్లవరుసలు !
మెట్లవరుసలు మెట్లవరుసలు ! ◆

జ్వాలాతోరణం

జ్వాలాతోరణం!
నీలాకాశ ఫాలతలాన తేలే
జ్వాలాతోరణం!!

దశదిశలను కాంతి
వెలుగుల కావల పలవించు అశాంతి
కలకలలాడే మృదులాననములపై
తళతళతళ మను మధురభ్రాంతి!
జ్వాలాతోరణం!!

తెరలు తెరలుగా తరలెడు పొగలు
పురులు పురులుగా విరియుచు
వెలిగెడు దీపపుసెగలు!
అరులు వెలికి పరువు లిడగ
ఇరుల తరిమి తరిమి వెలుగు!
జ్వాలాతోరణం!

నీలాకాశఫాలతలాన తేలే
జ్వాలాతోరణం ◆

• • •

దిబ్బూ దిబ్బూ దీపావళి
మళ్లీ వచ్చే నాగులచవితి ! !
మిన్ను మన్ను కలకల కలకల మని
మెరసే వెలుగు వెన్నముతాటా వెలుగు రవ్వలూ
ఓహో ! వెలుగు రవ్వలూ ! ! దిబ్బూ ! !

కన్ను చెదర మిలమిల మిలమిల మని
మిన్ను లలము చుక్కానవ్వులో కాకరపువ్వులూ !
ఓహో ! కాకరపువ్వులూ ! దిబ్బూ ! !
సన్న తాచు చరచర చరచరవలె
మిన్ను దూసి వెలుగు చేరులో తారాజువ్వలూ
ఓహో ! తారాజువ్వలూ ! ◆ దిబ్బూ ! !

● ● ●

కను డదే - కను డదే
కడప గడపను ప్రమిద వెలుగులు
కను డదే కను డదే
కడల నడలెడు ఇరులపరుగులు !
కడప గడపను ప్రమిద వెలుగులు

ఘనఘనా ! ఘనఘనా !
ఘనఘన మనుచు దిశలు పలికెను !
ధనధనా ధనధనా !
ధనధన మనుచు సిరుల వాలికెను
ఘనఘన మనుచు దిశలు పలికెమ ◆

జైత్రయాత్ర

కేల కేల గోగు కాగడాలతో
విశ్వ మెల్ల వెలుగు నగుమొగాలతో

కడప గడప గడచి రారే!
వీథి వీథి వెడలి రారే!!

కేల కేల బాణసంచాలతో
దిక్కులెల్ల ప్రేలు పటాకీలతో

నడుముకట్టి నడచి రారే!
బడలిక నేమరచి రారే!!

మదమత్సరకోపమ్ముల
అదిమివేయ నొకేసారి
ప్రగతి వద్దు దానవాళి
పగ అడంప నొకేసారి

రారె రారె యువకులార!
రారె రారె యువతులార!!

దీపావళి వెలుగు చూపి
తిరుగులేని ప్రేమ చూపి
శాంత్యస్త్రము సంధించుక
సమరసాప్తి కొకేసారి

రారె రారె యువకులార!
రారె రారె యువతులార!!

కేల కేల గోగు కాగడాలతో
విశ్వమెల్ల వెలుగు నగు మొగాలతో!! ◆

ప్రతిజ్ఞ

ప్రతిహస్తము కాగడా ధరిస్తాము !
ప్రతివత్సరమ్ము ప్రతిజ్ఞ చేస్తాము ! !

గోగుల కొమ్మల రెమ్మల కొసలందు, మా
ప్రతిజ్ఞలే జ్యోతులుగా వెలుగొందు ! !

చెరకువిండ్ల చివరల్లో దీపికలై మా
ఆశయములె మెరయుమగా మాధురులై ! !

అర్క సహస్రపు కిరణావళిపోలు ! మా
కోర్కెలవెల్లుల గోగుకాగడాలు ! !

దేవత్వమునకు విజయోత్సవ మిదియే
దానవత్వమున కపజయ తరుణ మిదే ! ! ◆

దీపాళి

ఇంటింటి ముంగిటా ఒలికేటి నవ్వులే
        దీపావళీ ఓహో దీపావళీ!
కంటికాటుకలోన మెరుపూలపువ్వులే
        దీపావళీ ఓహో దీపావళీ!
ఒడినిండా నగలుండే ఒయ్యారినడకలే
        దీపావళీ ఓహో దీపావళీ!
జడుపు గిడుపూ లేని సంబరాల ఒడుపులే
        దీపావళీ ఓహో దీపావళీ!
చెడుగంతా చీకట్లయి మంచంతా వెల్తురయే
        దీపావళీ ఓహో దీపావళీ!
చెడుగూ చీకటి పోయీ మంచీ వెలుగూ నిలిచే
        దీపావళీ ఓహో దీపావళీ! ◆

రాబోవు అయిదూ
'అంతిసుందరి'
నాటికా గీతలు

అంజలి

అంజ లిదే పుష్పాంజ లిదే
అనంగదేవ ! ప్రణయాధి దేవతా !
నీ శుభాగమనలీల ! మా మధురాశాడోలా ! !

చివురుపతాకాలు ! కోకిల బాకాలు !
వలపుల పవనాలు ! చిలుక విమానాలు !
ప్రసూన మధురతలై ! ప్రణయజీవలతలై!
భువి నామని దిగిన వనాలు ! నవమనోజ్ఞసునందనాలు !

అంజ లిదే ! పుష్పాంజ లిదే !
ఓహో ! ఓహో ! నవవసంతసఖ ! మన్మథా !
ఓహో ! ఓహో ! కుసుమసాయక ! మధువ్యథా ! ◆

రాజహంస

రావో రాజహంసమా !
ఠీవియైన నడలతో ! ! రావో ! !

తలిరెక్కల అంచులే
మెరయు పైడిమించులై
కులుకుచు మెడచాపుచు
తరణి వాచు తేలవో !! రావో !!

జననాంతర సౌహృదాల
సందేశము లిత్తువో
ఈమృణాలహారము నీ
పాదములకు తోరమోయి !!

రావో రాజహంసమా !
ఠీవియైన నడలతో !!

•   •   •

రాజహంసకులతిలకా ! సెలవోయా సెలవోయా ! !

ఏ జన్మపుదో నీ స్నేహస్మృతి !
మా కేళీవని చేరితివా ! ! రాజహంసకులతిలకా !

మాతృదేవి పిలుపున పోవుదు వో
మదహంసా మన్నింతువుగా ! రాజహంసకులతిలకా ! ◆

ఇంద్రజాలగీతము

రావోయీ వైనతేయా
కాలగండ భేరుండ! గరుడా! విషనాగహారా!!

కొండశిఖరినుండి లేచీ, సందుగ రెక్కలను చాచీ,
అశనిపాత మట్లు భూమి ఆకసము ప్రతిధ్వనింప

కాళరాత్రి శిరోజాల పాయగా,
నిబిడఘనాఘనముల పెనుచాయగా,
రావోయీ వైనతేయా!!

● ● ●

హ్రాం హ్రీం, హ్రూం హ్రైం
దిగు! దిగు! మహేంద్రజాలీ! మాయామహంకాళీ!

కనులకు ఇరులతెరే మాయాజాలము!
ఇరులకు వెలుగుపారే మాయాజాలము!
మనసుకు మరపుతెరే ఐంద్రజాలము! దిగు! దిగు!

జల్లుజల్లులై సభికుల కన్నుల చల్లవే! చల్లవే!
చల్లవె మాయాకిరణాలు!
అల్లవే! అల్లవే! ..అల్లవె, అల్లవె కాంతివాహినుల
కదిలే ఛాయారూపాలు! ◆

రమ్యాణివీక్ష్య

స్మరియింతురుగా !

స్మరియింతురుగా ! !

తెలియని యే తొలిజన్మనో

హృదిలో నెలకొన్న వలపులు !

మదిలో ఒదిగిన తీయని తలపులు !

స్మరియింతురుగా !

స్మరియింతురుగా !

కన్నారో రమ్యవస్తువులను

విన్నారో మధురగీతములను

పరువులువారే యెదదలు

బ్రహ్మాండము నిండగ

స్మరియింతురుగా !

స్మరియింతురుగా ! ! ◆

(కాళిదాసునకు కృతజ్ఞత)

వన్నె ఆరుపాటయు
శిలప్పదికారంలోని
'కానల్‌వరిప్పాట్టు'
అనగా
'కడలి ఒడిపాట' అను
కోవల్ కథను
అనుసరించి.

తొలిపిలుపు

ఎవరు పిలిచినారో నన్నెవరు పిలిచినారో ।।

భవసాగరమున ప్రణయతరణిపై
పవలు రేలుగా పయనించే నన్నెవరు పిలిచినారో ।।

కలకబారెమది, పులక లొదవె నెద,
మరపు తెరలు విడి, తలపులు పొంగగ నెవరు పిలిచినారో

పిన్నవయసులో కన్నస్వప్నములె
కలకంఠస్వన క్రమమధువుగా నెవరు పిలిచినారో ।। ◆

ప్రియోక్తి

సడలనీకు కాంచీదామము ! నా
ఎడదలోన వెన్నెల లొలుకనీ ! !

వేయివలలవంటి కనులతో నా
యెడద కడలి లోతులలో అసువుల
హరియింతువుగా నీ సొగసుతో ! !

వింటివంటి కనుబొమల చలనముల
కంటబడిన నా జీవమ్ముల నిటె
హరియింతువుగా నీ సొగసుతో ! !

సడలనీకు కాంచీదామము ! నా
యెడదలోన వెన్నెల లొలుకనీ ! ◆

చెలివలపు

తీయతీయగా చెలి వలపించినదోయీ సఖుడా !

తోటలోని వెన్నెలతెరలలో
బాటసైన అరవాడు విరులలో
తేటతేనెలా మాటలతో - ఎద
బాటులో వెరగుబాటులో నిటులై - తీయతీయగా !

కడలియలలు విరిగిపడు నాటలో
ముదుగు వినుకపొర లూదు పాటలో
అణచు నగవులో పులక లెగయగా
తాను కెరలి తిరుగాడు దరులలో
తీయతీయగా చెలివలపించినదోయీ సఖుడా ! ❖

చెలిసొగసు, వలపు

తెలియునా చెలియ సొగసు వలపుతీరు లో సఖా !
విరిశరాలు, మరులు నాగులు, చిరుతమీలు, కారు మొగిలు
తరచి చూచి సకియమోము ధాత మలచినాడోయి

॥ తెలియునా ॥

రాగిలువాడునేత్రాలు మ్రోగుకంకణాలు
ఆగియాగి తిరుగ యువకహృదులు మరుగునోయి !

॥ తెలియునా ॥

శారదపూర్ణిమను చెలగు జాబిలి వెలుగోయి !
పాముకాటు వెరచి యులకు పరచివచ్చెనోయి ! ◆

॥ తెలియునా ॥

వ్యంగ్యము

ఇటు లౌ నని యెటు లెరుగుదుము !
ఏటి ప్రియుడా ఏటి ప్రియుండా !

తారహారములకు బదులుగా
తలలో వాడినపువు చాలని
వలపు లొలుక పలికిన ప్రియుడే
ఏటి ప్రియుడా ! ఏటి ప్రియుండా !
ఇటు లౌ నని యెటు లెరుగుదుము !

బాసతప్పు మోసకారియై
ఆసల నడియాసల జేసి
కల్లగాథలను వినిపించెనె
ఏటి ప్రియుడా ! ఏటి ప్రియుండో !
ఇటు లౌ నని యెటు లెరుగుదుము ! ◆

కావేరి

కావేరీ! ఓ కావేరీ!
నీ వెంత పుణ్యవతివమ్మ!
నీ వేమి యీనుపడవమ్మా!

వెండిగొడుగు వలివెన్నెలలో, న్నవ
దండము మెరసే వన్నెలలో, నీ
కేటిప్రియుడో! చోళుడు చేపట్టెను
ఏటికొమ్మ గంగమ్మ!
నీ వేమి యీసు పడవమ్మ!
నీ వెంత పుణ్యవతివమ్మా!

నీ కనుల మీను లాకలిని చెంద
వరుణింపవమ్మ కావేరీ!
నాగేటి మంతనము పాట, మేటి
సెలయేటి నీటిరొద పాట, నీ
నీట క్రుంకులిడువారి మంతరము
పాట లొలసి మెలయంగ
నీ విభునికీర్తి వెలయంగ విమచు
ప్రవహింతువమ్మ కావేరీ!
కావేరీ! ఓ కావేరీ!

నీ విభుడు నిన్నె ప్రేమించునమ్మ!
నీ వెంత పుణ్యవతివమ్మ!

ముద మగు తుమ్మెదరొదలో కమ్మని
పూవుల ప్రోవులు మెదల,
కదలియాడు మీన నయనాలతో
పొదరు, గుబురు, బాట, తోట, చూచుచు,
పరువు లిడుదువు గదమ్మ!
నీ విభుడు నిన్నె ప్రేమించునమ్మ
నీ వెంత పుణ్యవతివమ్మా!!
కావేరీ! ఓ కావేరీ! ◆

రాబోయే రెండు పాటలు
'మాళవిక' నాటకముకొరకు
వ్రాసినవి.

సుమసౌరభం

ఈ సుమసౌరభ మే సురపారిజాతకళికదో!
పెరటిలోని కల్పలతావరసుమమునె మరపించెను!!
ఏకాకి యొడద నే తారక పలుకరించెనో!
రా కేందుబింబ మే మబ్బుపిరుంద నిల్చెనో ॥ఈసుమ॥

అగ్నిమిత్రుడౌ వాయువు నిట్టూర్పుల వలెనె
అగ్నిమిత్రరాజు హృదయ మాందోళితమాయె! ◆ ।ఈసుమ॥

ఏకాంతజీవి

ఎద గాయపడిపోయె
పాదతోడ రాదతోడ!!

ఏకాంతజీవనము నే గడుపగాలేను
ఈవియోగము నింక నే నటింపగలేను!! ఎద గాయపడి!!

నా గోడు విని సుంత నన్నా రడింపగ
ఏ నెచ్చెలియు లేదు ఏ నెయ్యుడును లేదు।।◆ఎద గాయపడి!!

నాట్యపరీక్ష

నర్తించు నవె మయూరములు !

ఓహో యనుచు ఓహోహో యనుచు
కేకారవముల క్రిందుమీ దగుచు ! ॥ నర్తించునవె ॥

ధనంధనమ్మను మృదంగధ్వని
ఝుళం ఝుళం మ్మనెడు నూపురస్వని ॥ నర్తించునవె ॥

రాచనగరులో నాట్యాచార్యుల
నృత్యగీతవాద్యఘోషల
మేఘావృతమౌ వర్షఋతువుగ
భ్రమించినవో మదించినవో । ◆ ॥ నర్తించునవె ॥

ఎందుకో

ఎందుకో - హృదయమా !
అందని ఫలమునకై ఆశలు ! !

అదరు నిదేలా వామనయనము
అందిచ్చునా అనుకొనని శుభాలు

ఎందుకో - హృదయమా ! !

పురుష శేఖరుని కంటిని నేడు
వలపు విరియు టేనాడో కన్నుల
కరవు తీరు టేనాడో
ఎందుకో - హృదయమా ! !

తెలిసికొనగలేవా దేవా ! నీ
దివ్యచరణములె శరణము నాకు !
ఎందుకో హృదయమా !
అందని ఫలమునకై ఆశలు ! ! ◆

రిక్షాచిత్రణ

కదలకుమా చెలీ ! కదలకుమా చెలీ !
కదలిన అల దెడు లత్తుక
చెదరి తూలు క్రింద మీద ॥ కదలకు ॥

లత్తుక వలదినపాదము
నొత్తిన కెంజాయ లరసి
మెత్తని విరిదమ్మిరేకు
యొత్తదు తల లజ్జచేత ॥ కదలకు ॥

అరుణపదము తాకినంత
మొరడు కూడ చివురింపదొ
కరకురాతి యెడదకూడ
కరగి యేరులై పారదొ ◆ ॥ కదలకు ॥

దోహదము

పరవుము పరవుము ...చెలీ !

తడవున నీ అరుణపాద కాంతుల
పరవుము పరవుము చెలీ !
వలచుము వలచుము చెలీ ! . . . నీదు మది.

కదలు కోరికకలవిరులు ఫలింపగ
వలచుము వలచుము చెలీ !
చరచుము చరచుము చెలీ ! ... నీదు మృదు

పదముల నీతరు వదరి విరియగా
చరచుము చరచుము చెలీ ! ◆

ఎడబాపు

మనోరమణుడె రాగ
కనులార కాంచనైతి ! !

పిలుపైన విననైతి
మనసైన తెలుపనైతి ! ! ॥ మనో ॥

నా తను వేలో తూలి
నా మానసాంచలాల
మారుత చాలిత సుమలతయో
వీచలిత విద్యుల్లతయో ॥ మనో ॥

రెపరెపలాడినది, నా
ప్రియు నెడబాపినది ! !
మనోరమణడె రాగ
కనులార కాంచనైతి ! ! ◆ ॥ మనో ॥

అశోకదోహదము

ఎత్తైనదే మాళవిక!
అత్తుకపాద మశోకము నొత్తగ
నెత్తినదే మాళవిక!!
వ్రాలెనదే మాళవిక!! ||ఎత్తై||

సోలుచు చెలి వకుళావళి కౌగిలి
వ్రాలె నదే మాళవిక!!
తాకెనదే మాళవిక! ||ఎత్తై||

అశోకము తన మృదుపదమున నదరగ
తాకెనదే మాళవిక!!
పూచె నహో - అశోక మదే!
రాచకన్ని మాళవిక పదాహతి
పూచె నహో - అశోక మదే!! ◆ ||ఎత్తై||

కుసుమితాశోకము

విరహశిశిర మరగె హృదయ
తరుణాశోకములు పూయ
వనములను భువనమ్ములను
నవవసంతమాయె !
కల్పలతికయైనా వర పారిజాతమైనా
పెరటితరువె అమరయశో
మహితధీరలలితునకు
అగ్నిమిత్రు కూర్మిరాణి
యైనది మాళవిక !

అగ్నిమిత్రు నిట్టూర్పుల
అలరును వలపులిక ! ! ◆

కలువ వలపు

ఓ శశీ ! ఓ శశీ !
కౌముదీ విలాసీ !

వలపే నా యాశయమ్ము
వలపే నా జీవితమ్ము
బ్రదుకులోని చీకు చింత
మరచిపోవ వచ్చినాము ! !

జీవితంపు దేవళాన
దివ్యమంటపమ్మునందు
నీదు చరణతలము చెంత
అర్పింతుము నా యెడద ! !

ఓ శశీ ! ఓశశీ !
కౌముదీ విలాసీ ! ◆

శశిప్రియ

కలువా ! ఓ కలువా ! !

ఓకలువా ! సొగసులచెలువా ! !
నీలి నింగిపైన తేలు చుక్కకన్న వలనె
నీలినీటి సరసిపైన తేలియాడినావా ! ! ॥ కలువా ॥

తేరి పారచూచి నన్ను మిక్కిలి
ఏల కెంపు లొలికెదు నీ చెక్కిలి
కానుగదే ఓ చెలియా !
నేను నీకు పరదేశిని ! ! ॥ కలువా ॥

మరులు జల్లు చిరునవ్వుల
తనియించితి వెన్నిసార్లో?
నీలి నింగినెలత నొసట
క్రాలెడు నా రేఖవోలె
నీలినీటి సరసిపైన తేలియాడినావా ! !
ఓ కలువా ! ఓ కలువా !! ◆

ఆనందప్రకృతి

ఆకు పచ్చని ఆకు ఆటలో
అల్ల నల్లన సాగు చల్లగాలికి తోగు
చేలవెన్నెల సన్నపాటలో
ఆనందమే చిందునే జీవితపు
బాటలే వెలుగొందునే ! !

కలకలలాడే తరులతికలు వలపులు చిలికే
విరితోటలడోలికలో
జలజలజల మని ప్రవహాలు సెలయేరులలో
తళతళలాడే సొగసుల మెరపులపాలకిలో
ఆనందమే చిందునే జీవితపు
బాటలే వెలుగొందునే ! !

ఎడదలు పగిలించే ఎండలగాడ్పులలో
బ్రదుకుల కదిలించే వానలవరదలలో
దెస దెస ఝరులతో పెనుచాయల కారుమొగిలు !
ఉరుముల ఫెళఫెళలు! మెరుపుల తళతళలు !
తరిగిన వెనుకను పచ్చని వానలసోనలలో
ఆనందమే చిందునే జీవితపు
బాటలే వెలుగొందునే ! ! ◆

స్వేచ్ఛ

పాట తెలిసిన కోయిల లేమో
'బయట స్వేచ్ఛగ యెగరగలిగింది!
పలుక నేర్చిన చిలుక మాత్రం
పంజరంలో యెరక ఉడిగింది!

గుమ్మమున వ్రేలాడు చిలుకను
కొమ్మమీది కోయి లేమో
కమ్మగా వొకసారి పిలిచింది!
"అడవులంటా తోటలంటా
హాయి హాయిగ యెగిరిపోదా
మోయి నేస్తం రమ్మ" రమ్మని
తీయగా వొకసారి పిలిచింది!

చిలుకనేస్తం సిగ్గుపడుతూ
యెరక కంటికి అడ్డు పెడుతూ
చిరుతగొంతుక తొణక విచ్చింది!
'క్రౌంచిపుల్లా కొమ్మ దిగిరా

పంజరంలో పలుక నేరిచి
పళ్లు తింటూ కులుకుదా' మని
కళ్ల చూడకె కబురు చెప్పింది !

'ఇనుపయూచల యిరుకులోపల
యెరక చాపగ తావు లేదే
యెట్లు' అని అడిగింది కోకిలము !
'ఒంటికాలున కూరుచుండగ
మింటిలోపల పూచయే' దని
కంట తడి పెట్టింది కీరమ్ము !

'తోటభూముల హాయిగొలిపే
పాట లింపుక పాడవోయీ
అంది పాటలనేటి కోకిలము !
సరస కూర్చో - వేర్పుతాలే
చదువు అయ్యల పలుకు లెన్నో'
అంది పలుకుల కొలికి రాచిలుక !

'పాటలైనా పలుకులైనా
పరులదగ్గర వేర్పుటే' మని
హాయి నెరిగిన పికము పలికింది !
'పాట లేమిటి? తోట లేమిటి?
పాడు బెట్టులు హాయిగా' నని
పంజరంలో శుకము పలికింది !
పాడుతూ పిక మెగిరిపోయింది !! ◆

(రవీంద్రుని గీతి కనుసరణ)

శరదభిసారిక

మధువని కానరావో సఖా! నీకై
వెదకుచు వేసరిలితిన్ - సఖా - సఖా ! !
రానేలేదో ! ఎందో దాగితివో ! !
మధువని కానరావో !

నలుగడల చీకటాయె దారితోచదాయె
రానేరావో ! మధువని కానరావో !

నీవే పికమ్మై తరులలోన డాగి
కుహూ కుహూ యని పిలుతువే మొ పిలుతువేమొ
కుహూ కుహూ యని పిలుతువో యీ వనాంతరమున ! !
మరచితివో నీ చెలినే, తలపవేమొ బాసలనే !
మధువనిలో సుమడోలాకేళులలో
తనువుమరచు మోహనగానములోన
సురనదీజలములన్ సురుచిరమౌ ప్రణయనావ
సోలియాడ రావో వేగమె వనతలికి రావో !

విరిసెనదే కలువచెలి, ప్రియుని కాంచినదో !
చంద్రికలై ఆశామాధురులే వెలింగె !
ప్రియతమమోహనమూర్తిని
కాంచగ నా మనమే చెలంగె !
ఎంతో వేసరితిన్ వనియంతయు నీకై వెదకితి ఎందుంటివో !
ప్రేమజలధిలో నీద రావో !
మధువనకేళి తేల రావో ! ◆

హృదయనావ

చిన్నదోయీ నా హృదయనావ!
సాగరరాజా మెల్లగపోవా!
మాడవోయి నావలోకి నీరుపోరాదోయి
సాగరరాజ మెల్లగ పోవా!!

గాలిరేగి వీచెను నాల్గువైపులా
రాత్రి అంధకారమాయెనే దారితోచదే
ధ్రువతార వెలుగులోన
            నావ నడుపుము నీలోన!
సాగరరాజ మెల్లగపోవా!
చిన్నదోయీ నా హృదయనావ!!
తెరచాప చుక్కాని ఇవి నావి కావుకాని
మనసులోన ఏదో తోచి పడవను వదిలాను!
సాగరరాజ మెల్లగపోవా!
చిన్నదోయీ నా హృదయనావ!! ❖

(రవీంద్రుని గీత కనుసరణ)

గులాబి

సంజ నీ రెండలోన
కెంజాయ చివురుశయ్య
అలవోక పవ్వళించె
అందాల చెలి గులాబి!!

పొంగారు వలపుబరువున
రంగారు రేకుకనుల
నిండారు తేనెచూపుల
నెలవంక విరిసె నోర!!

అలసొవిలమ్ము నీదె
మన సెల్ల కలచివైచె!
మదిలోన నా గులాబి
వలచి మైమరువనీదె!! ◆

చిత్రార్జునము

చిత్ర : ఎవరో నీ వెవరో, నిను గని నా
భవమే మాన్యముగా !
ఓ అసామాన్యవీరా !
ఓ మహామాన్యధీరా ! !

అర్జు : విజయకాంక్షతో విశ్వము తిరిగే
వీరుడ - విజయుడ నో రమణీ !
నాగసతీ ! నీ వన్యసురూపత
నయనయుగళి ధన్యత నొందెనుగా ! !

చిత్ర : నాకలల దేవళములో నే కొలిచిన కామదేవుడేనా
కౌంతేయుండేనా ? నిజముగ కౌంతేయుండేనా
నాకలల దేవళములో నే కొలిచిన కామదేవుడేనా

అర్జు నాగసతీ ! అనురాగవతీ !
చిత్ర యోధపతీ ! విజయైకమతీ ! !
ఇద్దరు యుగయుగమ్ముల తపములు నేడే
సఫలము లాయెనుగా ! ! ◆

(రవీంద్రుని గీతి కనుసరణ)

పరిష్వంగము

హాయిగ పాడుదునా సఖీ
హాయిగ పాడుదునా ! !

ఆకసమందున రాకాచంద్రుడు
నా కౌగిలిలో నీ సౌందర్యము
కాంచలేక నా మబ్బులలోపల
పొంచిమూచి సిగ్గున తలవంచగ
హాయిగ పాడుదునా ! !

కరమున నొక మధుకలశము నిడికొని
ఉరమున నీ విటు లొదిగి యుండగా
తారాపథమును చేరగ గళమును
సారించుక తీయతీయ పాటలు
హాయిగ పాడుదునా ! ! ◆

నిదురపో

నిదురపో - హాయిగా నిదురపో ! ! ॥ నిదురపో ॥
కనుమూసి హాయిగా నిదురపో !
నిదురలో కలలలోకమ్ములో తేలిపో ! ! ॥ నిదురపో ॥

కలలలోకమ్ములో కనకపీఠమ్ముపై
వలపించు నీ రాణి వదనచంద్రికలలో
పొంగేటి క్షీరసాగరములో ! !
నిదురపో ! నిదురపో ! నిదురపో ! ! ॥ నిదురపో ॥

తరగలై వరదలై ఆకస మ్మంటుతూ
పొంగేటి క్షీరసాగరములో
వలపించు నీరాణి వదనచంద్రికలవే
చూచుకో ! చూచుకో ! చూచుకో!
వలపించు నీరాణి వలచుకో ! !
నిదురపో హాయిగా నిదురపో ! ! ❖ ॥ నిదురపో ॥

(బంకించంద్రుని 'రజని' నాటకంకోసం)

మెల్లమెల్లగ

మెల్లమెల్లగ మెల్ల మెల్లగ !
ఉల్లమును కొల్లగొనిపోయే ! ! ॥ మెల్ల మెల్లగ ॥

దూరదూరము సాగిపోతూ
కరగు గీతిక చరణమో
గాలి అలలను తేలిపోయే
పూలమాలిక తావియో ! ! ॥ మెల్ల మెల్లగ ॥

ఇసుకతిన్నెలు దాటి దాటి
నీలితరగల నీటి అంచుల
గలగ లను మంజీరమో
అంచలిమ్మల నంటి జలజల
రాలు శీకరపూరమో ! ! ॥ మెల్ల మెల్లగ ॥

మెల్లమెల్లగ మెల్ల మెల్లగ
ఉల్లమును కొల్లగొనిపోయే ! ! ◆ ॥ మెల్ల మెల్లగ ॥

మధుర యామిని

మధురయామినీ మానసవీథిలో
నీరవలోకము నిదురకాంచె!!

దూరతీరాలను సాగరగానము
ఉచ్ఛలస్వనముల మ్రోగి యాగె!!

జన్మజన్మల మధురాశయములు
శరదభ్రములై దెసలు ప్రాకె!!

చిరతరుణాశాజ్యోతి తారయై
చీకటి తెరలను చెదరగ తాకె!!

దూరదేవాలయమంగళగీతులు
భువనమోహనములై చెలరేగె!!

చపలచంచలసాగరగానము
సీమాంతరముల కరగసాగె!!

హృదయతంత్రులప్రణవమంత్రము
శాంతి శాంతి శాంతి యనుచు
అమరకాంతి కిరణజాలము
మహోదయమ్మని మారుమ్రోగె!! ◆

(రవీంద్రుని గీతి కనుసరించి)

చలికారు

చలికారు కౌగిలించె
    కొండచిలువవోలె లోకము !
తొలికారు తలుపు చరచె
    తెరచుకోదు కరవు వాకిలి ! !

మనసందు మసలు పరువులు
    వినువీథి నంట లేక
చిరుతగాలి నర్తనాల
    జగతి శోభ నందలేక
తల వాలిచి యిల రాలెను
    ముదురాకు లవెన్నో ! !

నెరవిరు లొదవని తోటల
    గళము విడిరాని పాటల
కరవాయె తరుణిమలు
    అబ్బురమాయె మధురిమలు
ఇరులందె ఇనుపసంకెల
    బరు వందె స్వతంత్రత !

పరమాణువు శకలమ్ముల
    భయ మందె శాంతి, భద్రత ! ◆

రాబోయే నాలుగుపాటలూ
గోరాశాస్త్రి 'విషవృక్షం'
నాటకం కోసం వ్రాసినవి

హరిదాసికీర్తన

తన
అధరసీమపై అనిశమ్ము నర్తించే
మధురమురళి నే నైతినా !
తన
నీలతనువుపై తేలియాడే
వనమాల నైనా గాతినా ! !
నే నేమి గా నైతి నా స్వామికి ! !
సఖీ
విరహిణి రాధనై వీధిని బడితిని
గోకుల మంతా హాసియింప !
అదిగో కళంకిని మదనశ రాహత
మాధవు ప్రేయసి రాధ అదే -
అని
నింద పా లయితి నందరిలోనను
మందిరమును విడలేను సఖీ!
విగ్రాహారములు నిన్నటి మాటే
అలంకరణములు అవి యేలే ! !
నే నేమి గా నైతి నా స్వామికి ! ! ◆

జూదరి వేదాంతం

వేరే జూద మెందుకూ ?
        వేరే పందె మెందుకూ?
ఈజీవితమున కదే అర్థం
        వేరే లేదూ

ఒక్కసారి తెగించి
సాహసే లక్ష్మి యని
రంగమున కురికేవా,
గగనాంతరాళమున కెగసిపోయేవా,
ఖంగుమని మోత మోగేవా !
ఆ మరుక్షణ మంద
అథఃపాతాళానికే క్రుంగిపోయేవా ! !
        వేరే జూద మెందుకు ?

ఒక పందెమునకు పాచికలు పేర్చిన
వేరొక పందెము పడునల్లే
ఒక్కదానికై నీవు పరుగులిడ
వేరొక్కటి నీకై వెంటాడుగ
ఏ యొక్కరికై నా లభించేది
ఏమిటి ప్రాణ్ణనుస్వారమే !

        వేరేజూదమెందుకు ?
        వేరే పందె మెందుకు ? ❖

జాదరి వేదాంతం

చూపు దూర మెందుకు ?
          చూడు దగ్గరలోనే !

పందెం పారకపోతే
          ఉందే కోటివేలురా . !

కొండపల్లంలోన
ఎండవెలుతుర్లోన
          ఏదో మెరుస్తుందిరా
          ఏదో పిలుస్తుందిరా
దాహపడి నీ రనుకొని
మోహపడి దారినిబడి
దగ్గర చేరంగానే
          మాయమవుతుంది ।

చూపుదూర మెందుకు?
చూడు దగ్గరలోనే ! ।

మాయైనా మనసైనా
హాయైనా అడుసైనా
దొరికిందే స్వర్గంరా
వలచిందే అప్సరరా
దూర మెందుకురా ?
చూడు దగ్గరలోనే ! ! ◆

కాలసర్పి

ఆడుదంటే
యేమనుకొంటివో ।
చూడ, సుందరి రూపమునందు
ఆడు కాలసర్పము హృదయమందు ! ! ।ఆడుదంటే।

దూరమందుండి చేయెత్తి
పిలిచేటి మోహనరూపం ।
దగ్గరైతే అంటక తాకక
    ఆడే శాపం ! ! ॥ఆడుదంటే॥

కదిపి
కోపమ్ము నుంతైన రేపితే
    పగబట్టి ఉరుకు !
లోక తొక్కడిన తాచై
నిదురింప దెర చచ్చువరకు । ।

ఆడుదంటే
యేమనుకొంటివో । ◆

P.G. 144

రాబోయే 4 పాటలు
బుచ్చిబాబు 'ఉమర్‌ఖైయాం'
నాటక కోసం వ్రాసినవి.

అనుభవభారము

ఎన్నో, ఎన్నో, ఎన్నో ఫలాల్
ఎన్నో ఎన్నొ రుచి చూశాను! ॥ఎన్నో॥

దానిమ్మ, ద్రాక్షలు, మామిళ్ళ,
నారింజ, అరటులు చూశాను!
మేథన్ను మత్తెక్కించేవి! ॥ఎన్నో॥

పారెయ్యి పళ్ళన్నింటినీ
కలిపెయ్యి పళ్ళన్నింటినీ
కలిపెయ్యి ధూళితో లేదా
మొలిపించు కాటిలో!-
ఆకలికంటె మధురమ్మైన దేదీ ఫల మదేదీ!! ॥ఎన్నో॥

• • •

ఎన్నో ఫలాలు రుచిచూశాను
అన్నింట మధుర మేదో ఏదో!!

ఆకలి ఒకటే మధురఫలమ్ము
ఆకలి మించినదేదీ ఏదీ!!
దానిమ్మలు ద్రాక్షలు, నారింజలు,
మామిళ్ళా, అరటులు చూశాను
ఇవి అన్నీ ఏటి ఫలాలో!

ఆకలి ఒకటే మదురఫలమ్ము
ఆకలి మించిన దేదీ ఏదీ ?

ఎన్నో ఫలాలు రుచి చూశాను
అన్నింట మధుర మేదో ఏదో ◆

ఖైయాము తత్వం

ఖైయాముతో కలిసి రావోయీ!
నీవు త్రాగిన మధువు నిజము కాదేని
నీవు నొక్కిన చెక్కిలే మిథ్యయేని
సృష్టి అంతా నిజమటోయీ!! (ఖైయాముతో)

నీ లోని యీ వెల్గు నిలిచి యున్నపుడే
నీ వాంఛితము లెల్ల నెరవేర్చుకోవోయి!
ఆవెల్గు నీలోన ఆరి చనేని
ఏమున్నదోయి! నీవును శూన్యమోయీ!! ◆

(ఖైయాముతో)

హేమంతగానము

మట్టిబొమ్మలను వలచానే !_అవి
ఎట్టి ద్రోహమును చేశాయో ! !
పరితాపపు మధువుతోడ
పరిపూతమ్మాత్మ నేడు !
లేదు నేడు నాకు వాంఛితమ్ము లేనే లేదు !
నేను ప్రకృతిలోన లీనమౌదు లీనమౌదు ! !
ఎండిపోయినది యంబుధి !
ఎర్రపడిన దాకాశము !
అంధకారరాత్రినుండి
అనంతకాంతిలో కలియ
విమోచన మ్మయిన యాత్మ
విశ్వమ్మే నిండి వెలుగు !
లేదు నేడు నాకు వాంఛితమ్ము లేనే లేదు !
నేను ప్రకృతిలోన లీనమౌదు లీనమౌదు ! ! ◆

ఉమర్ ఖైయాం

సాకీ రావె సాకీ !
ఏదీ మధువు కలశము నింపు ! ! ॥సాకీ॥

చలికారు చింతావసనము
తొలికారు మంటల విసరుము !
రెక్కల నార్చు కాలవిహంగ
మొక్కింత దూరమె పోవలె ! !
సాకీ రావె సాకీ !

కలుగని రేపు గూరిచి అసలు
కలవర మేల సాకీ

గడచిన నిన్న గూరిచి అసలు
తలపగ నేల సాకీ ! !

నేడే మనకు
మధువును క్రోల - నేడే సాకి నేడే ! !
సాకీ రావె సాకీ !

ఒంటెలపైని పాంథుల గుంపు
ఊగుచు సాగు శూన్యములోకి !
ఒక్కటివెన్క నొక్కటి కాగ
చుక్కలు నేగు శూన్యములోకి !
చక్కని నీదు పెదవులు కలిపి
చల్లగ నన్ను చేరుము సాకి ! !
సాకీ రావె సాకీ !

ఏదీ మధువు కలశము నింపు !
సాకీ రావె సాకీ ! ! ◆

కలలబేహారి పాటలు

కలలూ బాబూ కలలూ ! !
ఎవరైనా ఎవరైనాగానీ
కొనరండీ మహామంచికలలూ ! ! ॥ కలలూ ॥

ప్రేమ గనని విరాగుల్లారా !
శ్రీలు పొందని జోగుల్లారా !
అంద మెరుగని అభాగ్యులారా !
కుట్రమనసుల కుత్సితులారా ! ! ॥ కలలూ ॥

ఉన్నతపథాల ప్రేమమాధురుల
చిన్నిపూవులో చేర్చిన అందం,
పున్నమజాబిలి వెన్నెల వెలుగే
చిన్ని కెరటమున చిందే అందం,
ఒక్క కేశమున విశ్వమ్మంతయు
దాక్కి యుంచు నవయౌవనపందం,
అన్ని అందముల అరచేతుల్లో
స్వర్గముచేసే తియ్యని కలలూ ! ! ॥ కలలూ

వ్యక్తులపై అధికారము నిచ్చే
శక్తి కలలు కావాలా ?

విరక్తివల్ల కర్మసన్యాసమూ
ముక్తికలలు కావాలా ?
పిల్లా, మేకా, కొంపా, గోడూ,
భూమీ, పుత్రా, నగలూ, వస్త్రా
అన్నీ యిచ్చే యిన్నో కలలూ!!
కలలూ బాబూ కలలూ!! ॥ కలలూ ॥

• • •

కలలు కొంటారా! బాబూ
కలలు కొంటారా!!

బ్రతుకె కలయై కలయె నిజమూ
కలలు కొంటారా!!

పొడులోకపు బరువు సంకెల
పారవేయ ర దేమి పాపము!!
కలలు కొంటారా!!

అంధులా బాబూ అ దేమో
ఆవరించిన వెలుగె కానరు!!
కలలు కొంటారా!!

కీర్తికాంతకు ఆశపడుదురొ
ముక్తికాంతకు మోహపడుదురొ!!

అమరులై జగమెల్ల యుగయుగ
మవతరించే కలలు కనరో!

కలలు కొంటారా! బాబూ
కలలు కొంటారా!! ◆

(బుచ్చిబాబు నాటికకోసం వ్రాసినది.)

మధుమాయ (ఖరహరప్రియ రాగం)

మ్రోయవే మృదు మురళీ! హృదయములో మధుమాయా!!
అంతరాళమునకు సాగి అలసగతిని మ్రోగి మ్రోగి
అవశ మౌచు రాలిపడెను ఆశాతంత్రు లవనిపైన!!

కదలికేని లేనిజగము నిదురలోనొ నీరవతనొ
కారుచీకటులకౌగిలి కన్నుమూసి సురిగిపోయె!!

మరల మరల పిలుచునవే! తరళమధురగీతు లేవో!
రాలిన ఆశాతంత్రులు తూలి కలసి మ్రోయగోరు!!

మ్రోయవె మధుమురళీ!
హృదయములో మధుమాయా!

నీరవరాగజలధిలో
నిబిడనిరాశావధిలో
తేలి తేలి ఉదయించు వెలుంగుల
తీయని యాశల రొదలో!
మ్రోయవె మధుమురళీ!
హృదయములో మధుమాయా! ◆

మంచుతెరల ఆశయు

మును మంచు సోనలో _ తళ్కుమను
తొలిసంజ మెరుపులో
వలపించు భావాల అలలలో కలలలో

        నీరూపె తోచునోయి _ నా ఆశ
        నీ వైపె సాగునోయి ! !

సెలయేటి పరువులో _ మెరిసేటి
నీరెండ తళుకులో
ప్రణయమే విరహాంపుటవలమై ప్రళయమై

        నీ వలపె తోచునోయి _ నా ఆశ
        నీ వైపె సాగునోయి ! !

విరిదోట మలుపులో కురిసేటి
పరిమళపు బరువులో
తలపు దొంతరంలో చెలగేటి స్మృతులలో

        నీ హొయలె తోచునోయి _ నా ఆశ
        నీ వైపె సాగునోయి ! ◆

లోకాలోకం

ఏ లోకానికి ఆలోకం ?
ఈ లోకానికి ఈ లోకం
ఆ లోకానికి ఆ లోకం
ఈ లోకానికి ఆ లోకం
ఆ లోకానికి ఈ లోకం
ఆలోకాని కొకేలోకం !

ఈ లోకానికి ఆ లోకపు
ఆలోకం తుది పెను శోకం !
ఈ లోకంలో ఆ లోకం
ఏకై తేనే ఈ లోకం
లో ఆలోకం ఒకనాకం !
సుఖానందలోకాలోకం !

ఏ లోకానికి ఆ లోకం !
ఆ లోకానికి ఆ లోకం
ఈ లోకానికి కాకుంటే
అది యేమో ఒక మాలోకం !

మా లోకానికి మీ లోకం
మీ లోకానికి మాలోకం
ఒక ఆలోకపువయితేనే
ఆ లోకంలో మీకూ మా
కూ ఒకే ఒక్క ఆలోకం !
సుఖానందలోకాలోకం !! ◆

జన్మభూమి

(కేదార)

మేలుకొనవో మాదు జన్మభూమీ !
మేలుకొనవో మాదు ఆంధ్రభూమి !
నిద్రా జడత విడవో
దారిద్ర్యతమస్సు లడఁగెలే !
ఆర్ద్ర మనస్వినీ ! ఆనం
దారుణ భవ్యోదయాన ! ॥మేలుకొనవో॥

సశ్యామల సుశ్యామల
స్వర్ణలతాకాంచలాలు
తిరుమలేంద్రకీలపింఛా
గిరిమారుతములను తేల ? ॥మేలుకొనవో॥

గౌతమీ కృష్ణ పంపా
ఘనతరంగ గానములో
కలవిహంగ వైతాళిక
గళఝంఝారవము వినవో ! ॥మేలుకొనవో॥

చైత్రకిసాలయతోరణ
కోమలలసనములో
యాత్రలు ముగిసిన యోధుల
విజయ విహాసనములో
ఆశల వెలుగులలో
నిరాశల పరుగులలో
మేలుకొనవో మాదు జన్మభూమీ !
మేలుకొనవో మాదు ఆంధ్రభూమి ! ! ◆

నవోదయాశ
(చారుకేశి)

నవోదయ మెపుడో ! దేవా,
శుభోదయ మెపుడో ! !
దవానలకీలలై, ద్వేషము రోషము భువి నిండెగా ! !
॥ నవోదయ మెపుడో ॥

నీతిహీన సంగ రాల నంధకార మాయెనే,
స్వాతంత్ర్యభాను డే విహాయసాన డాగెనో ! !
॥ నవోదయ మెపుడో ॥

క్రూర మారణాయుధాల ఘోరభయద నర్తన !
ఉదారజీవితాశయాల స్వేచ్ఛావికర్తన ! !
॥ నవోదయ మెపుడో ॥

ఆరాటమ్మే ప్రాణధనమ్ముల
కరచేతులలో నణుక్షణమ్ము
తీరని పర్యవసానపు పోరాటమ్మే
సదసత్తుల కనిశమ్ము ! ! ॥ నవోదయ మెపుడో ॥

అశోద్ధతులై జగముల హత మొనరించే అసురుల
ఉసురుల గొనవో
తరుగని నీ దయ అమృతలహరులై
ఝరులై కురియుగ మే మరయుదుమో ! ! ❖
॥ నవోదయ మెపుడో ॥

శాంతిశోధ

నడవనిచో టెల్లి నడుస్తూ . . . .
మడిచిన వ్రేలినే మడుస్తూ . .   .   .
వడి దిరిగే విశ్వంలో . . . .
సుడి దిరిగే విశ్వంలో ! !.   . . . . . .

కడలేని పయనాలలో
కడిచాయి యుగా లెన్నో
తడబడే చరణాలతో
కడలనే నయనాలతో
ముడివడిన చిరుపాటతో
ముడిలేని యెదమూటతో
తడివడిన కనులసొదతో
తడిలేని పెదవిరొదతో
కడిచాయి యుగా లెన్నో
కడలేని పయనాలలో ! ! ♦

అన్వేషణ

దారిచూపువాడె లేక తరలిపోవాలి
కొండదారులందు ఒంటరిగా తడుముకోవాలి
అడవులందు కుంజకుంజ మరసి చూడాలి ॥దారి॥

చిన్ని చిన్ని గుహలు చూసి లోయలు చూసి
కొండలసెలయేటినీట కళ్ళు తుడుముకోవాలి ॥దారి॥

విజనసరోవర సువర్ణసోపానముల్
కదలియాడు పైడిహంస బారులలోన
హాయిగ మలయానిలాన నూయల లూగే
కొమ్మకొమ్మ కోకిలమ్మ గూడులలోన
మరపురాని తీయబాధ ఆరసికోవాలి !
అడవులందు కుంజకుంజ మరసి చూడాలి . ॥దారి॥

ఆకసమ్ము క్రింద నిలిచి ఏకాకిగ నొక్కసారి
అంతరాంతరముల గాథ ఆలకించినాను
పలుకు లేవో నోటినుండి వెలువడినవిగాని
గగనగర్భమందు కలిసి కరిగిపోయినాయి
తెల్లపోయి ఏకాకిగ తేలిపోయినాను
బ్రతుకంతా కొండలలో పడి తిరగాలి !
అడవులలో కుంజకుంజ మరసికోవాలి !
దారి కానరానికోట తడుముకోవాలి !
అంతరనేత్రాంచలాల అద్దుకోవాలి ! ◆

(రవీంద్రుని గీత కుసుమం)

ఊరడింపు

ఊరడిలవె ఓ నళినీ! రాణీ!! ॥ఊరడిలవె॥

వెలుగు చీకటులు, పవలును రేయీ
విశ్వరంగమున వేడుక తెరలే!! ॥ఊరడిలవె॥

వాడుకయౌ తీయని కలవరమున
నేడు రేపు తిరిగి తిరిగి కలుగునె!! ॥ఊరడిలవె॥

రాతిరి లేకయె కలుగునౌ వేకువ
వేకువనే నీ కల సఫలమ్మౌ! ◆ ॥ఊరడిలవె॥

దిగుదిగు

దిగు దిగు నాగా !
        దిగరా నాగా ! ! ॥ దిగు ॥

దిగు దిగు దిగ రా నాగా
దిగరా నాగా దిగరా నాగా ! ! ॥ దిగు ॥

తెల్లనీ శివునీ మెడలో
నల్లనీ కాలనాగూ
నీవేగా ఓ నాగా, నీవేగా ఓ నాగా ! ! దిగు ॥

నల్లనీ విష్ణువుకూ
తెల్లనీ శేషపాన్పూ
నీవేగా ఓ నాగా, నీవేగా ఓ నాగా ! ! ॥ దిగు ॥

వేయిపడగాల నెత్తి
మోయుదువు భూదేవినీ
మనుషులా ఉసురులంటే మనుసేమోనీకు నాగా
దిగు దిగు నాగా !
        దిగ రా నాగా !

ఓ నాగా దిగరా ! నా తండ్రీ దిగరా !
నీ కోరా విషమూ లాగికోరా నేగా !
ఓ నాగా దిగరా ! నా తండ్రీ దిగరా ! ! ◆

(‘పేరంటాలు’ చిత్రం కోసం వ్రాసినది)

హింసాయ్ ఉన్మత్త పృథివీ

ధరాతలము హింసోన్మత్తము
ద్వంద్వభావసమరోద్రిక్తము
లోభ జటిలబంధము అడచ
ఘోరకుటిల పంథల నడుము !
నూతనావతారము నెత్తి
కాతరులగు సకలప్రాణులకు
అభయ మిమ్మమ్మహో మహాప్రాణ !
ఆలంకింపని మ్మమ్మృతవాణి
విరియనిమ్ము ప్రేమకమలము
చిరమధునిష్యంద మమలము !

ఓయి శాంత ! ఓయి ముక్త !
ఓహో అనంతపుణ్య !
కరుణాఘన ! కావింపు ధరా
తలి కళంకశూన్య !

రమ్ము ! దానవీరా ! రమ్ము !
ఇమ్ము ! త్యాగకఠోరదీక్ష !
మహాభిక్షు ! కైకొమ్మిదె మా
అహంకారభిక్ష !

దేశదేశముల శోకమ్మును
మోహమ్మును రూపుమాపవో !
ఉజ్వలముగ జ్ఞానసూర్యుడై
ఉదయసమారోహము నేయ
సకలభువన ప్రాణవృష్టియై
అంధజగతి కమరదృష్టియై
ఓయి శాంత ! ఓయిముక్త !
ఓహో ! అనంతపుణ్య !
కరుణాఘన ! కావింపు ధరా
తలి కళంకశూన్య !

స్వార్థవిషచ్ఛన్నము లగుచు
అపరితృప్తి ఖిన్నము లగుచు
నిఖిలహృదులు ఆక్రందించె
దేశదేశముల రక్తకలుష
గ్లాని తిలకరూపము తాల్చి !

నీ దక్షిణహస్తము చాచి !
విననీ ! నీ మంగళశంఖము !
విననీ ! నీ శుభ సంగీతము !
నీ సుందరచ్ఛందము !
ఓయి శాంత ! ఓయి ముక్త !
ఓహో ! అనంతపుణ్య !
కరుణాఘన ! దీవించు ధరా
తలి కళంకశూన్య ! ◆

(రవీంద్రుని సంగీతమునకు అనువాదము.
ఢిల్లీఅల్లరులలో భంగపడిన మహాత్ముని ప్రార్థనలో
దీని సంగీతావృత్తి ఆయనకు, సభాసదులకు మహాశాంతి నిచ్చెడి.)

అమర గాయకుడు

వృథావ్యథితచరితోద్గాతా !
సుధామధురగీతోద్గాతా !
యుగయుగాలు జీవితపథాన
దగాపడిన జీవుల హృదార్తి
ద్రవమై నీగళమున స్రవించు !
హృదయమ్మొ నీకు గళమ్మొ?
వ్యసనమ్మొ నీకు వరమ్మొ ?
చేతలలో తలపోతలలో
కైతలలో కనుమూతలలో
ఆశలలో ఉడురాశులలో
జోతులకై యెగురుతు పోతా !
ముంగిటి తలుపే వంగిన దయి
యెగురకయే తలపై తగులు !
దిగుచుండగ జోతులు రగులు !
మిగిలేదే యెదదకు దిగులు !
వగపుజీవికల పెనునొగులు !
"పొగిలి లోలో కుములు గాయమె
రగిలిమండెను నీ హృదయము !
ఎగయు నీ యింటిదీపము కొసలె
బుగులుకొని తగులబడె గృహము ! !" ◆

స్మృతిసీమల్లో సైగల్

గేయకారు డెవ రైతేనేం
భావాలకు నీ హృది నెలవై
నీ తియ్యని కంఠనాళమున
నిస్తుల మధువులుగా రాలాయ్ !

రజకీనీ ప్రియుడవై పరచి
ఘాతుకలోకము నేమరచి
మధురగీతమాలికతో వవ
ప్రణయసౌధమును నిలపావు !

"ప్రేయసి వస్తే శ్రావణము
ప్రేయసి లేందే ఏ ఋతువూ
భాసించ" దనుచు పాడేవు !
యువకులకూ విద్యార్థులకూ
ప్రేమికులకు అది వొక వేదం !

"గడచిన దినాలు సుఖదాలై
కలలో తియ్యదనా లవుగా !

దుఃఖంలో ప్రకృతదినాలు
ఒక్కింతయినా గడవవుగా !"
అని ఆలాపిస్తూ నవ్వేవ్,
అది నవ్వో లోకపు కఠినప్పు
దయాని కొక సమ్మెటవో !
ప్రేమికు మార్గ మ్మీజగతిని
కంటకమహిత మ్మన్నావు ?
ప్రేమకుఫలిత మ్మీజగతిని
దుఃఖమ్మే అని తేల్చావు !
నీ శక్తిని వినియోగించి
నీ ప్రయత్నముము కానిస్తే
కలిగే సత్ఫలితా లన్నీ
కావిలించుకుంటై నిన్నని
ధరిత్రిమాతను సేవిస్తూ
పవిత్రముగ చాటించేవు
"చేతో నను రమ్మని పిలిచి
కాల దన్ని పొమ్మంటుందా !
చిన్నతనం అయితే మాత్రం
హృదయం లేదా అమ్మాయికి ?
అని వాపోతూ నువు దగ్గిన
ఆదగ్గున ఖంగు ఖంగు మని
మారుమ్రోగుతై లోకంలో
మోవపోవు ప్రేమికహృదయాల్ !"
వీథిగాయకుడవై నువ్వు
చేతులార పైకి తెచ్చిన
ప్రియురాలే నిన్ను కాదని

లోకపుషోకుల పాలైతే
నీదుహృదయవల్లకి విరిగి
రోదింపగ కొండలె కరిగాయ్ !

నీ నేర్పినపాటే గొప్పగ
తాను పాడగా సభలోన
తనని మెచ్చువారే అంతా,
నిను చూచేవారే లేరు !
ఏమిటి ఈ అన్యాయమ్మని
ఎలుగెత్తి విలాపించేవు !
సులువుగ బ్రతుకున దాగపడే
కవిహృదయాలను కలిచేవు !

అరిపోని దీపపు వెలుగున
కొనవూపిరి నీ పాట వినే
కోరికతో వేచిన ప్రేయసి
గుండెబరువు తీర్చినపాట !
దేవలోకసీమల నామెను
రాకుమార్తె చేసినపాట !
లోకములో ప్రణయజీవులకు
'మరపురాని తీయనిబాధ !'

'దివ్వె జ్వలించా' అని పాడావ్ !
నువ్వే ఆరనిదివ్వె వయావ్ !
నీ పాటలు మాస్మృతిసీమల
తరిమి తరిమి వలపించే నం
దనవన చందనసమనాలు !
తలపు దొంతరల మెదిలే క
మ్మని కర్పూరపుధూపాలు ! ◆

భగ్నప్రతిమ

ఎచట ఎచట శిలకు ముక్తి ?
ఎచట మనుజ హృదికి ముక్తి ?

కళలలోనె కళలలోనె కలదుకలదు శిలకు ముక్తి !
కలలలోనె కలలలోనె మనుజహృదికి కలదు ముక్తి !

॥ఎచట ఎచట॥

కడలి అలల బానిసగా గడపి ఓర్మి నేర్చిన శిల
అగ్నిపర్వతంపు గర్భమందు క్రాగి వేగిన శిల
నరుల గగనసౌధముల పునాదిరాయిగా నగు శిల

॥కెచట ఎచట॥

తరతరాల ఎండ వాన తాకిడుల కృశించిన శిల
యుగయుగాల మనుజపాదయుగళి మోసి అలసిన శిల

॥కెచట ఎచట॥

కలలో ప్రణయమధురిమల చవియే మనుజహృది ముక్తి !
శిల్పిచేతి ఉలి నర్తనముల పిలయము శిలకు ముక్తి !
విరిగిన శకలాల దివ్యవిగ్రహ మౌ టదియె ముక్తి !
ఎచట ఎచట శిలకు ముక్తి ?
ఎచట మనుజ హృదికి ముక్తి ? ◆

(బుచ్చిబాబు నాటికకోసం వ్రాసినది.)

ఈ రెండూ
'పురప్రవేశం'
నాటికాగేయాలు

యశోధర వ్యాకులత

ఉషస్సుల శాక్యపురీవనముల
    వికసింప మానె తామర లేలో ?
తమస్సు లలమి విన్నవోయె వెన్నెల
    రేలను రాచనగర దేలో ?

యశోధరరూపలత
వసివాడెను వ్యాకులత !
నటించు విరాగతలో
మరపించు విషాదతయే ! !

అశేషజీవతతి యార్తి బాపగా
    నరిగిన విభు డిక రాడో !

ఆర్తివిముక్తాశేషజీవనుతిలో
    తనకును సుఖ మీడో !
యశోధరరూపలత
వసివాడెను వ్యాకులత ! ! ❖

పురప్రవేశము

నేడే వచ్చునటమ్మ - నేడేనటమ్మ !
నిర్మలప్రేమతో నిఖిలమ్ము పాలించు
రారాజసుతుడు - శ్రీతథాగతుడు ! !

శృంగాటకాల చివురుల తోరణాల
స్వాగత మ్మిచ్చేటి పారిజాతాల
మధురమౌ భగవానుమందహాసాలు ! !
నేడె వచ్చునటమ్మ నేడేనటమ్మ ! !

అడుగడుగు వందారుకోటిశీర్షాలు
అగరుధూపాల చందనసౌరభాల
అఖిలహృదయాల ఉచ్ఛలసాగరాలు ! !
నేడె వచ్చునటమ్మ నేడేనటమ్మ ! ! ◆

మాంచాలి బాలచంద్రుడు

ఎన్నాళ్లకు ! ఎన్నాళ్లకు !
ఇన్నాళ్లగ తలవాకిలి యిల్లె తపియించుట
ఎన్నాళ్లకు ఎన్నాళ్లకు ఈప్సితము ఫలించుట
ఇన్నాళ్లకు నాస్వామిని కన్నారగ కాంచుట
సన్నజాజి విరిసరముల స్వాగత మర్పించుట !

హృదయేశ్వరు ప్రణయఖేలనాల తేల నిత్తునా
కదనమునకు పద మని పదనుకత్తి నందిత్తునా ?

పలనాటికి కాపుసేయ వలపు త్రుంపవేని
వెలయాలికి తులయని నిందలుపడు తలపైని

పతిదేవుని రణదీక్షామతి నొనరించెదనుగాక
క్షితిని వీరపత్ని నన్ను నుతి నెలయించెదనుగాక

ఇన్నాళ్లకు నా స్వామిని కన్నారగ కాంచుట !
ఎన్నాళ్లకు ఎన్నాళ్లకు ఈప్సితము ఫలించుట !

• • •

ఎదలో కదలు వ్యథ లేవో కథ లేవో ఇన్నాళ్ల !
ఎరిగింపనా ప్రాణేశా ! ప్రాణేశా !

నీ భవ్యరూపమె తలచు
నా భర్మ పాంచాలికలూ
నీ శ్రావ్యనామమె పిలుచు
నా శారి కాకీరములూ
నీ రాకకోసమె నిలుచు
ఆరామనుమవల్లికలు
నాయెదలో కదలు వ్యథలేవో కథ లేవో ఇన్నాళ్ల !
ఎరిగింపనా ప్రాణేశా ! ప్రాణేశా !
కాలి మొక్కక్కరికోసము అకటా
కాచి యుండునది కాదు
రాకరాక వచ్చిన నా విభుడవు
పోక తీరదాయె పోలికలనికి
క్షణక్షణ నిరీక్షణలో నే నిక
మనవలసినదేనా వేదనతో !

• • •

వాలు తాల్చి పోరు సల్ప నేగరే, లీల
వైరి వీరవరుల డీలు పరప నేరరే ! ! ◆

(ఈ రెండు గోపీచంద్ 'పాంచాల' నాటికకోసం వ్రాసినవి.)

రుచీ దేవి

కృష్ణనృపతి యశోగాథ
రుచీదేవి ప్రణయగాథ
అమాయికాహృదయమునకు
విచిత్రపరిశోధ!

యాదవనాథునికే సరి కృష్ణరాయనృపకేసరి
వైదర్భీదేవి కెనయగును గజపతిరాజతనయ!

పితృపరాభవంపుబాధ
పతిప్రణయమధురగాథ
అమాయికాహృదయమునకు
విచిత్రపరిశోధ!

ప్రేమదూత శాంతిదూత ప్రియుకంఠరవమ్మౌ,
పితృపరాభవము చేసిన శత్రుకర్కశస్వరమో!
తన హృదిలో తీరెడుకోర్కెల ఆశలపరుగు..,
తన దేశములోన అపజయపు నిరాశముల్లులు!

పితృపరాభవంపుబాధ
పతిప్రణయమధురగాథ
అమాయికాహృదయమునకు
విచిత్రపరిశోధ!

తన హృదయేశ్వరుని చేరి తా నొకతె సుఖించుటో!
తనవారి పరాభవమ్మునకు ప్రతీకరించుటో!
కలల డోలికల నాథునికౌగిలిని సుఖించుటో!
కల్యాణగృహమ్ము రక్తకలుషిత మొనరించుటో!

పితృపరాభవంపు బాధ
పతిప్రణయమధురగాథ
అమాయికాహృదయమునకు
విచిత్రపరిశోధ! ◆

ధరిత్రీమాత

ఓర్మి తాల్ముల పైడివావ !
ఓ ధారుణీ ! మాతృదేవి !

సంజకెంజాయ పీవనలు
క్రొంజివురుగుబురు జాలరులు,
తల్లి, నీ యడుగుదామరలు !

సడిలేని చదల పెన్నిరులు,
కడలేని ముదిమి నిద్దురలు,
తల్లి, నీదారి తెర తెరలు

॥ ఓరితాల్ముల ॥

కొన లొగసి పెనగుచీలికలు,
అనలమాలికలనాలుకలు,
అమ్మ, నీహృది వికావికలు !

శివునితలపై కొండచిలువ,
చలువపోనల తెల్లగలున,
అమ్మ, నీపయి మంచుపలువ !

॥ ఓరితాల్ముల ॥

చెలగు మృదుమధురస్వరాలు,
పలుకు యువమత్తహృదయాలు,
జనని, నీదు మధూత్సవాలు!

చెడిన కోరికల పాపాలు,
విడిన గుండియల తాపాలు,
జనని, నీగర్భశోకాలు!

॥ ఓరితాల్ముల ॥

ధనముగా తూగు ప్రణయమ్ము,
ఘనముగా మ్రోగు వినయమ్ము,
అమ్మ, నీమ్రోలి నవయమ్ము!

మేడలే కూల్చు ద్వేషాలు,
వాడలే కాల్చు రోషాలు,
అమ్మ, నీ ప్రకృతిదోషాలు!

॥ ఓరితాల్ముల ॥

ఎదకలచు వికలదృశ్యాలు,
మదిచెరచు వికృతలాస్యాలు,
అమ్మ, నీ విచలితాస్యాలు!

॥ ఓరితాల్ముల ॥

కొంలేవి సౌందర్యపాత్ర,
తులి లేవి యానందమాత్ర,
జనని, నీ తుది లేవి యాత్ర!

ఓర్మి తాల్ముల పై డీనావ!
ఓ ధారుణీ! మాతృదేవి! ◆

రావమ్మా

రావమ్మా మా తెనుగుతల్లీ!
అమ్మా, రావమ్మా! తల్లీ, రావమ్మా!
తరలిరావమ్మా మా తెనుగుతల్లీ!!

ఇరుగుపొరుగూ వారి పొరపొచ్చెములు లేక
గతుకుబీతుకూ లేని గౌరవపుదారిలో!! ॥రావమ్మా॥

పచ్చపచ్చనిచేల పైటనీడల్లోన
పైడిరవ్వలు కురిసి భాగ్యాలతో మెరిసీ!! ॥రావమ్మా॥

తుంగభద్రా పెన్నా, కృష్ణా గోదావరుల్
నీ క్షీరమ్మై పొంగి నీ ప్రజల పాలింప!! ॥రావమ్మా॥

తిరుమలేశునికొలువు, సింహాద్రిపతి చలువ
శ్రీశైలవిభుకరుణ, కనకమ్మ దయకలిగి!! ◆ ॥రావమ్మా॥

శశిరంజని

తృష్ణ

కొండవాలులో కొలనొక్కటి
తళతళ మురిపిస్తోంది !
ఎండ పడినప్పు డల్లా ధగధగ
ఎంతో మెరుస్తోంది ! ! ॥కొండవాలులో॥

అడుగులు తడబడ ఎంతొగ పరుగిడీ
తరలిపోయినప్పటికీ,
కడుదూరమ్మున కదలదు మెదలదు
కాలి కంద దెన్నటికి !! ॥కొండవాలులో॥

దూరము వదలక దారిని మ్రింగే
కొండచిలువ తళుకులో !
చంద్రుని మ్రింగీ నెమరువేసుకొను
తమోగ్రహపు బెళుకులో !! ॥కొండవాలులో॥

కడపటి బారులుతీరిన వెలుగులు
కరిగి సురిగి పోతాయి !
కడలి, పైని, లోన, కాఱుచీకటి
కురులు క్రమ్ముకుంటాయి !! ॥కొండవాలులో॥

ఎందుకెందు కీ పరుగులు - అందగ
నలవికాని వెలుగులు !
ఎంత గడచినా ఏమి మిగులు, తుద
కంతు లేని దిగులు !! ◆ ॥కొండవాలులో॥

నావికా

ఏతీరమని చేరెదో
　　　నావికా
ఏ తీరుగా చేరెదో ?

తెరువన్నైనను లేదు
తన్నైన గనరాదు
పాటరేవును కాదు
నీటిజాడయు లేదు
ఏ తీరమని . . . . .!

చలనమ్మైనను లేదు
(శాంతియైనను లేదు
దరిదాపు గనరాదు
దాటు నావయు లేదు !
ఏ తీరమని . . . . . . !

తెఱచాప, చుక్కాని
తిప్పు మాలిమి గనవు !
మన్నుమిన్నును గాల
మానమేనియుఁ గనవు !
ఏ తీరమని . . . . . .!

అందమ్మైనను లేదు
హాయియైనను లేదు
ఆత్మ దాహము తీరు
నసువు లేనేలేదు !
ఏ తీరమని . . . . . . !

ఎగయు భావాలతో
తెగని చింతనముతో
ఎగిరిపోకోయి నీ
ఇలువీడి యెచటికో !

ఏ తీరమని చేరెదో
　　　నావికా
ఏ తీరుగా చేరెదో ? ◆

(రవీంద్రునికి కృతజ్ఞత)

పోయిన స్వర్గము

పోయినది మన పుణ్యలోకము
పోయినది మన పూర్వనాకము !
హాయిభోగము లడుగ మిగిలిన
దంతు దొరకని నరకజీవిక !

మునుల పలుకుల వెలుగు లడగెను !
కనుపొడుచు చీకటు లలముకొనె !
మన పురాతనవీరు లేరోయ్ !
మనదు నాకోద్ధారు లేరోయ్ !

తొలుత శాస్త్రము లెవరు చేసిరో !
తొలుత కావ్యము లెవరు పాడిరో !
తొలుత నాగరకు లెవ రోహో ! !

ఏడు దీవులు కలయ నేలుచు
నినుడు దిరిగే విశ్వమంతయు
సాగరము లూర్ధ్వలోకమ్ములు
చక్కఁ బెట్టిన సార్వభౌములు

వార లేరీ? వార లేరీ?
వారిసంతతి వారికేవీ
వారి పూర్వుల జ్ఞానసంపద
వారి పితరుల శక్తి సంపద?

మాయకలి వచ్చిపడె నెన్నఁడొ
మనము శక్తివిహీను లైతిమి !
కులము లెన్నియొ కుదురుకొన్నవి !
కొలది గొప్పలు నెలవుగొన్నవి !

కత్తు లన్నియు నొరలపై బడె
కత్తులను దాకినవి యొరలును
రెంటి యైక్యమ్మందె యారెం
డింటి సౌఖ్యమ్మంట తెలియరు !

కలిమి నిచ్చే పసిడిపంటలు
తెలికడుపులను నింపబోవగ
బలిమి గాల్చే కడుపుమంటలు
ప్రభుని కలిమికె యెసరు పెట్టవొ ?

రత్న గర్భని పేరు గాంచియు
రాణివాసపు బ్రతుకు బ్రతికిన
అమ్మ యిప్పుడు కాలవశమున
అమ్ముడాయెను పరులపంచను !

వేయటే, దే నవలితో - ఏ
మాయపందెము నెప్పుడైనను
దాయలగు పరులకడ నమ్మకు
తప్పలేదోయ్ మాయదాస్యము !

వైనతేయుల బలము గూరిచి
శ్వేతవాహను జావనోరిచి
స్వేచ్ఛయను నమృతమ్ము కొనితే
సిద్ధమగు నవసరము కల్గెను !
అమ్మ బానిసతనము బాపగ
నువు వేరే దొరకదండోయ్ !
కోలుపోయిన నాకమును దో
కొనగవలయును గదలి రండోయ్ ! ◆

(1937)

శిక్ష్యపాటు

విస్తృతాకాశ గభీరతమండి
వినీలసాగర గర్భములోనికి
తారక యొక్కటి రాలినది;

బారులుగా జను తోడితారకలు
భారమయిన నిశ్వాసము లెన్నో
హృదయము లద్రువగ విడిచినవి;

రిక్కల పాదిలో కాంతిపుంజము
అగాధభూమిని నిద్రించుటకై
ఇప్పు డిప్పుడే క్షణమాత్రంలో
పోయినది ;

తారక లన్నియు తాఱుమాఱయి
తలపుల కోసిన విపులదుఃఖమున
అయ్యయ్యో ! అని దీనదీనముగ
అర్చినవి !

పడుచున్నది, పడుచున్నది, అదిగో పడుచున్నది!
వినీలవనధ్యగాధములోనికి,
దుష్కర నిశీథగర్భమున ఆ అనంతమగు నాకాశంలో!

ఎన్నడయిన నామృతనక్షత్ర మ్మెరపుకొనున నా హృదయముపైని
ప్రశాంతముగ
ఆ యనంతమగు నా కాశమున ఆ వినీలసాగరగర్భమున,
ఆ నిశీథమధ్యమున ! ! ◆

(రవీంద్రునకు కృతజ్ఞత)

కలకోసం. కలకోసం

నేనే ఆశాలేశంకోసం కలకన్నానో ఇన్నాళ్లూ,
అది వట్టికలే ఇంతా చేసి!
ఆ కల కాస్తా కరిగిన వెంటనె
కళ్లు తెరిచి చూస్తాను గదా,
సుఖానికే మొఖం, వాచి, ఒడల్ సడలి
ముసలిన్నై కనిపిస్తాను!
ఒక కలకోసం విదంతా ఒక కలకోసం!

చెర్లో బారుమనే కెరటంలా
చెట్టున కట్టుంచా న్నా తంబుర!
మోగదు - మూగది - ఒక సంచీలో
ముడిచి మూట కట్టుంచా నక్కడ,
అంతా కలకోసం! అబ్బ
ఇదంతా ఒక కలకోసం!

కదలక పరుండు మెదలక పడుండు
పగలబోవు నాహృదయమోయ్!
బతుకూ లోకం మారిపోయిన్నై,
నాకు నేనె మారా నిది అంతా
ఒక కలకోసం - అంతా ఒక కలకోసం ◆

(రాబట్ ఆంగ్లరచనకు కృతజ్ఞత)

రతివిలాపం

హే ప్రాణపతీ సజీవివో?
కనిపించవె నీ రూపరేఖలే!
ప్రోవై యిల రాలి తూలు ఈశ్వర
కోపానల భస్మ రాశిలో!!

రమణీయ శరీర, నీమనోహర
రూప మిమ్మటు భస్మమై చన్
కనుమంటిని ప్రేలిపోదె నాయెద
కాంతల్ కఠినాత్మలో యుర్వ్!!

కమలమ్మును సేతు వొరసే పారెడు
కల్లోలినివోలె వొంటమై
త్వదధీన ననున్ త్యజించితే
క్షణమందే గతసౌహృదుండవై ◆

(కాళిదాసు ననుసరించి వ్రాసినది)

చెలిమికతలు

మరపు తెరల చెలిమికతలు
తిరిగి పాడకోయి వెతలు !

తనువు తనువు మెలసిపోయి
ఉనికి బరువే మరచిపోయి
మనికే వలపు లొలుకు కతలు !
తిరిగి పాడకోయి వెతలు !

హృదయవిదారక శరాలు !
మా ప్రేమ కివే వరాలు !
మధురస్మృతు లీ స్వరాలు
విధుర వ్యథ లింక చాలు :

మరపు తెరల చెలిమికతలు
తిరిగి పాడకోయి వెతలు ! ◆

(అనార్కలీ నాటికలో పదము విషాదగీతి రచనాకాలం 1937)

రాచొప్ప తొమ్మిది పాటలు
'దేవదాస్'
నాటిక కోసం వ్రాసినవి.

ఎవరో హో

ఎవ రోహో! ఎవ రోహో !
ఇపుడా నను పిలిచేరు ?
హృది లోలో కలిచేరు ?

పగిలిన హృది శకలాలో
ఎగసిన జ్వాలాకీలో
ఎవరో రగిలించేరు !

ఎవ రోహో ! ఎవ రోహో !
ఇపుడా నను పిలిచేరు ?

బ్రదుకే హాలాహలమై
బరువై కర వయ్యెనే !
ఎవరూ నను మననీరో ?
విసమైనా తిననీరో ?

ఎవ రోహో ! ఎవ రోహో !
ఇపుడా నను పిలిచేరు ? ◆

జానపదం

సేతులార వొదులుకున్నావా,
        నా యెల్లిబావా,
సిన్ని గుండెలు సెదిరివున్నావా !

సేతులోని సిన్ని పిల్ల సెన్ను మీరిన వన్నెల పిల్ల
సేతులార వొదులుకున్నావా,
        నా యెల్లిబావా,
సిన్నిగుండెలు సెదరకున్నావా !

నిన్నే కోరి వొచ్చినపిల్ల కన్నే వలపు సీరో కారో
        కన్నుమూసి యెరగ నన్నావా,
        నా యెల్లిబావా,
మిన్ను లె మీదా వొరగకున్నావా ? ✦

నృత్యగీతి

సఖీ! సఖీ! మధుపాత్ర
సత్వరముగ కొనితేవే!

మనసున వలచినప్రియు డేతెంచెనే
మన గృహమ్ము మధువన మౌచు మించెనే !
మలయవాయువులు వీచె
కలగీతమ్ములు లేచె

రావో రావో సఖుడా !
మధువు గ్రోలగ రావో
మధుర మధురమౌ వెన్నెలలో
మల్లెపొదల లే వెన్నెలలో
ప్రేమగీతముల డోలికలో
మధువు గ్రోలగరావే ! ! ◆

పదవోయి పదవోయి

పదవోయి ప్రయాణికుడా !
తలక్రింది మూట చేనిడి వడి పరుగిడి ! !
కంటకవనములతో కడు నిండెనోయి దారి
వలలో పడేవు వలపించు పువుల కోరి ! !
తలక్రిందిమూట చేనిడి వడి పరువిడి

॥ పదవోయి ॥

వలపు తగిలెనా వదలనే లేవు
హృదిలో రగిలే సొద నోర్వలేవు ! !
తలక్రిందిమూట చేనిడి వడి పరువిడి ◆

॥ పదవోయి ॥

దప్పి

నీటితో ఆరేది కాదే యీ దప్పి
        నీటితో ఆరేది కాదే!
నీ ప్రేమజలధిలో ఈదులాడినగాని
తేటనై నీ వలపు తేనెలానినగాని!!

కోరికే తీరనీ తీరకే పూరనీ
గుండె లలోకే వలపె మండి దహియించనీ!!
వంతలో సుఖములో వదలనే నీ ప్రేమ
కాటిలో నా యొడలు కాలునాడేకాని!!

నీటితో ఆరేది కాదే యీ దప్పి
        నీటితో ఆరేది కాదే!! ◆

మరు నిముసము

మరునిముసము మనదో కాదో
మధు వానవో మధుపా మధుపా !

వడగాలిని వాడునో యేమో
జడివానను రాలునో యేమో

తొంగలి రెప్పల చెంగల్వపూవే
తొంగిచూచె వదిగో కన్నావే!
రేపని మాపని చూడకుమోయ్ !
రెప్పపాటుమాత్రమె యీ బ్రదుకోయ్ !
మరునిముసమె మనదో కాదో
మధు వానవో మధుపా మధుపా ! ◆

జీవితము

జీవితము దుఃఖపూరితము - నేడు !
కడచిన దివాలు సుఖపూరితాలు !

మధురస్వప్న మో మలయమారుతమో ! !
దుఃఖపూరితము జీవితము నేడు ! !

నా యనువారే లేనిలోకమున
ఏ యాసయు హాసము లేదాయె
కంటకయుతమై ప్రేమమార్గమే
కల్లోలమ్మై ప్రళయ మ్మయ్యెడు
జీవితము దుఃఖపూరితము నేడు !! ◆

ఏల రాడు ?

నీల మేఘశ్యాము డేల రాడాయె !
తేలిపోయే మేఘమాలికలు నవ్వితే
నీల యమునాహృదయ మేల దిగులొందునో !! ॥ నీల ॥

తన వేణుగీతిలో ఏల యీ జీర !
అమృతహృదినే ఏరు వంచించి రార ! ! ॥ నీల ॥

నాదు వెదలో భయములే దిశల ఇరులాయె
లోని ప్రణయము నింగిపైని శశి కాదాయె ! ! ❖ ॥ నీల ॥

చరమగీతం

మృత్యు వెళ్లెత్తి నిను పిల్చుచుండంగ
ఆశతో దేనికై ఆరాటపడెదు ?
ప్రేమతో వెలుగొందు జాలిచూ పొకటి,
పగిలిన హృదయమ్ముపై అశ్రు వొకటి ! ❖

పన్నె ఐదూ
'బికారి'
నాటకంలోని పాటలు.

బృందగానము

శంకరపదసేవారతుడౌ చంద్రదాసుఁడు
మానసదేవిని దేవతగా మదిని తలపడు !

మంత్రతంత్ర మహిమాన్విత దేవత క్రోధితయాయె !
చంద్రదాసు జీవితము విపత్పూరిత మాయె !

చంద్రదాసు తనయు నిరాశాసాగరమున ఆశానౌక
సుందరసుమకోమల బేహుల విదియచంద్ర రేఖ ❖

యుగళగీతం

అతను : ఇటు తిరుగవో ఉహుఁ ఉహుఁ . . . చెలి పలుకవో ఊహుఁ
చిరునగవుతో నను దరియవో . . ఊహుఁ ఉహుఁ ఉహుఁ
నీలినీలి మేలిముసుగు తొలగనీ తొలగనీ !
బాలచంద్రముఖకాంతి వెలుగనీ వెలుగనీ !

ఆమె : మోము కదిపి కనులారగ కనలే
నే మిమ్ముల అలమునె సిగ్గేలో !

అతను : సిగ్గుతెరలు చీలనీ వ్రాలనీ
చిర్నగవుల వెన్నెలలు తేలనీ !

ఆమె : మనమున తీయనితలపులు రేగునే
మనసుదీర పలుకుదమన పలుకేయాగు నదేలో !
యాసిగ్గేలో ! ❖

కాలనాగినీ

రావే కాలనాగినీ, దిగిరావే నీలభోగినీ !
బుస్సో బుస్సు బుస్సోబుస్సు మనుచు
నభస్సో నందుకోవే అందుకోవే !! ॥ రావే ॥
రెండూనాలుకలు, చండానలశిఖలు
మండీపడగ, పడగచాచవె చాచవే రావే. . . ◆

వియోగగీతి

విననోచనా యిక నా సఖా
నీ యమృతవాణి !

కను తెరచి కాంచలేవో సఖా
కళలేని అభాగిని నీ సఖిని !. . .విననోచనా !
పలుకాడ నైతినే సిగ్గున నిను
తిలకింప నైతినే !

తొలికలయిక ముగిసెనో ఒక క్షణములో
కంకణ నూపురగానము నీవే !
కుంకుమశోభయు నీవే !
మ్రాను కూలరాలిన తీవముగద
తునియలుగా వ్రీల దేల నాయెద !

విననోచనా యిక నాసఖా
నీ యమృతవాణి ! ◆

నృత్యగీతి

వినర్తింతునే ! విన ర్తింతునే
విలోకించునా !

మనోనాథు మంగళమూర్తి
విలోకించునా !

పునర్జీవనోల్లాసముతో !
విలోకించునా !

మనోహరముగ నర్తింప
కాంతునో కాంతుని !
వినర్తింతునే ! వినర్తింతునే !

జన్మజన్మములు తానే
మన్మనోనాథు డానో !
శాశ్వతప్రణయడోల
జీవితమె మధురమౌనో ! ◆

వచ్చే పందొమ్మిది గీతాలు
'సవ్య' రచించిన
వైరొమజ్ఞార్ నాటకం
కోసం వ్రాసినవి.

నిశ్చలప్రేమ

కఠినమోయీ కఠినమోయీ
కంటకోపేతము గదోయీ !

ప్రేమికుల మార్గ మీ యిలలోన !
ప్రేమికుల సౌఖ్యాలు కలలోన ! !

లోకంపు క్రౌర్యంపు మంటల
లో తపించి నశించు నేది ? . . . ॥ఏది॥

ప్రేమికుల దేహమ్ము మాత్రమ్మో !!
లోకంపు క్రౌర్యంపు మంటల
క్రాగి ఉన్నతి జెందు నేది? . . . ॥ఏది॥
నిశ్చలప్రేమమ్మో - ప్రేమమ్మో ! ! ◆

మహల్

మా మహల్!
మా మనస్సులో మహల్!
ప్రేమనిర్మితము విశాలమౌ మహల్!!
చిన్ననాడె మాదు చిట్టిచేతులు నిల్పిన మహల్!
మా మధురాశయముల యుద్యానవనమ్మున లేచిన
మా మహల్!
జన్మజన్మలకు మా సుస్నేహమె జ్యోతులై వెల్గు
మా మహల్!!

చంద్రవంక సౌందర్యము మబ్బుకన్నె మాధుర్యము
సంజవెల్గు సౌభాగ్యము సర్వకుసుమ సౌరభ్యము
కలిపి తొరిపి నిర్మించిన మా మహల్!!
మా మనస్సులో మహల్!
ప్రేమనిర్మితము విశాలమౌ మహల్!! ◆

బిచ్చం

మంచు తెరలో కనుల
నించే గులాబివై
నీ గృహద్వారాన
నిలిచావు రాణీ!

నీ హస్తమిడు భిక్ష
స్వీకరిస్తున్నారు
ఎంద రెందరో నీదు
ఇంటి ముందర నేడు!

అందరూ వెళ్లాక
ఆఖరున నే వొస్తే
నే నంచు తెలియకే
పూవు లిస్తావు!
ఈ పూలకోసమా
నా రాక రాణీ!

మేలిముసు గింత తొల
గించి చూపిస్తావా
చంద్రుణ్ణే గేల్చేయు
చక్కనౌ నీ మోము!!
మంచుతెరలో కనుల
నించే గులాబివై!! ◆

ప్రేమతప్పా ?

ప్రేమయే అపరాధమా ?
ప్రేమ లేకున్న లోకాన ఏ మున్నదో ! !

అల్లదే మింటిపై సాగు బుల్బులు జంట
వాటి ప్రేమను కంటగించువా రెవరో?
ప్రేమయే అపరాధమా ?

ప్రేమ నాలో పెరిగి పెద్ద దౌతుంటేను
నేను భగవంతునికి చేరు వౌతుంటాను
ప్రేమయే అపరాధమా ?

ప్రేమ లేకున్న లోకాన ఏమున్నదో !! ◆

దైరి కేడ్యు

> ।అన్నీ మరవ వలెనా ?
> అన్నీ కల్ల లేనా ?
> కలలేనా యికపైని?

నా సుఖమ్మె తన సుఖముగ
నా బాధయె తన బాధగ
ఒకరి నొకర మెంత వలచి
యెన్నివాళ్ళ గడపినాము ।।అన్నీ।।

తల్లి మరిచి, తండ్రి మరచి,
ఇల్లు, లోకమెల్ల మరచి
లేగులాబి కుటీరాల
లో గడపితి మెన్నివాళ్ళ ◆ ।అన్నీ।

నైరా కీడ్క్యు

సెల వింక సెల వింక సెలవూ ! !

ఓ నర స్త్రీరమ్ములార,
ఓ గులాబివూ పుటీరమ్ములారా,
సెల వింక సెల వింకక సెలవూ !!

గడె వియోగ మె సై పలేడు
కడు బేలహృదయమ్మువాడు

పిడిపోవలె ప్రేమమయుని
ఓదార్పరమ్మ నా ప్రియుని !

ఖర్జూరవనమ్ములారా,
ఓ గులాబీ తావులారా,
సెల వింక సెల వింక సెలవూ ! ! ◆

మజ్నూన్ విలాపము

గుడారమెత్తివేశారు
కడ కొంటరిగ మిగిలాను
ఎడారిలో నా బ్రదుకే యెడారి కాగ !

నా వలపుల రాకుమారి
తో కలయిక లింకపైని
కలలందేనా ? ఆహో కలలందేనా ?

చిన్ననాట పాఠశాల
చెట్లనడుమ ఆటలలో
నాటి యిన్ని యేళ్లు పెంచి
నాము మాదు ప్రేమలతను,
పెరికివేయగలదా యీ యిసుకతుపాను
లోకపు యిసుకతుపాను ! ! ◆

బృందగీతం

పదిల మోహో, పదిల మోహో
హృదయమా, హృదయమా ! !
దూరదేశములోని ప్రియతము
చేరబోయే హృదయమా
చెరనిడేవారెవరు నిన్నిక
స్వేచ్ఛ కలిగెను నీదు ప్రేమకు ! !

సాగు మోహో, సాగు మోహో
సాగు మోహో, ప్రణయహృదయమ ! !
నిన్ను చేరగ నీదు ప్రియతము
డెన్ని కడగండ్లు పడుచుండునో
సాగు మోహో । సాగు మోహో
సాగు మోహో । ప్రణయహృదయమ ! ! ◆

లైలావిశ్వరూపం

ఎందుచూచినగాని నీవు, లైలా
మృతిలేదు ప్రేమ కంటావు!!
వెండియిసుకలలోన తళుకులో నీవు,
పండబారిన సంజ పసిమిలో నీవు,
సన్ననౌ నెలవంక సిసిమిలో నీవు,
మంచులో కనువిచ్చు
మధురమధురమ్మైన
లేగులాబీపూవు నవ్వులో నీవు,
ఇంచు కించుకలుగా
హృదయమ్ము నలరించు
అర్ద్జారమారుతము నీవు, లైలా
ఎందుచూచినగాని, నీవు లైలా
మృతిలేదు ప్రేమ కంటావు!! ◆

ముడిపాట

ఎవని కలియగోరుదువో
ఏడీ అత డేడీ, అత డేడీ !
ఎదుట ఉసురు లేని తనువు
ఎవరిది, తనదేనా తనదేనా !
నీ ప్రియునిదే, నీ ప్రియునిదే !

కఠినలోక మేలో మిమ్ము
కలియనీయనైనా లేదు !
బ్రదుకనీయనైనా లేదు ! !

ఈ లోకములో కలయిక లింక లేవు ఇది నిజమ్ము !
పై లోకములో నీకయి ప్రాణసఖుడు వేచియుండు ! ! ❖

సతీ పరాభవం

రుద్రదేవా ! మేలుకోవా !
భద్రకాళి అపర్ణ భస్మమాయెను !

నిద్రయా అది తపోముద్రయా
లే! రుద్రదేవా ! మేలుకోవా !

సర్వమంగళ నీదు సతి పరాభవ మెట్లు
లోర్తువో ! ప్రమథాళి ఆర్తి నెటు తీర్తువో

హేరుద్రదేవా ! మేలుకోవా !

ఘోరపాపతమస్సు హోరు మని నాట్యమ్ము
సేయు నీభువి చీమ చిటుకు మన్నటు లేని
లేదా హే రుద్రదేవా ! మేలుకోవా !

విప్పవా ! నీ నొసటికన్ను !
కప్పుదువుగాని కాలానలజ్వాలలో
కలుషపూరిత వసుంధరను ! !
ఎత్తవా ! నీ విలయపదము !

చిత్తుగా చిందుత్రొక్కుదుగాని ఈ యహం
కార మత్తనిరంకుశాశయుల దుర్జనుల !!
లేవా ! హేరుద్రదేవా ! మేలుకోవా ! ◆

అన్నపూర్ణ

అన్నపూర్ణా ! విశాలాక్షి ! దేవి!
కన్నతల్లీ ! అహో ! రత్నగర్భ !!

ఆకలను కేక లోకసము తాకె !
చీకటులిమూక నల్దెసలు ప్రాకె !
చేరదా ! నీ శ్రవోయుగళిదాక !
పారదా ! నీ కృపాకాంతిరేఖ !!

అన్నపూర్ణా ! విశాలాక్షి ! దేవీ !
కన్నతల్లీ ! అహో ! రత్నగర్భ !!
చిమ్మలినిశమ్ము వచ్చు మొగసాల !
గ్రుమ్మలవశమ్ము పైడిధనశాల !

వాకిట శిరాలు రాలు పాలికలని !
ఏ కెలన నీ కృపాపాంగకలన !!
అన్నపూర్ణా ! విశాలాక్షి ! దేవి !
కన్నతల్లీ ! అహో ! రత్నగర్భ ! !

మూగకంఠాల పిలుపు విన్నావో !
పోగవికరాల సంజ్ఞ కన్నావో !
మరణమో జడతయో లేవలేము !
కరుణ హస్తానికై వేచినాము !!

అన్నపూర్ణా ! విశాలాక్షి ! దేవి !
కన్నతల్లీ ! అహో ! రత్న గర్భా !! ◆

హింసామత్త

హింసామత్త పృథివీ !
ధ్వంసలీలాతాండవమున
తనివితీరుటే లేదో ! !

సస్యశ్యామల మౌ మృదు
లాస్యము రుధిరమయమాయె !

సాంధ్య గగన మందవీచి
ఝంఝానిలభయదమాయె ! ॥ హింసా ॥

భగ్నాశయవా ! హృదిలో
అగ్ని లేల ? ఆర్తులేల ?
కఠిన శిలలె ద్రవియింపగ
కలుగు కంపనమ్ము లేల ! ॥ హింసా ॥

లేవు మధువనస్వనాలు !
ఘోరశతఘ్నురవాలె !
క్రుంగుదువిట కూలుదువట
నింగి కెగసి రాలుదు వెట ! ॥ హింసా ॥

ఇంకనైన వెలువడవో భ
యంకరతమసాపథాలు
శాంతికాంతు లొలయు నమల
సౌఖ్యవియత్తలి చేరవో !
హింసామత్తపృథివీ ! ! ◆

ధర్మచక్రోవదన

ఆర్త యయ్యెనే - పవిత్ర
ధాత్రి భరత భూమి నేడు !
ఆప్తమిత్రు లొండొరులను
హత మొనర్చు కదనస్థలి
రక్తసిక్తమయ్యెనయ్యొ
రత్నగర్భహృదయతలి ! !

॥ ఆర్త యయ్యెనే ॥

కర్మభూమి నే డెవ్వరు
ధర్మచక్ర మేగింతురో
బుద్ధదేవు బోధామృత
మర్థ మెవరు తలపింతురో !!

॥ ఆర్త యయ్యెనే ॥

అ యజాతశత్రు తపన
ఆ యశోకు దయాపరత
ఆ కనిష్కు ధర్మపరత
అవని నెవరు మరపింతురో !!

స్వార్థపరులు కుటిలమతులు
స్పర్థాన్వితు లజ్ఞానులు
శిష్టహాని సేయగా, అ
రిష్టమ్ముల కాటకాల !!

। ఆర్త యయ్యనే ।

హతభాగినియై, అనాథ
యై, అరణ్యసీమయందు
పతిని గలియ గోరి పేర్చు
సతి చితాగ్నికీలలందు !!

। ఆర్త యయ్యనే ।

తండ్రిని చెరసాలనుంచి
తాను గద్దె యెక్కె నొకడు
తనకు సుతుడు జన్మింపగ
తనగుండెలె ఝల్లు మనియ !! । ఆర్త యయ్యనే ।

పేరజాత శత్రుండే
పోరు సల్పె బ్రతు కదెల్ల
కర్మపక్వమై బుద్ధుని
ధర్మమె శర ణన్నదాక !!

॥ ఆర్త యయ్యనే ॥

యుద్ధానలకీలలలో
క్రుద్ధకాలసర్పవిష
జ్వాలలలో క్షతనారీ
బాలవృద్ధరోదనలో !! ◆

। ఆర్త యయ్యనే ।

రాజ్యశ్రీ శోకగీతి

జ్వాలాకీలలలో రాలి, కాలి కాలి, ధూళి తూలి
చాలింతును నా జీవిత మిక !
ఈ చితాగ్ని యే శరణ్య మిక !!

గాలిలోని పిచికగూడువోలె రాలె నా పెన్నిధి,
ఏలా బ్రతుకగలనో యింక యింకెవరింకు? నా కెవరిక !!

నా సర్వస్వమ్ము నాశనమ్మాయె నయ్యో అదేలో !
వాసంత విలాస మేది వ్యర్థజీవినౌ నా కిక !!
ఏ వధూవరుల నెడబాసిన పాపినో గతజన్మను ?
ఈ విధిని మరింతవింత జేసిత మెటు గడుపుదు నిక ?
జ్వాలాకీలలో రాలి, కాలి కాలి, ధూళి తూలి
చాలింతును నా జీవిత మిక !
ఈ చితాగ్ని యే శరణ్య మిక !! ◆

ప్రబోధగీతి

మూతపడిన కన్నులు తెరువవో
ప్రాతఃకాల ప్రభలు విరియవో
దుఃఖతమోవృతధరాతలముపై
సౌఖ్యభానుసందేశము నీయవో !

కఠినశిలాహృది కరిగింపవో
శిశిరతరుశాఖ చిగురింపవో
హింసాకులధరణీతలమందు
అహింసాయుతశాంతికాంతు లొలుకవో !! ◆

పాపీ

పాపీ! ఓహో పాపీ! - నీ
పాప మదెంతటిదైనా పశ్చా
త్తాప మందరా పాపీ !!

పశ్చాత్తప్తుని హృదయముపై పర
మేశు కరుణా వర్షించుర పాపీ !! ॥పాపీ॥

కీటకమై తొలిజన్మ లోన నా
నాటికి పుణ్యము నార్జన సేయుచు
కోటికోటి యుత్తమజన్మల గని
నేటికి మానవజన్మ నందితివి !! ॥పాపీ॥

నరజన్మములో పుణ్యముచేసిన
మరి యే జన్మములేని ముక్తిరా !
పరమేశుని దయ పాపాత్ములకిల
దొరకదు కోటి కోటి జన్మలకును !! ॥పాపీ॥

హింసావిహితము కరుణావిహితము
సంసారము భూలోకస్వర్గము
చేజేతులనే సంసారమ్మును
చేసికొనెదు స్వర్గనరకములుగా !

పాపీ! ఓహో పాపీ! - నీ
పాప మదెంతటిదైనా పశ్చా
త్తాప మందరా పాపీ !
పాపీ! ఓహో పాపీ !! ❖

ధర్మచక్రము

సాగునదే ! సాగునదే !
    ధర్మచక్రము ! ధర్మచక్రము !
ఏగునదే ! ఏగునదే !
    జగతి నలుదెసల నాచంద్రార్క్యము !! ॥ సాగునదే ॥
పిలుమనదే ! వినబడదో !
    శిలలు ద్రవించు కరుణతో
పిలుచునదే ! యెద యెద
    హత్తించు ప్రేమగళమ్ముతో !! ॥ సాగునదే ॥
రాజు, రౌతు, ప్రభువు, బంటు
    యతి, గృహస్థు చనుమార్గము
సర్వసమము, శాంతికాంతి
    పథ మవక్రము ! ధర్మచక్రము !!
సాగునదే ! సాగునదే !
    ధర్మచక్రము ! ధర్మచక్రము !
ఏగునదే ! ఏగునదే !
    జగతి నలుదెసల నా చంద్రార్క్యము ! ! ❖

గీతాంజలి

ఓయి మహాత్యాగీ! ఓహో భవ్యయోగీ!
అహో తపస్వీ! హే మహాత్మ! జోహారు! జోహారు!

భరతప్రజ శాంతిసమర
భద్రవీరవరులజేసి
గురుతపమున భరతమాత
పరతంత్రత బాపినావు !!

అన్నదమ్ము లన్యోన్యము
హత మొనర్చుకొనుట మాన్ప
భార మనక ధీరత మెయి
ప్రాణము లర్పించినావు ! !

కరమున వరచక్ర మెత్తి
హరిజనాళి రక్షించితి !
రామచరణ పారాయణ !
శ్రీ దరిద్రనారాయణ ! !

శిష్టగతుల చెలగింపగ !
దుష్టమతుల తొలగింపగ
జగతీధర్మము నిలుపగ
యుగయుగముల నవతరింతు !!

ఓయి మహాత్యాగీ! ఓహో భవ్యయోగీ!
అహో తపస్వీ! హే మహాత్మ! జోహారు! జోహారు! ❖

జోత

ఇదె జోతా నీ కిదె జోతా !
ఓ స్వతంత్ర భారతపితా !
        నరపాలనలో దాస్యాంబుధిలో
        తెరువు వెఱుంగని దీర్ఘనిద్రలో
        మఱిగిన నరులకు సత్యాగ్రహమును
        వీరాయుధమ్ము నొసంగిన నేతా !
నీ కిదె జోతా ! ఇదె జోతా
ఓ స్వతంత్ర భారతపితా !
        మన్నిక గలిగిన నరజాతులలో
        ఎన్నిక గలదోయ్ మన జాతియునని
        మా కొకదేశము మా కొకజెండా
        మాకొక ఉన్నతి నిచ్చిన నేతా !
నీ కిదె జోతా ! ఇదె జోతా
ఓ స్వతంత్ర భారతపితా !
        కరుణా శేషువు కవ్వపుత్రాడుగ
        మఱిగెడుపగలే మంథానాద్రిగ
        నరుల హృదంబుధి తరచి తరచి శాం
        తిరూప సుధ నందించిన నేతా ?
నీ కిదె జోతా ! ఇదె జోతా !
ఓ స్వతంత్ర భారతపితా !
        ఇదె జోతా ! నీ కిదె జోతా !
        ఓ స్వతంత్ర భారతపితా ! ❖

పూజా శీర్షములు

పూజాశీర్షము లివిగో - మా
పూజాశీర్షము లివిగో !!
ఓ జీవదయాపర ! బాపూ ! మా
పూజాశీర్షము లివిగో !!

భరతావని జన్మించితివా
అవతారమూర్తివై మించితివా !
చరఖా చక్రాయుధధారీ ! హే
దరిద్రనారాయణశౌరీ !! ॥ ఓ జీవదయాపర ॥

నిరుపమాన జనతానేతా ! హే
భరతస్వాతంత్ర్యవిధాతా !
సత్యాగ్రహమంత్రోద్గాతా ! హే
ప్రణయమహోదయలోకవిజేతా !! ॥ ఓ జీవదయాపర ॥

మానవతాప్రపూర్ణమూర్తీ ! హే
అమరమధురజీవనశక్తీ !
అసమానస్వార్థత్యాగీ ! హే
అద్వితీయసమతాయోగీ !!
ఓ జీవదయాపర ! బాపూ ! మా
పూజాశీర్షము లివిగో !! ❖

పృథ్వీప్రశంస

పృథుల క్షమాశాలినీ ! పృథ్వీమాతా !
గగనపథస్వేచ్ఛాగామినీ ! కాంతిప్రపూతా !!

శశ్వన్నవరాగ నవోష స్తేజస్వినీ !
అనశ్వర విస్వరాంధ ఘన సంతమస్వినీ !!

ప్రచండాంతరోజ్జ్వల జ్వల జ్వాలామాలినీ !
అచలశాంతిమయ తుహినాంబరధారిణీ! ధారుణీ !!

నందిత శతసహస్ర పక్షిస్పందన మధుకలస్వనీ !!
క్రందిత శతకోటిక్లాంత బృందశోక వికిరధ్వనీ !!

వివిధ మతప్రణయస్పృష్ట విస్మృత సుహృన్మణీ,
విద్వేషవిభేదవాద వికల ప్రకృతిఖనీ,
నిరవధిక వికారిణీ ! నిస్తుల
నిత్యసత్యసౌందర్యప్రస్తారిణీ !!
దిక్కాలాతీత దివ్యశరీరిణీ ! ధరణీ !
పృథులక్షమాశాలినీ ! పృథ్వీమాతా !! ◆

లలితస్తుతి

మాహేశ్వరీ, మహాకాళీ
పాహి సృష్టి లయంకరీ !
ఆదిశక్తీ కాళరాత్రీ
అళికనేత్రీ శాంకరీ !! ॥ మాహేశ్వరీ ॥
మహారూపా, మహామాయా
మహాశక్తి, మహారతీ !
మహాబుద్ధీ, మహాసిద్ధీ,
మహాతంత్ర, మహామతీ

పంచప్రేతాసనాసీనా
మహాభైరవపూజితా !
ముక్తదంష్ట్రానలోర్మికా ! హే
రక్తనేత్రజ్వాలికా !! ॥ మాహేశ్వరీ ॥

రుధిరసక్తా మాంసవిష్టా
వారుణీమదవిహ్వలా !
కాలకంఠీ పరాశక్తీ
కపాలమాలాన్వితా !! ॥ మాహేశ్వరీ ॥

హే శూలధారిణీ హే శ్యామగాత్రా !
హే రుద్రరూపిణీ హే శోణవక్త్రా !
భగవతీ భైరవీ విశ్వాధికా !
రుద్రమూర్తీ శ్యామపాదరూపా !
ఈశ్వరీ క్షోభిణీ విశ్వసంక్షోభిణీ !
లోకకల్లోలినీ హాకినీ రూపిణీ !
నిర్భవా భవనాశినీ వజ్రధారిణీ !
మూలశక్తీ జగన్మాతా భవానీ !
నమశ్శక్తి దాయినీ హే ముక్తిదాయినీ !
హే క్షణక్షణసంకలిత పాలిత ప్రలయి
    తానేకవిశ్వాత్మికా !
ప్రకృతిపూరుషకళాకృద్ద్వయైకాత్మికా !
అద్వయానందసచ్చిదనంతదీపికా !
పాహి లలితాంబికా !
పాహి మాం పాహి మాం పాహి !! ◆

మహోదయం

నవవసంతపత్రావళి

మహోదయ మాయె నహో! అహో!
శుభోదయ మాయె నహో!

దెసదెస కెంజాయల కోప అలమగ
మసలుచు ప్రాకే తొలుసంజ!

ఎసగే కాంతి శలాకల మాటున
పస ఉడుగు నిరుల వెనుకంజ!

మహోదయ మాయె నహో! అహో!
శుభోదయ మాయె నహో!

తోటల బాటల చీకటి చాటుల
చలిమంటల వెలవెలలోన!

తూరుపు వాకిలి బంగరు తలుపుల
జయగంటల గణగణలోన!

మహోదయ మాయె నహో! అహో!
శుభోదయ మాయె నహో!
తెలతెలపోయెడి చుక్కలదాయల
కలకలపులుగుల పిలుపులలో!

కొక్కొరొకో యని గొంతుల నిండుగ
కుక్కుటముల మేల్కొలుపులలో!
మహోదయ మాయె నహో! అహో!
శుభోదయ మాయె నహో!

చెంగున గెంతే లేగల సొకుచు
చెలగే అంభారవములలో!!
లేవడి కరవులు లేవని చాటే
ముంగిటి ధాన్యపురాశులలో!!

మహోదయ మాయె నహో! అహో!
శుభోదయ మాయె నహో!! ◆

స్వాతంత్ర్య స్వప్నం

విధుర హేమంత మరిగినదోయి!
　　మన కింక
మధుర వాసంతమ్మె కలదోయి!
　　మునరు చీకటితోట
　　మసలు నాకటి బాట
　　ఎసగు వెన్నెలతోట
　　పసిమి వన్నెలబాట!
మనసు మనకల రేయి చనెనోయి!
　　మన కింక
తెలివి వెల్గారయిు పవలేనోయి!
　　ఒరగు పీన్గులవాడ
　　మఱుగు మూల్గులమేడ
　　కెరలు నాటలవాడ
　　వరలు పాటలమేడ!
వాల్గువీథుల జాటిరమ్మోయి!
　　వాసంత
వవశుభోదయము సమయమ్మోయి!
　　వాడవాడల దిరిగి
　　మేడ లన్నిటి కరిగి
　　తోడి సోదరుల నీ
　　కూడగొనిరమ్మోయి!

ఊడిగపు బ్రతుకు గడచినదోయి !
మన తల్లి
వాడవాడల స్వేచ్ఛ గడెనోయి !

కలిమి గల్గిన తల్లి
కడుపు చల్లని తల్లి
పసిడివలువల తల్లి
పంటవలతే తల్లి
వలపు విరిదండ గొనితెమ్మోయి !
మన తల్లి
గళమందు వేయ రా రమ్మోయి !
ఒత్తని యకరులతో
మెత్తని దళాలతో
క్రొత్త యామని పూలు
కొమ రొప్పు కమలాలు !
దేవికి నివేదన మ్మిమ్మోయి !
మధురమౌ
దివ్యామృతము స్వేచ్ఛసుమ్మోయి !
తల్లి బానిసతనము
వెల్లి బాసిన మనము
వైనతేయుల మమృత
మానుదము రా రమ్మ !
విధుర హేమంత మరిగినదోయి !

మన కింక

మధుర వాసంతమ్మె కలదోయి !! ◆

స్వతంత్రభేరి

మ్రోయింపు జయభేరి !
వాయింపుము నగారా !

తేలింపుము నభోవీథిని త్రివర్ణాంచితపతాకా !

॥ మ్రోయింపు ॥

భారతీయ స్వేచ్ఛాసూర్యు నాచ్ఛాదించు రాహుచ్ఛాయ
అంతర్ధానమాయె ! . . . . అంతర్ధానమాయె !
మ్రోయింపు జయభేరి !

స్వార్థమ్మనక సౌఖ్యమ్మనక
సంగ్రామమున పోరీ
వీరస్వర్గ మేలగ చనిన
ధీరులకెల్ల జోహార్!
జోహార్ వివిధరాష్ట్ర వీర యోధులకు జోహార్!
జోహార్ వీరమాతలకును పత్నులకు జోహార్!

• • •

ఉదయమ్మాయెను స్వేచ్ఛాభారత
ముదయమ్మాయె నహో!
తూరుపుఖండపు వారల తపములు
కోరిక లీడేరెనహో!!
దెసలల్లిన భారత స్వేచ్ఛాసూర్యుని
ప్రాభాతోజ్జ్వలకాంతి!
ప్రసరించుత తూరుపువాకిలి తరచుక
ప్రేమపూరితప్రశాంతి!!
దేశదేశముల దీనజనావళి దాస్యబంధన విముక్తి
ద్వేషరోషములు తెగలు పగలు
నశియింప జగమెల్ల శాంతి!! ◆

(భారతదేశం స్వతంత్రమైన 1947 ఆగస్టు 15 అర్ధరాత్రి 12 గంటలకు ప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఉపన్యాసం ఢిల్లీనుంచి అన్ని ప్రాంతీయ రేడియో కేంద్రాలూ రిలే చేశాక, ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేసిన పాటలలో టంగుటూరి సూర్యకుమారి పాడిన 'మ్రోయింపు జయభేరి' 'ఉదయమ్మాయెను' అనే ఈ గేయాలు రెండూ మద్రాసు రేడియో నుంచి ప్రసారం అయ్యాయి)

బౌద్ధభారతవసంతము

నవవసంతము నేడహో

        ఎన్నవ వసంతము నేడహో!

దిక్కు-దిక్కుల బోధివృక్షపు

        దివ్యశాఖలు చివురు లెత్తెను!

బోధిసత్వుని బోధనామృత

        దీధితులు లోకాన వెలిసెను!! ॥నవ॥

ఆరామవీథికల

                ఊరూరబోధకులు!

ఇంటింట సాధకులు

        బాధాపనోదకులు!! ॥నవ॥

ఆ మేరువును దాటె

        అంభోధులను దాటె

ఆ అహింసాపథము

        త్రిజగదాశాపథము!! ॥నవ॥

బుద్ధదేవునిసూక్తి

        ఇద్ద మని యనురక్తి

గళము విప్పి పాడు

        నవవసంతము నేడు!! ॥నవ॥

నవవసంతము నేడహో

        ఎన్నవ వసంతము నేడహో!! ❖

([illegible] నావికాగేయం)

వాగమృతద

అగణిత శుభదాయినీ ! వాణీ ! హే జననీ !
వేదవినుతా ! రాగమహితా ! వాగమృతదా శారదా !
వికలపాపా ! విహృతతాపా ! సకలసుగతిసాధనీ !
దేవమానివందితపదా ! దివ్యలోకావాసినీ ! ॥ అగణిత ॥

వరకమలజమనోహారిణీ ! కమలముఖీ ! కమలాకరవిహారిణీ !
సితశాంత శశికళాహాసినీ ! సుకవితాకళావిలాసినీ !
నిరుపమ కరుణాకలితా ! అకలుషనవరసభరితా ! ॥ అగణిత ॥

లోకలీలారచనశీలా ! అతివిశాలా భారతీ !
ఆదిప్రకృతీ ! అంబికా ! ఆర్తజనతా సురలతా !
గానలోలా ! కలవిపంచీస్వరఝరీ మదభరీ ! ॥ అగణిత ॥

శాంతియుతా ! చారుమతీ! చతురకథాసారమతీ !
హేమాతా ! ప్రపూతా !
శాంతియుతా! లలితకళా కోమల మేఖలాశోభితా !

నవయుగజీవనభావనధాత్రీ !
కవిజనహృదయరతా సావిత్రీ ! ◆ ॥ అగణిత ॥

'ద్వారం' వారికి ఆశీః సుమగీతి

నీ యాశీః సుమరాశి చల్లుమా !
ఓ సరస్వతీ ! కళాధి దేవతా !   ॥ నీ యాశీః ॥

ప్రతిభావంతుడు వినయవినమితుడు
సేతుశీత నగవిఖ్యాతుండు
శిల్పకల్పనాపారావారము
మా అమూల్యవరమౌ ద్వారముపై !   ॥ నీ యాశీః ॥

తన సాధనచే తన తపస్సుచే
తన గానకళావైశద్యముచే
తన రాష్ట్రమునకు తన దేశమునకు
ఘనతను కూర్చిన మా ద్వారముపై !   ॥ నీ యాశీః ॥

తానాలాపములందు స్వరములకు
ప్రాణము పోసిన ఘననయఫణితుల
మానవహృదయపుతంత్రుల తాకే
మధురగాయకుడు మా ద్వారముపై !

హృదిపులకించు ధనుష్టంకారము
బ్రదుకులు చివురించే ఓంకారము
రాగరసానందపదద్వారము
తవకు వరములౌ మా ద్వారముపై !
నీ యాశీః సుమరాశి చల్లుమా !
ఓ సరస్వతీ ! కళాధిదేవతా ! ◆

(1949లో మద్రాసు విశ్వవిద్యాలయం సెనేట్ హాలులో 'ద్వారం'వారి సన్మానానికి కూర్చిన బృందగానం)

P.G. 198

యుగకర్తా! అభివాదాలు!!

కందుకూరి వీరేశలింగం
నీ వొక మహోన్నత శృంగం!
ఎందుకు జన్మించాడో
ఈత డని ప్రశ్నిస్తే -
ఇందు కని జవాబు వచ్చే
వందనీయు లందరిలో
కందుకూరి వీరేశలింగం
నీ వొక మహోన్నత శృంగం!

నీవు జీవించినప్పుడు
నేను జన్మించనే లేదు

అప్పుడు నీతో జన్మించడం
అదొక అదృష్టమే అయినా
ఇప్పుడు జన్మించడం
ఇదే నా కదృష్ట మనుకుంటా !

నీ జీవించినరోజుల్లో
నీ వొక్కడవే ఒక వెలుగు !
నీ చుట్టూ మహాంధకారం
నే నందులో బ్రతికుందునా ?
నీ తరవా తొక నూరేళ్లకి
నీ కిరణాలే మే మంతా !
నీ జీవించిన ఆ దినాల్లో
నిద్రిస్తోంది జాతంతా !
నిద్రితజాతిని లే లెమ్మని
విప్లవశంఖం పూరించావ్ !
నీ తరవా తొక నూరేళ్లకి మే
మంతా నీ జయశంఖాలం !

ఈ యుగావ తొలిరోజుల్లో
నీవే జన్మించకపోతే
ఆంధ్రజాతి అనేకయుగాలు
అస్థిదరిద్ర మైపోయేది !

పీడితజనులకు ఊరటగా
బాసట ఐ నిలిచిన దెవరు ?
అన్నపూర్ణవంటి గృహిణితో
ఆర్తజనకుటుంబివి నీవే !

నిరంకుశుల కాఠిన్యం

ఎదిరించ సాహసించిన దెవరు ?
మేరుధీర హృదయేశ్వరితో
వీర యోధవరుడవు నీవే !

మూఢాచారపుసంకెళ్లను
ముక్కలుగా త్రెంచిన దెవరు ?
జ్ఞానశీల ప్రాణేశ్వరితో
సత్యధర్మపరుడవు నీవే

తన సౌఖ్యాన్నే మరిపించే
త్యాగబుద్ధి చూపిన దెవరు ?
సహనశీల రాజ్యలక్ష్మితో
మహామహితాత్ముడ వీవే ?

తెలుగుతోట కొత్తదారుల
కొత్తపైర్లు చల్లిన దెవరు ?
అమలవాణి భాషాసతితో
అమరగురుసమానుడ వీవే !

చరిత్రలో సాహిత్యంలో
పరిచిన నీ తొలిదారుల్లో
ఉన్నతభావాలు స్మరిస్తూ
నీ అడుగుల వెనుకనె వస్తాం !

నూరేడుల ప్రతిజయంతికీ
నీ విజయం ప్రతిధ్వనిస్తాం !

ధన్యభరతమాతృపుత్రా !
అభినవాంధ్రచరిత్రకర్తా !
నీ పవిత్రపాదాల కివే
మా నిరంతరాభివాదాలు ! ! ◆

మాతృభూమి

హే భువనమనోమోహినీ
నిర్మలసూర్యకరోజ్జ్వలధారుణీ జననీ ! ! ॥ హే ॥

నీలసింధు నిర్మల జల
ధౌతచరణ కమలతల
అనిల వికంపిత కోమల
శ్యామల నవ సస్యాంచల
అంబర చుంబిత విశాల
ఫాల హిమాచల !
ధవళ తుషార కిరీట సుశోభినీ- జననీ ! ! ॥ హే ॥

తొలి ప్రభాతమున నీ గగనమున
తొలి తపోవనుల సామరవమున
ఎన్నో జ్ఞానధర్మకాంతు లొలసె
ఎన్నో మహాకావ్య తతులు వెలసె
చిరకళ్యాణమయీ అతిధన్యశీలవమ్మా
అవిరళవితరణశీలివి అన్నపూర్ణవమ్మా
యమునాజాహ్నవీగలితకరుణాకలితా
పుణ్యమధురపీయూషస్తన్యవాహినీ జననీ ! ! ◆ ॥ హే ॥

(రవీంద్రునకు కృతజ్ఞత)

సరోజిని

అందుకొనుమ ఈ సుమాంజలి !
అమరగాయనీ ! సరోజిని !
వీరనారివై స్వతంత్రతా
ఘోరరణంబున పోరితివి !
విదేశీయులకు భారతవిదుషీ
వికాసమును ప్రకటించితివి ! ! ॥ అందు ॥

అజ్ఞానపు టంధకారము
హత మొనర్చు నిశితదృష్టితో
వక్త నౌచు సూక్తి మురళిని
పలికించితి సుధావృష్టితో ! ! ॥ అందు ॥

జీవమురళి మూగవోయినా
భావసరళి మధురగీతమై
దేశదేశముల యుగాలుగా
ఆకాశం మ్రోగుచుండులే ! ! ◆ ॥ అందు ॥

సరోజిని

భారత స్వాతంత్ర్య భవనసంధాత్రి !
మాన్య మకుటోపేత మహిత జనయిత్రి !
మా జోతలివె ఓ సరోజినీదేవి !
వంగ దేశీయవిద్వద్వంశమందు
ఆ హరీంద్రుని యక్క వౌచు జన్మించి
కమనీయభావాల కవయిత్రి వౌచు
పాశ్చాత్యభాషల ప్రౌఢ వనిపించి
ముత్యాలనాయుని మురిపెంపు సతివై
తెలుగుకోడలి వౌచు తేజరిల్లితివి ?
మా జోతలివె ఓ సరోజినీ దేవి !
నీ కంఠమాధురీ నిభృతగీతికల
రాజదండంబైన రమణీయ మురళి
నీ రాష్ట్ర పాలనా నిర్వహణమున
సర్వప్రియత మ్రోగి సార్థక మ్మాయె !
అతిరథ మగుడు, మహారథ మగుడు
ఆత్మ వేనుమి భారతాంబకు నీవు ! !
మా జోతలివె ఓ సరోజినీ దేవి ! ! ◆

అంజలి

అంజ లిదే మానవోత్తమా !
    అఖిలలోకపితా ! మహాత్మా !   ॥ అంజ లిదే ॥

మకుట మేల బిరుద మేల
    మహిత సార్వభౌమా ! నీ
అకలంకప్రేమ నేలినావు
    సకల భూమండలి !!   ॥ అంజ లిదే ॥

    తనలోపల జీవాళిని
    తమ్ము సకల జీవులలో
    కనుగొను కరుణామూర్తీ !
    ఖేదమోద సమవర్తీ !!   ॥ అంజ లిదే ॥

ఆ తథాగతుండు క్రీస్తు
అవని బ్రోవ నీవె యొచు
ఆ యహింస పరమధర్మ
మను సత్యము నెలకొల్పిరా !!   ॥ అంజ లిదే ॥

    లోకప్రజ హృదయమ్ముల
    ఏకత్వము నీకు శాంతి !
    దశదిశలను నీ యాశీః
    ప్రసవవృష్టి మాకు కాంతి !!

అంజ లిదే మానవోత్తమా !
అఖిలలోకపితా ! మహాత్మా !! ◆

శాంతిదూత

జయ జయ భారత భాగ్యవిధాతా !
జగత్ శాంతిదూతా !
జగతికెల్ల శుభదినమ్ము నీదగు
జన్మదినము సత్యమార్గనేతా !
ధన్య నిన్ను గన్న యీ ధరిత్రి !
ధన్య మా భరతధాత్రి !
పరమధన్యులము భారతీయులము !
బాపు మా గురుడ వీవె !!
పగలు తెగలు మఱచి నిఖిలప్రజ నీ
పథమున నెద యెద గదియ జేయునో !
రగులు లోభమోహములు నశింపగ
రామరాజ్య మీభువి నిక వెలయునో ! !
జయ జయ భారత భాగ్య విధాతా !
జగత్ శాంతిదూతా ! ! ◆

సర్వోదయము

ఓ బాపూ ఓహో బాపూ మా బాపూ మా ప్రియబాపూ !

నీ జీవన మధురస్వప్నంలో
మా జీవితమార్గం దీప్తంగా మము
దీవిస్తున్నావా చిరునగవున
పరికిస్తున్నావా ! ॥ ఓ బాపూ ॥

మనిషి మనిషీ తకిలీపట్టి
నిమిష నిమిషం నూలువడుకుతే
తనకు తానే వస్త్రదాతయై
జగం సర్వం సుభిక్ష మౌను !

ఇదే మంత్ర మా దేశించావ్
విదేశాల చూ పే అన్నావ్
స్వదేశీపరిశ్రమ లెడల
ఉదాసీనతను మాన్పించావ్ ! ! ॥ ఓ బాపూ ॥

ఆచరణములను ఆకులచుట్టూ
ఆదర్శమ్మను సూత్రము కట్టీ
సూత్రపు కొస శ్రద్ధను కదు రుంచీ
ధర్మచక్రం ప్రవర్తించితే
సర్వజీవితాధారం దారం
లాగగ లాగగ సాగుతు వస్తే ! !

అనురాగమె కండెలుగా చుట్టి
పడుగూ పేకా అడ్డం నిలువూ
పరచుకు పేర్చుకు అల్లుకుపోతే
జీవితములు వస్త్రావృత మౌను ! !

బాపూ ఓహోహో బాపూ ! ! ◆

ఉగాది

స్వతంత్ర భారతజననీ, నీ కిదె
నితాంత నవనీరాజనము
అశేష పూజాశీరీషములతో
అగణిత వర వారీజనము !!

॥ స్వతంత్ర భారతజననీ ॥

వదలెను చిరదాస్యపుశృంఖలములు
చెదరెను దైన్యతమఃపటలమ్ములు
అనేతుహిమనగ మొక్కటపొంగై
అలముకొన్న దానందతరంగము ! !

॥ స్వతంత్ర భారతజననీ ॥

బలిమికి జేగురు, శాల్మికి తెల్లన
కలిమికి పచ్చన, కర్మచక్రము,
వాడ వాడ నీ హృదిలో మేడల
నేడు త్రివర్ణపతాకములే !!

॥ స్వతంత్ర భారతజననీ ॥

పచ్చనితోటల నే యెడ వినినా
స్వేచ్ఛాపికములు నిండుగళమ్ముల
హాయి హాయిగా రెక్కల విద్రిచే
తీయని గీతీహారతులే ! ! ॥ స్వతంత్ర భారతజననీ ॥

త్యాగమూర్తియౌ మహాత్ము డొసగిన
శాంత్యహింసలే సదాశయములుగ
సకల వసుంధర నేకము చేయుగ
అకలంకులమై ప్రతినలు సేతుము ! ! ◆

॥ స్వతంత్ర భారతజననీ ॥

స్వాతంత్ర్యఘంట

స్వాతంత్ర్య శుభోదయ ఘంటా
నాదం బదె మ్రోగెను మింట !
టంఠం టఠం టఠటం !
టంఠం టఠంఠం !
వీతెంచె నవాశామారుత
మోతల్లీ ! మా నవభారతి !
టంఠం టఠం టఠటం !
టంఠం టఠంఠం !
నీ పదాల కెరగెడు శిరాలు
నీకు జోత లిడు మా కరాలు !

నీ కిడు నవగీతీహారతి !

మా తల్లీ ! ఓ నవభారతి !

టంథం టథం టథటం !

టంథం టథంథం !

పగలు తెగలు తగవులు మరచి

నగు మొగాల హృదులను తెరచి

కనబడు నీ చల్లని మూరితి

జననీ ! ఓహో నవభారతి !

టంథం టథం టథటం !

టంథం టథంథం !

ధర్మసస్యకాంతుల నడుమ

కర్మచిహ్న ధర్మచక్రమై

కూర్మి పేర్మి చాటెడు కీరితి

నీ పతాక ! మా నవభారతి !

టంథం టథం టథటం !

టంథం టథంథం !

సత్యాగ్రహమంత్రగురుండు

శాంతిదూత యోగివరుండు

స్వాతంత్ర్యమహారథసారథిఁ

గన్నతల్లి ! మా నవభారతి !

టంథం టథం టథటం !

టంథం టథంథం !

స్వాతంత్ర్యశుభోదయఘంటా

నాదం బదె మ్రోగెను మింట !

టంథం టథం టథటం !

టంథం టథంథం ! ! ◆

నవభారతసందేశం

అహో నవప్రభాతము !
శుభాశాపరిపూతము ! !
స్వాతంత్ర్యోజ్జ్వలయువాశయోత్సాహోపేతము ! !
అదె స్వతంత్ర భారతదేవాలయ ఘంటారావము !
అదె అశోకచక్రాన్విత త్రివర్ణ కేతనహాసము !
అదె స్వరాజ్య ప్రజాభోజ్య సువర్ణభవనవికాస
మహో నవప్రభాతము !
శుభాశాపరిపూతము !
ఆసియా నివాసులార ! స్వాతంత్ర్యపిపాసులార !
స్వాతంత్ర్యమ్మున కర్షులు సకల మానవు లని చాట
బర్మా చైనా జావా ప్రజలు మనకు తోడు నే
డహో నవప్రభాతము !
శుభాశాపరిపూతము !
శాంతి కాంతిపరిపోషము ధర్మచక్రపరివేషము
సత్యసమ్మిళితావేశము మహాత్మమహోపదేశము
జగత్కుటుంబాదర్శము నవభారతసందేశ
మహో నవప్రభాతము !
శుభాశా పరిపూతము ! ! ◆

స్వాతంత్ర్యోత్సవ పుష్పాంజలి

మాదీ స్వతంత్ర దేశం
మాదీ స్వతంత్రజాతి !
భరతదేశమే మా దేశం !
భారతీయులం మా ప్రజలం ! !

వింధ్య హిమవత్ శ్రీ నీలాద్రుల
సంధ్యారుణిత నవాళలు మావి !
గంగా గోదావరీ సహ్యజా
తుంగతరంగితహృదయాల్ మావి !!

ఆలయమ్ముల శిల్పవిలాసం !
ఆరామమ్ముల కళాప్రకాశం !
మొగల్ సమాధుల రసదరహాసం !
మాకు నిత్యనూతనేతిహాసం !!

అహింసాపరమోధర్మః
సత్యం వద ధర్మం చర
ఆదిఋషుల వేదవాక్కులు
మా గాంధిగౌతముల సువాక్కులు !!

స్వతంత్రతా భ్రాతృత్వాలు
సమతా మా సదాశయాలు !
జననీ ! ఓ స్వతంత్రదేవీ !
కొనుమా ! నీరాజనాలు మావి ! ! ◆

ప్రబోధము

జైహిం దని జై హిం దని
నడు ముందుకు ! నడు ముందుకు !
మువ్వన్నె పతాక నెత్తి
ముందుకు నడు, నడు ముందుకు !

ముం దేమిటి గమ్య మ్మని
ఎందుకు ప్రస్థాన మ్మని
అద రెందుకు, బెద రెందుకు
ఎదురే లేదని ముందుకు
ప్రణయయోగి గాంధిబోధ
ప్రపంచైక్యతకు మందని ! !

॥ జైహిం దని ॥

కలకత్తా అమృతసరూ
కాకినాడ కథేవరూ
కాశ్మీరం డార్జిలింగ్
కన్యాకుమారి పూరీ
ఆసేతుహిమాచలమూ
అంతా మందే హిందని!!

॥ జైహిం దని ॥

లేదు లేశమును మాకే
దేశ మాక్రమించు నాశ!
మా పురాణభూమిపైని
సై ప బో మొకరి దురాశ!
లేదిక పరతంత్ర దేశ
మీ ధరిత్రి నికముందని!!

॥ జైహిం దని ॥

భేదవాదసంకులమై
భీకరసమరాకులమై
పరస్పరవిమారకమౌ
బహుళజాతిపుంజమందు
సత్యాహింసాత్మకమౌ
నిత్యధర్మ మార్గదర్శి
ప్రాచ్యగగనపరంజ్యోతి
భవ్యభారతియె మందని!! ❖

॥ జైహిం దని ॥

అభినందనము

(విజయవాడకు)

అభినందన చందనపవనసుగంధము లివిగో!
ఆనందితహృదయసుమ నవమరందము లివిగో!
విజయవాటికా !

ప్రాచీనభరతబౌద్ధార్షజ్ఞానపేటికా !
ఇంద్రకీలదుర్గాచలవరకిరీటికా !
కృష్ణాతరంగచుంబితమృదుపాదపీఠికా !
అభినందన చందనపవనసుగంధము లివిగో !

నభోవాణి నవోన్మేష శుభసంధ్యారుణిమ
సకలకళాసాహితీ కలితనాదమధురిమ
వికసితకోటిత్రయాంధ్ర నయనయుగళితరళిమ !

అభినందన చందన పవనసుగంధము లివిగో !
ఆనందితహృదయసుమ నవమరందము లివిగో ! ! ❖

(విజయవాడ ఆకాశవాణి ప్రారంభోత్సవము)

తెలుగుతల్లి

తెలుగుతల్లీ ! యశఃకల్పవల్లీ !
ఎసగు పైడిపైరుల పాలవెల్లీ ! !

కాలవాహినీ బహుతరంగాల
కదలని ధరాపరాగవేదికల
నిభృతమా మహోన్న తచరిత్ర లివే !
ప్రసవమాలగా నీ గళమ్మునకు ! !
తెలుగుతల్లీ ! ! యశఃకల్పవల్లీ !

రాల రాగిరేకుల మలయుగీతలు
తాళపత్రాలపై వెలయు కైతలు,
వీరజనపదమ్ముల కథలు, గాథలు,
నీదు చరితాం సారంపుబోధలు ! !

తెలుగుతల్లీ ! యశఃకల్పవల్లీ !
ఎసగు పైడిపైరుల పాలవెల్లీ ! ! ◆

మంగళం

మంగళమ్మమ్మ ఆంధ్రావనీ !
మహితస్వర్లోకగోరూపిణీ !
మంగళమ్మమ్మ ఆంధ్రావనీ ! ! । మంగళ ।

గౌతమీ తుంగభద్రా కృష్ణవేణీ త
రంగ మధుర స్తన్యవాహినీ ! !
తిరుమల శ్రీ సింహవరశైలశృంగినీ
స్ఫూర్తరత్నవిభూషితాంగినీ ! ! ॥ మంగళ ॥

విహరింపవమ్మ స్వేచ్ఛావిహంగపథాల
కటిగతస్వర్ణ మేఖలవై
నికటవర్తి కోటిత్రయాత్మజార్పిత
విశృంఖలసుమాంజలివై విలోలసస్యావలీ
శ్యామలాంబరవై విహరింపవమ్మ ! ! ॥ మంగళ ॥

మార్మోగనీ అనారతము నానాజాతి
జనసభాంగణముల్
విజ్ఞపండితతత్వతత్పు లావలిగళమ్ముల్
ధర్మసద్గుణముల్ మార్మోగనిమ్మా ! ! ॥ మంగళ ॥

నర్తింపనీ సగర్వమ్ముగా దేశదే
శాల సువిశాల కేతనముల్
నీదు కేతనముల్
మా గొప్పతనముల్ నర్తింపనిమ్మా ! ! ◆ ॥ మంగళ ॥

విజయప్రభాతము

ఏందు రే మే మనే మే మని ?
కందు రే మే మనే మే మని?
అంద రిటు రండి చూడం డని!
సుందరము విజయప్రభాత మని!
అందరికి కొత్త ఆమని యని ! !

విశాలావకాశాంతరాలందు వ్యాపించి
లోకాన శంకాకులానేక విద్వేషనిద్రోహముల పెంచు
మాయావృతాశేషభీతి ప్రచ్ఛాయ లవె వెల్వెల్ జారె !
దిశల్ నిశారాజ్ఞి కేశాంధకార ప్రభల్ తీరె !
ఎదల్ నిరాశావృతో ద్రిక్త సందేహభావాల్ తిరోగాములై పారె ! !

దిక్స్వామినీఫాలభాగాన, నున్మంచు సోనల్ చెలంగంగ
సుస్నాతసౌందర్య మొల్కంగ
గిరులందు తరులందు గుహలందు
తమగూడులను నిద్దురలు తీరిన శకుంతముం చిన్నిచిన్నోళులందు

తీయ నగు ఏఁరావలింతలన్, తల్లిపొత్తిళ్ల త్రుళ్లింతలన్
ఎరకకట్టుచు అప్పుడప్పుడే చాచు పక్షముల విదిలింతలన్
లేతకోరికం కదిలింతలన్ — ॥విందు రే మే మని।

చెల్లచెదరై సన్నగిల్లు నీహారమున,
ఏరులై పారు బంగారమున,
సూర్యవిభుతేరు గోపురపు కోటీరమున,
మిలమిలలలో తళత్తళతళలలో ధగద్ధగిధగలలో,
రాశులై పోసిరో కుంకుమ మ్మనిపించు
రమ్యసంధ్యావర్ణ రాజిలో
నీలసుశ్యామలారుణముఖ్యసప్తవర్ణాశ్వదీధితులవెల్గే నభోరేఖలన్,
పుణ్యభూముల పవిత్ర నదీనదమ్ములన్,
ఓంకారపూర్వమ్ముగా గీయమానమ్ములౌ
వేదగాయత్రినాదమ్ములందు - ॥విందు రే మే మని।

దగ్గరాయెను విజయ మనుచు,
దిగ్గు మని లేచి తల లూచుచు,
ఒక్కరొక్కరు తూర్పుదిశా
చక్కగా రండి చూడం డని,
కొక్కొరో కొరొ కొక్రొకో అని
కుక్కుటోద్భోధగీతమ్ములన్ - ॥విందు రే మే మని।

గతము చెడ్డది, నిశాంధ మని, ఆ
గతమె మంచిది, సుప్రభాత మని!
సుందరము విజయప్రభాత మని,
అందరికి కొత్త ఆమని యని!

విందురే మే మనే మే మని?
కందురే మే మనే మే మని? ◆

శతపత్రసుందరి

ద్వితీయభాగం

అంకితం

14 5 1940

అనగా మాపెళ్లి అయిన నాటినుంచి అరవైయేళ్లుగా

నన్ను కంటికి రెప్పలా కాపాడుతున్న, నా భార్య

సుభద్రాదేవికి

'చిట్టి మరదలా!'

ఓసి నామేనత్త కూతురా ఓ
సోసి మాబావ మురిపెపు చెల్లెలా,
ఓసోసి మాచెల్లాయి చిననాటి ఆటపాటల చెలిమికత్తెవై
చెల్లెక్కు చిలిపి చేష్టల చిట్టి మరదలా, నా
తొలినాటి తీయపాటల దోరగొంతులో తనగొంతు
కలిపిపాడే వలపు కిన్నెరా, నా .
అనుదిన స్వప్నాల అనునిశా స్వర్గాల అనునిమేషము నాదు
భావవృక్షము నల్లుకొను కల్పవల్లీ, నా
అయిదుగురు రత్నమాణిక్యాల బంగారు
అనుగుబిడ్డల కన్నతల్లీ, నా
జయపరాజయదుర్గ పరివేష వలయాల వెలుగులో ఇరులలో
ఛాయవై దీపమై అనుసరించే సఖీ, సంతత హాసస్ముఖీ!
నీదు తియ్యని నవ్వు, నీ కురులలో పువ్వు
నీ తీవి తలపూపు, నీదు చల్లని చూపు
ఎన్ని వాసంతాల ఎన్ని — బహుమతులో

(1967)

ఆశా నా ప్రాణసఖీ

ఆశా నాప్రాణ సఖీ ! ప్రభాతతారా
పాణి గ్రహీతి దారా, నామధుర భావ ధారా
దగ్గరగా రా, మరీ దగ్గరగా రా, ఇంకా దగ్గరగా రా !!
॥ ఆశా నాప్రాణ సఖీ ॥

కడగండ్ల నడుమ జడత పొడమ మేలుకొలుపుమా
దిగులొందు హృదయ మందిరాన దివ్వె నిలుపుమా !
ఆశా నాప్రాణ సఖీ ప్రభాతతారా
దగ్గరగా రా, మరీ దగ్గరగా రా, ఇంకా దగ్గరగా రా !!

జిగి వాలు చూపు నగవులతో, మగువ కులుకుతో
బిగి ప్రాటి వలలు పైకి విసరి, సొగసు లొలుకుతూ
భ్రమయించు దురాశాభామిని పిలుపులు విననీకు
బిగియించి వలపు కోట తలుపు దరియగ రానీకు
ఆశా నాప్రాణ సఖీ ప్రభాతతారా
దగ్గరగా రా మరీ దగ్గరగా రా ఇంకా దగ్గరగా రా!!

మై గగురు పొడుచు శీతగాలి తెరలదాడిలో
నాగుండె ప్రేలి నవయ జేయు కలల పీడలో
నన్నొడిసి పట్ట వెన్నాడు నిరాశా కామినిని
నెన్నడుము విరుగ తరుమవే, నామేను నిమురవే
ఆశా నాప్రాణ సఖీ ప్రభాతతారా
పాణిగ్రహీతి దారా, నామధుర భావధారా
దగ్గరగా రా మరీ దగ్గరగా రా, ఇంకా దగ్గరగా రా!! ❖

(1960)

తొలిపలుకు

డాక్టర్ బాలాంత్రపు రజనీకాంతరావు గారితో సాన్నిహిత్యము నాకు లభించిన ఒక మహా వరప్రసాదము.

శ్రీ రజని మహా వాగ్గేయకారుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, వారితో కలసి ఉద్యోగరీత్యా ఆకాశవాణిలో వున్నప్పుడు వారినుంచి నేను గ్రహించిన విశేషములు అశేషములు. ఆంధ్రావనిలో లలిత సంగీత స్రష్టికర్తలలో వీరు అగ్రగణ్యులు.

సాహిత్యానికి వలయు సంగీతము యొక్క పరిమితి, స్వరూపం అటులనే సంగీతానికి వలయు సాహిత్యము యొక్క పరిమితి, స్వరూపం తెలిసి కూర్చబడిన పాటకు లలిత సంగీతం అని అనవచ్చు ఇది యొక విన్యూత్నమైనశైలి. బహుశః దీనికి ఆంధ్రసంగీతమనే నామకరణం సరైనదని నా అభిప్రాయం.

రజని సాహిత్యం, రజని సంగీతం, రజని యక్షగానాలు, రజని సంగీత రూపకాలు మొదలైన వాటిలో నేను పాల్గొని, వారికి తృప్తి కలిగించేటట్లు పాడగలిగినందుకు గర్వపడుతూ వుంటాను. అప్పటి ఆపునాదియే నన్ను వాగ్గేయకారకుని చేసింది. ఇది అతిశయోక్తి గాదు, అందువలననే నా వాగ్గేయాలు ఒక ప్రత్యేకమైనవిగాను, అపూర్వమైనవిగాను బుధజనులు గ్రహించినారు.

రజని సంగీత శాస్త్రాన్ని కూలంకషంగా గ్రహించిన విద్వాంసుడు. శాస్త్రీయ సంగీతం అంటే వెంటనే వీనులకు విందు కలిగించదనీ, ఇది అర్థం చేసుకొనుటకు కించిత్ సంగీత జ్ఞానము కలిగియుండవలెననీ ఒక అభిప్రాయమును సంగీతజ్ఞులు కలగజేసినారు

ఇది సరియైనది గాదు. సంగీతం ఆపాతమధురం. అందరికీ ఆనందముకలుగ చేయునదే శాస్త్రీయ సంగీతము. వినువారికి రాగలక్షణము, ఆరోహ ణావరోహణాదులు, తాళ లక్షణములు తెలియనక్కరలేదు. లక్షణము తెలిసికొని లక్ష్యశుద్ధితో గానము చేసినయెడల వినువారు ఆనందింతురు. శిశుర్వేత్తి పశుర్వేత్తి యను ఆర్యోక్తికి అనుగుణంగా గానము చేయవలయును. అట్లు గానం చేయువాడే కళాకారుడు. తక్కినవారు విద్వాంసులు మాత్రమే.

ఈ రహస్యమును గ్రహించి రజని తనరచనలను శాస్త్రీయతతో కవితలోని ఆలోచనామృతమును, ఆపాతమధురము గావించినారు.

ఈవిధముగా రజనిని గురించి వ్రాయవలెనన్న మరొక గ్రంథము వెలువడవలసియుండును.

ఈ గ్రంథములో గణేశాది దేవతా స్తుతులు, గురుప్రశంసలు, నవగ్రహస్తుతి, మహాకవులకు ప్రణతులు, జాతీయ గీతములు ఇంకా యెన్నో అద్భుతమైన కవితలు గలవు, శతపత్ర సుందరి కలదు.

వీరిరచనల ముద్రణ అటుంచి మరొక ముఖ్యమైన విషయము గలదు. వీరు వాగ్గేయకారులగుటచే వీరి సాహిత్యము, సంగీతము వీరిచేత పాడించి ఆడియో, వీడియోలలో భద్రపరచవలెను. ఇది అత్యంత ఆవశ్యకము. ముందుతరాలవారికి మిక్కిలి వుపయోగకారి. ఈ కార్యక్రమము చేపట్టవలసిన బాధ్యతను త్వరలో గుర్తించి ఆచరణ గావించవలెను.

ప్రస్తుతము కూడా ఈ ముద్రణ స్వరయుక్తముగా జరిగియుండిన బాగుండెడిది.

అయినను మించిపోలేదు. ఈ ముద్రణలో శ్రీ రజని రచనలు, వీరి సంగీతము స్వరయుక్తముగా ప్రచురించినచో నాకు సంతృప్తి గలుగును ఇటువంటి సత్కార్యమునకు సహకరిస్తున్న ప్రతివారినీ అభినందిస్తున్నాను.

శతపత్ర సుందరుడు శ్రీ రజని దీర్ఘాయురారోగ్య వైభోగాలతో వెలుగుతూ ఆనందముతో వర్ధిల్లుతూ వుండాలని పరమాత్మని ప్రార్థిస్తున్నాను.

ఈ గ్రంథమునకు పీఠిక వ్రాయమని నన్ను ఆదేశించుటలో శ్రీ రజనికి నాయందు గల వాత్సల్యతే గాని నాకు అర్హత గలదని నేననుకోలేను. ఇదినాకు మరొక అదృష్టం శ్రీ రజనికి మనసా శిరసా నమస్కరిస్తూ ఆశీస్సులు కోరుకుంటున్న

మద్రాసు
12-7-99

పద్మవిభూషణ, సంగీతకళానిధి
డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ

విషయసూచిక

	గేయము.	తొలిపంక్తి	పుట.
1	నా స్వేచ్ఛకు మొదలూ తుది	నాచేయువదీ	325
2	ఓం గణానాం గణపతింహవామహే	జనగణముల	326
3	గురుప్రశంస	వరనారద గురునకు	327
4	సుమాంజలి (కాటూరివారికి)	తొలికారు	331
5	ఆదిభట్ల నారాయణ దాస నృత్యాంజలి	ఒక చరణంపు	333
6	గురుద్వార మధురఝరి (ద్వారం)	ఒకసన్నని	334
7	ప్రణతి (రాళ్ళపల్లి)	సిరులమ్మ	336
8	దేవులపల్లి	ప్రమదమా	339
9	గేయపూజ (బాపిరాజు)	ఓరాజా కవిరాజా!	341
10	సంగీత గంగోత్రి	ఆదిమ నరుడే	342
11	నవగ్రహ స్తోత్రం	నవగ్రహ స్వరూపుడా	343
12	సూర్యస్తుతి	ఏడు స్వరములు	348
13	చంద్రస్తుతి	వందనమిదె	349
14	అంగారకస్తుతి	అంగారక	350
15	బుధస్తుతి	స్తవముసేతు	351
16	నామ మహిమ	విదురలో	352
17	సదాశివుని ఉమాదాసత్వం	వదలక	353
18	శ్రీ వేంకటేశ్వర కళావైభవము	శ్రీ వేంకటేశ్వర	355
19	సిద్ధేంద్ర ప్రస్థానము	శోభనపు రాతిరి	357
20	సిద్ధేంద్ర కళావైభవం	చిందు లొలయు	358
21	సన్యాసి ఉపగుప్త	సన్యాసి ఉపగుప్తుడు	359

	గేయము.	తొలిపంక్తి	పుట.
22	మేలుకొలుపు	చిత్తమెచట	362
23	కస్తురి లేడి	దిగ్భ్రమతో	363
24	రవీంద్ర శత వర్షోత్సవోపహారము	ఓ విశ్వకవీ.	364
25	భ్రూమధ్యరేఖ	పుస్తకాల అలమర	367
26	దుందుభి ఉగాది నిమికులు	జరిగాయుగాదులెన్నో	369
27	ఒక ఉగాది గేయం	వచ్చిందా	372
28	ఉగాదిపాట	ఏటా వచ్చే ఉగాది	373
29	ప్రబోధైకాదశి	లేవయ్యో	374
30	సంక్రాంతి పాట	వచ్చెను సంక్రాంతి	375
31	మకర సంక్రాంతి	తరలె ధనుర్విక్రాంతి	377
32	విజయ దుర్గానుగ్రహము	ఆరువదేండ్ల	378
33	వట వృక్షం	, మర్రిచెట్టునేను	379
34	మానవ వికాసం-'కంప్యూటర్'	పెరిగే విజ్ఞానపు	383
35	తెలుగుపాట	తేనెల్లు చిందేది	384
36	చిత్తూరు సుబ్రహ్మణ్యస్మృతి	తల్లి తెలుగమ్మ	389
37	దివ్యసీమ	గణనీయ	391
38	భారత భేరీ	మ్రోగిందోయ్	392
39	వందేమాతరం (కాశ్మీరం)	వందేమాతరం	393
40	సమతాగేయం	పదరా చేయిచేయి	394
41	ఆంధ్రోదయం	స్వరంబెత్తి పాడరా	395
42	ముక్కోటి కంఠాలు	ముక్కోటి కంఠాలూ	396
43	కదిలే నవపరిధులు	అదిగో నీ చిరస్వప్న	397
44	తెలుగుపాట	ఎక్కడెక్కడ	398
45	సమైక్యగీతి	మనజాతికొకే గీతి	399
46	ఆసియా స్వతంత్ర	ఆసియా స్వతంత్రజ్యోతి	401

	గేయము.	తొలిపంక్తి	పుట.
47	త్రివర్ణరాగం	మనభారత రథకేతనమున	402
48	స్వర్ణపథ	ఎగువరక్తచ్ఛాయ	403
49	భావవారాశి	రారమ్మా	404
50	ఆంధ్రకేసరి	ఏరీ సీసరీ	405
51	అభ్యుదయభాంతి	అమ్మారో అభ్యుదిత భాంతి	406
52	రౌద్రవాణి	వింధు మొక	407
53	శాంతిగీతి	ఆది	408
54	కర్బియాంగ్	రండి కర్బియాంగ్	410
55	సెలయేరు	ఓ కొండమీది సెలయేరా!	412
56	రజతోత్సవగీతం	అదిగో చిన్న సెలయేరు	413
57	చీకటివెలుగుల సహజీవనం	కలకాలము	415
58	విస్ఫోటనం	భూభారం	417
59	అమెరికా యాత్ర	నాబాల్యసఖుడు	419
60	స్వరలహరీలోల	స్వరలహరీలోల	428
61	రంగవల్లి	కమనీయమైనట్టి	429
62	రాగిణీ గీతి	ఏలి వింగీ	430
63	చుంగుల పరికిణీ	ఝంగని కింకిణీ	431
64	సంతపాట	రాసోదర	432
65	ఏదిప్రగతి	ఏదిప్రగతి	433
66	లక్ష్మమ్మ కథ	అటోఇటో ఎటుపోవుటో	434
67	ప్రభంజనగీతి	నివాత శూన్యస్తంభం	435
68	యుగళగీతి	ఏమంత తొందర	436
69	గాలిబ్‌గజల్	ముంగిళులు	437
70	నిరీక్షణం	ఎదురు చూడడమదెన్నాళ్ళో	438
71	మంచుమల పాట	ఇది ఉండమట్టుకునే	439
72	చెలువుడు	చెలువుడు రాడేలనే	440

	గేయము.	తొలిపంక్తి	పుట.
73	రావె పక్షీ	రావె పక్షీ	441
74	దేశవరాళి	చాయలకే	442
75	అరుణరశ్మి	మెఱుపో	443
76	మరో మొహెంజొదారో	మరుగుపడిందొక మహీధరం	444
77	చండీదాసు కీర్తన	వినరె వినరె	445
78	కోకిల ప్రియ	కొనవ్రేళ్లా	446
79	కైశికీ చక్రవాకం	ఇం దేకతమ	447
80	సాటిలేని ప్రణయం	ఎవరువిన్నారు	448
81	యుగళగీతి	మనప్రేమ	449
82	స్వైరిణి	కదలిపోవునదే	450
83	నను చూసి నవ్వేరే	నను చూసి నవ్వేరే	451
84	మనసౌనే ఓరాధ	మనసౌనే ఓ రాధ	452
85	నాదమహిమ	వీణా! ప్రియవీణా!	453
86	నా వీణ రుతి	చూడచూడ దగ్గరై	454
87	మూసీపై వలపు వంతెన	మెలకువలో తీయకలో	456
88	జాజిసుందరి - ద్రాక్షసుందరి	రమ్య మధుర	457
89	శాంతిపథం	వెలుగుపాయో	458
90	తరుణులకు సంతరణ మార్గం	హింసాయుతము	459
91	పూర్ణిమాత్రయం	వైశాఖపూర్ణిమ	460
92	ఓ నా బంగారు బంగాళమా	ఓ నా బంగారు బంగాళమా	461
93	ప్రణయ బంధసేతువు	దక్షిన్ దివ్యభూమి	463
94	బాలమురళీషష్ట్యబ్దాభినందన	గురుపరంపర	464
95	విశ్వయానం	ఓమిత్యేతదక్షరం	465

నా స్వేచ్ఛకు మొదలూ - తుదీ

నే చేయునదీ నే చేయనిదీ
సాధించినదీ ఫలియించనిదీ
నీ యిచ్ఛలేక జరుగదట
నా స్వేచ్ఛ మొదలు తుది యెచట! ॥నే చేయునదీ॥

నిను చూచుటకే రప్పించితివీ
నీ దరిసెనమే యిప్పించితివీ
యీనోట పాట పాడించితివీ
యిది ఎవరి రచనయని యడిగితివీ ॥నే చేయునదీ॥

నీ భావనమే నాజీవనమై
నీ ప్రణయమ్మే నాకవనమ్మై
నా అహాపుటంచు చెరిపించెదవో
నా ఇహము పరము గావించెదవో ॥నే చేయునదీ॥

నాదామృతమే పరసాధనగా
నీ దివ్య వాక్కే ఉద్బోధనగా
ఈ రజని కాంతు లీలయించెదవో
విశ్వ జనహితము వెలయించెదవో ◆ ॥నే చేయునదీ॥

(మే 1965)

'ఓం గణానాంత్వా గణపతిం హవామహే'

జనగణముల తుష్టికి సంవత్సర గణాధిపతి వగు నీ సంతుష్టికి
హోమము నీకె గణాధిపా ॥

భూమండల ప్రదక్షిణ గతిలో
ఈ మహా విహాయస వ్యాపృతితో
విశ్వపరీత ప్రణవాకృతిలో
సుస్వర గీతి హోత్రుడగు నీకే ।హోమము నీకె।

గాత్ర సనాతన మంటపమ్ములో
చిత్రీకృత సర్పరంగవల్లిక
నాభికేంద్ర ప్రజ్వలత్ కుండమున
హృదయ పాత్రలో కంఠ దర్వితో ।హోమము నీకె।

ఏకం ద్వే త్రీణి చత్వారి యని
భావరాగలయ భాషా యుతమౌ
అస్మత్ కృత గేయాజ్య ధారతో
రసనాగ్ర ప్రస్ఫురత్ జ్వాలతో ॥హోమము నీకె।

అహంకార హరిత పత్ర దళములు
అవమానాశ్రుకలిత తోయమ్ములు
మొగ్గలై మిగులు కోర్కెల పూవులు
ఒగ్గిన పండెమ్ముల సత్ఫలములు ।హోమము నీకె

స్వప్న నిర్మిత విరాడ్జనమూర్తీ విశ్వేశ్వర భువన భవన వర్తీ
గౌరీ జననీ నయనా నందా దూరీకృత సకలవ్యసన కందా ✧

॥హోమము నీకె॥

(ఆగస్టు 1984)

గురుప్రశంస

వరనారద గురునకు, త
ద్గురునకు, గణపతి కుమార గురునకు జేజే
సుర రక్షో గురులకు, కవి
వరగురు వాల్మీకికి, తరణి భవులకు జేజే!

ఎందరో విద్యాగురువరు
లెందరో సాహిత్యమర్మహిత బోధకులా
యందరిలో లక్ష్మీకాం
తుందలచి ఘటింతు కేలు దోయిందలపై ॥

సాహిత్యచరితలో జంటకవుల పంట
ఆంధ్రికి ప్రత్యేకమైనదంట!
ఆధునికాంధ్రాన ఆదికవుల జంట
తిరుపతి వేంకటేశ్వరుల దంట !
మలికైత రీతుల తొలిపంట వేంకట
పార్వతీశ్వర కవిద్వయము దంట !
తొలకరి కైతల మలిపంట పింగళి
కాటూరి కవి యుగ్మకమ్ముదంట
ఒక్క కవుల జంట ఒకరికి పుత్రుడ
ఒక్క జంటలోని ఒకరి శిష్యు
డగుట రెండు జంటలందున మిగిలిన
తండ్రి, గురుని, భక్తి దలతునెప్పుడు

సాంతాభ్యస్త విశిష్ట వాఙ్నిచయులౌ
ఛాత్రుల్ స్వతంత్రుల్ కృత
జ్ఞాంతే వాసులు పూజ సేతురు మహో
పాధ్యాయు సారస్వతా
భ్యంతర్లీన రసప్రసన్నుని వచో
భావార్థ సంపన్నుడౌ
కాంతున్ మద్గురు నర్ఘ్యపద్యమణిము
క్తా పుష్ప హారాళితో ।

ఎగ దువ్వగా వంగ కెగయు పట్టుతురాయి
వలె నిల్చు తెలికేశముల బెడంగు,
నిడుదైన నొసటిపై నిలువుగా దిద్ది తీ
ర్చిన యెఱ్ఱ చాదు వాసనల సౌరు

మడత పెట్టిన బెట్టుమాయని నునుపట్టు
బంగారు పొడవు జుబ్బా పసందు

చలువచేసిన సన్నతెలినూలు పొందూరు
మడుగు దోవతి పింజె మడులతీరు,

నయనముల దాలుచు సులోచనముల మెరపు
కంఠమున వ్రేలు గ్రైవేయకమ్ము తీవి,
వేదికల నిల్చి నటియించు విగ్రహమ్ము
గురులకు గురుండొ, మారు శ్రీ కరుడొ యనరె !

వేలకొలది పత్రంబుల వ్రాలు చేర్చి
గంపలను బండ్ల నింపగా గాదు కైత
జ్ఞానదుగ్ధంపు మీగడ సారమెత్తు
పల్కు-మిన్కుల మలి కవిబ్రహ్మ తానె !

ఆచార్యోత్తములుద్భవింపగ, తదీ
యాధ్యాపకాసక్తి, ప్రా
గ్వాచో దక్షత నాంధ్ర వేంకట నర
స్వత్యగ్ర పీఠంబులన్
ప్రాచార్యత్వము నిర్వహించిన యధ్య
క్ష ప్రాభవుండట్టి బ్రా
హ్మాచారుస్తవ గణ్య పుణ్య గురు ల
క్ష్మీ కాంతు పూజించెదన్ !

తెలుగు మాగాణి తెన్నుల జానుదనమొల్క-
తొలకరి ముత్యాల గిలకరించె,
మమత యంటని ప్రేమ మానవాళికి పంచు
సౌందర నందన శాఖి నాటె
అపరోక్ష దైవమౌ ఆదిత్యు గొనియాడి
ధరణిపై తేజోంహరుల నింపె
మధుర పండితరాజ మస్తకన్యస్త శ్రీం

గార గంగా తరంగాల తేలె,
ప్రాచ్యపాశ్చాత్య సాహిత్య పద్ధతులను
మేళవించి విమర్శ పథాల జూపె
ఆంధ్ర వాఙ్మయ చరితంబు నవల నెవరు
చెప్ప, వ్రాసిన దది గురుయాచ్ఛిష్టమె కద !

భారతాకాశవాణిలో ప్రభుత మీర
ఆంధ్ర గీర్వాణ కార్యక్రమాల నడుపు
నవసరాన సహోద్యోగ మాచరించు
కీర్తి తన శిష్యులందు నాకే లభించె !

తిరుపతి వేంకటేశ్వర సుధీకృత నాటకిరాజియందు మా
గురుడు ప్రధానభూమికల గుర్వనురక్తి ప్రశస్తి నందడో
సరసత వాయువీథి పలు సంస్కృతనాటికలందు నన్ను తా
పరవశపౌనటుల్ బహుళభంగుల తీరిచి మోదమందడో !

సర్వ భారత రాష్ట్ర సాహిత్య పరిషత్తు
కార్యనిర్వాహకాగ్రణుల మించె
ధీ చాతురుల సర్వదేశ సమ్మాన్యులౌ
గ్రంథ ప్రణేతల గారవించె ;
విశ్వవిద్యాలయ విబుధవర్గంబుల
నగ్రాసనాధిపత్యము వహించె,
ఆంధ్ర భాషా మహోద్యానమ్ము ఫలపుష్ప
భరిత నిత్యవసంతవనిగ పెంచె,
సభల, పరిషత్తుల బృహస్పతి యెవండో
కళల కావ్యప్రశస్తి భార్గవుడెవండో
అట్టి శ్రీనాథ చింతన స్వాంతు నమల
రశ్మిమంతు లక్ష్మీకాంతు ప్రస్తుతింతు !! ❖

(సూజీవేటు 29-1-1967)

సుమాంజలి

(కాటూరి వారికి)

తొలికారు క్రొమ్మెరుంగుల మబ్బు జంటలో
నొక మబ్బు తొలిమబ్బు నొరసికొనెనె ?
సౌందర నందన శాఖికాద్వయినొక్క-
మ్రాకు నందనవాటి మునగ చనెనె !
పౌలస్త్య హృదయ తత్త్వ జ్ఞాన సందీప్తి
లీనమయ్యెనె రామబాణ భక్తి?
కులహీనులను చేదుకొనగోరు గుడిగంట
చేరెనే తానె శ్రీదారుకొల్వు?
గూఢమై రూపమెత్తిన గాఢమైత్రి
ఒడలు దాల్చిన శాంతి పెల్లుబుకు భక్తి
యశము కోరని దీన సాహాయ్య రక్తి
అయ్యెనే అట్టిగుణకీర్తి అమరమూర్తి?

ఏ యమృతమూర్తి సన్నిధినింతనిలువ
ఆయురానంద సారస్వతాంశ పెరిగి
మాధ్యశుల జీవితములు సమగ్రాస్యములగు
అమ్మహావేది అవధిస్థలమ్మెయింక!!
సమితులకాడమీలు పరిషత్తులు శూన్యములైన యట్లు తో
చు మధురమూర్తి నీదగు ప్రమోదనమందగరాని, యింతలో
అమరకవీ, అనారత మకుంఠితమైన త్వదీయ సేవయిం
కమరక ఆంధ్రవాణి అమితాప్త వియోగ విషాదమందెడున్ !!

సక్తుడవుకావు కా వనాసక్తుడవును
లోకవృత్తంబునను పారలౌకికతను
ఇదియు సాజమ్మె ఋషులౌ కవీశ్వరులకు
ద్వైతమందునకల్గు నద్వైత సిద్ధి!

ఒకటి మాత్రమునిజము నాయూహ నీ యు
దాత్త సంస్కృతి, సంస్కృతమైన నీయు
దార సుందరవాణి పెద్దలగు తిక్క
నాది కవి వల్లభుల స్ఫురణకును దెచ్చు!

కవి యగునొక గురునకు బా
వవు, నింకొక గురునిజంట వాసిగనిన యో
కవిరాజ పూజ్యుడవు నా
కవుదువు గురువరుడ విదె మదంజలి గొనుమా!

ఒక కవుల జంటలో నొక
రికి పుత్రుడ నట్టిదే మరియు నొక జంటన్
ప్రకటముగ నొకరి శిష్యుడ
నుకదా తత్సముడ నీకునున్ గురుదేవా!!

ఏదయ్యా ఆ 'దరు' వని
ఆదరమున నన్ను పిలిచి యడుగగ పాడిం
దే దయువుగ నే పాడగ
మోదమ్మందెడి గురూత్తముడు మరిలేడా!

వేల పొగాకు పోరమును చీల్చుచు చిర్నగ హాస్యమందు హం
దా తనరింప ఆస్తికని తల్లజుతోడనో శిష్యుతోడనో
కైతలఁగూర్చి, లోకము ప్రకారము నెంచుచు ముచ్చటింప నీ
కే తగు వేంకటేశ్వర కవీశ్వర! కై కొనవే సుమాంజలుల్!!! ◆

ఆదిభట్ల నారాయణదాసస్తుతి

ఒక చరణంపు టందె పురుషోచిత తాండవశైలి చిందవే
యొక పదనూపురమ్ము లలనోచిత లాస్య విలాస మంద నీ
వొకడవె వాచికాభినయ మొప్పుగ పాత్రలు పెక్కుఁదాల్చి, నా
టకగతి యక్షగానముల డక్కఁగనేలితి దాససద్గురూ!

యక్ష గంధర్వ కిన్నర ప్రేక్షణముల
స్వర్గము సివారుల కథా ప్రసంగములను
రంగవేది సంగీత నర్తన చణత్వ
మమరులనుగూడ కైవల్యమందజేయు
గురుభరతుడవో, నందివో, గిరిజ పతివో!

తరుణగోపాలు చిన్నిపాదమును బోలు
లేతపాదాన తొలిగజ్జె మోతమోసి
చిన్నిగొంతు నాదబ్రహ్మ చేర బిల్వ
పాటగా వార్చి నూరేండ్లు దాటెనయ్య!

శారీరమున్న వస్తాదులు వరవడి
తీర్చుకోదగు మేనితీరు నీదె,
శారీరమున్న ఉస్తాదులు సాధించి
చేరుకోదగు గొంతు సొరు నీదె,
వైదుష్యమున విదాంవరులు జన్మలనెత్తి
చదువుకోదగు పెద్ద చదువు నీదె,
ప్రావీణ్యమున కళాపరులు పురాముక్కి
తమున పొందెడు భరతమ్ము నీదె ◆

గురు ద్వార మధు ఝరి

ఒక సన్నని మెరుపు తీగ, ఒక తిన్నని వెలుగు రేక
మంద్రమధ్య తంత్రుల రెండింటి బదులు మోతలు !
మానవ గాత్రంపు మంద్ర మధుర ఝంకారం !
వాయులీన దక్షిణహస్త ఘటిత ధనుష్టంకారం !
వినిర్గతవామకరాంగుళీ త్రిస్థాయి స్వర్ఝరోంకారం !
నాదమాధురీ గురుద్వారం, మోద మధు ఝురీ
హరిద్వారం !!

ద్వార హృదయరస సంపత్కార ముక్తికి
పరవశము కాని దెవరి సంగీత శ్రవణ భక్తి
శ్రీ వినాయకుడో శ్రీ సరస్వతో, శ్రీ వరలక్ష్మో, సీతమ్మో
శివుడో, మాధవుడో, తారకనాముడో క్షీరాబ్ధిశయనుడో
ఐహిక సర్వ విముక్తి, ఆముష్మిక లక్షణ స్ఫూర్తి కలిగించే
వాయులీన నాదతనువులై, స్వరరాగసుధారసయుతులై
రూపుదాల్చిన స్వరావతారులు సకల జనావళి ఇష్టదేవతలు !
అల్లనల్లన అల్లుకునే మంత్ర మోహనావ కిరణాలు
వంపువంపునా తెంపులేక ఇంపుల లోకేశ శబ్ద సంపుటాలతో
సాగిపోయే సాంప్రదాయిక రాగఝురీ తరంగాలు
సాహిత్య రసానుభూతి మరందాలు !
ఘూర్ణ మనః పతిత పదావలీకలితాలు !

వాగ్గేయకార గురురాగాక్షర భావభరితాలు !
పక్షికిలకిలా జిత రవళితాలు, తాన సంతాన లయోన్మత్తాలు !
తంత్రీ హుంకార జృంభితాలు !

కల్యాణీ, కమాచీ, కాంభోజీ, బిలహరీ,
బేగడా, దేవగాంధారీ,
వాగధీశ్వరీ, వరాళీ, శహానా, వాచస్పతీ,
భైరవీ, శుభపంతువరాళీ, ఆనందభైరవీ,
ముఖారీ, కానడా, కాపీ, హిందోళమూ,
రక్తిరాగాలూ, ఘనరాగాలు, సర్వస్వరప్రసంచారాలు,

వివాది స్వర దాటుప్రయోగాలు, ఎగుడుజారుల నయలీనతలూ
దిగుడు జారుల ఘన గంభీరతలూ
గురుదేవుని కమాను విమాన చాలనాలూ
తాన మాధురుల తంత్రులపై చిందులూ గంతులూ

శృంగారంలో అతిసుకుమార సోయగాలూ
భక్తిలో భావతన్మయ గాంభీర్యాలూ,
పల్లెపదాల పల్లీయుల గొంతుల పరువాలూ కలరుతాలు
సాంప్రదాయిక వర్ణాలంకార సుగమకరంజక స్వర సంపుటాలూ
కర్ణాటక సంగీతపు గత్తులు, గమ్మత్తులు
అన్నీగురుదేవుల కమాను సొత్తులు !
రసానంద పద ద్వారపరివేష్టిత రక్తి తన్మయాసక్తులు
నిత్యజీవన్ముక్తులు !!
అది గురుదేవుని పురాకృత తపస్సు !
శిష్యకోటికి నిరంతరాశీస్సు ! ◆
(ద్వారం వెంకట స్వామినాయుడు స్మృత్యంజలి)

ప్రణతి

(శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మకు)

సిరులమ్మ పదవీ ప్రసిద్ధి చేకూర్చి
గైరమ్మ బహుజన గౌరవమ్మునొ

చదువుల తల్లి వాత్సల్యమ్ము మీఱ
ఇరుప్రక్క క్షీరమ్ము లెలమి గ్రోలించె
ఒకధార గాంధర్వ ముద్దీప్తమయ్యె
ఒకధార సాహిత్య ముద్వేలమయ్యె।

నారదు నపరావతార మాతండె,
తనువు దాల్చిన శారదామూర్తి యతడె।
స్వరరాగ పరిణామ చారిత్ర వేత్త
వివిధ ప్రబంధ ప్రవీణు డతండె।
ఆంధ్ర సంస్కృత కన్నడాది భాషలను
సంతతాధ్యేతయౌ సద్గురువతడె

తెలుగుకైతల తేనె తీపిని మరిగి
కన్నడ కస్తురి గంధమ్ము నెరిగి
సంస్కృత ప్రాకృత సాహిత్యమర్మ
ధర్మాల సూక్తి బద్ధములుగా చేసె।

ఏడుకొండలవాని కెన్నియో వేలు
పాటలల్లిన తాళ్ళపాకాన్నమయ్య
సంకీర్తనా చార్య సత్కృతులెన్నొ
రాగాలకెక్కించి రక్తి ఘటించె

కట్టమంచి మహాత్రప్రగాఢ బంధమున
విశ్వ విద్యాలయ విబుధ విఖ్యాతి
మేధానిధికి నర్మ మిత్రుడై తాను
సరస వాఙ్మయ విమర్శల త్రోవదీర్చె॥
సారస్వ తౌచిత్య చర్చలగాని,
సంగీత రసవాద సభలనూగాని,

రాష్ట్రమ్ములందు కేంద్రమునందు తాను
పదవి గ్రహించని పరిషత్తులేదు!

ఉభయ బాంధవ్య నిరూఢి సాధించు
భార్గవుడో, బృహస్పతియో అతండు!
తీర్చిన సింధూర తిలకంపు నిడివి,
పట్టు దోవతి, జరీ పట్టు పైబట్ట;
బక్క- పల్చగ నిల్చు భాగవతుండు

తీయగా చేదైన తెలిపెడు వాగ్మి!
చూచిన పొడవుగా తోచడుగాని
తలపులో మాటలో తన యెత్తుపైకె!
ఎఱుకలో నలుగడ లెసలారు వెల్గు
పచ్చని యొజ్జని పైడి మైచాయ;
చల్లని మెల్లని చందురుకావి
నెయ్యంపు చిఱునవ్వు నెలకొను మోవి,
అవని అంచులు దాటునట్టి పై చూపు-;
అన్నింటి పరమార్థ మరయు లోచూపు!

నియమ నిష్ఠలు తప్పనివి నిత్యవిధులు,
నిరత విష్ణుధ్యాని, నిరతిశయుండు!
రాళ్ళపల్లి కులాబ్ధి రాకాశశాంకు
డతడనంతా పరుడగు కృష్ణశర్మ

వేయి నెలల నిండు ప్రాయంపు పూర్ణచం
ద్రునకు విద్య దుత్తమునకు నతులు;
తెనుగు తల్లి ముద్దు తీరుచు సుతునకు
ప్రవాసితాంధ్ర పౌరప్రణతు లివియె!! ◆
(చింగుటూరు సభలో చదివిన కవిత, 1977)

దేవులపల్లి

ప్రమదమౌ సాంబ్రాణి ఘుమఘుమల్ వెదజల్ల
కాకపక్షాలు ప్రక్కలకు తేల,
తరచైన పునుగు అత్తరు సువాసనల జ
బ్బాసయి తెలివెల్లైనాటు వ్రేల,
ఇరువైపులకు వంపులెసగ కట్టిన పింజె
లెసలారు ధోవతి పసలుమీర
చుట్టు గాయకకవి స్తుతి మతులొప్పగ
కొల్వుచేసెడు శిష్యకోటి చేం,
శ్రీఖండ మృదుధూమరేఖా పరీవృత
శారదాలయ చంద్రశాలయందు,
హిమ తోయ ఘనసార కమనీయ పరిమళాం
చిత విశ్రాంతిక సుఖాసీనుడగుచు
నన్నపార్యాది నానా పురాకవినాథ శిల్ప తత్త్వ విచార కల్పనముల

నవయుగాధిపతి మానవుకేతనము దిక్కు-
దిక్కులకెగిరించు దీర్ఘదర్శి
అట్టి కవియోగివంద్యుడు, అట్టి రాజలోక
మాన్యుడు, అట్టి మహాకవీంద్రు
డట్టి బహుజన హిత వక్త - యరిగె దివికి।

తన భావనవాటి నవలెత్త చివురొత్త
రేలుపవ, ఝిల్లికాలమొకటె।
తన వాక్సుధా వల్లరిని తోగ నెదలూగ
వీధి, లోగిలి, సభావేది యొకటె!
తన స్నేహకళిక వెల్గున ముగ్ధ తపించంగ-
కవులు పామరులు సచివులు నొకటె
తన గీతి ఝురుల తీయన దోప తలలూప
వాయువీథి, సినీ యవనిక యొకటె।
తానుముట్టని నిత్యనూతనత లేదు;
తన్ను తాకని నవమహోద్యమములేదు;
తలపులో పల్కులో ఉదాత్తతకు గురుడు
కేవల కవీశ్వరుండె మా కృష్ణశాస్త్రి!!

స్వర్ణ గళపేటి శస్త్రవిచ్ఛిన్నమయ్యు
పక్ష భంగమ్ము నొందదు భావ విహగి,
విశ్వమైత్రి దుగ్ధలవమ్ము బీయుచోని
లేఖినికి గడె విశ్రాంతి లేకపోయె।

ఓ మహాగేయ శిల్పి, ఓ ఉజ్జ్వలాత్మ!
నీవు సామాన్య మానవు నిశితకష్ట
విష్టురాల్ నీహిగా నెంచ, నిఖిలలోక
హృదయభావాలు శాశ్వత రుక్కులయ్యె!! ❖

గేయపూజ

(బాపిరాజుకు)

ఓ ! రాజా కవిరాజ ! శశికళా సౌమ్యతేజ
ఇదె రజని గేయ పూజ ! అందుకోవయ్య అడివిబాపిరాజ ॥

॥ ఓరాజా ॥

ఒకకేల కుంచె వంచి పెరకేల కలము నుంచి
అలవోక నాంధ్ర జగతి వెలలేని వర్ణరాశిని వెలయించితి

॥ ఓరాజా ॥

నీ చూపు చొరనిలోతులు, నీ ఊహపోని యెత్తులు
భావంపు పరువు చేరని దూరాలు
లేవయ్య నీవు కానని అందాలు ॥ ॥ ఓరాజా ॥

ప్రతి యెడద దివ్వె వెలుగు, ప్రతిమనస్సుమపుతావి
వెలిగించె నీ యెడంద స్నేహరసము,
విరియించె నీ మనస్సుమనోరజము ॥ ॥ ఓరాజా ॥

ఎండిమియాను నీవె, ఎడొనీస్ ప్రేమనీవె
ఎనలేని ప్రణయ గీత శిల్పి నీవె !
ఆ ఆర్ఫియస్సు అమరవీణనీవె ! ॥ ఓరాజా ॥

నీ గీతల ఒంపులలో, నీ రంగుల యెంపికలో
నీ మాటల సొంపులలో నీ పాటల ఫణితులలో
సకల కళా సమ్మిశ్రిత భరతనాట్యరంగము
సృష్టికి ప్రతిసృష్టి, అమరలోక యక్షగానము !!

ఓరాజా కవిరాజా ! శశికళా సౌమ్య తేజ
ఇదె రజని గేయపూజ, అందుకోవయ్య
అడివి బాపిరాజా !!! ◆

సంగీత గంగోత్రి

(సంగీతోత్పత్తిని గూర్చిన గేయం)

నాటకురంజి - ఆదితాళం

ఆదిమ నరుడే హరుడేనో, ఆదిదైవమే శివుడేనో।
అక్షరమాలకు సప్తస్వరాలకు
హరుని డమరు లయ జతులె ఒరవడులో ॥
కైలాస మేరు కందరాలలో తాండవ మాడే నటరాజే
డమరువాద్య మనోహారి పురారి
డిగిడిగి డిం . డిగిడిగి డిం .. డిగిడిగి డిం .. డిగిడిగి డిం ..
గజ చర్మాంబరధరుడేనో ॥ఆదిమ॥

బ్రహ్మ విష్ణులకె పరీక్ష పెట్టిన ప్రథమ దైవత మ్మతడేనో
ప్రథమ మనుజ సంఘమున నాటవిక
శాంబరీ భిల్లు డత డేనో ॥ఆదిమ॥

మూలా నక్షత్రమె జగజ్జనని మూలాధారమ్మగు నెంకో
సహస్రారం సంస్థి తారుద్రయే రుద్రదైవతమునకు కొలువో ! ◆

॥ఆదిమ॥

నవగ్రహ స్తోత్రం

రాగమాలిక రూపకం

పల్లవి. ధన్యాసి

స పమ గమపా । ప పని సరిసా । పని సరిసని దప ।

న వ . గ్రహ స్వ రూ పుడౌ నా. రా.... యణు

మగ గపమగరీసా; । మనిపప మగమా పని సస సని సగరిరిసా ॥

న. కు న.తులు శి. వుం ..డు బ్ర హ్మయును లా . .నె

సామగరిస । సనిదప మాదపమగ రిస ॥

సృష్టి స్థితి ల. య. కా . . . , రుడు

చిట్ట స్వరము

గా, మపని । పా నిసరిస । పనిసదాప మపగారిస ।

నిసగా, మపనిసనిదప ॥ మపస్థ, పనిసగరిసని ॥ సగరిసరినిసా, పనిద ।

పదమపా, సగరిసరిని ॥ నవగ్రహ . . .

సౌరాష్ట్ర

, దనీస సాస ॥ సరిసనిదా నిదపా పమ । పాదని సనిదా నిదపా ।

ఆ.త్మ కార కు.డై . . వె..ల యు ఆ. . ది. . త్యుడు

మగపమగరి రిసారీ, ।, సరీగమా పాపమ। దా నిసరిస రీ।

జ. గ. . త్సాక్షి , ప్రత్య. క్షప. రా త్పు రు డౌ

దని సారిస నిస సనిదాపమ । పదనిస నిదపమ గరిసా।

ప్ర. భా.. క రున. కీ,..వె. నతు. లు..

ధా, నిసరి । గమపమగరి ।। గామపామ ।। దానిదపా ।

దా నిసరిస- నిసదాపమ ॥ ధాపమగరి గమపమదని ॥

సగరిసరినిసా (ధన్యాసి)

నవగ్రహ స్తోత్రం

ఆసావేరి

రిమరి మపప, దపా మపాదసా । సరినిస పదమప మ పాదప ॥

మనః కా. ర కుడు షో డశ మం. జు ల. క ళా

పమ గగరిసా ॥, రిమపద మపమరి గ ॥ రిసా రిమపదా ॥

.. నిలయుడౌ మాత్మ. మూ..ర్తి శశి ర.జనీ

మనోహరునకు నతులు

సరినిసాప పదప ॥ రిమపద పమగా రిసా ॥

మ.నో..హరున కు - నతు లు

సగరి సరినిసా, - (ధన్యాసి)

రిమరిమపా, దపా నిదప । మపదపామ । గా,;రిసా॥

రిపమపమరి గారిసా ॥ రిమ రిమ పమ పాదసారి ।

సగరి సరిని సా; - (ధన్యాసి)

సురటి

, రిమా పనీ నీ ॥ నినినీ దని ॥ సాస సస నీనిద । సాప పనినిమపా ॥

వి . క్రమకా రకుడు గ్రహ క్షేత దా..యు. కుండు కు. జ..డు

, మపనిస, రీమగ. । రిస నిస రీ,మ ॥ రిససా సనిరిస నిదపా ॥

భా. త్మ. సౌ ఖ్య కరు డం గా . ర.కు న.కి. వే .

మ పా, ద పమమాగ రీ, ప ॥

న   తు. లు. .   .

మా, మాగ । పపమరీ । మరిసనీసా । రిమపపపా ।

మాగ పామ సీదపా, । మపమగరిస రిమపనిదని । ◆

ధన్యాసి చిట్టస్వరం పాటవెను

నాటకురంజి :

, దనిసా సా ససి ॥ దని రిసనిద మానుగ । రీగ మపమగసా ।

• కా వ్యశిల్ప గణి తా... ది క.॥ కారకుం...డు

ససనీదసీ సాస ।, సనిసా సామగమా ॥ సిదనిప దనిసా దనిసరి ॥

ప.ం .డి తుండు సౌమ్యు డై .న   బు.ధు.డు. . చం ద్ర.

గపమగసా ససనిదమగ ॥ రిగ మపమగ సా ॥

సు. తు.న కి. వే...   నతు లు... ..

సా, రిగమ ॥ నిదని పదని ॥ సనిదమగరి । గమప గరిస ॥

మగసనీద సీసరిగమా । నిదమగమా నిదని పదని ॥ ధన్యాసి

॥ సగరిసరిని

అఠాణ :

, పమ పసనా । సనిరీ సా నిసరిమ । రిసస్తా సా సనిరిస ।

. వి ద్యా దా య కు డు వే.ద.   వి.దు డు ప్ర.త్ర

నిదపా దదా పద ॥, నిదా నిసా రిమ । రిసనిప పదనీ పరి ॥

క.రు డును సం   ప. ద్యశః ప్ర   దా .. య.కుడు బృ

సా.రి సనిపద సనినీ ప ॥ మాపద పమరిమ సరీస ॥

హ. స్ప.తి కి. వె   న తు. లు. . . . .

పమప గాప । పదనీపా మపరిసాస . నిరిసదా, ॥

మపదప నిసరిస మమరిస । నిసదా నిరిసపా మపరి ॥

సగరి సరినిసా (ధన్యాసి)

ఫరజ్

గమాదమా దనిస ॥ రిసా రిసా । నీ సరిసని దప ।
జా. యా కా.ర కుడు కళా శా స్త్ర.వి. దుడు
దపమగ మదమద । దసీసా, సీద । పా, దపమగమా ॥
క. వి మనో.జ మాయా మాధు రీ ప్ర.దు.డు
గమదని సరిసని దపమగ । పమగరి సా; ॥
భా... గ్య. వు. న. కు. న.తు. లు
సమగమదమ ॥ దని సరిసా । నిసనిదపా । మపమగమా ।
మగపమ గరిసని సమాగి । మదామ దనీద నిసాని ।
సగరి సరినిసా (ధన్యాసి)

యదుకుల కాంభోజి

, రిపమా సరిమ । పా దస దపా, ప ।, మప దదా దని ॥
సం.త. తక్షి కా ర. కుం డు దై. న్యతా వి.
నిసానిదా పదసనిదప ।, పద సాసా । సని సనిదా పద దపమా ॥
వా. . ర కుం డు. , ప. రైశ్వ ర్య దు.డు శ. నై..
పాదస దప మదపసమగ । గమ పాదసమగ రీ, మగరి ।
శ్రీ యు. న. కి. వే. . . . న. తు..... లు . . .
సారిమామ । మగమ పాప । మపదాదా ॥ నిసనిదపా ॥
మపదసాస పదసపాప మదప పమా సరిమపదా ॥
సగరి సరినిసా (ధన్యాసి)

రామప్రియ

, సరీగమా పా ॥ దా నిదపమ పా ॥ దమ పదాని ॥
, క్రమసో. పా నా త్త. మ. హో రా. జయోగ
సారి సాస ॥ , సరీగా, మా । గా పమ గరీ, స ॥
దాయ కుందు॥,సమశ త్రు ద్వే. ష హో రి

దనిసా సస నిద పాపమ । పదనిస నిదపమ గరిసరి ।
రా.. హా.వు. నకు. న.తు. లు.... .....
గామపామ ॥ పదనిదా ॥ పదనిసనిద ॥ నిదపమపా ।
పమపా ధపదని సనిసరి । గరిసనిదప మపదని సరి ।
సగరి సరినిసా, ... (ధన్యాసి)

షణ్ముఖప్రియ

,ఖరా సినిని రిస । నిరదా పా మా, పామ । పదపమ గరిగస ।
మోక్షదా య. కు . డు ఛా యా మూ, ర్తియువే
రిగమపా పధ ।,నిదా నిసస స। రిగగరిరి స । సనిరిస నిదసని
ధపపమ ॥
రాంతియువు..ణ్యక్షే త్రఫలప్రదుం. డు కే ... తు.వు.నకు
పదనిస నిదపమ గరిగమ ॥
న తు. లు. .....
పమగరిసా । రిగమపా । పదనిదాద। ॥ నిసరినిసా ॥

నిసనిగరిసనిదపమపా
ధమపాద పదనిస నిసరి - రామప్రియ -
దరిస దాప మపదసాస - యదుకుల కాంభోజి -
నిసాని ధప మధపమగా - ఫరజ్ -
మరిసమదప రిస నిసదా - అఠాణ -
నిసనిదమగ మపగరిసా - నాటకురంజి -
రిమరిమపమ పసనిదపా - సురటి
పదమపాప సరినిసాస - అసావేరి -
దనిస దాపమ దానిసని - సౌరాష్ట్ర
ధన్యాసిలో = సగరిసరినిసా, పనిద పదమపా, - సగరిస్తరిని ◆
॥నవవ॥

సూర్యస్తుతి

(నవగ్రహ కీర్తనలలో మొదటిది)

సౌరాష్ట్రం - అటతాళం

ఏడు స్వరములు మూడు స్థాయులు
ఏకబిగి మ్రోగేటి ప్రణవము
ఏడురంగుల గుర్రముల రథ
మెక్కి ముజ్జగ మేలు దైవము ॥సూర్యనారాయణ స్వామీ।
జోతలివె నీకు !!

మూడునెలవుల మేల్మి నీలో
చూడగంటి మయా సవితృడా !
మేలుకొలుపవె భర్గ మాలో
మేలుములను వివేక సంపద ॥ ॥ సూర్యనారాయణ స్వామీ ॥

ఆత్మ వై వ్యక్తిత్వ మిత్తువు
అబ్బ వై నడపెంపు నిత్తువు
రాజ వై పదవీ ప్రసిద్ధి, స
మాజకేంద్రక తేజమిత్తువు ॥ సూర్యనారాయణ స్వామీ ॥

సాలు వరియా యెండవానలు
సమయమున ముక్కారు పంటలు
ముంగిళుల శుభ్రత, నిరోగత
లోగిళుల సిరులిచ్చు, వేలుప ॥ ◆ ।సూర్యనారాయణ స్వామీ ॥

చంద్రస్తుతి

(అసావేరి - రూపకం)

వందన మిదె చందమామ
అందాలగనీ అమృతధునీ ॥ వందన ॥

మానస జాతుడవు చంద్ర
మా మానస కారకుడవు
మాతృ వత్సలతా సుధా
మాధుర్య ప్రదాత వీవు ॥ ॥ వందన ॥

కేళికలకు వనౌషధీ
మూలికలకు వికసిత సుమ
మాలికలకు చిత్రశిల్ప
తూలికలకు పాలకుడవు ॥ వందన ॥

నిశల చలువ వెలుగుల రజ
నీ కాంతుడవై యేగెదు
వెన్నెల చీకటి నెలసరి
వన్నె లద్దుదువు తలపుల ॥ వందన ॥

పడతుల పరువపు నెలవ
బంగరు మేలిమి కొలువ
కడలి యెడద అలల పొంగ
ఉడుపతి ! అంబికా పొంగ ◆ ॥ వందన ॥

అంగారక స్తుతి

సురటి - ఆది

అంగారక, మంగళకర, మంగళ
అవనీ తనయా, అంజలి నీకిదె ॥ అం ॥

భ్రాతృ సౌఖ్యమును జ్ఞాతి మైత్రియును
క్షేత్ర గృహాది స్థిరాస్థి ప్రాప్తియు.
నిర్విరోధ దంపతీ సౌఖ్యమును
సర్వ దరిద్రఘ్నుల నీవరములు । అం

అస్త్ర శస్త్ర సైనిక వ్యూహమ్ముల
ఆరక్షక సైన్యాధిపత్యములు
యంత్ర శాలల, రసాయన భౌతిక
తంత్ర వైద్య వృత్తులు నీ యుక్తులు । అం

ప్రచోదింతు వీవే మాక్రీడల
బ్రతుకు పందెముల వ్యాయామమ్ముల
వ్యష్టి సమిష్టి వివాదల దేశ వి
దేశ యుద్ధముల జయాపజయముల ॥ అం ।

ప్రజా పరస్పర విద్వేషాగ్నుల
ప్రకృతి వైపరీత్య విపత్తులలో
రక్త ప్లుతిలో ధ్వంసోధృతిలో
రక్షణ శాంతుల నిచ్చును నీదయ ◆ ॥ అం ॥

బుధస్తుతి

నాటకురంజి - రూపకం

స్తవము సేతు, బుధా, సౌమ్య
తారాచంద్ర ప్రణయ గమ్య ॥
సూర్యతేజ సాన్నిహిత్య సూక్ష్మబుద్ధి స్ఫులింగమా ॥స్తవము॥

కావ్య కల్పనల యెత్తు
గణితాంక జ్ఞత లోతు
లిపి లేఖన పటుత కూర్పు
నీకు జ్ఞ నామపు మహత్తు ॥స్తవము॥

రాష్ట్రకోశ నతోన్నతుల
ధాతు మిశ్రణోత్పత్తుల
వాయు భూతలాంభోనిధి
వణిక్సంపదల సమకూర్తు ॥స్తవము॥

చతోక్తి హాస్య ప్రవృత్తి
పుణ్య సంహితా ప్రసక్తి
సంచార నియుక్త సకల
సాధనాలు నీ వరాలు ◆ ॥స్తవము॥

నామ మహిమ

నిదురలో మెలకువలోన చెదురు మదురు
కలలలోన నేనను తెల్వి కదలి పోవు
గగనసీమాంతరాల చీకటి బయళ్ళ
వెన్నెలల యేళ్ళ పెనుగాలి విసురువడుల
మరపు సుడి గుండములలోన కరగువేళ
విందు పది దెసల్ మార్మ్రోగు వేల్పు పేరె
భూత భవితవ్య ప్రస్తుతములను కలిపి
తలపులో నిండి, నోరెత్తి తన్ను పిలువ
జేసి, తెలివొందునను ప్రక్క జేర్చునదియె

పరమ భక్తాంఘ్రి రేణు నమ్రతకు తోడు
ఈశ తాదాత్మ్య భావనా వేశమంది
తద్దయా పాశలగ్న హృదయము తోడ
తన్ను మనసారం గొలుతు బద్ధాంజలి నయి ◆

సదాశివుని ఉమా దాసత్వం

సూత్రధారుడు : వదలక యధరము వణకుచుండగా
ఉను కొడలు చెమట లోదవి తడియగా
ఎట్ట యెదుటకని శశి మకుటధారి !
అట్ట హాస రహిత రజతశిఖరి !

కర కమల చలిత డమరు నాదఝరి
దరస్మిత ప్రణయలహరి !
ఎటొ కదలగోరి యెత్తిన పాదము
ఎత్తినట్లె కుంచితముగ వంచి
శిల యద్ద మోచు కలిగి చిందాడు
సెలయే రటు శైలరాజ సుతకు
కదలగా వలను పడదాయె, నేల
కాలానదాయె శివునెదుట.
ఆదరపూర్ణమౌ హస్తమ్ము చాచి
అనురక్తు డై హరుం డనియె ని ట్లుమతో !

శివుడు : ఓ యవనతాంగి !
ఈ యదనునన్ త్వదీయ దాసుడను గానటే ! మ
దీయ స్వాంతము త్వదీయ తపమునకు
క్రీతమయి పోయె గాదటే

సూత్ర : వల్లభుపలుకులు వినినగిరిజకు
వదలిపోయె తీవ్ర తపక్లేశము
అనల్పసాధన ఫలించువేళ
అబ్బురముగ పునర్నవత కలుగదె ॥
(ఓ యవనతాంగి మొదటైన గేయానికి పాఠాంతరం)
అమ్మడైతి నీ తపస్సునకవనతాంగి
నీకు దాసుడైపోయితి నేటి మొదలు ॥ ◆

(కాళిదాసు కుమార సంభవము నుండి)

శ్రీ వెంకటేశ్వర కళావైభవము

ఆదితాళం

నాట రాగం

శ్రీ వేంకటేశ్వర! కళాపూర్ణ నీవలో కొలువనీ నిను సతతము
ద్వావింశతి పితృ మాతృ తత్త్వ కలిత ప్రణవ చైతన్య భరా!
పపని పనిసనిపమ పపమగ మమరిస
పనిసనిసస నిసరి గామ పమపా ।
గమపని స్వరీ.. మరిరిసా । సరిసాసా నిపనిమపాగమపని ।

గౌళ : ఆది పురుష యుగ యుగముల నుండియు
ఆసేతు శీతనగ సంస్కృతి ద్యుతి
శ్రీదయిత. త్వదానంద నిలయోజ్వల పతాక
వెదజల్లు వెన్నెలగ ॥

గౌళ : రిమపని సనిపమ రిగమరి సనిసా ।
పనిసనిసా - రిమపనీప మపనీ ॥
సనిసరీరి రిగమ రీరి సనిసా
సనిసనిపా పమ గమరీ రిమపని ॥

ఆరభి : పౌరజానపద జీవితానుభవ భావగరిమలఘుతరమ్ము సేయగ
పారహీన దివారాత్రయుత సంసార చక్రము ప్రదీప్తమై వెలుగ ॥

ఆరభి : దదపా మపమగరిరీ సారిసా సధసరీరి రిమ పదాద సనిదా ,
మపదసా, రీ, రిమగ రిరిసా దరిసనిదా దపమగరీ రిమపద ,

వరాళి : సప్తస్వర సుందరీ చరణ మణిదీప్త నూపుర రవళిలో, త్వదీ
యాప్త వాగ్గేయకర భక్త మౌని సంకీర్తన సహస్రార్చనతో
పపమగా గరిరి సనిదని సరిసా । సనిగరీ గామ పాపమ పదపా
పదనిసా, రీ, గామగరిసా రిసనిదా, దపమగా, మపదని ॥

శ్రీ పాంచ భౌతికము నీదు సృష్టి నీక్షించి మా
కాల్పనిక శక్తి విజృంభించ
షోడశ కళా రజనీకర ప్రేమ దృష్టితో నీవుమనుబ్రోవ ।

వరాళి : మపమగాగ దపమగారి సనిసా । గారిగా మపమ పదమపదా ॥
శ్రీ : రిపసని పనిపని సరిగరీ గరిస . నిసరిమాప సరిమపాని నిమపా ॥
ఆరభి : పపమగరీ, రి. దపమగ రిమాప । దసనిదసారిరి సనిదరిసా ॥
గౌళ : రిసని పామగమ రీరి సనిప నిస రిమపనీ పనిస రీసిసరిసాని ।
నాట : సరిగమ రిరిసని పమగ మపనిసా । సరినిసాని పనిమపామగమపని ॥
శ్రీ వేంకటేశ్వర ! కళాపూర్ణ సేవలో ... . ◆

సిద్ధేంద్ర ప్రస్థానము

శోభనపు రాతిరి పరారి
            చనెను సిద్ధేంద్రుడేయూరు?
విద్యారణ్యానతి మేర, పర ధర్మ విజేతలబారి
            ఆర్షధర్మరక్షణ కోరి, వారాహి కౌమారి గౌరి,
            కామాఖ్య మందిరము చేరి,
సన్యస్త గురువుల కచేరి
పండితులకు పామరులకు
            తీర్థమ్ముల, క్షేత్రమ్ముల
ఆసేతు హిమాచల జనులకు, శివ విష్ణుగాథలే ఏరి,
            భక్తినందించగా కోరి
జీవాత్మకు పరమాత్మతో
            చేరి పోవుటకు మరులూరి
శ్రీ గదితమై, భాగవతమై
            స్త్రీ రహితమై, నట మహితమై
నందికేశ భరతులదారి, కలాప కేళికలను తీరి
            యక్షగాన పరిణతి మీరి
తిరిగి కూచిపూడిని చేరె,
            ఔరారదా కరుణానిధీ !! ◆

సిద్ధేంద్ర కళావైభవం

(శందా ర్థాశీర్వాద దరువు)

చిందు లొలయు పదములు, కను
విందౌ భంగిమలు నుచితవేషము లొప్పన్
మంది యొదలలరు దరువుల
సుందరమగు కూచిపూడి 'శోభ' తలపరే !!

ఆంధ్రుల కళల యశము నిలుపరే !
లోకపు ప్రజతో మైత్రి నెరపరే !!

ముందు పన్నెండేళ్ళ కిందట
ముద్దుగా మీ గురుల బృందము
ఉత్తరా దక్షిణా పథ ప్రజ
నొక్కటిగ హృదయాల చొరగొన్న ప్రతిభ తలపరే !!

మన 'కూచిపూడి' పేరు నిలపరే !
ఆంధ్రుల కళల యశము తెలుపరే !!
దేశ దేశములతో మైత్రి గొలుపరే !!

భామ వేషమ్మాదిగాగను
పలురకమ్ముల నాటకమ్ముల
భారత ప్రభు గౌరవమ్మును
బడసిన గురువరులఘనమౌ ప్రతిభ తలపరే !

మన కూచిపూడి పేరు నిలుపరే !
ఆంధ్రుల కళల యశము తెలుపరే !
దేశ దేశములతో మైత్రి గొలుపరే !! ◆

(కూచిపూడికి అభినందనం, విజయవాడ - 1-7-71)

సన్యాసి ఉపగుప్త - వాసవదత్త

నృత్యనాటిక

సావేరి :

సన్యాసి ఉపగుప్తుడు ఒకనాడు
ప్రథిత మధురాపురీ ప్రాకార పార్శ్వాన

పవళించినాడు విర్లిప్తుడు, నగరాన
మారుతాహతి దీపతోరణము లారినవి
తలుపు గడెవడి గేహములు నిదుర కూరినవి
నడికి రేయిని శ్రావణాభ్ర మండలి చుక్క
మరుగు వడినది కారుమబ్బులో నప్పుడు

శుద్ధసావేరి : ఇంతలో నచట తోచె నెవరిదో
చెంతనే చరణ మాపురార్భటి
లేచె సగము సన్యాసి చకితుడై
త్రోసి కునుకు కుప్పసపు దుప్పటి
ప్రకాశించినది క్షమా రమ్య నే
త్రకోణముల దీప కాంతి యొక్కటి

వకుళాభరణం : అభిసరించునదె నగర నర్తకి - వ
యో విలాస భాసిత మదమత్త
తనువు పైని నీలిమేలి పారతో
ఝుణ ఝుణ మను చరణకింకిణులతో
యోగి వరునిపై అడుగు తడబడగ
ఆగిపోయినది వాసవదత్త ॥

ఖరహరప్రియ : కరదీపిక నెత్తి కాంచె । కమ్ర గౌర దేహ కాంతి
స్వచ్ఛ కపోలమున మెరయు చంద్రశీతలమగు శాంతి
కరుణా వికసిత దృగంత సౌమ్య హాస ముద్ర నింతి
కనుల నామె బిడియ మొలుక కలకంఠమున నిటుపలికె
'కుమార క్షమింపవో - మా గృహము పావనము సేయవా
ఎటుల యోగ్యమోశయింప - కఠినశిలా తలము నీకు'
యోగి జాలి తొలుక పలికె 'ఓ త్రిభువన సుందరీ
ఇంకా సమయము రాలే దీడేర్పగ నీదుకోర్కి
రాగలవాడను సమయము రాగానే నీదు దరికి' ॥

మేఘరంజని - <u>ఆది (మాయామాళవగౌళ జన్యం)</u>
పిడె హఠాత్తుగ వర్షమే ఘుములు
తోచె తటిత్తులు వడివడిగా

ధరిత్రి ఝుంఝుమా మరుత్తు అలమెను
తరుణి భయముతో కంపిలగా
ఆకాశంబున వజ్రనాద ఘో
రాట్ట హాసములు జడిగొనగా

వసంత : <u>ఆదితాళం</u>

వానలు వెలిసిన కొన్నాళ్ళకు పురి
లోన చైత్ర సంధ్య మెరసెను
పవన పోతములు పరువులెత్తినవి
పథ తరు శాఖలు చివురులొత్తినవి
వకుళ మల్లికా జాతులు గముల్తై
నగర వనమ్ములను విరిసెను ॥
(మృదంగ తాళధ్వనుల ముక్తాయింపు)

బహార్ రాగం - ఆది తాళం

మ్రోగె మురళి యెక్కడో దూరముగ
మృదంగ వీణా ధ్వనులు మంద్రముగ

సంతత కుసుమోత్సవ గతి మధువని
జనము తేలి రానందము గా ॥

నిర్జన నగరిని కనుగొని నవ్వగ
నిశ్శబ్దముగా నిండు చందురుడు
సాగు నెవడో ; ‌। ; ; - ;; ॥

సాగు నెవడో జన శూన్యపథమ్మున
చంద్రికా రాత్ర యాత్ర
తరుశాఖల ముఖరింప పికములు
తగు సమయమ్మని మనసున తోపగ
ఇపుడె సాగెనో అభిసరింపగా
ఇదియేనా యతి చెప్పిన రాత్రి ◆
(రవీంద్రుని రచనకు అనువాదము)

మేల్కొలుపు

గీతాంజలి

చిత్తమెచట భయ శూన్యమో
శీర్ష మెచట ఉత్తుంగమో
జ్ఞానమెచట ఉన్ముక్తమో గృహ
ప్రాచీరము తన ప్రాంగణ తలమును
దివారాత్ర మృత్తికా ధూళిలో
క్షుద్ర ఖండములు చేయదో !!
వాక్కులెచట హృదయోద్గతోచ్ఛ్వాస
మొరసి వెలువడునో - కర్మధారయెట
అజస్ర సహస్ర విధాల చరితార్థతలో
నిర్వారిత స్రోతమ్మై దేశదేశముల దెస దెస పరమునో

తుచ్ఛాచార మరు ప్రాంతమ్మెట
విచార స్రోత: పథమింకింపగ
మనుజాని కృషి శతధా వ్యథకాదో !
అట్టి స్వర్గ తలి మేల్కొనునట్లుగ
జాలివడని నీగట్టి చేతితో
భారత జాతిని తట్టి లేపవో
అఖిల కర్మలమ ఆనందములను
అందించే వేలుపైన తండ్రీ !! ◆

(గురుదేవునిది)

కస్తూరిలేడి

(గీతాంజలి)

దిగ్భ్రమతో పరువులిడుదు కస్తురి హరిణమునై
ఆత్మ సౌరభముతో ఉన్మత్తత వనవనము
ఆమనిరేయి చల్లగాలి ఏదెస తోచదాయె
పొందలేను కోరినదాని, పొందుదు కోరని దాని ॥

గుండెల వెలువడు గంధమె ఎండమావులాయె
గుండెలపై తడుముకున్న ఉండకయే పాయె
పొందలేను కోరినదాని, పొందుదు కోరనిదాని ॥

వేణువుపై పాడబోవ వెర్రిపాట యాయె
పాడగ తలపోయ రాగ ఫణితి మెదలదాయె
పొందలేను కోరినదాని, పొందుదు కోరనిదాని ॥ ❖

('జాహాచాఇ, తాహాపాఇనా' రవీంద్ర గేయానికి
తెలుగు అనువాదం - గజల్ వంటిది)

రవీంద్ర శత వర్షోత్సవోపహారము

ఓ విశ్వకవీ, గురుదేవరవీ
భారత సంస్కృతి మూలకందమౌ
జీవాత్మైక్య జ్ఞానచ్ఛవి
పరం పరాగత మూఢమనోగత
సంప్రదాయ శృంఖలాపవీ !
నాప్రణతులివే నా వినుతులివే !
ఓ విశ్వకవీ, గురుదేవరవీ !
నీ కవితా శక్తికి కాలావధులేవీ!

ఒకప్పు డఖండమ్మై, పిదప ఖండమ్మై
విడిన వంగ భూజన భాషే అది?
రాజ్యాంగమ్మున రంగు సుద్దతో
దిద్దిన పరిహద్దులు నీ కవితా
పతంగి రెక్కల నడ్డ గలిగెనా ?

పంజాబ సింధు గుజరాట మరాఠా
ద్రావిడ కళింగ వంగములన్
వింధ్య హిమాచల యమునా గంగో
చ్ఛల వారాశి తరంగములన్
పులకితమ్ములుగ, ఉజ్వలితములుగ
ఉద్బోధించిన ప్రభాత విహంగి
స్వేచ్ఛా పక్షమ్ముల విద్రిమకొంచు
భారత భూపరిధుల కడచి, పరచి
పూర్వపశ్చిమోత్తర దక్షిణముల
సీమాంతములంటెను గాదా
ఓ విశ్వకవీ, గురుదేవరవీ !
నీ కవితా శక్తికి కాలావధులేవీ!

ఉదాత్తానుదాత్త స్వరితమ్ముల
తొలి తపోవనులసామరవమ్మున
వేదగాన మొనరించిన ఋషివి!
ఉపనిషత్తులందొదిగి యుండిన
మహోర్థముల ప్రవచించిన మౌనివి!

తమసానదీ తటమ్మున కిరాతు
బాణహతికి కూలిన పతికోసము
శోకించిన క్రౌంచము కాంచగనే
లోకోత్తర కావ్యము పాడితివి!

అలనాడుజ్జయినికి విక్రమార్కు
కొలువున నవరత్నమ్ములందు నీ
వమూల్య మాణిక్యమవై అపూర్వ
కావ్య దీధితుల వెలార్చి, ఇందాం
తర కవివై యా జ్యోతిస్సును గని
పరమాద్భుత మందియు రవి కవిగా
ఏలయ్యా, విక్రమార్కు కొలువున
దశమ రత్నముగ కాగోరితివి!

వ్యాసుడునీవే, వర్జిల్ నీవే
దండివి నీవే, డాంటే నీవే
భాసుడును భట్ట బాణుడు నీవే!
షెల్లీవీ షేక్స్పియరువు నీవే

ఓ విశ్వకవీ, గురుదేవరవీ!
నీ కవితా శక్తికి కాలావధులేవీ!

ఆనాడే నాడును కవికిలేని
అదృష్టమొక్కటి నీనా డబ్బెను
ఎన్నిభావములు, ఎన్నిగీతములు!
ఎన్నికావ్యములు, ఎన్నివిధములో!
ఎంత భువనమోహన సౌందర్యము!
ఎన్ని అనుభవము లెన్ని మాధురులు!
ఎన్ని దేశముల యెన్ని భాషలం
దెందరు పాఠకులెందరు శ్రోతలు!

ఇంతటి విశ్వజనీనత ఏ దేశపు
కవికైనా ఏ నా డబ్బెనదో!

భువన సృష్టి కాటవిడుపు గానకయి
నవ నవో న్మిషిత మనోజ్ఞ సుందర
కావ్య జగత్సృష్టికర్తవై, అవ
తరించినట్టి విధాత నా రవీ!!

ఓ విశ్వకవీ, గురుదేవరవీ!
నీ కవితా శక్తికి కాలావధులేవీ!

ప్రాచ్య ఖండమున భరత భూమిపై
వంగసీమనుదయించిన రవీ!
ప్రాచ్య పశ్చిమ జ్ఞానాంబుధులకు
సేతువైన తత్వ చ్ఛవీ?

మా దృశ యువ కవివర కంఠమ్ముల
తిరిగి పాడుకొను అమరకవీ!
గురుదేవరవీ! ఓ విశ్వకవీ!
నా ప్రణతులివే, నా వినుతులివే! ◆

(ఆకాశవాణి కవి సమ్మేళనంలో స్వయంగా చదివినది, మే 1961.)

భూమధ్య రేఖ

– రసిక ప్రియ రాగం

(అక్షయనామసంవత్సర ఉగాది గేయం)

పుస్తకాల అలమర్పై భూగోళం ఒరిగుంది
గోళమంటే పుడమి తల్లి కుములుతోంది
క్రమ్మెభయదకేశరాశి, కావి సంజశాటి
వెళ్ళు క్షయయొ, వచ్చు ప్రభవా తుళ్ళని నెలపొడుపు నగవా ॥

... భ్రూమధ్య రేఖపై ముడతెందుకో ...
ధీమంత హృదయంలో దిగులెందుకో ..

కిచ కిచ కిచమంటూ పిచికల్ల జంటా
కొంగొత్త గూడూ మళ్ళీ కట్టిందంటా
కాకి కట్టిన యింటా కోకిలముల జంటా
కుహూ కుహూ అంటూ మళ్ళీ గుడ్లెట్టిందంటా !

నరమృగ ఖగజీవులలో పరపీడన పెరిగెననా
భూతదయా మానవతా బుద్ధులు తరిగెననా
చెక్కిట చెయిచేర అశ్రునదులు వరదలై పార
వచ్చు వత్సరాది యిచ్చు ఉత్సాహము జార
... భ్రూమధ్య రేఖపై ముడతెందుకో ...
ధీమంత హృదయంలో దిగులెందుకో ...

పౌర పాపరాశి నదీ నీరమ్ముల కలచెనంట
ధూళిదుమ్ము చెలరేగి గాలి చెరిచెనంట
దట్టముగా యంత్రశాల గొట్టము పొగలల్లెననా
పట్టణాల మురికివాడలు పల్లెలు దిగ మింగెననా
భ్రూమధ్య రేఖపై ముడతెందుకో ...
ధీమంత హృదయంలో దిగులెందుకో . .

కుడి యెడమల వెంట రాజ్య కూటమ్ముల తంటా
విశ్వవిలయ హేతువులౌ అస్త్రక్షేపణులంటా
తారా రణభేరీ ధ్వని వైరిశిబిర హేషలనా
నారాయణ పాశుపత పురాణవైర ఘోషలనా !
... భ్రూమధ్య రేఖపై ముడతెందుకో ...
ధీమంత హృదయంలో దిగులెందుకో .. ◆

(1986)

దుందుభి ఉగాది చినుకులు

జరిగా యుగా దులెన్నో
అరవయి పయి; తలపు తరగ లల్లన లేచున్
తరచయి బదుకున వినబడు
వరవడులై తోచు నీతి వాక్యాలవలెన్ ॥

తొలగి చనేటి వత్సరము దుర్మతి, దాని వరాలవేవియో
తెలియముగాని, సర్వ జగతీజనపాళి సమత్వ సాధన
మ్ముల నెదిరించి మించెనిల మోసము స్వార్థము దుర్నితీయున్
కులమత జాతి భేదముల గోడల సంఘము ఛిన్న భిన్న మౌ ॥

దుర్మతి పేరులో క్షముడు దుర్విషయాలస మగ్నమానసం
బోర్మి యొకింత లేమి జనులొక్కరి కొక్కరు తోడురాని యే
కర్మయు మంచి మేలునకు కాని, పరస్పరపీడ, తోడుగా
ధర్మ మధర్మమున్, తెలియు దారిని, చీకటి క్రమ్ము వేళనో !

గతియించిన కాలము మే
లు తరమ్మను పాతమాట లొప్పుందురో, దు
ర్మతి సంవత్సరమ్ము పే
రుతీరు సార్థక మటందురో మరి జనముల్!

పరుగిడునేడు బాధలకు పల్లవి యుంచును నెల్లకేళకున్
జరిగి గతించె దానికిక చూచని చేతుల వీడుకోలొసం
గరె యని, వచ్చు నేడునకు కౌగిలి సీయుగ స్వాగతం బొసం
గరె యనరో గతాను గతికంబుగ నీ జగతీప్రజావళుల్ !
తధిమి తధిమ్మటంచును వితాడిత చర్మపటమ్ములో । అదో
అదిగో ఉగాది, కొత్తది, జనాళిల మేల్కొలిపేటి హోరు నిం

పేద వేడు పేరు దుందుభి, అపూర్వ తపః ఫలమేమి తెమ్మనో,
కొడవలు తీర్పు కానుకలు కొల్లలుగా నిరుపేద కిమ్మనో ।

దుందుభి పేరుమోసె నిల తొక్కి-యు దొక్క-కముందె, అర్థిరా
పంచ సమీరం పదముల మంజుల శింజితముల్ దిశేందిరా
సుందర పాద నూపుర విశుద్ధ లయమ్ముగ లీనమాయె, పెం
పొందుచు మావి వాలయు పికావళి కొత్త కుహూ రుతమ్ములన్

కావడి కుండలలోపలి కలిమీ లేమీ తూచి
లేమి పీడ లేకుండగ కలిమి పంచగలమా

తన ఘనతను తగ్గించిన,
మన ధనికత పెరుగునా?
ప్రతి చేతికి పని దొరకున
ప్రతినోటికి ఫలమందున
ప్రతి గుండెకు కళలందున
ప్రతి చెవి కవిత మోగునా?

ఆశల పల్లవి పుష్ప పరాగం అయితే
పూసి ఫలిస్తేనే నవరాగం అవుతుంది.
ఆశల పుష్పరజంలో ప్రతికణమూ ఫలంకాదు
మనుజ సోదరుని స్వార్థమే మనిషి కృషికి భంగకారి!
కవి గళమ్ముతో ప్రజాగళమ్ములు కలిసినప్పుడే వసంతమౌను
కొత్త చిగుళ్ళూ, కొత్త పూవులూ, కొత్త పళ్ళతో నవవసంతము
ఆ ధ్యేయం అనర్ధ్యమైతే, ఆ ఆదర్శం అందనిదైతే
ఎదురయ్యేదొక ఆశాభంగమె !

అడుగడుగున మనిషిలోన ఆదర్శాలు పూయకపోతే
ఆశలు ఫలించకపోతే, జనమనస్సు కవిమనస్సు జరుగును స్వార్థంవైపు
అదే తొలి ఉగాది ! అదే తొలుపొద్దుటి ఉషో రేఖ

తలపు గడియారపు కదలిక మొదలౌ తొలిక్షణం
నీలపు పెంజీకటి కడుపున పెరిగే తొలి మినుకు !
సృష్ట్యాదే సృష్టి అంతు: అదే మొదలు, అదే తుది
లేదు నిన్నా నేడూ రేపూ, పాత యేడూ కొత్తయేడూ
వీడుకోలూ స్వాగతమూ - ఏదీలేని చోటు అది
అది ఏకం - అద్వితీయం - అదే బ్రహ్మం - అదే సర్వం !

దేవు డనుకో, శూన్య మనుకో !
అన్నీ ఉన్న, ఏదీలేని,
లేకా ఉన్న, ఉన్నా లేని, ఒకే ఒక్క చోటు అది !
ఒకే ఒకటి! అదే రెండు ! అదే మెండై అనేక మౌ !!

సత్తోమరి, చిత్తో అది - సదసత్తుల పొత్తో అది !
సున్నోమరి, మన్నో అది - మిన్నో మరి మనసో అది !
మనసో మరి మాటో అది - మాటో మరి పాటో అది !
పాటో మరి ఆటో అది - ధను ధమ పేలే అణువుల
ఆటో పొరపాటో అది !
నలుదెస ముసరే మంటల చెలిమో మరి కొలిమో అది !
కలిమో మరి లేమో అది ! మెరపో తలమునకో అది -
మిణుకో మరి కునుకో అది - తెలివో మరి మరపో అది
తలపో మరి పలుకో అది - వెలుగో చీకటి యో అది !
చుక్కో మరి సొక్కో అది - మన్నో మరి మబ్బో అది !
శక్తో మరి ముక్తో అది ! రక్తో విరక్తో అది !
జనమనస్సు కవి మనస్సు
తనని స్మరించడం తప్ప
లేదు మరో ప్రార్థన మార్గం !
నవోగాది నవ సర్గం !! ◆

విశాఖ ఆకాశవాణి కవి సమ్మేళనం 24-3-1982

ఒక ఉగాది గేయం

వచ్చిందా మరో కొత్త యేడు
వచ్చిందా, వచ్చిందా!

ఏమి తెచ్చు, ఏమి ఇచ్చు కాన్కలు
కలవారికీ, లేనివారికీ!!
కలవారికి మరింకెన్నో కలుములు
లేనివారికింకా లేములా? =

మనిషిపీడ మనిషికి తరుగునా?
మనసులోని మాన్యత పెరుగునా?
కులము తెగల గోడలు కూలునో
చెలిమి తోట పూవులు పూయునో

ఆత్మ శుద్ధి అందల మెక్కునో!
అవినీతి తిరోగమించునో!
విడువగలమా హింసావృత్తి ?
నడువగలమా శాంతి ప్రవృత్తి? ❖

ఉగాది పాట

(రుథిరోద్గారి)

ఏటా వచ్చే ఉగాది, ఏటేటా వచ్చే ఉగాది
పాట పాడుదుమదే సోది
ఒకే సోది అదే సోది ॥ ఏటా ॥

చెడుకాలం పోయిన యేడని
కడుమంచిది వచ్చే యేడని
కొత్త చివురు తిని కొత్తపాటతో
కొత్త ఆశ అందించు కోయిలని ॥ ఏటా ॥

ఏడు గడిచితే ఏమి మిగులు
కూడులేని పేద గుండె దిగులు
నీళ్ళులేని పంటరైతు గోడు
ఊళ్ళు ముంచు ఏళ్ళ వరదపాడు ॥ ఏటా ॥

ఉన్నవాడు తిన్న కొద్ది మిగులు
కలిసిరాక, లేనివాని పొగులు
విమత వాదులకు ఎడతెగని పగలు
సమత మరణ మందు మాత్రమె తగులు ॥ ఏటా ॥

ఒకనికె గాదుగాది అదిగో! నలువైపుల ఆరుకోటు లొ
క్కొకనికి ఏటికేటి, కోకటొక్కొటి, మొల్లమొదళ్ళ వాళ్ళ నా
రి కెడపు మ్రాకు నిల్పినను 'రింగులు' చుట్టెను ముచ్చదాక, సి
రికలగు, కోర్కులాకులగు ప్రేళుల నూపుచు పిల్చుగాది నిన్ ॥

పూవుల గుత్తులొచు, తెగపూసియు, పిందెలువేసి, అత్తముల్
ప్రోవులు సోవు లొచు దిగ బోయగ, నేలుగెలల్ జనాళి కం
దీవె యుగాది తత్త యుచి తేచ్పుల తీర్చుచు లోకులందరిన్
జీవన మాధురీమయ విశేష సుఖావళి తేల్చి పొగదే ॥ ◆

'ప్రబోధైకాదశి'

కనకాంగి రాగం.

లేవయ్యా, లే స్వామీ, లే పాలవెల్లిలో
చాలయ్యా చాలు నిదుర, ఈ వాళ్ళ నెల్లలో !!

మబ్బులు మాసిన కార్తిక మాసపు టేకాశి
అబ్బురముగ గరుడ మరుత్తు లిరుదెసల గాసి,
ఉబ్బెడు రాయంచపై విరించి, శేషశయ్య నీవు?
లేవయ్యా, లేస్వామీ ...

విశాఖ వెండ తిరుగురవి కృత్తికవైపు పోగుతశి
పగలురేయి దయ వెలయు సమాన కాలగతుల
శ్రీదేవీ భూదేవీ చెరివైపున కొలువ ॥
.. లేవయ్యా, లేస్వామీ

ఆర్ద్రిజ మూలాతారక, అభిజిత్తున వాణి
శ్రవిష్ఠ గోలోకరాధ ప్రకృతి రూప లౌమ
ముగురమ్మలు పతులతోడ ముల్లోకము లేల ।
. లేవయ్యా, లేస్వామీ ...

నిద్దుర మేల్కొను పదాలు నీకు హెచ్చరికగా
పొద్దు టావరింత నడుమ బోటన నేళ్ళ చిటికవేసి
సుద్దులుగా ఋషులు జ్ఞాన సూక్తులు పఠియించుచుండ ।
.. లేవయ్యా, లేస్వామీ ... లేపాలవెల్లిలో

(సప్తర్షి మండలానికి దిగువన కనపడే "HERCULES & DRAGON" నక్షత్రాల గుంపును విష్ణువుగనూ, శేషనాగు గానూ అథవం కాళిదాసు కాలంనుండీ అనగా 57 BC నుండీ భారతీయులు ఆరాధించేవారు. శయనైకాదశి, ప్రబోధైకాదశి ఆషాఢశుద్ధైకాదశి, కార్తీకశుద్ధైకాదశి వంటి విష్ణుపూజా దినములు ఆ ఆరాధనకు దృష్టాంతాలు)

నవంబరు 1998

సంక్రాంతి పాట

వచ్చెను సంక్రాంతి
ఇచ్చు శుభము శాంతి ॥వచ్చెను॥

కుచ్చుల స్వప్నాలూరే
వెచ్చని కంబళ్ళు
మంచు తెరలు చీల్చే
చలిమంటల సందళ్ళు !!
వెన్నెలకడిగిన దారుల
వెలసిన ముగ్గుల్లో
ముగ్గుల ముసి ముసినవ్వుల
సిగ్గుల మొగ్గల్లో !! ॥వచ్చెను॥

ఆవిరి లెగసే నోళుల
అందపు పాటల్లో
అందెల గాజుల రవళుల
ఆడే గొబ్బిళ్ళూ ॥వచ్చెను॥

పూవులు, కుంకం, పసుపూ
పూజల నాగళ్ళూ
పొలతుల నోముల కలకల
పులగం పొంగళ్ళూ ॥వచ్చెను॥
వచ్చెను సంక్రాంతి
ఇచ్చు శుభము శాంతి !!

పిల్లల తలలను రాలే
అర్లో నేరేళ్ళూ
పెద్దల దీవెన కోర్క్యాల
పెరిగే నూరేళ్ళూ ॥ వచ్చెను ॥

అలకల మామల ఓపిక
కొలిచే అల్లుళ్ళూ
రంగుల బొమ్మల కొలువుల
పొంగే కూతుళ్ళూ !!

గాదెల గడపల ధాన్యం
కదిలే వాకిళ్ళూ
అందరి పనులకు జనులకు
ఆట విడువు వీళ్ళూ ॥ వచ్చెను ॥

నిండిన రెక్కల కండలు
తెగు పందెపుకోళ్ళూ
కొమ్ముల పందుల రోషం
కొసరే పొట్టేళ్ళూ !!

వచ్చెను సంక్రాంతి,
హెచ్చెను విక్రాంతి !!
మకరం చేరిన సూర్యుడు
సుకమిచ్చు పగళ్ళూ
సకియలు దూరమ్మై తే
శకాలు రాత్రిళ్ళూ !!
వచ్చెను సంక్రాంతి
హెచ్చెను సంభ్రాంతి !! ◆

మకర సంక్రాంతి

తరలె ధనుర్విక్రాంతి
మరలి మకర సంక్రాంతి ॥

అంబా పలుకు జగదంబా పలుకు శుభ
మనెడు డుబుడుక్కరవళితో
భంభం మని శ్రుతి విడంబంబుగా జం
గంబూదు శంఖధ్వనులతో

తరలె ధనుర్విక్రాంతి
మరలి మకర సంక్రాంతి ॥

రంగా హరిలో రంగా, రంగాయని పరవ
శంగా దాసరి చెంగింగా
రంగైన పంట ఘనంగా ప్రతి యింటి
ముంగిట్లో రాసులు పోయంగా

తరలె ధనుర్విక్రాంతి
మరలి మకర సంక్రాంతి ॥

కళ్ళముందు చెరలాడే మంచు తెర
త్రెళ్ళజేయు భోగి పొగలతో
ప్రేళ్ళా సందులను ధారా ధారలై
త్రుళ్ళే రంగు బుక్కాలతో ...

తరలె ధనుర్విక్రాంతి
మరలి మకర సంక్రాంతి ॥ ◆

విజయదుర్గానుగ్రహము

అరువదేండ్ల యువాబ్ద పౌష్యంబునందు
మూలతో గూడిన యమాస ముందునాడు
తనదు షష్ట్యబ్దపూర్తి సత్సంగమునకు
తన యనుగ్రహ పాత్రులందు ననుగూడ
దొడ్డ తనమున రప్పించె 'గాడ్ను' గారు।
అది వెదురుపాక, విజయదుర్గాశ్రమాన
తుల్య వాహినీ శీత వాతూలములను
ఆ మహాజన సంరంభమందు, వేద
ఘోషలను విజ్ఞ విద్వదా శ్లేషములను
నా మహాభాగు వాశ్లేష మందెనాకు,
ఆదరము, బంధుప్రీతి, యనంతమైన
దేవ్యనుగ్రహ భాజన తృప్తి కలిగె !

శివుడు, శక్తియు నొక మేన చేరినటులు,
సందిటను రాధ కృష్ణత్వ మందినటులు,
వల్లి స్కంధ భుజ స్కంధమల్లినటులు,
అమ్మ సీతామహాలక్ష్మి యాది ప్రకృతి,
ఆది పురుషు సుబ్రహ్మణ్య నాని యుండ,
ఇరువురేక కిరీటమ్ము నెలమి తాల్ప,
కనకకమయ దీప్తి నలుగడలను వెలింగె -
పర్యవేష్టిత సన్మాన్య బంధుమిత్రు
లరువదుల యుత్సవమ్ము బ్రహ్మాండ మలమి
అర్య మార్బుద మండలా లావరింప,
ప్రకృతి పురుషుల అద్వయ ప్రణయవృష్టి
విశ్వమయి నత్సలను బ్రోచె విజయదుర్గ !! ❖

వటవృక్షం (మర్రిచెట్టు)

తమిళ కవి మూలరచన పక్షిరాజన్ తెలుగుసేత రజని

మర్రిచెట్టు నేను ; అత్యద్భుత
మహావృక్షాన్ని నేను !!
ఎన్నో ఊడల ఇంతటివృక్షం
ఎదిగిందొక చిన్న గింజ నుంచే
అణువే ప్రచండ జ్వాల అయినట్లు !
తరువుగనే పెరిగినాను త్యాగవి
గళిత రక్తకుల్యల యుగయుగాల
కలల అశ్రుధారల పారుదల;
వింధ్య హిమాచల శిఖరాలనంటి
కన్యాకుమారి ముక్కడలి వరకు
విస్తరిల్లు నా విపుల శాఖలు !
　　　　నిచ్చ పచ్చని కొమ్మలనీడల
　　　　విచ్చలవిడి మమతనెన్నో పక్షులు
　　　　రుచి మించు పండ్లు మెసవుతు హాయిగ
　　　　విశ్రమిస్తాయి నా ఒడిలో !
పక్షుల బాసలు వేరు వేరు, మరి
జాతులూ వేరు, రంగులవెన్నో ——
పాట పాడించు భావం మాత్రం
ఒక్కటే ఎన్నటికీ ఎప్పటికీ !

పగలంతా తమ పనిపాటుల్లో
పక్షులు శ్రమపడు గుడారం నేను!
ప్రతి ఋతుప్రారంభోత్సవమూ
నా కొమ్మల తొర్రలలో జరుగుతుంది!
వట వృక్షాన్నేను! ఆశ్చర్యావహ వృక్షాన్ని నేను!

రండోయ్ పిట్టలెల్లారండి.
చేరుకోండి యీ శిబిరంలోకి!
సత్యమే మారని నావేదం!
శాంతీ, స్నేహం, నా పాఠం!

కనుక -

ఆత్మ గౌరవంగల నా తలిరులు
పిట్టల తిను రాబందుల గూబల
వాలనీయవు నాపై - వాటికి
గూళ్ళు కట్టుకొన అనుమతి లేదు;
బాడుగ యిచ్చినా - దేవిడీ మనా!
వట వృక్షాన్నేను! ఆశ్చర్యావహ వృక్షాన్నేను!

కాల చక్ర పరిభ్రమణంలో
నా శోధనలూ నావేదనలూ
చెప్పడానికి అలవికానివి!
చారిత్రిక ప్రకరణాలలో
చెప్పదగ్గవి నా సాధనలు!

ఎన్నడు ఎండిపోక ఉండే నా
పాలవల్ల ప్రత్యేక శక్తితో
బంజరు నేలనుకూడా పెరుగుతా!!
నేనమూల్య వరాన్ని యీ నేలకు!
వట తరువును నేను ఆశ్చర్యావహ తరువును నేను!

వెతుక్కుంటూ కొన్నిపక్షులు
నావైపే ఎగురుతు వస్తాయి !
నా తియ్యని పళ్ళని తిని నాపైనే
రెట్టవేసి ఎటో ఎగిరిపోతాయ్ !
మరికొన్ని యీ విత్తనాలను
మరే చెట్టు మీదో వేస్తాయి !

        చిన్ని పిట్టల వచ్చీరాని
        చిరుకూతలు నచ్చకేమో వాటి
        ఎదిగీ ఎదగని చిన్నిరెక్కలను
        తుంచి వేస్తాయి - కొన్ని పక్షులు !

పిట్టల అందం, చిరుతతనాన్నీ
మెచ్చుకుంటూ వాటిని చెల్లిస్తూ
అంటాయి - ఇలా - కొన్ని పక్షులు!
రండి, రండి - కూచుందాం, రండి
ఆ పక్క చెట్ల కొమ్మలపైని
ఎత్తైన కొమ్మలపైని కూచుని
చీకూ చింతా లేక హాయిగా
ఆనందిద్దాం రండోయి !!

        వడ్రంగి పిట్ట నెలా క్షమించడం ?
        బెరడు తొల్చి పగలకొట్టి
        నను దెనమొల చెయ్యడం, అదా నీకిష్టం !
        నా మ్రానులోన రంధ్రాలు తొల్చితే
        పాముల కాపురాన్కి చోటవుతాయ్!
        మ్రాని చెట్టు నేను, అద్భుత మహిత వృక్షాన్ని నేను !
జాలి పడదగిన పాదపాన్ని
పాడే పక్షులకు పళ్ళిస్తాను

నావేళ్ళు విశ్రాంతిలేక శ్రమ అనుకోక
నేల లోతు లోతులకి చొచ్చుకుని
జలాలలోని నీటిని పీలుస్తాయ్ !
నాగింజలు చేదయితే నేమీ
పళ్ళుమాత్రం అతి తియ్యగ ఉంటాయ్ !
తలనుంచి వేళ్ళదాకాను
నా శరీరానికెన్నో బాధలు
మెగటయిన గంధకపు ఘాటుకి
నా కళ్ళనీళ్ళు జాలిగొలుపవూ?

అరటి చెట్టులా! వంగిన వెంటనె
లేచే పల్చదనం లేదు నాకు !
ప్రభంజనం మొర వింటారుగదా
నన్ను వేళ్ళతో పెగల్చలేదని!

పెల్లగించు ఝంఝా మారుతమని
బెంగనాకు సుతరామూ లేదు.
మర్రిచెట్టునేను, అద్భుతమహితవృక్షాన్నినేను!
నా ఊడలు గాలితేలు వేరులై
క్రిక్కిరిసి దగ్గరగ లేనందున
సందుల వెలుతురు చొరబడగలదు
నేలలోకి త్వర త్వర చొచ్చుకుని
హాయిగా నిలదొక్కుకొను వేళ్ళు
ఎన్నో ఊడల ఇంతటి వృక్షం
ఎదిగిందొక చిన్న గింజ నుంచి
అణువే ప్రచండ జ్వాల అయినట్లు!
వట తరువునునేను, ఆశ్చర్యావహ తరువును నేను !! ◆

(1995 జనవరి 25న ఆకాశవాణి ప్రసారం =

మానవ వికాసం : కంప్యూటర్

పెరిగే విజ్ఞానపు తాళంచెవి
తెరిచె మానవ వికాస ద్వారం !!

నవయుగాని కగ్ర దూత యెవరు ?
కంప్యూటర్ - అదే - గణక యంత్రం !
నరుని బుద్ధితో పోటీ యెవరు?
కంప్యూటర్ - అదే - గణకయంత్రం !!
గణకయంత్ర నాడీజాలంలో
అణగి మణుగు వివిధ దేశాలతో
కుదించుకొన్న భూగోళమే ఒక
కుగ్రామంలా అనిపిస్తుంది !! ॥ నవయుగానికి ॥

మనిషి మెదడులా నరాల జాలం
వలలు ముడుల విద్యుత్ ప్రసరిస్తే
కంప్యూటర్ సాధించి తీరు ఘన
కార్యాలెన్నో అసంఖ్యాకము !! ॥ నవయుగానికి ॥

చిప్పిలంకెలు మీటనొక్కితే
చిక్కులముడి విప్పడాలు, చిత్రాల్ !
తార్కిక నియమాల సహాయంతో
హద్దులేదు కంప్యూటర్ పనులకు !
బటన్ నొక్కి ఆర్డరిస్తే చాలు
చేసేసేవలు మనిషిని మీరు !

షట్టర్ ఎత్తే చౌకీదారో, షాపులలో పనుల సహాయకుడో
కార్యాలయాల ఆఫీసర్లకు ఫైళ్ళందించేటి డఫేదారో !! ❖
॥ నవయుగానికి ॥

తెలుగుపాట

తేనెల్లు చిందేది
గానాల్లు పాడేది
జాణల్లు ఆడేది
మా తెలుగు పాట ! ॥ తేనెల్లు ॥

కొలది గొప్పల నెంచబోనిది
కులము తెగలకు ఎడములేనిది
మతము పగలకు మగ్గిపోనిది
ఊరువాడా, కొలువు, కోవెల
నగరునాడుల హద్దు లేనిది
దిక్కు దిక్కుల వెల్లుబాట
తెలుగువారల తియ్యపాట!

ఎల్లమ్మకూ జాజి మల్లేల మాలా
అలమేలు మంగకూ కలువా పూదండా
కాకతమ్మకూ నీలి గోరింట మాలా
కనకదుర్గమ్మకూ గన్నేర్లదండా!

మాణిక్యాలమ్మకూ మంకెన్న మాలా
పీతాంబకు గోగు పూవుల దండా
భ్రమరాంబ తల్లికి మరువంపు మాలా
బతకమ్మకూ ముద్ద బంతీ పూదండా
ఊరూర తెమ్మగమ్మ ఊరేగు బాటా
పండుగ జాతర్ల బవనీల పాట!
ముగ్గురు భారత కవుల పద్దేలతో
ముద్దు కూర్చింది;
తగ్గట్లు ఛాందస వృత్తాల తొడవుల
తలను దాల్చింది!
తల్లులదేశి పదాల అందాలతో
ఒళ్ళు నింపింది!

ఘల్లు ఘల్లున రాజ సభలలో,
గుడులలో గజ్జె కట్టింది! ॥ తేనెల్లు ॥

జైన బస్తీలలో చదువుల వేవో
సంఘ బౌద్ధారామ సంగీతు లేవో
తెగలు పగలు ముంచు అగతిలో తేలె
ప్రగతిలో సిద్ధం నమః ఓనమాలె!
శివదేశికుల దేశి చెలిమలో వరద
శ్రీనాథు పల్నాటి చరితలో ద్విపద
జాను తెనుగమ్మకు నాడె మో ఉపద
కర్ణాట కటక భూ ఖండ మధ్యస్థమౌ
అబ్జ వనమ్మంధ్ర మను మంచి మాట
ఆ అబ్జవన సూర్యుడను ఆత్మవిశ్వాస
మందిన శ్రీనాథు డన్నట్టి మాట.

పోరుమంచిది కాదు భూమి నెక్కడగాని
పగ మించ దేశంబు పాడౌను గాదె
ఐకమత్యము చెడు నద్దాని తోడనే
దేశంబు పరుల స్వాధీనమ్ము గాదె
స్వాతంత్ర్య హీనత జనులకెన్నడు, పగ
వారికైనను వద్దు వద్దన్న మాట! ॥ తేనెల్లు ॥

అడవిలోనా పల్లెలోనా
కొండలోనా కోనలోనా
సంతల్లో జాతర్లలోనా
గంతులేసే తెల్గుపాటా
రాజసభలో ఏవగింపై
పండితులకూ ఈసడింపై

ఆలనా పాలనాలేక
అల్లలాడే తెల్గుపాటా
దేశభాషలవాసి కోసం
దిక్కులురికే తెల్గుపాటా
నగరులోనా, నాడులోనా
కొలువులోనా కోవెలలోనా
పండితులలో పామరులలో
అందుకొన్నది పెద్దపీటా
కొండవివర కొల్వులోనా
ఉండి పగలూ రేయీ పాడే
పీట వేసిందెవ్వర య్యా
తాళ్ళపాకా అన్నమయ్యా ! ॥ తేనెల్లు ॥

దేశభాషలయందు తెలుగు లెస్సంచు
ఏనాడు కృష్ణరాయలె మెచ్చునంది
నాటినుండి నాడు నాడులలోన
తెమ్మెరై ప్రాకింది మా తెల్గుపాట ॥ ॥ తేనెల్లు ॥

తిరుమ లాహోబల శ్రీరంగములను
విద్యానగర రాజవీథుల యందు
మధుర తంజాపురీ మైసూరులందు
తిర్వనంతపురాన కార్వేటి నగరి !
కూచిపూడీ మొవ్వ గోల్కొండలందు
మేలటూర్ వరహూరు చెంజి కోటలను
శ్రీశు కోవెలల వరేశు కొలువులను
దక్షిణ భారతి వక్షము పొంగ
దిక్కుదిక్కులనేలె మా తెలుగు పాట ! ॥ తేనెల్లు ॥

తద్ధణాతోం ద్రిగుడు తోం ఝణు
ధీంతనా తక ధీంతనా
దత్తిలా కోహల భరతులే ఎత్తిరో మరు జన్మము
సిద్ధ నారాయణ క్షేత్రయ లక్ష్మరాతకే సుద్ధరింపగ ॥
ప్రకృతి యువతియైడు క్షేత్రము బహు పాత్రలా నాయికలుగా
పరమ పురుషుడు నిర్గుణుడు క్షేత్రజ్ఞుడే నాయకుడుగా
జీవుడు దేవునకు సతిపతిభావమాపాదితముగా
భావిత నాట్యాభినయముల ప్రజల జీవన్ముక్తి లోనరుప
దత్తిలా కోహల భరతులే ఎత్తి రో మరు జన్మము
సిద్ధ నారాయణ క్షేత్రయ లక్ష్మర లరే ఉద్ధరింపగ
తద్ధణాతోం ద్రిగుడుతోం ఝణు
ధీంతనాతక ధీంతనా !!

ప్రకృతి శృంగార పరమావధిలో
పరమందించే క్షేత్రయ పదములు
నరాకృతి యైన నాదసుధారస
పరంచిచ్చు త్యాగయ కీర్తనములు
ఊరనూరనూ వాడవాడనూ
పల్లెల్లోనా ఢిల్లీలోనా
విద్యుదయస్కాంత రాజవీథిని
దేశవిదేశ రాజధానులలోన
నవ భారతి మానవ భారతిగా
స్తవనీయమ్మగు మా తెలుగుపాట !

తేనెల్లు చిందేది
గానాల్లు పాడేది
జాణల్లు ఆడేది
మా తెలుగు పాట !! ❖

'చిత్తూరు' సుబ్రహ్మణ్యస్మృతి

తల్లి తెలుగమ్మ మొగిలమ్మ, తండ్రి- తెలుగు
తండ్రి- పేరయ్య, జన్మ పొందాగ సాగు
పుంగథముఖుండు తెలుగూరు పుంగనూర
మామిడులతీపి గొంతంటు మండలమ్ము
పేర- మండలమంతకు పెద్ద ఊరు
పేర-'చిత్తూ' రనుచు తాను పెంపుగాంచె

పాలుపెరుగులు గోపాలబాలు నాట
పాటలును పసితనపు టుగ్గుపాలతోడ
పట్టుపడెను సుబ్రహ్మణ్య బాలకవికి!
మధురదారిలో చల్ల నమ్మంగ బోవు
గోపిక తలంపు లామెను కొసరిపిల్చు
కృష్ణు వలపులు పాడిన గేయములును
తానెరచియుంచి యాకీర్తి తన కుటుంబ
పెద్దలది యని ప్రకటించు వినయమూర్తి!
తల్లిదండ్రులకడ సాంప్రదాయిక మగు
స్వర్ణముఖీ నీటి సెలయేటి జల్లుపాట
చిన్ననాట నేర్చియు తృప్తి చెందనట్టి
సుబ్బయకు విద్య దంశ సంక్షోభపెట్టె!
స్వర్ణముఖీ యేటి తరగల సన్నపాట
పరిణతిని గోరి చనె చెన్నపట్టణమ్ము!
తూర్పు కడలి తీరాన నుత్తుంగ భంగ
గానరసపల్లవులలోన తానమాడ,
విస్తృత స్వర ఝుంఝూ ప్రశస్తి తేల
దాక్షిణాత్య సంగీత దిగ్దంతి ఘనత

నయఘనగభీర మధురగాంధర్వ ఫణితి,
పిళ్లైయనుపేరు, నాయనా పిళ్లై యిచ్చె!
కంచిపుర నాయనా పిళ్లై ఘనగురుండు,
తగిన శిష్యుడు సుబ్బయ్య ధన్యజీవి!
ఆ గురువు శిష్యవరు తనయంతవాని
చేయ 'చిత్తూరు' నకు లభించెను విశిష్ట
గాన విద్వద్గురుత్వము ఘనతమీర
రాష్ట్రగౌరవ సమ్మాన రమ్యకీర్తి!
తాండవాధిదైవమౌ చిదంబరేశునగరిలోన
కొండలయ్య వేంకటేశు కొలువున తిరుపతిలోన
కపాలీశ పార్థసారథుల చెన్నపురమ్ములోన
త్యాగబ్రహ్మ ప్రణవ సమాధి తిరువైయారులోన
సింహళరాజధానిలో సంగీత కళాశాలలలో
ఆచార్య ప్రధానుడౌము అధ్యాపకతనునెరపెను!
అతడు విద్వద్గురువుగ ఆతండాచార్యుడుగా
వెలువడిరెందరో గురువులు, విద్వత్సభాగాయకులు!
జంత్ర వాద్యసర్వస్వ జ్ఞాని లోకనాథ శర్మ,
వివిధ కళాశాలల ఆచార్యవిదుషి రేవతియు!
ఒకరికి పిత్రుసముడౌ గురువు! ఇంకొకరి గురువు సాక్షాత్పిత!
వివిధభాషల రాష్ట్రాల విద్వత్ శిక్షణనెరపి
పొందిన బిరుదు లోకమాల మణిప్రవాళ సూక్తికగు!
ఇశై మన్నర్, ఇశైవళ్లల్, ఇశై ప్పేరరియర్ ఇవర్!
ఇశైక్కు మూలదెయువంతాన్, తంజాగి ఉడల్ పెట్రేయుక్కున్!
గాన సుధాకర గానార్ణవ, గానకళా ప్రపూర్ణుడితడు!
సంగీతకళాసింధు, సప్తగిరి, సంగీత విద్వన్మణియితడే! ❖

దివ్యసీమ

గణనీయ గురులు నారా
యణ తీర్థ, క్షేత్ర, సిద్ధయతి వర్యులు, జా
యన సేనానియు జన్మిం
చిన దివిసీమ అలదివ్యసీమ యనదగున్ ।

ఏమా అభినయచాతురి
ఏమా లాస్యప్రశస్తి, ఎంతటి పాటో
ఏమా రసపోషణ, దివి
సీమను పొగడంగ దివ్యసీమయె కాదో

కృష్ణుడాంధ్రులనేల, విష్ణువై యట వెల్సె
కడలి గట్టుపయి శ్రీ కాకుళమున !
కూచిపూడిని నాట్యగురువుగా చెన్నంది
లింగడిచ్చుట వట్టు వాంగమిచ్చె ।
అత్తింటి కరిగెడు నల్లుండు కృష్ణలో
ఆతుర సన్యాసమందెనచట
మువ్వల మోతల మురిపెంపు గోపాలు
డప్పరో భినయాల కలరెనచట

 ఋషులు దేవతలప్సరలనవరతము
 శివపితామహ నందీశ శిక్షణవిధి
 తర తరమ్ముల వెలయింత్రు, భరత కళల
 తెలియరో అట్టి దివిసీమ దివ్యసీమ !

కన్నడ రాజ్య రమాపతి
కిన్నెలవున హరియె ఆనతిచ్చెనట, కలన్
విన్నయగు తెలుగుబాసవె
యెన్నందగుకావ్య, కావ్యపుట మొదలిడగన్ ' ❖

భారత భేరీ మ్రోగిందోయ్

మ్రోగిందోయ్ భారతభేరీ మ్రోగిందోయ్
లేశమైన పరతంత్రత దేశమిక లేదీ ధరిత్రిపైననుచు
రాజ్యములెల్ల ఒకే కుటుంబమని
రారాదికపై పోరాటములని ॥మ్రోగిందోయ్॥

ఆడుదు పాడుదు వేడుక మీరగ
అందరు జనులకు పండుగని
సదా ధ్యేయములు శాంత్యహింసలే
ప్రజా స్వామ్యమే ప్రపంచమున కని ॥మ్రోగిందోయ్॥

సర్వజనులకును, సర్వమతములకు
స్వాతంత్ర్యమిమ్మట కలదనుచు
ప్రతి పౌరుండును రాష్ట్రపతేయన
ప్రాతినిధ్యపుటపాలన మనదని ॥మ్రోగిందోయ్॥

నడువుడు నడువుడు మూడగు రంగుల
ముద్దుల పతాకనీడల్లో
సర్వసమమ్మిది శాంతి పథమ్మిది
ధర్మచక్ర కిరణమ్ములిదేయని ॥మ్రోగిందోయ్॥

(1947)

వందేమాతరం

వందేమాతరం మన్తే భారతం
ఎన్నో భాషలెన్నో మతము లెన్నో జాతులైనా
అన్నాదమ్ములా చంద్రార్క మంతా భారతీయుల్ ।
హిందూ సిక్కు ముస్లిమ్ జైనపార్శీ క్రైస్తవులకు
పొందుస్ గూర్చు సహజీవనము నందించేటి సూత్రం ।

రశ్మిల్ చిందు మన స్వాతంత్ర్య లక్ష్మి మకుటమౌ!
కాశ్మీరంబుపై విద్రోహి గణముల్ దాడిరాగా
శిక్షింపగనేకంబైన సీమా రక్షకులకూ
దీక్షానరులకైకైకంబు - తేజోదాయి మంత్రం !!

జండా మూడు రంగుల్ నడుమ చక్రంబున్ వెలయగా
ఖండాంతరములందే నాడో ఖ్యాతిన్ గొన్న వీరుల్
భూసీమన్ నభోవీధిన్ సభావేదిన్ విజేతలుగా
ఆశీస్సుల్ ప్రసాదించేటి అమృత ప్రాయమంత్రం ।

చాలున్ మీ దురాశల్ శత్రుసేనల్ తొలగిపొండోయి
కాలాంతకము మా ఆయుధము ఘనమౌ ఐక్యయంత్రమ్
జగతిస్థలి ప్రజాస్వామ్య రాజ్యముగా సుస్థిరతను
ప్రగతిన్ దేశ దేశాలతో మైత్రిన్ పెంచు మంత్రం ॥ ◆

(1960)

సమతి గేయం

పదరా చేయి చేయి కలిపి
మదిలో సమత మేలుకొలిపి
పడనీ అడుగు ముందడుగు
పగలు తెగలుడుగ, చెలిమి బలిమి కలిమి.
జగజ్జనములు పరస్పరం పీడనంబు సేయంగబోరనీ
యువజనం సామ్యవాదులై, భావిభారతం బెలగలరనీ ॥ పదరా ॥

పనిలో పాలుగొనని వారు, ఫలితంబందుకొనగలేరూ
కృషిసాఫల్యమందు జనమందరకు దొరుకు పండువంటి బ్రతుకు
॥ పనిలో ॥

ఉండదగు అన్న వస్త్రములతో ఎండవానలకు చెడనిగృహం
అందరకు బ్రతుకు దిద్దు చదువుల సుందరాశ్రయం కళాలయం
జనకులు తల్లిదండ్రులన్నా, జ్ఞానులు గురులుః పెద్దలన్నా ॥
॥ పనిలో ॥

ప్రగతికి మార్గదర్శకుల పయిని గౌరవము నెరపి మసలుమన్నా
జగతిలో జీవజాతులకు సర్వజనకుడొక్కడు కలండనీ
చదువుబా శాస్త్రశోధనలు దారిచూపు సత్యంబతండనీ ❖
॥ పదరా ॥

(1979)

ఆంధ్రోదయం

స్వరం బెత్తి పాడరా సోదరా
ఆంధ్రోదయవేళా
స్వరాష్ట్ర భాను ప్రభారుణిమలో
సఫలాశయ మధురిమలో ॥స్వరం॥

పారిజాత సుమమాల కూర్చుమా
ఆంధ్ర మాతృ గళ సీమా !
లక్ష త్రిశత మౌ కరాంజలుల్
నీ యంజలితో చేరా !
ముదిత హృదయ జనరాశీ పొంగే
ఒకే పూర్ణవారాశీ !! ॥స్వరం॥

ఆశయ ప్రాప్తికై, అసువుల్ బలియై
అమరులైన ఆత్మలకూ
శాంతి యనీ ప్రార్థించిననాడే
సౌఖ్యమ్మగు మనకూ !
గోదారి రాగం, కృష్ణమ్మ వేగం
పంపాలయతో తూగా !!

స్వరంబెత్తి పాడరా సోదరా !!
ఆంధ్రోదయ వేళా !! ◆

(అక్టోబర్, 1953)

ముక్కోటి కంఠాలు

ముక్కోటీ కంఠాలూ, ఒక్కపొంగున ఊగాయీ !
ఒక్కటే జయవాదంతో
దిక్కులూ మార్మోగాయీ !! ॥ ముక్కోటీ ॥

ఎక్కడెక్కడి తెలుంగులూ
ఒక్కటే మేమన్నారూ
ఎక్కడున్నా ఆంధ్ర సరస్వతి
ఒక్కటే తెలుగన్నారు !! ॥ ముక్కోటీ ॥

ఒక్కటే మా సాహిత్యం
ఒక్కటే మా సంగీతం
ఒక్కటే మా శిల్పకళా
ఒక్కటే మా వేదాంతం ॥ ముక్కోటీ ॥

భారతజననీ ప్రియపుత్రీ
ఆంధ్రప్రదేశ జనయిత్రీ
కొలువునకూ రారండోయ్
తలపూవులతో మ్రొక్కండోయ్!! ◆ ॥ ముక్కోటీ ॥

(నవంబర్ 1, 1956)

కదిలే నవపరిధులు

అదిగో! నీ చిర స్వప్న ఫలితం
అదిగో! ఆంధ్రప్రదేశము
ఇదె నవ వర్ణాలంకృత భారతి
ఇదియే నీ మాతృదేశము
వారే నవ రాష్ట్రమ్ముల తారు
ణ్యోజ్వల నరనారీ జనము
తేరే . . . . . . చందన కర్పూరమ్ముల
ఆరని నవ నీరాజనము ॥ ॥అదిగో॥

వేకువ జామున సంజ వెలుగులో
వినబడు కలనిస్వనములవే
లోకశ్రీకర మంగళ గానము
లో కలియు తెలుగు గళము లివే ॥ ॥అదిగో॥

గ్రామము రాష్ట్రము దేశము ఖండము
గడిచి పోవు నవ పరిధులవే
నీ మనస్సు నా మనస్సు నవ జగ
తీ మనస్సులో కలియునవే ॥ ॥అదిగో॥

జవ సత్త్వయుత జనావళి కృషితో
నవ నిర్మాణ కలాపమదే
నవ భారత భారతి స్వతంత్ర మా
నవ భారతి సల్లాపమదే ॥ ◆ ॥అదిగో॥

తెలుగుపాట

(తెలుగురాగఝుంరు)

ఎక్కడెక్కడెక్కడున్న తెలుగు సోదరా
ఒక్క తెలుగు పాట గొంతు లన్ని కలియ పాడరా ॥ ॥ఎక్క॥

ధిక్కరించి నిరంకుశత దేశహద్దులు దాటి
దిక్కులెల్ల పిక్కటిల్ల శకారంభము చాటి
జాతి ఆంధ్రత్వము ధాటి భరత ధాత్రి కోటగట్టి
తెలుగు ప్రతిష్ఠ నెలకొల్పితె భళిభళి సెబాసురా ॥ ॥ఎక్క॥

ముత్తాత విశ్వామిత్రు డాపస్తంబు డెవరి తాత
సిద్ధ నాగార్జును డెవరి జ్ఞాన దాతరా
కడలి అంచు లధిగమించి జ్ఞాన సంపదలను పంచి
ఎవని నౌకలు వాణిజ్య సిరుల మించెరా ॥ ॥ఎక్క॥

వివిధ దేశ నివాసాల వెలుగు తెలుగు యువత ఘనత !
విశ్వ కళా సదస్సులకు వెలుగు తెలుగు మాటరా
ఖండాంతర వాద్యముల మ్రోగు తెలుగు రాగ ఝుంరు
దేశాంతర కంఠాల తెలుపాట తేటరా ॥ ॥ఎక్క॥

సమైక్యగీత

చక్రవాక రాగం త్రిశ్రగతి

మన జాతి కొకేగీతి - ఆ గీతికొకేరాగం

మనజాతికొకేగీతి - ఆ గీతికొకే తాళం

ఆరాగం సకల భరతజనసమైక్యాను భోగం
ఆలాపం సకల జన హృదయ స్పందనైక వేగం !! ॥మన॥

బ్రహ్మమొక్కటే అది యోంకార పరిష్కృత మౌ శబ్ద బ్రహ్మమనుచు
భూతభవద్వర్తమాన యోగాతీత విశ్వమనుచు
సత్యము పలుకుడనుచును ధర్మ మాచరింపుడనుచు
ఆది ఋషులు ప్రవచించిన వేద వాక్యములనుచు ॥మన॥

తలపుల చేతల కలుషము కలియని వర్తనము
మమత లేని మంచితనము, మనస్సంయమనము
సమతా సంఘ శరణ్యత, మనుజుని నిర్వాణ పథం
ఇహ జీవన సిద్ధి బుద్ధ దేవు సూక్తి యనుచు ॥మన॥

అఖిల వైభవోపేతుడు అల్లా ఒక్కడనుచు
అద్వితీయుడతని మించి, లేదు వేరు దైవమనుచు
పవిత్రధార్మిక వర్తన, దీన దయా పరత
పైగంబర్ రసూలుల్లా వాగ్భూతమ్మనుచు ॥మన॥

ఆరంభములో ఉండెను శబ్దమ్మనుచు
శబ్దము విలసిల్లిన దీశ్వరునందనుచు
పీడిత జనుల నుద్ధరింప పిత్రానుమానము పొంది
శరీరియై ఆ శబ్దమె అవతరించె నతడే
కృపా సత్యపూర్ణుడైన క్రీస్తె యేసోను ॥మన॥

ఎనభైకోట్ల నరనారుల ఏకగ్రీవనాదం
ఎనభైకోట్ల హృదయమ్ముల స్వచ్ఛందామోదం
తీవ్రకోమలవైవిధ్య సప్తస్వర శ్రుతిబంధం
ప్రజాస్వామ్య సమభావ ప్రగతియుత బృందం ❖ ॥మన॥

ఆసియా స్వతంత్ర జ్యోతి

ఆసియా స్వతంత్ర జ్యోతి ఆరనీయమోయ్
భారత ప్రజాసమాఖ్య వర్ధిలవలెనోయ్
ఎన్నిసార్లు దురాక్రమణ సమరు కోడమోయ్
ఆత్మశక్తి నెంతకాల మణచు కోడమోయ్ !!!

శాంత్యహింస లసమర్థుల చదువులు కానోయ్
పంచశీల పిరికివారి మంత్రము కాదోయ్
సర్వమత సహిష్ణులతో జవా దేలనోయ్
ఉర్వి దెబ్బ కెదురు దెబ్బ లుండి తీరునోయ్ !!

ప్రజాస్వామ్య విఘాతకుని పాత శత్రువోయ్
నియంతగా పెరుగగానె నిష్క్రమణ హెచ్చునోయ్
నేలకొరకు కాదు కాదు నేటి యుద్ధమోయ్
మనుజ ధర్మ మూల సూత్ర నియమ బద్ధ హితమోయ్

భారత భూభాగమె కాశ్మీర రాజ్యమోయ్
భారతీయ ప్రజా చరిత పరి భవ్యమోయ్ !! ❖

త్రివర్ణరాగం

మన భారత రథకేతనమున త్రివర్ణరాగం త్రివర్ణరాగం,

మన పూర్వుల మహోదాత్తమగు ప్రాణత్యాగం, స్వార్థత్యాగం

ప్రజాస్వామ్య పరిపాలక నిత్యకర్మ యోగం
పరతంత్ర ప్రజలకెల్ల స్వతంత్రతా భోగం
బలదర్పితరాజసం ధనమదాంధతామసం
పరభాగ్య విలోలనం, పర ప్రజాపాలనం
ధరలో నశియింప జేయ, ధరించితిమి కంకణం
ధరాతలికి శాంతికరం, ప్రజావళికి సౌఖ్యకరం |మన|

స్వమతేతర హైన్యతా స్వజాత్యధిక మాన్యతా
కుల తత్త్వ వికీర్ణతా విభేద సంకీర్ణతా
ధరలో నశియింపజేయ ధరించితిమి కంకణం
ధరాతలికి శాంతికరం ప్రజావళికి సౌఖ్యకరం . . . మన

పాండిత్యపు మెరుగుల విజ్ఞానపు పరుగుల
పరస్పర విమారకమౌ వైరి రాజ్యతంత్రము
ధరలో నశియింప జేయ ధరించితిమి కంకణం
ధరాతలికి శాంతికరం ప్రజావళికి సౌఖ్యకరం ◆ |మన|

(1986)

స్వర్ణపథ

(స్వాతంత్ర్య స్వర్ణోత్సవం)

ఎగువ రక్తచ్ఛాయ,
దిగువ హరితచ్ఛాయ
నడుమ శాం త్యాత్మకమ్మైన ధవళచ్ఛాయ
అందు నర్ధశలాబ్ది తిరిగిన దవ్ర్కగతి।
దేవతా ప్రియదర్శి ధర్మచక్ర ప్రగతి।

ఎత్తరే భారతాంబకు స్వర్ణ హారతి,
బంగారు పళ్ళెరంబున మంగళారతి।

వాసంత వనములందు రసాల శాఖలను
నిరుపేద పిచ్చుకల నీడముల కిల కిలలు
కొరతలూ, కోరికలు సమతలో చెరిపేసి
దొరతనము నెరపనేర్చిన పల్లెపిచ్చుక
ఎక్కె బంగరు గద్దె, ఏబదవ యామని

ఎత్తరే భారతాంబకు స్వర్ణ హారతి।
బంగారు పళ్ళెరంబున మంగళారతి।। ◆

(1997)

భావారాశి

(దేశగేయం)

రారమ్మా రారమ్మా ఓ యేరులార
పారమ్ములేని యీ వారాశి చేర
వారాశీ అంటేను వారాశీ కాదు
తీరైనా భావాలు తెర్లేటి కడలీ !

గంగమ్మా జీలమ్మా కదలీ రారమ్మా
తపతీ నర్మదలారా తరలీ రారమ్మా
కృష్ణమ్మా గోదారీ కెరలీ రారమ్మా
తుంగభద్రా పెన్నా పొంగీ రారమ్మా ॥

మనభాగ్య నగరాన - నవ దుర్గసీమ
ఘనమైనా ఆశాలా కట్టా లేచింది

ఆకట్టాకటువైపు అదుగో వారాశి
ఆకట్టే ఇటు చేరె భావా వారాశి

తూరుపూ పడమరా తోచెనొకలాగూ
ఉత్తరమూ దక్షిణమూ ఒక్కటై సాగూ
నెయ్యానా మనలేటి తియ్యందనాలూ
ముయ్యేటి కెరటాలా ముయ్యందమూలూ ॥

ఈ భావా వారాశీ నేమీ యలలమ్మా
హిమగిరీ శిఖరాలా కెగిరీ పడునమ్మా
కాశ్మీరా లోయాలో కదలూ సెలయేరూ
కన్యాకుమారీ ముక్కడలీలో చేయా !!
రారమ్మా   రారమ్మా ◆

(1966)

ఆంధ్రకేసరి

(స్మృతి గీతి)

ఏరి నీ సరీ, వేరేరీ నీ సరీ
మాతృదేశ స్వాతంత్ర్య యోధవర
మాన్య మేరుగిరి ఆంధ్రకేసరీ ॥ఏరీనీసరీ॥

భారత జననీ ప్రియకుమార గుణధీర
దేశ భక్తాగ్రగణ్య
అవిభక్త చెన్నరాజ్య ప్రధాని
అశేష పౌర సంక్షేమ నిధాని ॥ఏరీనీసరీ॥

స్వరాజ్య సూత్రయజ్ఞ నాయకమణీ
వీరాంధ్ర ధరా సాధకాగ్రణీ
శౌర్యధనుల త్యాగధనుల సంతత
జన హితైక రంజనీ సుకృతులం ॥ఏరీనీసరీ॥

(1960)

అభ్యుదయ భారతి

అమ్మరో అభ్యుదిత భారతీ
అందుకో యిదె మంగళారతీ !

పల్లెసీమల పంట పొలముల
పట్నవాసపు పనుల కొలువుల
ఒక్క క్షణము విరామ మెరుగక
రెక్కలాడి గడించు కలుములు ॥ అమ్మరో ॥

పొంగి పొరెడు తరంగాలు
గాంగ పావన శీకరాలు
కోటి చేతుల కర్మధార
కోటి నుదురుల ఘర్మ వారి ॥ అమ్మరో ॥

పసిడి పంటల మిసిమి మోముల
ఎసగు శ్రేయస్సారాలు
కలిమి మేడలు, లేమివాడలు
తులను సుఖపడు కాపురాలు ॥ అమ్మరో ॥

ధర్మదారల పూజచేసే
కర్మ వీరుల మందిరాలు
తెగల గోడలు, పగల జాడలు
అగపడని బృందావనాలు ॥

.. అమ్మరో అభ్యుదిత భారతీ

(1966)

రౌద్రవాణి

వినుడు మొక రౌద్రవాణి! వీర భారత క్షోణి!
శమద క్షమా సాధుజాతి సై
పదు నియంతలను కుటిల నీతినని !! వినుడు .

అజాత శత్రుల మేమని అంటే
అన్యాక్రమణము సైచుట కాదని
అహింస మా పరమధర్మమంటే
శత్రుపీడ సైరించుట కాదని !! వినుడు ....

సర్వమతమ్ముల సహజీవిక మా
గర్వ కారణము కాశ్మీరమ్మును
పొందగోరి దురాక్రమణ చేసిన
పొగరు బోతు తలలకు కంటాణి !! వినుడు

భాష లెన్నియో, భావమొక్కటే
మతము లెన్నియో హృదయమొక్కటే
మమత ఒక్కటే మారక్తము మా
మాతృదేవి పదముల పారాణి !! వినుడు ....

స్వతంత్ర భారత రక్షా దీక్షా
ధృత కంకణ శత సహస్ర పాణి !
చతుశ్శతాయుత సహస్ర జనతా
స్వర మేళన సశరీర వాణి !! ◆ వినుడు ....

(1961)

శాంతిగీతి

(గోపీచంద్‌కు స్మృత్యంజలి)

ఆది మధ్యాంత రహిత, ఓ అక్షరాత్మ
విశ్వసృష్టి సంరక్షణ విలయకర్త
సగుణ నిర్గుణా తీత ! త్రిజగదధీశ !
సచ్చిదానంద లీలా ప్రసన్న మూర్తి !

అతని గని యుందు నీవు త్వదంతికమున
కొత్తగా వలసదగె లోకోత్తరమగు
నిత్య సారస్వతోద్యోగ నిరతి, నీదు
కొలువు శిల్పుల యశమును కొల్లగొనగ !

అతని కటాక్ష వీక్షా చమత్కరహాస
సరసోక్తులను ద్వ్యర్థులరయ బోకు ;
నినుగూర్చి తనలోనా, తనుగూర్చి నీలోనా
ఉన్నదున్నట్లన మలికి పడకు ·

ఇహ పరమ్ముల రెంట నీసృష్టి లోగుట్టు
పరికించి ప్రకటింప వెరగు పడకు;
నిన్ను మించిన దీక్ష నిర్విరామకథా వి
ధాతృత్వ మారసి తత్తరిలకు;

ఇహజగతి పాఠకుల మోద మెడరువడగ
పరమున కకాలమున వచ్చిపడిన మేటి

వివిధ పాత్ర మనోరంగ విపులద్రష్ట!
త్రిపురనేని గోపీచందు, అపరస్రష్ట!

ఈర్ష్య పడకో విధాత, నీవింతదమక
ఎదురుకొనబోని కథక విరించి అమర
ధామమున భౌతికమ్మునాధ్యాత్మికమ్ము
కలిపివడబోసి జీవిత గాథలల్ల!

నీ కొలువుచేరి యేడాది నిండె; నేటి
కెన్ని గాథల ల్లువో, ఎన్నిలోక
చిత్త వృత్తుల తీర్తువో, చిత్రమతని
ఆత్మకీయవో నిస్తులానంద శాంతి!

• • •

ప్రాచ్య పాశ్చాత్య తాత్త్వికవరుల జ్ఞాన
బోధనల శాస్త్ర సిద్ధాంత శోధనముల
వికసితమ్మైన దృష్టితో ప్రకటపరచె;
వివిధ భంగుల తెలుగు జీవితపు కతలు!

హేయమన డే పురా సంప్రదాయమైన
ఎట్టిదియు దేశకాలాది హేతుబద్ధ
మెపుడు సాపేక్షమై మానవ పరిణామ
ప్రగతి సాధంపు సోపానముగునటంచు!

అతడు మానవతా వాది! అతడు నిత్య
కర్మయోగి, చిరంతన ధర్మరతుడు;
అతని కృషి అజరామ రమ్మతని భావ
మతని రచన లా చంద్ర తారార్క మ్ములగు!! ❖

(1967)

కర్సియాంగ్ పాట

రండి కర్సియాంగ్ ఇటె వెళ్ళాలి డార్జిలింగు
ఈకొండ దారమున గుచ్చిన రెండు పూస లొకే రంగు
ఏది మీటినా వినబడు నొకే హిమాలయపు పాట

లామా గుడిగంట మారుమోగు కొండ లోయ బాట ॥రండి॥

పొగ జిమ్ము బొమ్మరైలుపైని కొండబండిదారి
కుడి ఎడమ మలుపులు సుడులూ గడిచి మిన్నులూరి
ఇరుపక్కల ముంచెత్తే పొగమంచు తెరల నడుమ
పొంగారు జీవితంపు కొండ పల్లెలు రంగారి పొడమ ॥రండి॥

ఆకుపచ్చ గుబురుల తేయాకు తోట మడులు
తేకు మాకు పటాలాలు తాకెడు ఇరుగడలు
వలిగాలి పులకలూర మబ్బుకౌగిలి తమి దీర
సీ రెండమురిసి, వానలడిసి, యాత్రలో ఖులాసమీర ॥రండి॥

వంగేటి వీపునంటి బరువు వేలాడే లాడు
తలకు తగిలించి తరలిపోవు లేప్చా కూలివాడు
ఇదె వచ్చు దొర ఘర్వాల్ ధరియించి రీవిగాను
మహేంద్ర టోపిపై ఖుక్రీ మెరిసే గూర్ఖాజవాను ॥రండి॥

తలపులో నిలుచు నవ్నైకముల నేపాలీ పడుచు
ముంగురుల కత్తిరించి వెనుక కురుల జారవిడుచు
టైట్ ప్యాంటుల టీ షర్ట్ దిగించు యువకుల నిలకాంచి
ట్విస్టింగ్ హిప్పీల ననుకరించు ఆటపాట లానందించ ॥రండి॥

ఇట చూడ రండి తెల్లగౌన్ల ఈశతత్త్వ విదుల
జె సూట్ ఫాదరుల నిర్మల మానవ సేవా నిధుల
వినయ ధనులు బౌద్ధమునులు కాషాయాంబర ధారులు
శాంత మూర్తులరయగా! మంత్రచక్రము తిప్పె సూరులు !. ॥రండి॥

మార్వారీ ధనికులను బిహారీ వ్యాపారులను
టిబెట్ హస్త శిల్పుల, వంగీయోద్యోగులను
అరుదైన రజని కాంతు బోలు, ప్రవాసి కవివరుల
బ్రదుకులో వెసుగు మంద జేయు సార్థక కృషిపరుల కలియ ◆

॥రండి॥

(1966లో ఆకాశవాణి కర్సియాంగ్‌కు బదిలీ అయినప్పుడు అక్కడ వ్రాసినది

సెలయేరు

తరంగిణి రాగం - ఆదితాళం

ఓ! కొండమీది సెలయేరా!
బండ రాతి చరియ పక్క చకచక
ప్రాకులాడు మెరుపు తీగవో
ఉండియుండి పరవళ్ళు ఉరకలిడు
వెండి వాగువో విసపు నాగువో ॥ కొండమీది ॥

తెంపులేని రొదతోడ రేబవ
ళ్ళింపుగ పాడే కిన్నెరవో
ఎగుడు దిగుడు బండరాతి యెడదల
హేమము చేసే సొన్నారివో ॥ కొండమీది ॥

పాన లాన మాడి యెండకెండిన
వనపాలిక కురుల రాసివో
దాటువేసి వంపు సొంపు మెలికల
ఆటలాడు దేవదాసివో ॥ కొండమీది ॥

ధారాపాత మేగాన వెలువడే
దాగియున్న క్రియాశక్తి వో
యుగ యుగాల శృంఖలాల విదల్చి
యెగయు దాస్య బంధముక్తివో ॥ కొండమీది ॥

(1967 కర్సియాంగ్‌లో హిమాలయం కొండమీద
సెలయేటి ఒడ్డున పాడుతూ కూర్చినది)

రజతోత్సవ గీతం

(ఆంధ్రమహిళ - హైదరాబాదు)

ఆదిలో చిన్న సెలయేరు
అటు చింది యిటు చింది ఆర్ద్రతా స్నిగ్ధమై
సంఘ సేవా భావ ముగ్ధమై
అంతకంతకు పెద్దయేరై
మహిళాజన మహోదయ 'హిమాని' ఈనాడు
మహనీయకృషి ఫలాన్విత మహానద మయ్యె ॥ ఆదిలో ॥

తొలి చిందులో, అక్షరపు పొందులో, భావఝురి విందులో
ఉదారాశయ పథాల తారాడగా,
మలిచిందులో పరాధీన దేశప్రజ విముక్తికై
పరపీడన పరాయణ విదేశ విభులతో పోరాడగా
తరంగపు తురంగాలే ఝరీపాత వేగాన

సంప్రదాయపు మౌఢ్య శృంఖలమ్ములను
త్రెంచే తెగువతో, బిగువుతో, పరువు సాగించి ।ఆదిలో।

తననారి కల్లాపి, తన దారి సుందరంజె, తన జాతి ప్రగతికై
నారీ జనో ద్ధార భారమ్ము తోరమై
అసి ధారగా సాగి, అనవరత స్రోతస్విని ధారగా పారె ॥
ఎదలో ఇమిడ్చిన క్రియాశక్తి పొల్గాడ
ఎగుడు దిగుడుల చదును పరుచు లాస్య మ్మాడ
గల్గారసి, మెల్లగిసి, చెట్లు తోటలు పురనగర జనపదాల్ దరిసె
॥ఆదిలో॥

ఏటిగల గల ఉరవడులలోని నెన్నెన్నో
భరతనారీ సముద్ధరణ నిర్మాణాలు
సుందరీ విద్యాలయమ్ములు, ప్రసూతికా
మందిరమ్ములును, రోగనిదాన సౌధములు
రక్షణ గృహములు, శిశు కేళీ వనమ్ములును, సేవికా,
శ్రామికా శిక్షణ కుటీరాలు,
సతత రమణీ శ్రమారాధనారామాలు,
వితత విజ్ఞాన సంపమ్ముక్తి ధామాలు !! ।ఆదిలో।

అదిలో చిన్న సెలయేరు,
అపార సేవా భారగురు, ధగద్దగితమై,
రజతగిరి ధవళమై, కనక గిరి హరితమై,
ఇంద్రధనువర్ణ - నవరత్నకాంతియుతమై,
ఆంధ్ర మహిళా శిరస్సీమంతమున జారు,
దిగ్దిగంతాలు మెరిసేటి పాపట చేరు !!! ◆ ।ఆదిలో।

చీకటి వెలుగుల సహజీవనం

కలకాలము తను సూర్యుని చుట్టూ
చలువరేడు తనచుట్టూ తిరిగే
ఇలా గోళమున కిరుపక్కలనూ
వెలుగూ చీకటి విరతి లేకయే
తిరుగును గిర గిర, తిరిగి మరుగు పడి
మరల తిరుగబడి తిరుగును మరి మరి !

వెలుగు మంచిదని, చీకటి చెడుగని
కలుగ బోవునది శుభోదయమ్మగు
వెలుగని గతమంతా చీకటి యని
తలపు మనిషిలో అనాది నుంచి
తిరుగును గిర గిర, తిరిగి మరుగుపడి
మరలి తిరుగబడి, తిరుగును మరిమరి !

చీకటి నుంచే వెలుగు పుట్టెనో
చీకటియే వెలుగునుంచి పుట్టెనో
లోకేశ్వరమౌ పరమాణువులో
ఒకేసారి రెండూ జన్మించెనో !
తిరుగును గిర గిర తిరిగి మరుగుపడి
మరలి తిరుగ బడి తిరుగును మరి మరి !

సహ జన్ముల పోరాటమ్మైతే
మహాభారతం మూలకథే అది
సహపక్షీకుడు కృష్ణుడు తనయుని
అహంకార మణచిన కథ అదే !!
తిరుగును గిర గిర తిరిగి మరుగుపడి
మరలి తిరుగబడి తిరుగును మరిమరి

పగిలిన పరమాణువులో వెల్గి
నొగిలిన ధరణీ హృదయపు మూల్గి
పగ ఉమిసే మానవ మేధస్సు
రగులు పాపముల నరక తమస్సు
తిరుగును గిర గిర తిరిగి మరుగుపడి
మరల తిరుగబడి తిరుగును మరిమరి

తానే వెలుగట పరుడు చీకటట
తానే లోకశాంతి రక్షకుడట
తానే పరుడని పరుడూ తానని
తానెరింగితే, అదే స్వర్ణయుగం
తిరుగును గిర గిర తిరిగి మరుగుపడి
మరల తిరుగబడి తిరుగును మరిమరి

చీకటి వెలుగును లోగొనకుండా
చీకటిని వెలుగు పై కొనకుండా
చీకటి వెలుగూ చేరి ఏకమై
లోకశాంతి రక్షించే కాలం
తిరుగును గిర గిర తిరిగి మరుగుపడి
మరల తిరుగబడి తిరుగును మరిమరి

ఇరులు కురియు అమావాస్యరేయి
ధరణీశాంతికై, పండుగ సేయ
వరుస ప్రమిదలై స్నేహదీపములు
నరుని యెడద ముంగిట వెలిగేయా ॥
తిరుగును గిర గిర తిరిగి మరుగుపడి
మరల తిరుగబడి తిరుగును మరిమరి ◆

(1960 దీపా॰)

విస్ఫోటనం

వచన కవిత

భూ భారం హెచ్చింపు జ
నాభా విస్ఫోటనం
అణు విస్ఫోటనం కంటె
అత్యంత వినాశకారి ॥

చిన్న బెల్లం ముక్క మీద
చీమల పెను పుట్టలాగ
మెడపై తలవున్నవాళ్ళు
చెడ పెరిగి పొరాడుతూంటే
నిలబడడానికి నెలవు
కరవడానికి గ్రాసం కాస్త
క్రమంగా కరవై పోతుంటే
బహునాయక బహుళోదర
భారంలో కుంగే భూమి
విసిరేసిన విస్తరిపై
వీధి కుక్కల మోస్తరే కదా !

అడవి మృగాలంటాయిలా !
మమ్మల్ని తెగ వేటాడి
మా జాతుల్ని నాశనం చేస్తూ
మనుషులు పెంచే జూలల్లో
మమ్మల్ని బక్క చిక్కేట్లు చేస్తూ
మావల్ల దయ చూపమనే
జీవ కారుణ్య సంఘాన్ని తలపక
హరించుకు పోతున్నాయి పాపం
అడవి మృగాలంటారెందుకు ?
పెరిగి పోతోంది బాబోయ్, మొర్రోయ్

నరుల జనాభా అంటా రెందుకు ?
ఆహార విద్రాభయ విక్రమాలు
అపకారి పట్ల అంతు చూసేపగ
ఉపకారి పట్ల కృతజ్ఞత
ఉపచారం పట్ల ఆనందం
అడవి జంతువులకు సహజంగా
అమ్మపాలతో అబ్బే గుణాలు
రక్త మాంసాల రుచి మరిగి
హింసా క్రౌర్యాల కళ పెరిగి
నరమానవు పొడగిట్టని
అడవి జంతువేదో తెలుసా?
గూడు కట్టిన స్వార్థంతో
క్షణక్షణ దోపిడి తో
తోటి వారిని పీడించుకు తినే
నగరంలో పెంపుకనే
నర మానవుడే
పేరు మాపే పదుగురు కొడుకులా
ఊరు నిలిపే ఒక్క కూతురా!
సంతుకోసం దేవు లాడిన
జంటకు దేవుడు దర్శనమిచ్చి
అడిగాడట వెనకటికిలా
పేరు మాపే పదుగురెందుకూ
ఊరునిలిపే ఒకకూతురు చాలని
అడిగిందట అజంట
ఇలా పుట్టు కొచ్చేస్తున్నారే!
ఏమడుగుతారీనాటి జంటలు? ◆

అమెరికా యాత్ర

నా బాల్యసఖుడు చందూదత్తు
తన భ్రాతృసులుడు వేంకనవిట్టూ

మావూరి గర్వ కారణాలు
బులుసు వారి నోముల ఫలాలు
నను చెలిమి బలిమి పిలువంగ
ఇంగ్లాండు విడిచి నే కదలంగ
బ్రిటిష్ ఎయిర్ వేస్ విమానములోన
అట్లాంటిక్ మహాజలధి దాటి
అమెరికా ఖండమున న్యూయార్క్‌లో
అడుగిడినాను సెప్టెంబరైదున
కెనెడీ విమాన కేంద్రమున !

చంద్రుని మౌళినిదాల్చిన శివుడు
రాజరాజగు కుబేరుని సఖుడు,
పూజ్య పీఠికాపురదైవము !
సంగీత సాహితీ కళా పూర్ణ
చంద్ర సముడైన నేస్తము రజనికి
పిఠాపుర పౌర జన సమక్షమున
పెద్దగ గౌరవించిన ఉదారుడు
చంద్రమౌళి రాజ మాన్య సఖుడు !

అగ్ర రాజ్యముల అగ్రగణ్య మౌ
అమెరికా పర్యటించు సమయమున
తానొకడుగా తనివి నొందక
తనకు తోడు రమ్మని తా చేరిన
రెండవ నెలలో నన్నూ రమ్మని
తన భ్రాతృ సుతుడు కార్య సాధకుడు
ధ్వని తాంత్రిక విజ్ఞాన దక్షుడు
ఘన సాంకేతిక కర్మ చారి యౌ
బులుసు వేంకటేశ్వర దత్తు చేత

ఈశాన్య రాష్ట్ర తెలుగు సంస్కృతీ
సంఘ కార్య కర్తలు వాదోడుగ
ఆహ్వానము పంపునట్లు చేసిన
చందు చెలిమి బలిమికి జేజేలు

నూజివీటి విజ్ఞానవేత్త
వేయి పున్నమలు చూసిపెద్ద
దత్తులందరికీ జ్యేష్ఠసోదరుడు
ఆచార్య శ్రీ సుబ్రహ్మణ్యదత్తు
వారి 'అబ్బాయి' సూర్యా బులుసు
రక్షణ జ్ఞాన సైద్ధాంతికుడు।

అబ్బాయి సూర్య ఆహ్వానమ్మున
అన్నగారి కూర్మి పేర్మి బలమున
అమెరికా ప్రకృతి పరిశీలనకై
అడుగిడె న్యూయార్క్ున నే చేరిన
అదే మాసమున కొన్ని దినాలకు
దత్తు సోదరుల చిట్టి తమ్ముడు
తరుణ వయస్సున నా చెలికాడు,
వృత్తిలో రిటైరైనా తన వ్యా
వృత్తి చెట్లు చేమలను వదలని
గుడివాడ వృక్ష శాస్త్ర చార్యుడు
పాడవరి, చదువరి, సుబ్బారాదత్తు।

ఉపవనముల రాష్ట్రమని వాసిగొన్న
న్యూ జెర్సీలో జంటనగరాలు
సప్తాహ మొకటి మార్ల్బరోలో
సాగు మరొక్కటి మారిస్ ప్లెయిన్స్‌లో-
క్షీరసాగర గభీర హృదయులు,

స్నిగ్ధతా రమ్య మధురమూర్తులు.
సజ్జనతా సంప్రదాయ బద్ధులు
ఉదాత్త సాహిత్య కళారసికులు
సూర్యా బులుసు వెంకన్నదత్తులు
సర్వలక్ష్మి రాధావల్లభులు
సకల సుగుణ సంపత్సమృద్ధులు !
రాధమ్మా వెంకటేశ దత్తుల
హోలీ హిల్రోడ్ భవనమునందూ
సర్వలక్ష్మి బులుసు సూర్యాగార్ల
స్ప్రింగ్ వ్యూ టెరేస్ సౌధంలోనూ
ఆత్మీయ సాదరాప్యాయ పూర్ణ
సాతిథ్య మందు కొన్నాము !

సొంత తాతలతో సమముగా రజని
కాంతు తాత నాదరించు బిడ్డలు
మధుర మనస్కులు, మాన్యవర్తనులు
సువినయ మూర్తులు, సుధాదిత్యులు !

గొంతు విప్పి నేను పాట పాడగ
వంతపాడు అపోలో మొరచాచి
ముందు, వెనుక, కాళ్ళు నేల తొక్కుతు
ముట్టె చాచి చెలగాట మాడుమని
కోరి కవ్వించు అపోలోనూ, తన
గుప్పిళ్ళతో మందలించు రాకీ !
మూర్ల బరోలో రాకీ అపోలో
మాకు పొద్దు గూకులు నేస్తాలు !

వెనక కాళ్ళ నిల్చొని ముందుకాళ్ళ
మమ్ములాకి 'మార్నింగ్ గుడ్' ప్రెస్టూ

బ్రేక్‌ఫాస్ట్ టేబిల్ పక్క బిల్లపై
ఎక్కి కుచ్చుతోకవిప్పి మ్యావని
పలుకరించు సాషే మామ్మా
తోట వైపు తలుపు తీయగానె ఒక
టాటువేసి వేట కెళ్ళు కిరణా
మారిస్ ప్లెయిన్స్‌లో మా దోస్తులు !!

నా అమెరికా వివిధ నగర పర్యటన
గతుల నిత్య సహచరులు !
మా జ్యేష్ఠ పౌరసత్వ గౌరవాల
ఇరుగడల నాకు బాసటలు !
నా బాల్య సఖులు మాచందు, సుబ్బు
సుబ్రహ్మణ్య దత్తుగారి తమ్ములు
సూరయ్యగారి అబ్బాయిలు
మన బులుసు బ్రదర్స్ బాబాయిలు !

ప్రాక్పశ్చిమాలుదక్ దక్షిణాలు
సాగు జాతీయ రహదార్ల
ఈశాన్య రాష్ట్రముల చేర్చు మహా
నగరాల కలుపు రాజపథాల
కుడిపంక్తినో యెడమ పంక్తినైన
వడిపంక్తులందొకటగాని,
నగరమ్ము నుంచి నగరమ్ము పోవు
వెంకన్న దత్ బృహద్రథము !
ఇరువంక పచ్చ గుబురాకు నిండి
ఎదిగేటి తోట మడులు —
మరియొక్క వంక ఆకులను రాల్చి
మోడులౌ మాకు గెడలు

మైళ్ళకొలది చీమల బారులాగ
కదలు గాసొలిన్ శకటాలు
ఇరువైపులన్ గుబురు చాచుకొమ్మ
లెత్తైన సైన్లైన్లు

నడుమ నడుమ సర్వీసు కేంద్రాలు
సుడులు తిరుగు వంతెన దార్లు
దారి సుంకపు వసూలు ద్వారాలు
హోటేళ్ళూ, మొటేళ్ళూ, బార్లూ
ఊరి నడుమను మొటేళ్ళ నివాసము
డంకిన్ డోనట్ బ్రేక్ ఫాస్టులు
దారినడుమ విశ్రాంతి స్థలాల
చెట్ల నడుమ సిమ్మెంటరుగుల పయి
కార్ ట్రంక్ ప్యాకెట్ లంచీలు।

ఈశాన్య రాష్ట్రములగల్గు మహా
నగరాల చేరు రహదార్ల -
సర్వలక్ష్మి యో సూర్యా బులుసో
సారథి యై విషయ వివృతి చేయగ
ఎన్నిసార్లో సూర్యా బులుసుకార్లో,

ఆదిత్యో, వెంకన్నయొ, రాధయొ
చక్రధారియై విక్రమింపగా
ఎన్నిసార్లో వెంకన్న దత్ కార్లో ॥

గంటకు ఏభై, అరవై, డెబ్బై
మైళ్ళ వేగమున ముందుకు సాగుతు
వంతెనలూ, సొరంగాల ద్వారా

శంఖావర్త బైపాస్‌లు మీరా
దీపతతుల తోరణాల బారుల
జలాంతర నాళికా రహదారుల
బ్రేక్ ఫాస్ట్లూ లంచ్‌లూ దారిలోన
వేరు వేరు చోటుల కానిస్తూ
చేరేవారము మహానగరాలు !
న్యూయార్క్, న్యూబ్రన్స్‌విక్, మారిస్‌టౌన్
వాషింగ్టన్, బోస్టన్, ఫిలడల్ఫియా —
మహానగరాల పెనుకట్టడాల
దర్శనీయముల తిలకించాము !

నూటయేడు అంతస్థుల సౌధం
ప్రపంచ వాణిజ్యకేంద్రమూ,
ఐక్యరాజ్య సమితి భవన పుంజం
మెట్రోపాలిటన్ మ్యూజియమూ
కార్నెల్, హార్వర్డ్, యూనివర్సిటీస్
కోనింగ్ గ్లాస్ మ్యూజియం, ఫ్యాక్టరీ,
రాజధాని వాషింగ్టన్ డీ.సీ.
సెనేటుహౌస్, స్మారక స్తంభం
స్మిత్సోనియన్ అంతరిక్ష కేంద్రం
నక్షత్ర వేధశాలా -

అన్నిటిలోనా అద్భుతజనకం
అవిస్మరణీయ ముదాత్తానుభవ
మది, మా నయాగరా పర్యటనా
నయాగరా జలపాతంలో
తుషార మేఘావరణంలో
చందూ తాతా, సుబ్బూ తాతా

అంకుల్ దత్తూ ఆదిత్తూ
సుధాసీసీ తన చుట్టూ ఉండగ
నీహార రమణి సందిటిలో
నీలాలాడెను, రజనీ తాత
నయాగరా జలపాతంలో
తుషార మేఘావరణంలో !!

మా యాత్రలోన మహానగరాల
అందమైన షాపింగ్ సెంటర్లు
నూర్ల కొలదిగా బారులు దీరిన
కార్లపార్క్‌లో కారును విడిచి
ప్రవేశద్వారం సమీపించగనె
తమంత తాము తెరచుకొను తలుపులు !

ఎక్కుట కొకటీ దిగుటకు ఒకటీ
ఎస్కలేటర్ - సోపాన నిశ్రేణి
కిందమెట్టుపై నిలబడినంతనె
కిందిమెట్టు పోయి పోయి పైకి
పై అంతస్తుకు చేరు సాధనాల్
వివిధ వస్తువుల విక్రయశాలల
విశాల విస్తృత విపణీ కేంద్రాలు
శుభ్ర వేష భూషలు, భంగిమలతొ
సజీవములుగా తోచు బొమ్మలూ
బొమ్మలవలె నిల్చి పోజులిచ్చే
ప్రచార శిల్పపు సుందరాంగులు !
కొన్నవస్తువుల ప్యాకెట్స్ పేర్చి
తోసుకొనే చక్రాల ట్రాలీలు !
వివిధవస్తువుల విక్రయశాలల

విశాల విస్తృత విపణి కేంద్రాలు !!

బాస్టన్, వాషింగ్టన్, పొలిమేరల
ఫిలడల్ఫియా శివారు నందునా
విపనీ యుక్రేనియన్ చర్చిలో
పీస్ కాలవే సభాస్థలి యందు
ఎన్. ఎస్. శాస్త్రి, లక్ష్మీనరసింహం
వై. యస్. రావు, కిడాంబి రఘునాథ
ఆర్. కె. జొన్నాడల యాజమాన్య
మందున జరిగిన అయిదు సభలలో
మారిస్ ప్లెయిన్స్ భావరాజు గృహము
మ్యార్ల బరో దత్తుగారి హాల్లో
తెలుగు సాంస్కృతిక మిత్ర మండలికి
వినోద వికాసములు కలిగిస్తూ
విందు చేశాను పాటలు మాటలు
అందుకొంటి హర్షామోదమ్ములు !

ప్రసిద్ధ వాగ్గేయకార కృషిలో
ఆంధ్ర సంస్కృతీ చరిత్రయందలి
అవిస్మరణీయ ఘట్ట వివరణము
సోపన్యాసముగా సంప్రదాయ
సంగీతముతో సాహిత్యముతో
సరస హృదులు వికసింప వినిపించి
తదనంతరమున రజనీ విరచిత
రాగ ధోరణులు వివిధ బాణీలు
వెలార్చు గేయమ్ములు పాడినాడ !

ఓంకారాత్మక విశ్వయానము
అన్ని సభల యం దాఖరీగేయం !! ◆

స్వరలహరీలోల

కన్నడగౌళ. త్రిశ్రం

స్వరలహరీ లోల వాక్సుధామృత వల్లీ
రంగవల్లీ కల్పనా కల్పవల్లీ తల్లీ ...
కవికల్పిత నవనందన వనమంది రాలి
సుందరాంగణమునకు రావో
సవిలాసలలిత కోమల బహు వర్ణ పూర్ణ
రసకల్లోలినివై రావో

పర్యవశిత శరత్కాల భాసమాన
కౌముదీ మహిత రాత్రి
సూర్యోదయ పూర్వారుణ నీహార తుషార
యవని కావృత ధాత్రి
సదన సదనమున ప్రాంగణమున విలసిలు మాయా
ఉదయాచల మధురోజ్వల సంధ్యారుణచ్ఛాయా . . .

॥ స్వరలహరీ లోల ॥

రంగవల్లి

రాగేశ్రీ బిహార్

కమనీయమైనట్టి కల్పనే కలిగితే
          కనులార కాంచేది రమ్యం
కనులు మూసియు కానకలిగేది రమ్యం
          వీనులార వినేది రమ్యం గమ్యం ..
కమనీయ మైనట్టి కల్పనే కలిగితే
          కనులు వీనులు మూసి మనసమే జరిగితే
జననాంతరపు చెలిమి
          సహృదయులకది హృదయగమ్యం, రమ్యం

కమనీయమైనట్టి కల్పనే కలిగితే
మిన్ను మన్ను లగించి మించేటి రమ్యం
దివి భువి కవతరింప భువియె దివికి తరింప
గలుగు కల్పన హృదయ గమ్యం .. .. ◆

రాగశ్రీ గీతి

(మేఘు)

నీలి నింగి, గాలితరగల తేలిపోయే మేఘరాజా !
నాలు చూపుల వలగొనే శంపాలతంటే ఎంతమోజో ! ॥ నీలి ॥

తధిమి ధిమియని కుటిల కుంతల తటిల్లత సందిటను ఉరుముతు
అదరనీకా, బెదరనీకా ఆమెతో ఏమందువోయీ ॥ నీలి ॥

ఏటి వొడ్డున తోటలో సయ్యాటలాడే చిలిపి చేష్టల
పాటకప్పు ప్రేమికుల జంటకు భయము గొలుపగ ఉరుమకోయీ
॥ నీలి ॥

విజిత వీణా తంత్రిపై అనురాగ మాధురి లొలుకబోసే
రజని వేళల ప్రేయసీ హృది రంజిలగ గానంబు సేయవో ❖ ॥ నీలి ॥

(1979)

ఘుంఘుర పరికిణీ

వలజి రాగం

ఝంగనె కింకిణీ ఘుంఘుర పరికిణీ
అంగణమున నడవంగ శుభాంగి ||

విరబోయగ దిగజారు కురులలో
అరుణకాంతి కిరణాల మెరపులో
తెరలు తెరలుగా అలము తెమ్మెరల
దరిసి పలుకరించు ఎడద పొంగుల ॥ ఝంగనె ॥

మలయానిల చలనాల వలగొనే
మావికొమ్మ భుజముల హత్తుకొని
మల్లె తీవ రెమ్మ వేలి కొనలతో
సైగ గుస గుసల సోగ నవ్వడుల ॥ ఝంగనె ॥

నింగి ముంగిట సంధ్యాదీపము
నిలిపే ముద్దరాలి కనుపాపల
రంగు మబ్బుపైట చెంగు చాటున
రహస్య మెరిగే వేళ రజనియని ◆ ॥ ఝంగనె ॥

29 జనవరి 1984

సంత పాట

రా సోదర !! బ్రతుకొక సంత !
జయ పరాజయమ్ముల పుంత !
వచ్చే బిడారు, పోయే బిడారు
చెయి మారే పైసా వింత !

జన సంకులం, ధన పంకిలం
తరుణ యౌవన ఝుంఝూనిలం
వివిధ సౌఖ్య భోగ దావానలం !!
రా సోదర బ్రతుకొక సంత !!

నవరసుల వెదజల్లవోయీ
మొహరీల నెగజిమ్ము భాయీ
ఈసంతకెల్ల సౌందర్యరాశి, నీ
సొంత బానిసగునోయీ ॥ రా సోదర ॥

ఇది హృద్యము, ద్రాక్ష మద్యము
అనవద్య సుందరాంగి పోయగా
ఎడ తెగని ధార, దాహమ్ముతీర
సేవించవోయి సుకుమారా !
రాసోదర ! బ్రతుకొక సంత ॥ రా సోదర ॥

రేపేమౌనో ఏమౌనో
రూపేమౌనో ఏమౌనో
ఈవేళే సుఖింతాము రా రావోయి రావోయి ◆

('మధ్య ప్రాచ్య నాటికలోనిది' 1971-72)

ఏది ప్రగతి ?

ఏది ప్రగతి సెలవీయగ దోయి !
ఏది అగతి సెలవీయగ దోయి ??

జనత భారమై, వసతి దూరమై
సుఖము మేర చేరే కోరికతో
కలలు మేడలుగ కట్టడమా, క
ట్టడములున్న పడగొట్టడమా ! । ఏది ప్రగతి ।

జలమపార మౌ నదులు దారమై
జనపదాల పంచలి పరుగులలో
క్షేత్రలక్ష్మి ఖేలనమా, విలయో
ద్భృత తరంగ లోలనమా !! ॥ ఏది ప్రగతి ॥

ధన మమూల్యమై, బలమ తుల్యమై
జనతా సమతా సాధన పథమున
స్వేద సముద్భృత స్వర్గమా, అల
సతా వ్యాకులిత నరకమా ?? ॥ ఏది ప్రగతి ॥

శత్రు మధ్యమై, మైత్రి పూజ్యమై
స్వదేశ సీమా రక్షణ కృషిలో
సమైక్యవైరి నిరోధమా !
స్వగృహ నాశ సంరంభమా !! ❖ । ఏది ప్రగతి ।

లక్ష్మమ్మ కథ

అటో ఇటో, ఎటు పోవుటో !
జీవితమార్గము చీలిపోయె నిట !!

ఎందుకో కానిదారి పరుగులు
చిందు నడుగు జాడ రక్తకణములు
దేహ మోహమున కెద తపింతునా
హృదంతరాగ్నిని తనువు వ్రేల్తునా
వదల జాల నసమార్గము - అసమార్గమో, ఘన మార్గమో
వదల జాల సఖి, హృదయ శల్యమో నీకది
క్షమించుసఖి ! క్షమించు సఖి ! ❖ అటో ఇటో !

(మూడురోడ్ల కూడలిలో మూడుదీపాల స్తంభం కింది తిన్నె 1948)

ప్రభంజన గీతి

నివాత శూన్య స్తంభం, నిష్పీడన మంథానం
ఝంఝూవాత సంరంభం, ధ్వంస విధి విధానం ।నివాత।

పరిభ్రామ్య మాణ రోదసీరాక్షసి నిటలాక్షం
పశుపక్షి మనుష్య సౌఖ్యహరణ జీవనాటంకం
నలు పక్కల ఒత్తిళ్ళు, నడిబొడ్డున గుడిసుళ్ళు
పలుపంకల స్వార్థ నైజ పాపాల్ విలోకే కవ్వం ।నివాత॥

వైపరీత్య నాట్యరంగ సూత్రధార వక్రదండం
స్వైరవిహార విజృంభణ్ మరున్మేఘ ఛత్రదండం
ఊఊవడి పరువుల కరువలి, ఉరుముల మెరుపుల అలజడి
పెళ్లగిలిన తోట, బాట, వరదల కూలు వంతెనలు
రథ్యలు రహదారులు తెగి, రాకపోకలవరోధాల్ ♦ ॥నివాత॥

(ఆంధ్రలో తుపాను 9మే, 90)

యుగళగీతి

భైరవిరాగం

ఇద్దరు

ఏమంత తొందర ఓ జాబిలీ
రవంత నిలబడు మా మునివాకిలి!
నిండుపున్నమ వెన్నెలలు
దండుగాయె మా తగవులలో
రవంత నిలబడు జాబిలీ!

ఆమె

అందములో నాకు నేనె సాటని
అంతలోనె జాబిలి అననేలా!

అతను

సకియ మోము వెన్నెల లొలుకగ గని
జాబిలియని పిలిచిన కినుకేలా! | నిండు పున్నమ
------- జాబిలీ!

ఆమె

పొగడి పొగడి ముద్దు తీర్చుకొనుటే
పురుషుల నైజమ్మన తగవేలా

అతను

వలపు పొంగి తలపులూరి పల్కిన
పలుకు కల్లయన వగపేలా ? | నిండు పున్నమ
----- జాబిలీ

ఆమె

ఏది కల్లయో, తలపో, పలుకో
ఏది నిజమొ ఎరిగింపగ రాదో

అతను

తలచిన తలపూ పలికిన పలుకూ
వలపు సాక్షి నిజమంటే వాదో! ◆ | నిండు పున్నమ
----- జాబిలీ

గాలిబ్ గజల్

ముంగిళులు, సంపెంగలు గులాబి మల్లెలు వికసించె
రంగు రంగు జాలరుల వసంతు రాకయె ప్రకటించె
హృదయాన సకియపైన మమత లెపుడొ క్షీణమాయె
దావాగ్ని కీలలందు కాలి తరిగి బూడిదాయె ! ।ముంగిళులు

నా యెడద రూపు సుంత యేవి
నాకు తెలియదాయె
నే వెదకులాడుచుండగ నీకే లభించెనాయె । ।। ముంగిళుల ।
మచ్చలను మృత్యువే కప్పి పుచ్చి యుండకున్న

దిగంబరుడనె గానో అంబరము లెన్ని యున్న
అల్లా సముక్షమున గాలిబ్ అవనతుడు గులాము
అలాగే తప్పు త్రాగి పాత్ర కందించు సలాము ❖ । ముంగిళుల ।।

(1967)

నిరీక్షణం

(అభోగి భైరవి)

ఎదురు చూడడ మదెన్నాళ్ళో
కదలనీదు గడప వదలి ఆశా ॥ఎదురు॥

పిలుపు వచ్చునని తెలిసి పొంగి, నీ
కొలువుగూర్చి కలల మది చెలంగి
నిన్ను జేర బయలు దేరు క్షణ మా
సన్న మను కొనుటెగాక రాకయే ॥ఎదురు॥

పగలు రేయి గడచి పోవ, ఎప్పటి
పగిది సాగు చుక్క చెరగు దుప్పటి
ఒక్కటొకటిగా దినములూ నెలలు
లెక్క పెట్టుకొనుటెగాక రాకయే ॥ఎదురు॥

సేవకై కొనెదు నీవు నా చేతి
తావులీను పూవుగుత్తి చేకొని
పావనమౌ నీదు మోవి చేర్చగ
కైవసమౌ నిండు చంద్రు రాకయే ◆ ॥ఎదురు॥

(1979)

మంచుమలపాట

ఇది ఉండచుట్టుకునే కొండచిలువ మడత దారి
కొండపై కొండ దాటిపోవ కొసకు చేరు ఊరు ! ॥ ఇది ॥

లోయలో నిండి రాసులౌచు లేచే పొగమంచు
మోపు మోపులై మబ్బులన్ని దెసల మోహరించు ! ॥ ఇది ॥

సాగిపోయేటి మబ్బులందు సగము తొంగిచూచు
చక్కనౌ మంచుకొండ కొసల వెండి మెరపుతోచు ! ॥ ఇది ॥

ఇట మంచు పెన్నముద్ద మేయు దిగ్గజాల దండు !
ఈ కాంచన జంఘకు చుట్టూ ఈ కొండల పిండు ॥ ఇది ॥

ప్రతికొండకు తేయాకు గుబురు మరకతపు తివాసి
నభమంటు కరికరాల కోనిఫరస్ వృక్షరాజి ॥ ఇది ॥

ఇరు పక్కలపొదలందు పూయు పెన్ని రంగుపూలు !
సేమంతి, సూర్యకాంతులు, శివ్రులీ, స్థల కమలాలు ! ॥ ఇది ॥

మైగురు పొడిచి వణికించే చలి పీపలి తావు
మండయిన యెండ, చెమట బొట్టు లీలావున రావు ! ॥ ఇది ॥

పగలు రేయనక లోయ, కొండ వర్షధారముంచు
ముసురు విడి అన్నిదెసల అల్లుకొను పెనుపొగమంచు ! ॥ ఇది ॥

ప్రతి మాకుకు ప్రతిమనిషికి చుట్టుక్కా పెనుకప్పు
కప్పు విడి రేపు మాపు కాస్త సేపవు కనువిప్పు !! ❖

(1967)

చెలువుడు అలాగ

ఠుమ్రీ

చెలువుడు రాడేలనే - ఓ సకియా
పిలిచెనుగానీ ఉపవని కలియగా ॥ చెలువుడు ॥

వలపుజంట పావురాల ఖేల, కొ
మ్మల పయి చూడగ ఊసుపుట్టెనే ॥ చెలువుడు ॥

పొగసెదెందుకే సొమ్ములెందుకే
మగువ, ప్రియుడురాని బ్రతుకెందుకె ॥ చెలువుడు ॥

ఏకాకిగ గడచె రజని వనిలో
వేచుట కింకెంత పొద్దె అయయో ◆ ॥ చెలువుడు ॥

రావె సఖీ

ఠుమ్రీ

రావె సఖీ మధువనికీ
ఓ వసంత పూర్ణేందు హాసమ్ముఖీ ! ॥ రావెసఖీ ॥

చందన సురభిళ మందానిల మృదు
సందేశము నీ కందినదే సఖీ ! ॥ రావెసఖీ ॥

యమున గలి గలలు తరుగక మునుపే
సుమ పరాగములు సురుగక మునుపే
ఓ మద మరాళ సుందర గమనా
కౌముదీ రజని గడవక మునుపే ◆ ॥ రావెసఖీ ॥

దేశవాళి

(ఓ.సీ. గంగూలీ పుస్తకంలో రాగరాగిణీ ఓ చిత్రాన్ని చూసి అదే రాగంలో రచించిన గేయం 55వ మేళకర్త శ్యామలాంగి జన్యం.)

చాయలకే రాడాయె
న్యాయమా పెడమోము శాయ ॥చా॥

కళాతపన ఫలింపగా
కారయిత్రినవే ప్రియుడు
ఏమరుగుల తాదిరుగునో
తొక్కడె ఒకసారిగడప ॥చా॥

ఎడదలోన ప్రమిదలోన
ఇగిరెనేమొ స్నేహరసము
ఎదురుచూచు దీపకలిక
కురులోనె కొడిగట్టెనో ॥చా॥

ద్వారతోరణము సంధ్యా
మారుతముల కదలదేలా
రేరేని నగవుల రాగ
క్షీరాంబుధి పొంగదేలా ॥చా॥

నులివెచ్చని మార్గశిరపు
చలి పున్నమ శశి పిలువడో
వెన్నెల పాటతో ప్రియుడు
మన్నించునో నేడైనా ◆ ॥చా॥

అరుణరశ్మి

మెఱపో వెలుగో చూడు
స్వరమును సవరించుక పాడు
మరపు ముసుగు తెర యిరులను వీడి
తూరుపుదెసలో తోచు నదో ॥

మెరపు జారులో విరిసిన భావము
మరి యుందక మాయమ్మగునో
వెలుగున తడిసీ వెడలిన భావము
విశ్వమునే వెలిగించు నదో ॥

రాగ పాత్రలో భావ మధువులో
నా గళమ్మలో ఊగునెదో
నవగీతమ్మది వాల్గ దిక్కులా
యువలోకము తల లూపునదే ॥

అరుణరశ్మి వికసించు కమలము
కుంకుమమ్ము శోభన కరమే
ఉషః కాంత నెమ్మొగము శాంతిలో
రుషా ద్వేషములు కనరావే ॥

తెల్లవారితే లోక మ్మంతా
తీవ్రారుణమై పోవునా
ఆకుల నంటే మంచు బిందువులు
అందమైన పూవులుండవా ? ◆

మొహెంజదరో

మరుగు పడిందొక మహీధరం
స్మరణీయ విజయ ధరాధరం
పురాతన మనుజ పురోగమనమున
మరపురానిది మొహెంజదరో ॥ మరుగు ॥

సంస్కృతి లత విరియ బూసినా
జ్ఞాన కాంతి విస్తరించగా
మనుజుని స్వార్థమె యుగ యుగమ్మునా
మహాప్రళయమ్మై ధరిత్రి ముంచగ ॥ మరుగు ॥

మనిషి మనిషి నడుమ గోడలై
కనలు పగలు తెగలు చీడలై
మనుజధర్మ మహావృక్ష రాజము
కనుపు కనుపు తొలిచి వేయగా ॥ మరుగు ॥

సమాజమే ఒకసౌధమ్మై, ప్ర
తి మానవుండొక స్తంభమ్మై
సమాన భారమ్ము మోయకుండ, వి
షమ భావమ్ముల సమసిపోవగా ◆ ॥ మరుగు ॥

(ఎన్ ఆర్ నంది రంగస్థల నాటకానికి నాంది గీతం 1960)

కీర్తన

పల్లవి : వినరె వినరె మాధవు గాధ !

అను పల్లవి : దినము యమునదరి నందకిశోరుని
ప్రణయిని యీ రాధబాధ ॥ వినరె ॥

పెదవి నంటిన మురళి పదము పాడగానె
కదలి యమునా గట్టు చేరునే
యమునలో పడవెక్కి మధురా చేరబోవు
రాధను కేవిమ్మని కోరునే ॥ వినరె ॥

రాధ రౌంటి నున్న రూకలియ్య బోవ
కాదని చెక్కిలి నొక్కునే
ప్రకృతియె తానై ప్రభునెడబాసీ
పరితపించి రాధ సొక్కునే ॥ వినరె ॥

వ్రజ వనితలు స్వైరిణీ యన పాడియె
పరమ పురుషుని ప్రియతమయెకదా
ప్రకృతి మాతయే రాధా దేవియని
చాటు భణితము చండీ దాసిదే ♦ ॥ వినరె ॥

(వంగ భాషలో భక్తిగేయాలను కీర్తనలంటారు.
ఇది చండీదాసు కీర్తనల్లో దేనికీ అనువాదం కాదు.
వంగభాషలోని ఆశైలికీ. పద్ధతికీ ఛాయానుకరణం
సునో సునో హే కృష్ణన కాలా
అనే హిందీ కీర్తన
కె. ఎల్. సైగల్ పాడిన దానికి ప్రతిధ్వని. పల్లవి మాత్రం)

(1998)

కోకిల ప్రియ

కొనవ్రేళ్ళా సన్నచేసే
నిను పిలిచే ఏవిలాసీ
ఊగాడే కొమ్మ చివరా!
తూగాడే మావిచివురా!

ఏమందో ఏమని?
ఈనాడే ఆమని

కొసకొమ్మా చివురు గుత్తి
గుబురులలో గొంతునెత్తి
పాడిందే పాత పాటా
నాయెదలో కొత్త ఊటా

కోయిల ఏమేమనే
నేడింకో ఆమని!

ప్రతి హృదయం వేణువైతే
ప్రతి పవనం గాణయైతే
ఇల్లిల్లూ మారు మ్రోగే
పల్లవి నవగీతమైతే

నీపాటే మేమనీ
అందరికీ ఆమని!! ◆

(1971)

కైశికీ చక్రవాకం

ఇందేకతమ కుందు చుందునే
సుందరీ! నీ బాహు బంధమెడబాసినే ॥ నిందే ॥

చందనా నిలము మైసోకితే నీ యూర్పు
గందమందే పుంకలొంది స్పందింతునే ॥ ఇందే ॥

కుంద కుసుమాల కనినంతనే నీ మధుర
మందస్మిత స్మృతి నెడంద దిగులొందుదునె ॥ ఇందే ॥

కైశికీ చక్ర వాకాన నిన్ పిలుతు రా
కాశశీభాసి సందేశమందునో లేదో ॥ ఇందే ॥

చంద్రికలు చీకటులు చిందు రజనీ గళ
మ్మందన్ని రాగాల్ వియోగ సంయోగాలు ◆ ॥ ఇందే ॥

(1982)

సాటిలేని ప్రణయం

ఎవరు విన్నారెవరు కన్నారు,
రాధికా ప్రణయమ్మునకు సాటి
మాధవుని ప్రేమమ్మునకు సాటి ॥రాధికా ..ఎవరు ॥
ఎడలు రెండూ ఏకమన్నారు!
గడె వియోగమె సైచమన్నారు !
తమ సమాగమ మింక ముగిసేనా !
తనువొరసి ఉసురులే యొగసేనా ॥ రాధికా ...ఎవరు ॥

చందురుని చెంగలువ వలచేని
చాతకము జలధరుని తలచేని
చలి తుపానుల కలువ నుడిసేని;
చాతకము దాహార్తి నుడిసేని;
చందురుడు చెంగలువ జూచేన?
జలధరుడు చాతకము గాచేన ?
ఏటికో యీ క్షణిక ప్రణయాలు
సాటిలేనిది రాధ ప్రణయమ్మే;
సాటిలేనిది కృష్ణ ప్రేమమ్మే ! ॥రాధికా... ఎవరు ॥

తేటి వలపే మేటి అంటావ ?
పూవు వలపే పొగడ బోతావ ?
పూవుకొరకై తేటి రాదేని,
తేటికొరకై పూవు పోయేన?
ఏటికో, యీ క్షణిక ప్రణయాలు;
సాటిలేనిది రాధ ప్రణయమ్మే;
సాటిలేనిది కృష్ణ ప్రేమమ్మే. ◆ ॥రాధికా. .ఎవరు ॥

(1938)

యుగళగీతి

ఇద్దరు: మనప్రేమ - మనప్రేమ
సస్యసౌందర్యభూములలో, ప్రభవించి, ప్రభవించి
చండీ: నమ్రమరుసీమమగునో
రామి: కమ్ర సుమధామమగునో
ఇద్దరు: మనప్రేమ - మనప్రేమ
కల్లోలినీ తరంగములన్, పయనించి, పయనించి,
చండీ: శీర్ణ సికతాద్రియగునో!
రామి: పూర్ణ కలశాబ్ధియగునో!
ఇద్దరు: మనప్రేమ - మనప్రేమ
కాలగాధాగ్ని కీలలలో తపియించి తపియించీ
చండీ: దగ్ధతరుకాండమగునో
రామి: ముగ్ధ మధు భాండ మగునో,
ఇద్దరు: మనప్రేమ - మనప్రేమ
దీప్తఝంఝూమారుతములన్ ప్రసరించి ప్రసరించి
చండీ: విరహ నిశ్వాసమగునో
రామి: సరసదరహాసమగునో!
ఇద్దరు: మనప్రేమ - మనప్రేమ
సువిశాలగగన వీథులలో, విహరించి, విహరించి
ప్రణయస్వేచ్ఛాభ్రగామి యగునో
నిరవధిక సౌఖ్యధానియగునో !! ◆

(1940)

రాబోయే మూడు
'స్వైరిణి' నాటికా గేయాలు

స్వైరిణి

కదలిపోవునదే యెవ్వరో
కాదారి చీకటి సైదోడు లేకయే ॥ కదలి ॥

వెదురు పొదల మెదలు గాలి యూలలె
వేణునాదమని అదరిపడి ఉరికి ॥ కదలి ॥

నీలి మేలి ముసుగు తేలియాడ, త
మాల తరుల వెనుక వెనుక తారుచు ॥ కదలి ॥

ఈడ ఆడ నీడ లేవి ఆడిన
వాడె రాధికా వరుడని పరువిడి ◆ ॥ కదలి ॥

(1959)

'నను చూసీ నవ్వేరే'

నను చూసీ, నవ్వేరే,
నా సఖులీ వ్రజ భామినులు !

చెవిచాటూ చెయి చేర్చీ,
కొసరే రేవో గుసగుసలు,
నాపైనీ, నీపైనీ,
ఓపలేక అల్లిన కథలు !

పొదదాటీ, నదిదాటీ
కదిలే వేణురవము వడిలో
ఈ గుండే, యెటులాగు,
రాగతరంగిణి పెనుసుడిలో !

తనువులంకే, పరిమితమౌ
ప్రణయమ్మని యెంచేవారే,
తమగుండే, యిరుకులలో,
నలుగుడువడి నవ్వేవారే !! ◆

(1959)

మనసౌనే ఓ రాధ!

మనసౌనే ఓ రాధా! మరల వేణువూద
ఘనశ్యామ సఖి శంపాంగనవై నర్తింపరాద । ॥ మనసౌనే ॥

మందలోని గోవులు ప్రేమించి మోరలెత్తి చూడ
బృందావని గడప గడప, అందెలు ఘల్లుమని యాడ,
చిందులలరు పదములు కాళిందీ తటమందు కూడ
సుందర గోపీ మండల మందు
నిలిచి నీవు పాడ ॥ మనసౌనే ॥

ప్రతినయనద్వయి నాపయి, ప్రణయామృత ధార కురియ,
ప్రతి యెడంద నవ విద్యుల్లతయై నా హృదయ మొరయ,
ప్రతివనమ్ము ప్రతికుంజము, శ్రుతి లయాన్వితమ్మై విరియ
ప్రతిస్వనమ్ము ప్రతి మూర్ఛన, ప్రణవ మంత్ర మౌచు మొరయ ◆
॥ మనసౌనే ॥

(1959)

తరువాత రెండూ
'విశ్వవీణ'
నాటికాగేయాలు

నాదమోహము

వీణా ! ప్రియవీణా !
సారింతును నీ తంత్రుల   తేలింపుము వినువీధుల
వీణా; ప్రియవీణా; నావీణా; ప్రియవీణా;
జనన మరణముల సీమాంతములకు వడిపోనీ,
నీ నాద మహిమతో నను లోకాంతములకు పోనీ,
          వీణా; ప్రియ వీణా;
వాయువేగ మనోవేగములు చాలవు వీణా;
ప్రేయసి పోయిన లోకమునకు వేగము పోనీ;
          వీణా; ప్రియ వీణా; వీణా; ప్రియవీణా; ◆

(1950)

నాకీణ రుతి

చూడ చూడ దగ్గరై
చూడ చూడ దూరమై

జరిగిపోవు కరిగిపోవు
శతశత గోళాలు !

చూడ చూడ పెద్దవై
చూడ చూడ చిన్నవై
నురిగిపోవు మరగిపోవు
జ్యోతిర్మండలాలు!

చూడ చూడ వ్యాప్తమై
చూడచూడ లుప్తమై
తరలిపోవు మరలిపోవు
తమోంతరాళాలు !!

నావీణరుతి లోకాంతరగతి
ప్రియా ప్రాణ వసతి
పద పద శీఘ్రగతి ! (ఆలాపన)

నా వీణరుతి మ్రోయగా త్రోయగా
నీ ధ్యానమే భావమై రాగమై
నీ దారి నా ధ్యేయమై లోకలోకాలు
తిరిగేటి చరణాల గతి తాళమై
ఎల్గెత్తి విన్పింతు నిదె నా హృదయవాణి !
ఏ లోక మందుందువో విందువో రాణి ! । నావీణరుతి మ్రోయగా ॥

వేలావకాశాల కెదురీతలో
గోళాల భ్రమణాల శ్రుతి మ్రోతలో
తేజశ్శలాకాల ఛాయాంధ తమసాల
ఆజాను హస్తాల మెలివేతలో
ఎల్గెత్తి విన్పింతు నిదె నాహృదయవాణి,
ఏ లోకమందుందువో విందువో రాణి !
నా వీణరుతి మ్రోయగా ।త్రోయగా . . . ◆

(1950)

మూసీపై వంపు వంతెన

పర్యాత రెండూ
'ప్రణయ సేతువు'
సంగీత నాటికాగేయాలు

మిలమిలలో తీయందాలో, కిలకిలల నీ వలపులలో
మెదిలేనా ఊహలలో, నవనవ్వవే నీవె ప్రియా !

వలరాజో, నెలవంకో, తెలిమబ్బో తెలియగవే!
మది పొచ్చి, మనసిచ్చి, జత గూడ రావె ప్రియా !

రాచనగరులో మువిరుసులు, వంపులవద్దిని గుసగుసలు,
చెలియను చేరగ బోయే ప్రియునకు, చెంగలు మూసీ బుస బుసలు

రాసుతు డెక్కిన వారువము,
రయము మీరు ఝుంఝూ రవము !

వాలము పింజాపుర పోలు, తేలుసు నెంగిసి మెడజూలు,
నేలను ఎంచే అంటుక ఖిరిఖిర, గాలిని తూలే ముంగాలు !

రాసుతు డెక్కిన వారువము, రయము మీరు ఝుంఝూరవము
పడగాలో, సుడిగాలో జడివాన మెరుపు దిగు వాలో !

ప్రణయ సమాగమ భంజనమొ,
ప్రకృతి యీర్ష్యయో ప్రళయమ్మొ
దరులను రాసీ, తరగల దూసీ,
నురగలు పోసీ, పొంగెను మూసీ

> తెరలు తరలుగా తరలు తరస్త్రై, ఏరో ఎలపో పారే !
> హృది పొంగా నదిపొంగా, ఎది దేసిన మించు ననంగా,
> తెరలు తెరలుగా తరలు తరస్త్రై, ఏరో నలపో పారే !'

హృది అలలే పై వేస్తై, నది అలలపొంగు పింపాయా !
రాసుతు అశ్వము మొర్రాంది రమణోస్మైటస్తై జవ్వాది ! ◆

(1982)

జాజి సుందరి - ద్రాక్షసుందరి

రమ్య మధుర భావలలితకళా
        లతిక జాజి సుందరి
అల్లుకొనియె వలపుగొలిపి
        గాఢముగా ద్రాక్షసుందరి ॥ రమ్య ॥

దగకొన్న బాటసారి నోరు
        తడుపు క్షీరవాహిని
ఎగసేటి తరగలతో
        పొంగి పొరలు ప్రేమరాగిణి । రమ్య ।

వరదలై పారు నేరు
        ఊరువాడ ముంచకుండ
ప్రేమ హేతువుగ లేచె
        సేతు వొకటి గోలుకొండ ॥ రమ్య ॥

పల్లెకుటిలోని కుండలోన
        తేరు పాల మీగడ
పొదుషె ప్రేమ మహానగర
        భాగ్యరాశిలోగడ ◆ ॥ రమ్య ॥

(1982)

శాంతి పథం

వెలుగు పాయో చీకటి చాయో
తెలియకే పైబడు విధిచేయో!
యుగయుగమ్ములు కిందై మీదై
జగతి వలలై అలమే మాయో!

వర తపోవన గురుసందేశం
ధరాతలి కది ఆశాలేశం,
దురాశా దానవ తారంభం
ధరా పురోగతికి విలంబం

ప్రణయ మంత్ర ప్రవక్తలేరీ!
కనుగొనరె శాంతికి రహదారీ!
సమ్రాట్టుల నిరంకుశతలో
నమ్రమ మనుజులెందరు హతులో!

విశ్వరహస్యాన్వేషణలో
విజ్ఞమేధ సంచాలనలో
విదితమౌ పరమాణు శతఘ్ని
విశ్వశాంతికి పెను దావాగ్ని! ◆

(1960)

తరుణులకు సంతరణ మార్గం

తరువాత రెండూ
'జ్యోతిరైక్యం'
నాటికా గేయాలు

స్త్రీలు : హింసాయుతము సంసారమిది
ఆశా మృషా మిహికా పథం
సంసారబంధములేని శ్రమణులు
సాగునదె స్వేచ్ఛా పథం !
తరుణులకు సంతరణ మార్గము
తెరువవో కరుణానిధీ !

పురుషులు వలిపములు త్యజియించి చేరుదు
వల్కలములు ధరింతురో
కఠిన నిష్ఠుర నియమములతో
కాననముల వసింతురో
లలనలకు సన్యాసమెటు లవ
లంబనీయము సోదరీ !

స్త్రీలు : రోసి సంసార బంధము, తల
మోసెదము అష్టాంగమార్గము
వలపువంతలులేని బ్రదుకుల
నిలిపెదము భూతల స్వర్గము
శాంతి దాంతులె మా నగలు
నిర్వాణ కాంతులె పూలమాలలు !

పురుషులు : నడకచే నలిగిన పదాలు
వంతచే వడకు వాతెరలు
బడలినది గురువరుని పాలక
జనని, వాకిట వేచియున్నది;
తడియు చెక్కుల పౌర నారీ
జనము పరిజన మొదిగియున్నది !
వడయరో సంతరణ మార్గము
వడతు లింక దయానిధీ ! ◆ (1965)

పూర్ణిమాత్రయం

వైశాఖ పూర్ణిమా వర్తితజ్యోతి
నిర్వాణ పథమందు నిస్తులజ్యోతి
విశ్వమ్ము నంతటి వెలిగించుజ్యోతి
ఈశ్వరత్వమ్మంది భాస్వంతమాయె !

నిత్యమైనది సత్యమైనది నిస్తులాత్మ జ్యోతి ఒకటే
భువనమంతట వెలిగే తాపస పూర్ణిమాత్రయ సుప్రశాంతి !

ఇంద్రియపు చెరసాల గోడలు ఎదుగుటకు కారణమ్మెవరో
జన్మపై జన్మల పరంపర సాగుటకు కారణమ్మెవరో
ఆశలను స్వప్నాల వలలను పన్ని విరజిమ్మినది యెవరో
అసద్రూపపు టహంకారము ఆత్మ యనిపించినది యెవరో

సురిగెతన ఆత్మావభాసము
వెలిగెను సదాత్మ ప్రకాశము ॥ నిత్యమైనది ॥

కాలావకాశాల వేలలు కరగిపోయిన చిదానందం
కాంతి శబ్దావసానమ్ములు కదలిపోయిన బృహదనంతం
ప్రణయ పారావార మనుభవ సారమౌ కరుణార్ద్ర చేతం
పారహీన పృథావ్యథాంబుధి పరిశ్రాంత విరామగీతం

వెలిగెను సదాత్మ ప్రకాశము
సురిగె తన ఆత్మావ భాసము ॥
నిత్యమైనది, సత్యమైనది ॥ ◆

(1965)

ఓ నా బంగారు బంగాళమా

(ఓ ఆమార్ సోనార్ బాంగ్లా)

ఓ నా బంగారు బంగాళమా,
            నాకు నీపై యెంతో ప్రీతి !
ఎన్నాళ్లుగ నీగగనము నీపవనము నా ప్రాణాల మ్రోగు
            నా ప్రాణాల వేణుగీతి ॥
అమ్మా ఆమనిలో నీమామిడితోట చిమ్ము కమ్మదనము
            అబ్బ హాయి! ఎంతహాయి!
అమ్మా మూర్చ్యానకే ఎండినపైరు చూడనౌనా నాకు
            నీనగుమోము   ॥ బంగారు ॥

ఏమి వెలుగేమినీడ ఏమి చెలి మేమిమాయో
ఏలాగున రచింతువో తరుల క్రింద నదీ తీరాలందు
అమ్మా నీదు మడి నావీనుల చిందు తేనెజడి
అబ్బా హోయి ! ఎంత హోయి !
అమ్మా నీదు మోము చిన్నబోతే అమ్మా నాకన్నోయి నీరు నిండు
|| బంగారు ||

నీ ఆటల బొమ్మరింట శైశవము గతించునే
నీమడి మట్టి నుంత మేనినంటు జన్మ ధన్యమంట
నీవు దినముకాగా సంజరాగా ఇంటికి వెళ్ళుతేనో
అబ్బా హోయి ! ఎంతహోయి !
అప్పు డాటబయల అంతా వాలి నీ యొడిలో
అమ్మా నీయొడిలో మైమరతుమంట !! || బంగారు ||

ఆలమంద నీబయుళ్ళ బల్లకట్టు నీదు పెళ్ళ
పొద్దంతా పిట్టల కూతలు దాగుడుమూతలు నీదు పల్లెబాట,
నీదు ధాన్యము నిండిన ప్రాంగణమందు సాగు జీవనము
అబ్బ హోయి ! ఎంతహోయి !
అమ్మా అన్నదమ్ములేగా అంతా అన్నదమ్ములేగా
అంతాగోపాలకులే అమ్మా గోపాలకులే, నీ హాలికులే || బంగారు ||

అమ్మా నీదు చరణ సీమ ఔదలను అర్పింతునే
అమ్మా నీపదరజమ్ము అది నా శిరోమాణిక్య మ్మగునే
అమ్మా దరిద్రు నుపహారమేదో ఉంతును పదతలి
అబ్బా హోయి! ఎంతహోయీ!
ఏ పరుని యింట తేబోనే నీకు భూషణ మనే గళబంధనము ◆
|| బంగారు ||

(బంగ్లాదేశ్ జాతీయ గీతం రవీంద్ర సంగీతముననుసరించిన తెలుగుసేత 1971)

ప్రణయబంధసేతువు

దక్కన్ దివ్య భూమీ ! ఓహో దక్కన్ దివ్య భూమీ !
మాతాతల మహాదర్శాల మధురస్వప్నసీమా !
ఓహో దక్కన్ దివ్యభూమీ !

పురాతన భారతారామాల పూదేనియల సౌరు,
ఇరానీ సుందరోద్యానాల ఇరపైన పన్నీరు,
భరించే తేనె పట్టువునీ వవర గంధర్వధామానివో
దక్కన్ దివ్యభూమీ !

సిరిసంపదలతో తపశ్శాంతితో
గుబురైన తరులలతా గుల్మాలతో
నిభృత గంభీర స్వాదు జలాశయాలతో
జాజ్వల్య మాన హైరణ్య సౌధాలతో
గండరించిన నాట్యగీతాల దేవతా మందిరావరణ శిల్పాలతో
స్వర్గమంచి మనస్కులైన ముల్లాలవలె
ప్రార్థనల ప్రతిరవించే గోపురాలతో
ఓయపూర్వ వినీత సంస్కృతి కరండమా
దక్షిణోత్తర భావ మాధురీ సమ్మిళిత శర్కరీ ఖండమా
హిందూస్తాన హృదయంపైని ఇంపైన మధుభాండమా
దివ్యసౌందర్యము విరాజిలు వెయ్యిరేకుల వెయ్యి వలపుల
తియ్యనైన గులాబి ! ఓహో దక్కన్ దివ్యభూమి ! ◆

(1970)

బాలమురళీ షష్ఠ్యబ్దాభినందన

గురు పరంపర ధ్రువ గురుడైన త్యాగరా
జస్వామి ఆత్మాంశ సౌష్ఠవంబు
వేంకట సుబ్బయ్య విజ్ఞత, దక్షిణా
మునిదీక్ష, సార్వభౌముని సమీక్ష
పంచదశాబ్ది సంవర్ధిత పితృదేవ
రక్ష గాన సుధాకరత చెలంగి
ఇరుప్రక్క క్షీరమ్ము వెలమి గ్రోలుటచేత
వాగ్గేయకార విద్వత్తు వెలసి
ఎలుగెత్తి, ధనువెత్తి ఎడమకుడియు నొత్తి
గాంధర్వ కళ త్రివిక్రమత నొందె (నాత)
డాంధ్రరాష్ట్ర విద్వన్మణి, అఖిల విశ్వ
రసికజన హృదయారామ రంజకుడగు
స్వరవిరించి, అపరవాణి, శతశరత్తు
లేలు నాద సుధార్ణవుడీ జగత్తు !

నాదేనా యీగీతి
నీదెకాదె మాధుర్య సుధాఝురి
నే నెవండ నీ అఖండ సృష్టిని
మౌని హృదయ ధ్యానయోగరూపా!
కనగ వినగరాని యనంతాద్భుత
గాన సుధాకర జన్మోత్సవ స
న్మానితానంద సాగర లహరిని
పూర్ణిమా రజని మురళీ రవళీ
ఘూర్ణమాన, నాద సుధార్ణవముగు! నాదేనా యీ గీతి! ◆

(6.7 1991)

విశ్వయానము

జంత్రగాత్ర స్వరమేళ

వ్యాఖ్యాత : "ఓమిత్యేత దక్షరం ఇదం సర్వం, తస్యోపవ్యాఖ్యానం,
భూతం భవత్ భవిష్య దితి సర్వ మోంకార ఏవ
యచ్చాన్యత్ త్రికాలాతీతం తదప్యోంకార ఏవ"

"ఈ సర్వ విశ్వమూ ఓంకార నాదంలో ఇమిడి ఉన్నది."

అని మాండూక్యోపనిషత్ చెప్పుచున్నది · భూతవర్తమాన భవిష్యత్తులను మూడింటిని క్రమ్ముకొని, వాటికి అతీతుడై ఉండిన కాలపురుషుడైన పరమాత్మనుండి వెలువడినది అతడే తానైన నాదతరంగిణియే - ముందు

విశాల కాంతిమేఘమై తదుపరి బహుఖండాలుగా ప్రేలి, గిరగిర పరిభ్రమించే గోళమాలికలుగా, సప్తర్షి, ధ్రువ, శింశుమా రాది తారామండలములుగా విడివడి, మేష, వృషభ, మిధునాదిద్వాదశ రాశులతో ఆకాశగంగతో కూడిన ఖగోళంలో - నాదాయనుడు, లేక నారాయణుడు ఓంకార స్వరూపుడుగా అనంతుడుగా శాశ్వతుడుగా సహస్రకోటీయుగధారిగా దర్శనమిచ్చే వరకూ నిత్యమూ జరుగుతూ ఉండే 'విశ్వయానం' - రజని రచించి సంగీతం కూర్చిన 'జంత్రగాత్రస్వరమేళ' లో మీకు సాక్షాత్కారమౌతుంది..

పురుషస్వరాలు : **ఓంకార పరిపాది స్వరమేళ**

మత్తేభవృత్తం - తెలుగు పద్యం

అదికల్పాది, మహోవిహాయస పరివ్యాప్తభ్రమత్
కాంతిమేఘ దవాగ్నిచ్ఛట భిన్నమయ్యె బహుధా ఖండాల
మందాకినీ నదియో క్షీరసముద్రమో యనగ
ఆ నాగేంద్రశాయీ దయామృదులాలోకన
మెల్లవిశ్వమును సంప్రీతిన్ ప్రపాలింపగా
ఓంకార పరిపాది స్వరమేళ . సప్తస్వర విన్యాస

వాద్యబృందం : **కాంతిమేఘ భ్రమణము, విస్ఫోటము, తారామండలములు,**
గ్రహకుటుంబములుగా విడిపోయి, అన్నీ
పరిభ్రమించడమూ
ఇదంతా నిరూపితమయిన శ్రీరాగ రచన
ఓంకార పరిపాది స్వరమేళ

సర్వస్వరమేళ : మేషశ్శిరోధ, వదనం వృషభోవిధాతుః,
వక్షోభవేన్మిధునం, హృదయం కుళీరం,
సింహస్తయోదర, మథో యువతి, ర్వస్తిస్తులా,
భృదన మేహన మస్యమస్యాత్, ధనుర్ధరోభవే దూరూ,
మకరోజానుద్వయం భవతి, జంఘాద్వితయం కుంభః,
పాదౌ మత్స్యద్వయం చేతి..

సర్వస్వరమేళ- తెలుగుగేయం :

ఓంకారస్వరమేళ

దర్బారురాగంలో వాద్యబృందప్రస్తావన

దర్బారురాగం- రూపకతాళం

కాలపురుష సహస్రార గళిత నాదతరంగిణీ, వి

శాలకాంతి కాదంబిని, లోలగోళమాలికలై,

ఎన్నోతారావితతులో, ఎన్నో గ్రహప్రగతులో,

నభోనీలసుదూరాల, విభావరీ వీథులంట

ఛాయానిబిడ సాగరాల, జ్యోతిర్మీ పజగతులంట

ఎన్నో తారావితతులో, ఎన్నోగ్రహప్రగతులో..

సప్తవింశతి తారా ప్రదీప్తరాశి చక్రమంటి

సుప్తిజాగృతి కారకులు, సూర్యులు వన్నిద్దరంట

ఎన్నోతారావితతులో, ఎన్నో గ్రహ ప్రగతులో..

తెలుగుగేయం : రీతి రాగంలో వాద్యబృంద ప్రస్తావన =

రీతి రాగం . ఖండగతి . చతురశ్రగతి, మిశ్రగతి.

ఓం, ఓం, ఓం, ఓంఓంఓం, ఓం ఓం ఓం, = ఖండగతి =

ఓంకార పరివృతం విశ్వం

సంకల్ప పరిమితం దృశ్యం

ఆది అంతములేని విశ్వం

నాదామృత తరంగలాస్యం

వాల్గు కొలతలంపోగు విశ్వం

వెల్గు చీకటుల సర్వస్వం.

ఓం ఓం ఓం, ఓం ఓం ఓం, ఓం ఓం ఓం.

నేపథ్య సంగీతం

అవధి పొడవూ నిడివీ ఎత్తూ = చతురశ్రగతి =

జవము చేరగా చరజగత్తూ,

వ్యవధి గతమై వర్తమానమై

భవిష్యమ్మై విశ్వయానమా . .
ఓం ఓం ఓం, ఓం ఓం ఓం, ఓం ఓం ఓం.

నేపథ్య సంగీతం

జడద్రవ్యము ప్రకృతియైతే = మిశ్రగతి =
చరత్తేజము పురుషుడౌనూ
ప్రకృతి పురుషుల ప్రణయ సంక
ల్పమున విశ్వము ప్రభవమందెడి . .
ఓం ఓం ఓం, ఓం ఓం ఓం, ఓం ఓం ఓం. =ఖండగతి=

ఓంకారస్వరమేళ నేపథ్యంలో సాగుతుండగా ఒకేగొంతులో పద్యం

పురుషకంఠం : **పూర్వారాగం - తెలుగు పద్యం - ఉత్పలమాల**
ఎవ్వడు తల్లి దండ్రియయి,
యీ జగముల్ ప్రభవించుచుండునో,
ఎవ్వని అక్షి యుగ్మక సమీక్ష
దినంబును రాత్రికల్గునో,
ఎవ్వని కుక్షి లోకతతు లెల్ల
మహా విలయంబు నందునో,
అవ్విభు డా యనాది, ప్రణవాత్మ
డనంతుడు మమ్ము నేలుతన్

ఓంకారస్వరమేళ
'సాంప్రదాయిక సంస్కృత శ్లోకం'

సర్వస్వరమేళ : ఓం నమో స్త్వనంతాయ సహస్రమూర్తయే
సహస్ర పాదాక్షి శిరోరు బాహవే,
సహస్ర నామ్నే పురుషాయ శాశ్వతే,
సహస్రకోటీ యుగధారిణే నమః . .
ఓం శాంతి : శాంతి : శాంతి :

ఓంకార స్వరమేళ

SATAPATRA SUNDARI - RAJANI

శతపత్ర సుందరిలో పాటలను 1956లో ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో రికార్డు చేస్తున్న రజని, టంగుటూరి సూర్యకుమారి.

చల్లగాలిలో, ఓ విభావరీ, మాదీ స్వతంత్ర దేశం, భారతభేరి, ఎవరువిన్నారెవరుకన్నారు, మన ప్రేమ, ఆశా నా ప్రాణసఖీ, ప్రతిశ్రుతి, మరునిముసము, మధుపాయి వంటి అనేక పాటలు, చండిదాసు, మధురానగరి, దివ్యజ్యోతి వంటి సంగీత నాటకాలలోని గీతాలు సంకలితమయిన సంపుటి.